# మేఘం లేని మెరుపు

నవల

\- మంథా భానుమతి



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 98

కౌముది మాసపత్రికలో

జనవరి 2014 సంచిక నుంచి ఏప్రిల్ 2015 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

విమానం వేగం తగ్గి కిందికి దిగడం మొదలుపెట్టింది. అర్ధరాత్రి రెండవుతున్నా దేదీప్యమానంగా వెలిగి పోతోంది ఆ మహా నగరం. కంటికి కనిపించినంత మేరా వెలుగులు విరజిమ్ముతున్నాయి.

అక్కడక్కడా కనిపిస్తున్న చీకటి ప్రదేశాలు పెద్ద పెద్ద చెట్లతో నిండిన తోటలు. విమానం కిటికీలో నుంచి ఆ విద్యుత్ తోరణాల సమూహాలని చూసి ఆనందిస్తున్నారు ప్రయాణీకులు.

ఆకాశం అంతా నిర్మలంగా ఉంది.

అంతలో..

ఆకాశంలో అతి పెద్ద మెరుపులు విమానం క్రిందుగా కనిపించాయి.

ఆ వెంటనే నగరం అంతా అంధకారం. . నగరంలో ఉన్న వారికి మెరుపులు మెరిసిన చోట చెవులు బద్దలయ్యే ధ్వని కూడా వినిపించింది.

ఎక్కడా మబ్బు తునక లేదే! ఇంత పెద్ద మెరుపు.. ఆ పైన చీకటి.. ఆందోళనగా చూశారు ప్రయాణీకులు.

వెంటనే బాక్ అప్ తో, విమానాశ్రయంలో విద్యుత్ సరఫరాకి అంతరాయం లేకుండా.. దిగుతున్న విమానానికి సిగ్నల్స్ వెళ్ళగలిగాయి.

ఒక అరగంటలో విద్యుత్ శక్తి నగరానికి అందేలా చకచకా ఏర్పాట్లు జరిగి పోయాయి. నగరం మళ్ళీ కాంతులు పుంజుకుంది.

ఆ మెరుపుకీ, వెనువెంటనే వచ్చిన చీకటికీ, నగరానికి విద్యుత్ సరఫరా చేసే సబ్ స్టేషన్ లో ఏర్పడిన చిన్న విఘాతం కారణం.

అతి కొద్ది సమయంలో తిరిగి పూర్వపు స్థితికి రాగలగడానికీ, నిరంతరం ప్రజలకి వివిధ సదుపాయాలకు సరిపోయే విద్యుత్ ఉత్పత్తి చెయ్యడానికీ కొన్ని వేల మంది పగలూ రాత్రీ కష్ట పడుతూ ఉంటారు. ఏ మాత్రం ఏమరుపాటు పనికి రాదు.

అలా విద్యుదుత్పత్తి చేసే కర్మాగారాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. వానిలో మన రాష్ట్రంలోని ఒక కర్మాగారం అది..

అక్కడే మన కథ మొదలవుతుంది.

●●●

శ్రీరాంపురం రైల్వే స్టేషన్ కి పది కిలోమీటర్ల దూరంలో ఉండే అతి పెద్ద టౌన్ షిప్. . .

చుట్టూ కొండలు.. పచ్చని ప్రకృతి మధ్య తీరైన రహదారులతో కన్నుల విందుగా ఉంటుంది.

ఆ టౌన్ షిప్ .. సుమారు పన్నెండు వందల మెగా వాట్ల విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేసే అతిపెద్ద థర్మల్ పవర్ స్టేషన్ కి సంబంధించినది. . ఒక స్టేజ్ తో అరవై మెగా వాట్లతో ప్రారంభమయి అంచెలంచెలుగా ఎదుగుతూ ఐదు స్టేజ్ లతో అంత అత్యధిక ఉత్పత్తికి చేరింది.

విద్యుదుత్పత్తి కర్మాగారం చుట్టూ నలు ప్రక్కలా నాలుగు కాలనీలున్నాయి. వాటిలో అందులో పని చేసే ఉద్యోగులు నివసిస్తూ ఉంటారు.

ఆ రోజు..

హడావుడిగా పరుగులు పెడ్తూ పెద్దగా మాట్లాడుకుంటూ వెళ్తున్న జనాల్ని చూసి ఇంట్లోనుంచి బయటికి వచ్చాడు చంద్రమౌళి.

"ఏమయింది?" పక్కనుంచి వెళ్తున్న పదేళ్ళ కుర్రాడ్ని అడిగాడు. చెయ్యి ఏమో అన్నట్లు తిప్పి పరుగెట్టాడు వాడు.

అందరి మొహాల్లో ఆదుర్దా.. ఎవరూ ఏమీ చెప్పేట్లు లేరు.

మౌళి ఇంట్లోకి వెళ్ళి తలుపుకి తాళం వేసి బైక్ మీద బయల్దేరాడు. 'సి' కాలనీ పక్కనున్న మైదానం దగ్గర అందరూ వృత్తాకారంలో నిలబడి ఏదో వింత చూస్తున్నారు.

కోతుల్ని ఆడిస్తున్నారేమో.. రోజూ ఉండేదేకదా.. అనుకుంటూ బైక్ దిగి స్టాండ్ వేసి, కొంచెం నిదానంగా కనిపించిన వాడిని అడిగాడు..

"ఏంటి హడావుడి?"

"చీఫ్ ఇంజనీర్ గారి మనవడు.. పాము.."

ఆదుర్దాగా అందర్నీ నెట్టుకుని గుంపులోకి వెళ్ళాడు. అంతకు ముందురోజే మౌళి ఆ అబ్బాయి, 'బబ్లూ'ని కలిశాడు. పెద్ద కళ్ళు, ఇంతింతలేసి బుగ్గలూ.. ముద్దు ముద్దు మాటల్తో కనిపించిన వాళ్ళని ఆకట్టుకుంటాడు.

మూడడుగుల పైనే ఉంటుంది.. తాచుపాము. రెండు చేతులతో దాని తలని పట్టుకుని, పకపకా నవ్వుతూ గుండ్రంగా తిరుగుతున్నాడు బబ్లూ. శివుడి మెళ్ళోనుంచి నాగుపామును తీసి ఆడుకుంటున్న కుమారస్వామిలా ఉన్నాడు. ఎవరైనా దగ్గరగా వెళ్ళ బోతే పాము తలని విసురుతున్నట్లు చేసి బెదిరిస్తున్నాడు. చుట్టూ ఉన్న జనం వెనక్కి వెనక్కి జరుగుతున్నారు.

చుట్టు ప్రక్కలంతా అడవి కావడంతో అక్కడ పాములు ఎక్కువే. సాధారణంగా జనం ఉన్న చోటికి రావు.. బబ్లూ ఎక్కడ పట్టాడో మరి..

తల అటూ ఇటూ తిప్పలేక దీనంగా చూస్తోందా పాము. గిరుక్కున వెనక్కి తిరిగి బైక్ స్టార్ట్ చేసి వెళ్లి పోయాడు మౌళి.

"సార్ కి భయమైనట్లుందిరా.. పారిపోయారు." ఒక ధీశాలి..

ఫక్కున నవ్వారందరూ.

"మీరు మాత్తరం ఏం చేత్తన్నార్రా?" ఒక పెద్దమనిషి అరిచాడు.

"మీది మీదికి రాకు బాబూ!" ఎవరిదో ఆక్రందన.

వృత్తం పెద్దదయింది.

మూడేళ్ళ బబ్లూ మాత్రం తాండవం చేస్తున్నాడు. అమాయకమైన ఆ మోహంలో ఎంత ఆనందమో.

"బబ్లూ!" పెద్దగా అరుస్తూ సి.ఇ గారి కోడలు, సుధీర పరుగెత్తుకుంటూ వచ్చింది. జనం పక్కకి జరిగి త్రోవ ఇచ్చారు. ముందు వెనుకా చూసుకోకుండా బబ్లూ దగ్గరికి వెళ్ళ బోతున్న సుధీరని, అప్పుడే బైక్ పార్క్ చేసి వచ్చిన మౌళి, చెయ్యి పట్టుకుని ఆపాడు.

అందర్నీ వెనక్కి జరగమని, ముందుకెళ్లి రెండు చేతులూ చాపి చూపించాడు మౌళి.

"బబ్లూ! నీ కోసం ఏం తెచ్చానో చూడు.." బబ్లూ చేతుల్లో పాము లేదు అన్నట్లుగా.. ఆ పాము కేసి చూడకుండా మృదువుగా పిలిచాడు.

"హాయ్.. కిట్ కాట్స్. అంకుల్.. రెండేనా? టెన్ ప్రామిస్ చేశారు కదా!" పాముని వదిలేసి, పది వేళ్ళు చూపిస్తూ పరుగెత్తుకుంటూ వచ్చి మౌళి చేతుల్లో పాకెట్లు లాక్కున్నాడు.

సుధీర ఒక్క ఉదుటన బబ్లూని ఎత్తుకుని, కళ్లనిండా నీళ్ళతో కృతజ్ఞతతో చూసింది మౌళిని.

నిస్త్రాణగా అయిపోయిన పాము నీరసంగా జరజర పాక్కుంటూ వెళ్ళిపోయింది, జనం భయం భయంగా పక్కకి తప్పుకోగా.

బబ్లూని దింపి వీపు మీద ఒక్కటిద్దామని చెయ్యెత్తింది సుధీర.

“నో..నో” వాడిని ఎత్తుకుని బైక్ దగ్గరకు వచ్చాడు మౌళి. సుధీరని వెనుక, బబ్లూని ముందర ఎక్కించుకుని కిలో మీటరు పైగా దూరంలో ఉన్న సి.ఇ గారి ఇంటికి వెళ్ళాడు.

●●●

హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ వరండాలో జరుగుతున్న పంచాయితీని నవ్వుతూ గమనిస్తున్నాడు మౌళి.

“బాబు ఇంట్లోపలికి ఎల్లాడమ్మా! మీరంతా ఉన్నారని నేను ఎనక పక్కకెల్లా.. “ బబ్లూని ఆడించడానికని పెట్టిన పదిహేనేళ్ళ నరసి ఏడుపు గొంతుతో చెప్తోంది.

“వాచ్ మాన్ ని చూస్తుండమని చెప్పద్దా ?”

“చెప్పనమ్మా! ఏం యాదగిరీ ?”

“లోపల పంపు పాడయింది కదమ్మా! బాగు చేసే వాడొస్తే నేను ఎత్తుకునే మాట్లాడుతున్నా. ఎప్పుడో చేతుల్లోంచి జారుకున్నాడు.” తప్పు ఒప్పుకుంటూ యాదగిరి కాళ్ళ మీద పడబోయాడు.

“సర్లే.. ఇంక ఎప్పుడూ గేటు వేసే ఉంచు. తీసినప్పుడు కిందికి చూస్తుండు. కాళ్ళ సందుల్లోంచి జారిపోతాడు.” మొహం మీద ధారగా కారుతున్న చెమటని తుడుచుకుంటూ హాల్లోకి వచ్చింది సుధీర.

చీఫ్ ఇంజనీర్ (సి.ఇ) గారి భార్య భారతి, బబ్లూని తీసుకుని తమ గదిలోకి వెళ్లి వాడికి జాగ్రత్తలు నేర్పుతోంది., నెమ్మదిగా! వాడు కళ్ళని ఇంకా పెద్దవి చేసి సగం తిన్న కిట్ కాట్ ని నాన్నమ్మ గద్వాల్ చీరకి పట్టిస్తున్నాడు.

“ఏడీ హీరో? ఏదో ఎడ్వెంచర్ చేశాట్ట.. “ బియస్సీ చదువుతున్న సి.యి గారమ్మాయి ఉష ఇంట్లోకి వస్తూనే హడావుడి చేసింది.

“హాయ్..” మౌళి పలుకరించాడు.

“హలో.. మీరే నటగా సేవియర్? థాంక్యూ..” ఉష కృతజ్ఞతగా నవ్వింది.

సి.ఇ శ్రీనివాస్ గారు ఆ పవర్ ప్లాంట్ కి అధికారి. అక్కడికి వచ్చి రెండు సంవత్సరాలవుతోంది.

ఉష, టౌన్ షిప్ కి దగ్గర్లో ఉన్న శ్రీ రాంపురంలో బి.యస్సీ ఆఖరి సంవత్సరం చదువుతోంది.

మౌళి ఐ.ఐ.టి చెన్నైలో యమ్.టెక్ ఎలెక్ట్ రికల్ ఇంజనీరింగ్ చేస్తున్నాడు. మౌళి తండ్రి, శ్రీనివాస్ క్లాస్మేట్స్. మూడు నెలల ప్రాజెక్ట్ వర్క్ కోసం ఆ పవర్ ప్లాంట్ కి వచ్చాడు మౌళి, శ్రీనివాస్ రమ్మని పిలుస్తే. ఒక నెలయింది. ఖాళీగా ఉన్న ఫర్నిష్డ్ క్వార్టర్స్ లో ఉంటున్నాడు. అప్పుడప్పుడు సి.ఇ గారింటికొచ్చి, అందర్నీ పలుకరించి భోంచేసి వెళ్తుంటాడు.

సుధీర, బబ్లూని తీసుకుని ఒక వారం ఉందా మని రెండ్రోజుల క్రితం వచ్చింది. శ్రీనివాస్ గారబ్బాయి వేణు బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఇంజనీర్. ఆఫీస్ పని మీద జర్మనీ వెళ్ళాడు.

“చాలా థాంక్స్ బాబూ! నువ్వు సమయానికి వెళ్ళకపోతే ఏమయ్యేదో.. తల్చుకుంటే గుండె ఆగిపోయేట్లుంది.“ భారతి బబ్లూని ఎత్తుకుని హాల్లోకి వచ్చింది.

“మొదట్లో నాక్కూడా కాళ్ళూ చేతులూ ఆడలేదాంటీ.. అచ్చు పాముల్ని పట్టేవాళ్ళు పట్టుకున్నట్లే పట్టుకున్నాడు. మిరకిల్..”

మౌళిని అభినందన పూర్వకంగా చూసింది ఉష.

●●●

సి.ఇ గారింటికి కిలోమీటర్ దూరంలో..

లేబర్ కాలనీలో ఒక ఇంట్లో..

పరిస్థితి హృదయవిదారకంగా ఉంది.

“వామ్మో! ఇదెక్కడి గోలరో నాయనో.. నేనేం చేతురా దేవుడా! నీ నోట మన్నుబడ. రోజూ తాగిచ్చి జీతవంతా సారాకొట్టోడి ఎదాన కొడతా ఉండావు కదరా.!” లక్ష్మమ్మ చిందులు వేస్తోంది.

లక్ష్మమ్మ, వీర్రాజులకి నలుగురు పిల్లలు. పెద్దపిల్ల నరసి.. సి.ఇ గారింట్లో పని చేస్తోంది. దానికి తిండి బాధ లేదు.. వాళ్ళే చూసుకుంటారు. పైగా టెంతుకి కట్టించి ప్రైవేటు కూడా చెప్తున్నారు అమ్మగారు.

ఆఖరోడింకా పాలు తాగుతున్నాడు అమ్మదగ్గర. సంకురాతిరికి ఏడాది నిండుతుంది. మధ్య మగ పిల్లలిద్దరూ బడికి పోతున్నారు. మద్దాన్నం అక్కడే అన్నాలు కూడా పెడ్తారు.

అంతా బాగనే ఉంది కదా.. నాకేం లోటనుకుంది లక్ష్మమ్మ మొదట్లో.

వీర్రాజు పవర్ ప్లాంట్ లో వర్కరు. బాయిలర్ దగ్గర పని చేస్తాడు. ఆ వేడిలో ఎనిమిది గంటలు పైగా పని చేసి చేసీ కాక పట్టి పోయాడు.

“నడుం పట్టేత్తందిరా! అటూ ఇటూ మెదల్నీటం లేదు..” రోజూ వీర్రాజు మొత్తుకోడం విని, ఒక సారి సారా కొట్టుకి తీసుకెళ్ళాడు తోటి పనివాడు.

“ఓ సీసా పట్టీరా.. నడుం గిడుం మాయం..”

మొదట్లో ఒక సీసాతో అయిన అలవాటు మూడు సీసాల వరకూ తేలింది. షిఫ్టు ఎప్పుడైతే అప్పుడు కాళ్ళు సారా దుకాణం కేసి నడిచేవి. సీకుల్తో సారా లాగించి, ఇంటికొచ్చి అడ్డంగా పడి గుర్రెట్టేస్తాడు.

లక్ష్మమ్మ చెప్పీ చెప్పీ విసుగెత్తి పోయింది. కొట్టు వాడు రోజూ ఫ్రీగా పోసి, ఒకటో తారీఖున జీతాలిచ్చే ఆఫీసు దగ్గర నిల్చుంటాడు.

ఆ రోజు ఇచ్చిన జీతంలో యాభై రూపాయలు ఇంటికితెచ్చాడు వీర్రాజు. కటింగులు పోను ఐదువేలు రావాలి.

“నెల్లాళ్ళు పిల్లలకేం పెట్టను.. చంటోడికి పాలు చాలట్లేదు. పాల డబ్బా కొనకపోతే ఆడార్చుక పోతాడు.” తన కడుపు గురించేం మాట్లాడట్లేదు ఆ మాతృమూర్తి.

మంచి సంగీతం వింటున్నట్లు చిద్విలాసంగా మంచం మీద పడుక్కున్నాడు వీర్రాజు.

అరిచీ అరిచీ, ఏడ్చీ ఏడ్చీ శోషొచ్చి పడి పోయింది లక్ష్మమ్మ. అక్కడికీ, పక్కనే ఉన్న ఏ కాలనీలో మూడిళ్ళల్లో పాచి పని చేస్తుంది. మూడొందలిచ్చి ఒక్కో ఇంట్లో టీ పోస్తారు. మిగిలి పోయిన వేమైనా ఇస్తే, ఇంటికి తెచ్చుకుని గంజితో పాటు నోట్లో వేసుకుంటుంది. రోజూ రాత్రీ, శనాదివారాలు మధ్యాన్నం వండుతుంది. ఆ మాత్రానికే పొయ్యిలోకి, పొయ్యి మీదికి కలిపి రెండు వేలైన కావాలి. ఎప్పుడో తప్ప రోజూ పాలకూర పప్పు, టొమాటో కూరే.

లేచి గొణుక్కుంటూ ఇంట్లోకి నడిచింది లక్ష్మమ్మ.

ఒక గదీ, వంటిల్లు ఉన్న క్వార్టరు. ఇంటి వెనక జాగా బానే ఉంది. అందులో కొన్ని కాయగూరల విత్తనాలు చల్లింది.మసక చీకట్లో వెతుక్కుంటూ దొరికినన్ని గోరు చిక్కుడు కాయలు కోసి, ఉన్న గ్లాసుడు బియ్యంతో కలిపి పొయ్యి మీద పెట్టింది.

మెత్తగా ఉడికేశాక, ఉప్పు, మిరపకాయ నంజుకుని తినేస్తారు రోజూ. ఒక రోజు సొరకాయ, ఇంకో రోజు టొమాట. ఆ తినే పాలకూర పప్పు చేసి కూడ వారం పైన అయింది చేసి. పోపు పెట్టడానికి నూనె చుక్క, అల్లం వెల్లుల్లి ఎక్కడ్నుంచి తేవాలి.. పప్పు బద్ద కొని

ఎన్నాళ్ళయిందో!

"ఆకలేత్తందే.." నరసి వచ్చింది నీరసంగా. కళ్లల్లో ఉన్నాయి ప్రాణాలు.

"ఏందే.. ఏమైంది..?" ఒక్క ఉదుట్న లేవబోయి, కళ్ళు తిరిగి కూలబడింది లక్ష్మమ్మ.

"ఇయాల నా కన్నవెట్టడం మర్చారమ్మా! ఎల్తాననంగానే సరే నన్నారే. అందరూ ఏందోలాగున్నారు. మరీ బాబు.." సాయంత్రం జరిగిందంతా చెప్పింది.

"పోన్లేమ్మా. ఆ బాబు మంచిగున్నాడు గంద. ఉన్నదే సరుదుకోని తిందారి." నాలుగో సత్తు పళ్ళెం కూడా తీసి వండింది సర్దింది.

సగం సగం నిండిన కడుపులతో, ఖాళీని నీళ్ళతో నింపి, కాళ్ళు ముడుచుకుని పడుక్కున్నారు ఇంటిదు మందీ.. ఒక్క వీర్రాజు తప్ప.

●●●

మరునాడు పొద్దున్న..

"ఇంకొక చుట్టు కాఫీ .." ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ వరండాలోకి వచ్చి పేపరు తీస్తూ అన్నారు.

బబ్లూ చెయ్యి పట్టుకుని ఇంటి ముందున్న లాన్ లో పచార్లు చేస్తున్న భారతి లోపలికి నడిచింది. చేతికందినన్ని నందివర్ధనం పూలని తెంపి తాత దగ్గరగా వచ్చి అందించాడు బబ్లూ. వాడి నెత్తుకుని సన్నని తోవ మీద నడుస్తూ తోటలోకి వెళ్ళారు సి.ఇ గారు.

మొక్కలకి గొప్పులు తవ్వుతున్న మాలి లేచి నిలబడి నమస్కారం చేశాడు.

సి.ఇ గారి ఇల్లు చాలా పెద్ద ఆవరణలో ఉంది. ఇంటి ముందు లాన్, పూల చెట్లు.. తీర్చి దిద్దిన బాటలు. గేటు తీసుకుని ఇంట్లోకి వెళ్తుంటే ఇటూ అటూ రంగు రంగుల మెట్టతామరలు స్వాగతం పలుకుతాయి. వాటి వెనుకగా నిలువెత్తు ఎర్రని ముద్దమందారాలు, పూల బరువుకి కొమ్మలు వాల్చి, నందివర్ధనం పూలతో సరగా లాడుతుంటాయి. కొంచెం పక్కకి వెళ్తే గులాబీ తోట.. తెల్లని, ఎర్రని, పచ్చని గులాబీలు. అన్నీ సహజమైనవే.. హైబ్రిడ్ కాదు, సువాసనలు వెదజల్లుతూ ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి.

బబ్లూ కిందికి జారి గులాబీ తెంపబోయాడు.

"ముళ్లు గుచ్చుకుంటాయిరా.." భారతి చేతిలోని కాఫీ కప్పు శ్రీనివాస్ కిచ్చి, బబ్లూని పక్కకి లాగి వరండాలోకి మళ్లింది.

గుండెల నిండుగా చల్లని గాలి పీలుస్తూ కాఫీ రుచిని ఒక్కో గుక్కా ఆస్వాదిస్తూ తాగి శ్రీనివాస్ వరండాలో పేము కుర్చీలో కూర్చుని పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

వెంటనే బబ్లూ తాత ఒళ్ళోకెక్కి, పేపరు తీసేసి, కళ్ళజోడు లాగేశాడు.

"అరే.. ఇలాగియ్యి.."

""ఊహూ.." ఫ్రేముని మరింత గట్టిగా ఉడుం పట్టులో బిగించాడు.

"ఇదొక్కటే ఉందిరా. విరిగిందంటే ఆఫీస్ పని గోవిందా! ప్లీజ్.." మెల్లిగా వాడి చిట్టి చేతుల్లోంచి విడిపించుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు సి.ఇ గారు.

"గుడ్ మార్నింగ్ సర్." ఖంగారుగా లోపలికొస్తూ విష్ చేశాడు వంశీకృష్ణ, డివిజనల్ ఇంజనీర్, కోల్ ప్లాంట్ ఇన్చార్జ్.

భారతి ఇంట్లోకి వెళ్లి తన కళ్ళజోడు పెట్టి పట్టుకొచ్చింది.

"ఇదిగో.. నా కళ్ళజోడిస్తా రా."

తాత కళ్ళజోడు కింద పడేసి పరుగెత్తాడు బబ్లూ. దృష్టి అంతా వాటి మీదే ఉన్న శ్రీనివాస్ కింద పడకుండా చటుక్కున పట్టుకుని కళ్లకి తగిలించాడు, గట్టిగా నిట్టూరుస్తూ.

"ఇందులో గ్లాసెస్ లేవు.." రాగం పెడుతున్న బబ్లూని ఎత్తుకుని లోపలికి తీసుకెళ్లింది భారతి.

"సిడ్డౌన్. ఎనీ ప్రాబ్లమ్?" వంశీకి కుర్చీ చూపించాడు శ్రీనివాస్.

"నిన్నంతా కోల్ వేగన్లు రాలేదు సర్. ఎన్ని ఫోన్లు చేసినా పంపిచేశాం అంటారు. ఉన్న స్టాక్ వారం కంటే రాదు. యస్,ఇ (సూపరెంటెండెంట్ ఇంజనీర్)గారు లీవ్ లో ఉన్నారు కదా!"

"అవును. ఇంకో వారం వరకూ రారు. వాగన్లేమైనా ట్రబులొచ్చి ఆగిపోయాయేమో.." సాలోచనగా అన్నాడు శ్రీనివాస్.

"తెలీదు సర్. డ్రైవర్లేమీ కాంటాక్ట్ చేయట్లేదు."

"సరే.. నేను కన్సెర్న్డ్ వాళ్ళతో మాట్లాడ్తాను. అవసరమైతే ఒకటి రెండు యూనిట్లు మూసేద్దాం. మీరు కోల్ మైన్స్ వాళ్ళతో కాంటాక్ట్ లో ఉండండి. గంట గంటకీ నాకు రిపోర్టిస్తుండండి."

"సరే సర్." వంశీకృష్ణ మళ్ళీ విష్ చేసి వెళ్లిపోయాడు.

ఉష్ణ ఆధారిత పవర్ ప్లాంట్ కి ముఖ్యమైన మూల పదార్ధం బొగ్గు. ఇంధనమే లేకపోతే ఏ యంత్రమైనా నడిచేదెలా.. శ్రీనివాస్ ఆలోచిస్తూ ఇంటి లోపలికి నడిచాడు. ఏమయి ఉంటుంది? ఏడాది వరకూ కాంటాక్ట్ రిన్యూ చేశాం కదా!

"నాన్నా! ఇవేళ మా కాలేజ్ డే. నేను డ్రామాలో వేస్తున్నా. మీరు వస్తారు కదూ!" ఉష కాలేజ్ కి వెళ్ళబోతూ అడిగింది.

"అవునవును.. మీ ప్రిన్సిపాల్ ఇన్విటేషన్ పంపారు. రావడానికి ప్రయత్నిస్తాను. నా ఇబ్బంది తెల్సు కదా!"

"మీరెప్పుడు ఇంతే." బుంగమూతి పెట్టి వెళ్ళిపోయింది ఉష. ఒక్క నిముషం ఆలిశ్యమైనా బస్ వెళ్లి పోతుంది.

"నువ్వు తయారుగా ఉండు భారతీ. నేను రాలేకపోయినా కారు పంపిస్తా. మీరు వెళ్ళచ్చు." ఆఫీస్ కి వెళ్లడానికి కావాల్సిన పేపర్లు అవీ సర్దుకుని స్నానానికి వెళ్ళాడు శ్రీనివాస్.

పవర్ స్టేషన్ లో రాత్రి డ్యూటీల వాళ్ళు ఇళ్ళకు వెళ్లి, పగలు షిఫ్ట్ వాళ్ళు ప్లాంట్ కి వెళ్లి పోయారు. ఆ సందడంతా సి.ఇగారి వరండాలోంచి కనిపిస్తుంది. రోజూ ఆ హడావుడి చూడడం అలవాటు శ్రీనివాస్ కి.

టౌన్ షిప్ లో కొత్త రోజు ప్రారంభమయింది

## 2

"ఇంటికి వెళ్ళబుద్ధి కాదోయ్. తల్చుకుంటేనే భయం వేస్తుంది." రాజు మాటలకి జాలిగా చూశాడు సహోద్యోగి సూర్యం. ఇద్దరూ పక్క పక్కనే సైకిళ్ళ మీద, రాత్రి షిఫ్ట్ చేసి ఇళ్లకి వెళ్తున్నారు.

ఇంకా ఆరు కూడా అవలేదు. అప్పుడే సూర్యుడు తన వాడి కిరణాలని సూటిగా వాళ్ల కళ్ళల్లోకి వదులుతున్నాడు. ఇద్దరూ 'ఎ' స్టేషన్లో అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏ.ఇ). రాజు పట్టా తీసుకున్నాక, ఉద్యోగంలో చేరడమే ఆ పవర్ ప్లాంట్ లో. అప్పట్నుంచీ, ఇంచుమించు పదేళ్ళనుంచీ రాత్రి షిఫ్టే. పెళ్ళయి ఐదేళ్ళయింది.

మామూలుగా అందరికీ రాత్రి షిఫ్టులు వంతుల ప్రకారం మారుస్తూ ఉంటారు. రాజు మాత్రం ఆఫీస్ కి వెళ్లి మార్చద్దని బ్రతిమాలుతాడు. ఆఫీస్ వాళ్ళకి మరీ మంచిది. పగలు డ్యూటీలకి గిరాకీ ఎక్కువ.

"ఎందుకలా?" ఎవరో అడిగారు మొదట్లో.

"ఇంటి కంటే అక్కడే బాగుంటుంది గురూ!" పేలవమైన నవ్వుతో సమాధానమిస్తాడు.

అయోమయంగా చూసిన వాళ్ళకి తన గోడు వెళ్ళ బుచ్చుకుంటాడు.

"నేనొక భార్యా బాధితుడ్ని. నా కూతుళ్ళతో నేను మనసారా ఆడుకోవడానికి కూడా లేదు." ముచ్చటైన ఇద్దరు ఆడపిల్లలు.

"పొద్దున్న వెళ్ళగానే స్నానం, ఫలహారం కానిచ్చి పక్క ఎక్కేస్తాను. మధ్యాన్నం భోజనం, మళ్లీ నిద్ర. రాత్రి ఎప్పుడవుతుందా అని చూసి.. చలో డ్యూటీ."

"మరి ఎవరైనా పెద్దవాళ్ళని రప్పించి చెప్పించచ్చు కదా! ఎన్నాళ్ళు పడతావిలా? పోనీ మన కాలనీలో పెద్దమనుషుల్నితీసుకురామా?"

"అదీ అయింది గురూ! వచ్చిన వాళ్ళు అవమానం పాలయి వెళ్లి పోయారు. కట్టుకున్నందుకు నాకు తప్పదు. అందర్నీ ఎందుకు బాధ పెట్టడం?" తనని ఓదార్చబోయిన శ్రేయోభిలాషుల్ని సున్నితంగా తిరస్కరిస్తాడు. రాజుని కలిసిన ప్రతీ ఒక్కరూ అతని స్థితికి జాలిపడుతుంటారు.

"సరే రాజూ! వస్తాను. రాత్రికి కలుద్దాం." సూర్యం తన ఇంట్లోకి వెళ్లి పోయాడు.

రాజు నెమ్మదిగా ఆలోచిస్తూ ఇంకా ముందుకు సాగాడు. అదే వీధిలో చివరగా ఉంటుంది అతని క్వార్టర్. ఇంటి వెనుక అంతా అడవిలా ఉంటుంది. కనుచూపు మేరలో జన సంచారం కనిపించదు. ఇల్లు మూలగా ఉండటంతో బోలెడు ఆవరణతో విడిగా ఉంటుంది. ప్రక్క క్వార్టర్ కీ, రాజు ఇంటికీ మధ్య చాలా జాగా ఉంటుంది. రెండిళ్ళకీ మధ్య దట్టంగా చెట్లు.. వాటి కింద ముళ్ళ కంచెలు, చెత్త చెదారం, వాడేసిన ప్లాస్టిక్ సంచులు.. నడిచేట్లుండదు. పక్కింటికి వెళ్ళాలంటే గేటు తీసుకుని పావు ఫర్లాంగు నడవాల్సిందే.

రాజు ఇంట్లోనుంచి ఎప్పుడూ మాటలు వినిపించవు. వీధి చివరి ఇల్లు కనుక వచ్చే పోయే వాళ్ళు కూడా ఉండరు. ఎదురు వరుసలో ఇళ్ళు కూడా రెండిళ్ళ ముందే ఆగిపోయాయి. రాజింటి ఎదురుగా పెద్ద బండ. బండ చుట్టూ తుప్పలు. ఉడతలు, ఊరకుక్కలు తిరుగుతుంటాయి.

రాజు భార్య, జానకి ఎప్పుడూ బైటికి రాగా ఎవరూ చూడలేదు. ఎవరైనా కలిసినా, గయ్యాళి అని దూరం దూరం జరిగిపోతారు. మొగుడినే హింసిస్తుంది.. వేరే వాళ్ళొక లెక్కా! ప్రతీ ఏడూ, శ్రీ రామనవమి పందిట్లోకి మాత్రం వచ్చి, కళ్యాణం అయే వరకూ దీక్షగా సీతారాముల్ని చూస్తూ, అయ్యాక ప్రసాదం తీసుకుని వెళ్లి పోతుంది.

నాలుగైదు రోజులకోసారి ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ తెచ్చి పడేస్తాడు రాజు. మామూలుగా ఇళ్ళల్లో వార్తలు చేరేసే వాళ్ళు పనిమనుషులు.. కానీ రాజు ఇంట్లో పనిమనిషి లేదు. అందుకే ఇంట్లో జరిగే సంగతులెవరికీ తెలియవు.

"మగవాడు హింసిస్తే ఆడది నోరు పెట్టుకుని ఊరు వాడా ఏకం చేస్తుంది. అదే మగవాడయితె.. పరువు కోసం నోరు మూసుకుని భరిస్తాడు." కాలనీలో అంతా అదే అనుకుంటుంటారు.

వరండాలో కిటికీ ఊచలకి ఇనుప గొలుసుతో సైకిల్ని కట్టి, రాజు ఇంట్లోకి వెళ్లి తలుపేశాడు.

**సుగుణ నిద్రలేచి** కళ్ళు నులుముకుంటూ హాల్లోకి వచ్చింది.

రవి షూ లేసులు కట్టుకుంటూ తలెత్తి చూశాడు.

"అబ్బా! తొమ్మిదయిందే.. ఏంటో ఎంత తొందరగా లేద్దామన్నా తెలివే రాలేదు. పిల్లలు స్కూల్ కెళ్ళి పోయారా?"

రవి మాట్లాడకుండా లేచి టెన్నిస్ రాకెట్ తీశాడు.

సుగుణ ఆవలిస్తూ లోపలికి వెళ్లి పోయింది. హాలంతా చిన్న సైజు రణరంగంలా ఉంది. పిల్లలు సర్దుకోగా మిగిలిన పుస్తకాలు, విడిచిన బట్టలు, తడి తువ్వాళ్ళు, పొద్దున్నే కూరగాయలవాడు వతనుగా పెట్టే కూరల సంచీ.. టి.వి, వి.సి.ఆర్ రిమోట్ లు సరే సరి.. ఎక్కడపడితే అక్కడ పడున్నాయి.

కూరగాయల సంచీ లోపల ఫ్రిజ్ లో పెట్టి రవి వెళ్లిపోయాడు. సుగుణ పళ్ళు తోముకుని, కాఫీ కలుపుకుని కప్పుతో హాల్లోకి వచ్చింది. సోఫాలో ఉన్న నానారకాల వస్తువుల్ని నేల మీద పడేసి టి.వి రిమోట్ తీసి బటన్ నొక్కింది.

రవి, సుగుణలకి ఇద్దరబ్బాయిలు. నాలుగు, రెండు క్లాసులు చదువుతున్నారు. మధ్యాన్నం రెండు నుంచీ, రాత్రి ఎనిమిది వరకూ ఉండే షిఫ్ట్ లో పనిచేసే డివిజనల్ ఇంజనీర్ (డి.ఈ) అతను. పొద్దున్నే లేచి, పిల్లలకి బ్రెడ్ కాల్చి, ఆమ్లెట్ వేసి పెట్టి, పాలు తాగించి, వాళ్ళని తయారుచేసి స్కూల్ కి పంపుతాడు.

"రోజూ బ్రెడ్డేనా? మాకొద్దు.."

అలా పేచీ పెట్టినప్పుడు, కాంటీన్ నుంచి ఇడ్లీలో, దోశలో తీసుకొస్తాడు.

సుగుణ ఎప్పుడూ చాలా బిజీగా ఉంటుంది. తొమ్మిదింటికి లేచి కాఫీ తాగుతూ, మధ్యాన్నం అన్నం తింటూ.. అత్యవసరమైన పనులకి తప్ప సోఫాలో కూర్చుని టి.విలో వచ్చే ధారావాహికలు చూస్తూ ఉంటుంది. సీరియల్స్ లేనప్పుడు సినిమాలు.. కొంత ఖాళీ సమయం దొరుకుతే ఫోన్ ఉండనే ఉంది.

"అవునమ్మా! మీ అల్లుడు ఎప్పుడూ ఇల్లు పట్టకుండా తిరుగుతుంటారు. పట్టుమని పది నిముషాలు కూడా నాతో గడపరు. పిల్లలు కూడా ఎప్పుడూ 'నాన్నా' అంటూ ఆయన్నే పట్టుకుని వేళ్ళాడుతుంటారు. నాకైతే పిచ్చెక్కిపోతోందనుకో!" ఐదువేలు ఖరీదు చేసే క్రేప్ జార్జెట్ చీర కట్టుకుని, నిండా మేకప్ తో, చక్కగా పైంట్ చేసిన చేతి వేళ్ళని చూసుకుంటూ వాపోతోంది ఓ కూతురు.

"ఇదేదో ఆలోచించాల్సిన విషయమే! ఎవర్తైనా తగులుకుందేమో.. మీ డ్రైవర్ని ఒక చూపు వేసి ఉంచమను. ఎవర్నీ నమ్మడానికి లేదు." కంచిపట్టు చీర ముడతలు సరిచేసుకుంటూ, కళ్ళు పెద్దవి చేసి, ఆవేశాన్నంతా మొహంలోకి తెచ్చుకుని, కంఠ నాళాలు పగిలిపోయేలా ఫోన్లో కూతురికి సలహా ఇస్తోంది ఒక భారీకాయం తల్లి.

"అయ్యో! నాకావిషయం తట్టనే లేదుస్మీ. ఎంతసేపూ నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారని బాధ పడుతున్నానే కానీ.." వెక్కిళ్ళు పెడుతూ... "ఈ విధంగా జరుగుతోందేమోనని కొంచెం కూడా అనుమానం రాలేదు." అంతులేని భారీ వాక్యాలతో హృదయ విదారకంగా ఏడుస్తూ, ఫోన్ చేతుల్లో మారుస్తూ మొరబెట్టుకుంటోంది కూతురు."

అంతకు ముందురోజే మొదలైన సీరియల్ లో తల మునకలుగా లీనమై పోయిన సుగుణ పనిమనిషి వచ్చింది కూడా చూసుకోలేదు.

పనిమనిషి, సుగుణ తాగి కింద పెట్టిన ఖాళీ కప్పు తీసి లోపల పెట్టి తను కూడా పక్కన నేల మీద చతికిల బడింది.

"అబ్బోసి.. ఎంత బాగా యాక్టింగులు సేస్తా ఉన్నారమ్మగోరూ! అయినా అట్లా ఎట్టేడిపిస్తారమ్మా ఈ మొగోళ్ళు.. " పనిమనిషి కేసి తిరిగి మాట్లాడద్దన్నట్లు సైగ చేసింది సుగుణ.

తలూపి నిశ్శబ్దంగా కూర్చుని తనూ చూడసాగింది, దానికి పదహారేళ్ళుంటాయి.

మధ్య మధ్య యాడ్ లు వచ్చే సమయంలో పనులు చేస్తూ, సీరియల్ నడుస్తున్నప్పుడు చీపురు కిందపడేసి, కూలబడి చూస్తూ.. ఎలాగో పని ముగించి "ఎల్తున్నానమ్మ" అని చెప్పి వెళ్ళిపోయింది.

వంటింట్లో పని చేస్తూ చేస్తూ, మిగిలిన బ్రెడ్ కి వెన్న, జామ్ రాసుకుని తినేసింది. కాఫీ డికాక్షన్ ఉంటే చిక్కగా కాఫీ కలుపుకుని

తాగేసింది. అక్కడో చెయ్యీ, ఇక్కడో చెయ్యీ వేసి ఇల్లు తడి బట్ట పెట్టి తుడిచేసింది.

వెళ్తూ వెళ్తూ, అరకిలో కందిపప్పు, ప్లాస్టిక్ సంచీలో పడేసి, లంగాకి తగిలించి, పొడవాటి కొంగుతో కప్పేసి పట్టుకుపోయింది.

అంత సేపూ, సుగుణ టి.వీ లో మునిగిపోయింది.

“ఆ ఎదురింటమ్మ పని చేసినంతసేపూ ఎనకాలే ఉండి ఏడిపిస్తుంది. ఈ అమ్మలాగా అందరూ ఎందుకుండరో.. “ సీరియల్ టైటిల్ సాంగ్ పాడుకుంటూ, హుషారుగా గేటు దాటి,. “మళ్ళా రేప్పొద్దున్నే కదా ఆ సీరియల్ వచ్చేదీ.. ఆ డ్రైవర్ ఏం చెప్తాడో.. వాళ్ళయ్యగారి గుట్టు కనిపెడ్తాడో లేదో..” ఊహల్లో తేలిపోతూ ఎదురింట్లో అడుగుపెట్టింది పనిమనిషి.

సుగుణ లేచి టైమ్ చూసుకుంది.

“అబ్బా! పదిన్నరయింది. ఇంకో గంటే ఉంది, ఇంకో సీరియల్ మొదలవడానికి. గబగబా స్నానం చేసి తయారై వంట చెయ్యాలి. అసలు ఈయనేడీ.. ఇంట్లో ఉండడేంటీ! సరదాగా నే వంట చేస్తుంటే నా చుట్టూ తిరుగుతూ ప్రేమగా కబుర్లు చెప్పచ్చు కదా! ఎప్పుడూ ఆటలూ, పిల్లలూ, వాళ్ళ చదువులూ... పవర్ ప్లాంటూ. ఇంట్లో ఓ ఆడది తనకోసం ఉందని గుర్తుందా! తనతో మాట్లాడి ఎన్ని రోజులయింది? ఒకవేళ ఆ సీరియల్ లోలాగ.. అయ్యో! తనకి కారు లేదు. డ్రైవరు లేదు. ఎవర్ని కనుక్కోమనాలి.. “ మధన పడిపోతూ ఎలాగో స్నానం అయిందనిపించింది.

తామిద్దరూ భార్యా భర్తలేనా.. ఒకే ఇంట్లో ఉంటున్న అపరిచితులా? ఓ ముద్దూ ముచ్చటా.. ఎన్నాళ్ళయింది? సుగుణకి ఒళ్ళంతా చెమటలు పోశాయి.

రవి టెన్నిస్ అయాక వస్తూ వస్తూ ఇంటికి కావలసిన సరుకులు తీసుకొస్తాడు. స్నానం చేసి పిల్లల పుస్తకాలు, బట్టలు సర్ది, తన బట్టలు ఇస్త్రీకి పంపేవి, ఉతకవలసినవి వేరు చేసుకుని.. ఇల్లు తనకి తోచినట్లు ఒక మాదిరిగా సర్ది భోజనానికి కూర్చుంటాడు.

సుగుణ, పప్పు, ఒక కూర, అన్నం వండేసి టి.వి దగ్గర కూర్చుంటుంది.

ఉప్పు సరిగ్గా లేని పప్పు, సగం మాడి, సగం ఉడకని కూరతో అన్నం తినేసి డ్యూటీకి వెళ్ళి పోతాడు. రోజూ లాగానే రవి నిశ్శబ్దంగా తన పని చేసుకుని వెళ్ళిపోయాడు.

సుగుణ మాత్రం కోర చూపుతో రవిని గమనిస్తూ.. ఏదో కనిపెట్టాలన్నట్లు అతడి మొహంలోకి చూస్తూ లోపల్లోపల ఉడికిపోతోంది.

సి.ఇగారి ఆఫీసు పెద్ద హాలులా ఉంటుంది. తలుపు దగ్గర స్టూల్ మీద అటెండర్ కూర్చుని, లోపలికి వెళ్ళాలనుకునే వాళ్ళ పేర్లు రాయించి, పి.ఏకి చూపిస్తుంటాడు. హాలు తలుపు తియ్యగానే పి.ఏ బల్ల, దాని మీద టైప్ మెషిన్, పక్కనే ఫైళ్లు.. హాలు మధ్యలో కోడిగుడ్డు ఆకారంలో పెద్ద బల్ల, దాని చుట్టూ పన్నెండు కుర్చీలు ఉంటాయి. అక్కడే మీటింగులు జరుగుతాయి. అదే హాల్లో ఒక పక్కగా సి.ఇ గారిది పెద్ద బల్ల, సింహాసనం లాంటి పెద్ద కుర్చీ.. ఆఫీసులో ఉండవల్సిన హంగులన్నీ ఉంటాయి.

అఫీస్ మూల మూలలా శ్రద్ధగా తుడిచి, వెనుక అనుకుని ఉన్న చిన్న గదిలో ఉన్న కరెంటు స్టౌ మీద పాలు నీళ్ళు కలిపి పెట్టాడు రాములు.

రాములు సి.ఇ గారి దగ్గర కాంట్రాక్ట్ మీద పని చేస్తున్న అటెండరు. ఏ పనైనా అత్యంత శ్రద్ధగా చేస్తాడు. అందరితోను కలుపుగోలుగా ఉంటూ ఎవరేం చెప్పినా విసుక్కోకుండా చేస్తాడు.

వరండాలో కలకలం మొదలయింది. శ్రీనివాస్ వస్తుంటే దార్లోనే అరడజనుమంది కలుసుకుని, వెనుకే లోపలికి రాబోయారు. స్టూల్ మీద కూర్చున్న ఇస్మాయిల్ లేచి సి.ఇ గారికి సలాం కొట్టాడు.

సి.ఇ గారు వెళ్ళడానికి మాత్రం చెక్క పార్టీషన్ తలుపు తీసి, మిగిలిన అందర్నీ ఆపేశాడు.

ఇస్మాయిల్ పర్మనెంట్ ఉద్యోగి. అతనికి స్కేల్ లో జీతం పదివేలు పైన వస్తుంది. రాములు వంటి తాత్కాలిక ఉద్యోగులకి మూడు వేలు ఇస్తాడు కాంట్రక్టర్. అతను ప్రభుత్వం దగ్గర్నుంచి గుత్తగా డబ్బు తీసుకుని మనుషుల్ని సరఫరా చేస్తాడు. అక్కడ లేబర్ అందరు 'గుత్తేదారు' అని పిలుస్తారు. ప్రతీ తాత్కాలిక ఉద్యోగి అతనితో మంచి సంబంధాలు పెట్టుకోవాలి. లేకపోతే ఆ పైనెల పని సున్నా.

ఇస్మాయిల్ వచ్చిన వాళ్ళ పేర్లు రాయించిన చీటీలు తీసుకుని, సి.ఇ గారి బల్ల మీద బొత్తిలా పెట్టి బైటికి వెళ్లిపోయాడు.

పక్కనున్న చిన్న గదిలో కాఫీ తయారు చేస్తున్న రాములు, గబగబా వచ్చి వినయంగా సి.ఇ గారి చేతిలో సామాన్లు అందుకుని లోపల పెట్టి వచ్చాడు.

శ్రీనివాస్ కుర్చీలో కూర్చుని బెల్ కొట్టారు. వెంటనే ఇస్మాయిల్ వచ్చేశాడు.

"వంశీకృష్ణని పిలుచుకురా!"

కోల్ ప్లాంట్ డి.ఇ వంశీకృష్ణ, ఐదు నిముషాల్లో, చేతిలో పేపర్లు పట్టుకుని వచ్చి కూర్చున్నాడు.

శ్రీనివాస్ ఎవర్నైనా సరే, రాగానే ముందు కుర్చోమని చెప్తారు. అందుకే అందరి మన్ననలు అందుకుంటున్నాడు. అంతకు ముందున్న సి.ఇ పూర్తిగా వ్యతిరేకం. ఎవరొచ్చినా.. బోర్డ్ మెంబరో, ఛైర్మనో తప్ప, ఎంతసేపైనా నిల్చోపెట్టే మాట్లాడేవాడు. ఆఖరుకి ఇంటికి వెళ్ళినా కూడా, వరండాలో ఉన్న ఒక్క కుర్చీలో అయన కూర్చుంటే, వెళ్ళిన వాళ్ళు ఎన్ని గంటలైనా నిల్చోవలసిందే.

ఎవరి పద్ధతి వారిది.

"ఏమయింది? కోల్ వేగన్స్.. ఎనీ ప్రొగ్రెస్?"

"ఏం లేదు సార్. లైన్లన్నీ అవుట్ ఆఫ్ ఆర్డర్. ఫోన్స్ అందట్లేదు. వేగన్లు ఎక్కడున్నాయో తెలియట్లేదు. ఇప్పుడున్న స్టాక్ అనుకున్న దానికంటే ముందే అయిపోయేట్లుంది." వంశీ అందోళనగా అన్నాడు.

రాములు రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి పెట్టాడు.

"ప్లీజ్." తీసుకోమన్నట్లు కప్పు చూపించి, కాఫీ తాగుతూ కళ్ళు మూసుకున్నారు సి.ఇ గారు. కొద్ది సేపు అలోచించి కళ్ళు తెరిచారు.

"మన వాళ్ళిద్దర్ని, జీపులో పంపించండి. మైన్స్ దగ్గర వేగన్లు బయలు దేరాయంటున్నారు కదా! ఒక ఏ.ఇ, ఒక సూపర్వైజర్.. ఎందుకైనా మంచిది, ఇద్దరు సెక్యూరిటీ వాళ్ళని కూడా పంపండి. ఈ లోగా మూడు యూనిట్లు ఆపెయ్యండి. గ్రిడ్ లో ఎడ్జస్ట్ చెయ్యమందాం." స్పష్టంగా సూచనలిచ్చి, వంశీని వెళ్ళమని, బెల్ కొట్టబోయాడు శ్రీనివాస్.

రాములు వచ్చి చేతులు కట్టుకుని ఎదురుగా నిలుచున్నాడు.

ఏమిటన్నట్లు చూశారు సి.ఇ గారు.

"మా టెంపరరీ స్టాఫ్ కి పర్మనెంట్ చెయ్యమని ఆర్డర్లొచ్చాయట కద్సార్?"

"ఇంకా మాకు రాలేదయ్యా. హెడ్డాఫీస్ లో డిస్పాచ్ అవకుండానే మీకు వార్త వచ్చేస్తుందే! కనుక్కుంటానుండు." శ్రీనివాసి మాట నోట్లో ఉండగానే హెడ్ ఆఫీసుకి డైరెక్ట్ లైనున్న ఫోన్ తీసిచ్చాడు రాములు, శ్రద్ధగా తుడిచి.

"నీ ఆత్రుత బాగుంది. కానీ ఇప్పుడు టైమెంతయింది?"

రాములు గడియారం చుసి నాలుక్కరుచుకున్నాడు.

తొమ్మిదయింది. హెడ్డాఫీస్ లో పదకొండింటికి కానీ ఫైళ్ళు కదలడం మొదలు పెట్టవు. పదిన్నర నుంచీ ఒక్కొక్కళ్ళు రావడం, ఆపైన చాయ్ లు.. ఆరోజు వార్తల విశ్లేషణ. అంతా అయి, ఆఫీస్ పనికి కూర్చునే సరికి పదకొండు దాటాల్సిందే. అందరూ అని కాదు.. తొంబై శాతం

అంతే. ఎవరైనా ముందుగా పని చెయ్యబోయినా.. మిగిలిన సంబంధిత ఉద్యోగులు లేక ఆగిపోవాల్సిందే.

"సార్!" ఇస్మాయిల్ చీటీలు పట్టుకుని నిల్చున్నాడు.

"సివిల్ డి.ఇ గారిని రమ్మను." చీటీలు చూసి ముఖ్యమైనవి పక్కన పెట్టుకున్నాడు శ్రీనివాస్.

ఇస్మాయిల్ డి.ఇ గారి గదికి వెళ్ళాడు. అంతలో..

"గుడ్ మార్నింగ్ సర్." సూపరెంటెండెంట్ ఇంజనీర్, నిర్వహణ.. (యస్.ఇ ఏడియమ్), గోపాలాచారి వచ్చి కుర్చీ వెనక్కి లాగి కూర్చున్నాడు.

పవర్ ప్లాంట్ లో సి.ఇ తరువాత, యస్.ఇ, ఏడి.యమ్ దే కీలకమైన స్థానం. ఇద్దరూ కలిసే, ఏ పనయినా నిర్వర్తించాలి.. ఎటువంటి సమస్యలొచ్చినా పరిష్కరించాలి. అతనొక్కడే ఎటువంటి అనుమతీ లేకుండా సి.ఇ గారి ఆఫీసుకి వస్తూ పోతుండచ్చు.

మొత్తం అక్కడున్న ఉద్యోగుల అటెండెన్స్ చూడడం, షిఫ్ట్ లు నియంత్రించడం, సెలవుల అనుమతులు.. ఒకటేమిటి.. అన్నీ యస్,ఐ ఏడియమ్ చేతుల్లోనే ఉంటాయి. ఒక్కోదానికీ కింది అధికారులు ఉంటారు. ప్రతీ వారం అందరి దగ్గరా రిపోర్ట్ లు తీసుకుని సరి చూస్తుంటారు. ఎక్కడేం లోపం జరిగినా ఆ యస్.ఇ గారిదే భాద్యత.

గోపాలాచారి ఆరడుగుల నాలుగంగుళాలు పొడవుంటాడు. కుర్చీ వెనక్కి ఎంత లాక్కుని కూర్చున్నా మోకాళ్ళు బల్ల అంచులకి తగులుతూనే ఉంటాయి. చూడగానే కోపిష్టిలా కనిపిస్తాడు. మొదట్లో కస్సుమన్నా.. అందరి బాగోగులు స్వయంగా చూసి, వీలైనంత వరకూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడని పేరు.

"సార్!" సివిల్ డి.ఇ.. కుర్చీ అంచు పట్టుకుని నిలుచున్నాడు.

"కూర్చోండి. సివిల్ వర్క్ స్ చాలా పెండింగ్ లో ఉండి పోయాయి. ఏం చెయ్యబోతున్నారు? రాత్రిళ్ళు రోడ్ల మీద అస్సలు వెలుతురు ఉండట్లేదని షిఫ్ట్ వర్కర్స్ గొడవ పెడుతున్నారు. అమ్మాయిలు రాత్రి ఎనిమిది దాటాక కాలనీలో తిరగడానికి భయపడుతున్నారు.

క్వార్టర్స్ లో నీళ్ల పైపులు లీక్, రూఫ్స్ లోనుంచి వాన నీళ్లు కారడం.. రోడ్లమీద, ఫుట్ పాత్ లలో పిచ్చి మొక్కలు పెరిగి నడవడానికి లేకుండా.. చెప్పుకుపోతుంటే ఎన్నైనా ఉన్నాయి. నేను సగం మాత్రమే చదివాను." రెండొందల పైన కాగితాలున్న ఫైలుని బరువుగా పైకెత్తి లేపారు సి.ఇగారు.

"ఇవన్నీ మీకెందుకు పంపారండీ? సివిల్ యస్.ఇ కి కదా ఇవ్వాలి.." గోపాలాచారి తన పొడవాటి చెయ్యి చాపి, సి.ఇ గారి దగ్గరున్న ఫైల్ అందుకున్నాడు.

"అదే కదా ప్రస్తుత సమస్య. ఇవన్నీ, 'సి.ఇ గారికి విజ్ఞప్తి" అంటూ రాములు కిచ్చి, నాకు మాత్రమే ఇమ్మని చెప్పారుట. రాములు, ఇందాకే ఒక వారం రోజుల కలెక్షన్ తెచ్చి ఇచ్చాడు ఒక ఆకాశ రామన్న అయితే.. ఇంకొంచెం ఘాటుగా రాశాడు. 'యస్.ఇ సివిల్ గారికిచ్చిన అర్జీలన్నీ మాయమై పోతున్నాయి. కాలనీలో ఇళ్ళు అన్నీ మీ క్వార్టర్స్ లాగ ఉంటున్నాయనుకోకండి..' అంటూ చురక వేశాడు." అదే శ్రీనివాస్ ప్రత్యేకత. అతను తలుచుకుంటే ఆకాశరామన్న ఎవరో తెలుసుకోవడం అంత కష్టమైన పనేం కాదు. కానీ లోపాలు గ్రహించి చర్య తీసుకోవడం అతని పాలసీ. అంతే కానీ రంధ్రాన్వేషణ కాదు.

"ఏమంటారు?" గోపాలాచారి డి.ఇ సివిల్ ని అడిగాడు.

గోపాలాచారికి చాలా పవర్ ప్లాంట్స్ లో పని చేసిన అనుభవం ఉంది. అక్కడ జరిగే అవకతవకలన్నీ కరతలామలకమే. అయితే ఆ పవర్ ప్లాంట్ కి వచ్చి ఒక నెలే అయింది. ఇంకా అవగాహన చేసుకుంటున్నాడు, అక్కడి స్థితిగతులు.

"చేస్తూనే ఉన్నాం సార్. బడ్జెట్ అదీ చూసుకోవాలి కదా!" సివిల్ డి.ఇ గొణిగాడు.

"సరే.. బడ్జెట్ సంగతి గోపాలాచారి చూసుకుంటారు. యాక్షన్ ప్లాన్ కూడా ఆయనే ఇస్తారు. మీరు ఆ ప్రకారం అమలు పరచండి. క్వాలిటీ దగ్గర కాంప్రమైజ్ అవద్దు." సి.ఇ గారు, గోపాలాచారి కేసి తిరిగారు.

"ఒక్కరగంటలో, నేనే మీ దగ్గరకొస్తా. ఇవేళే మొదలుపెడదాం. వర్కర్స్ ని పిలిపించమనండి."

సివిల్ డి.ఇ సుందర్రావు బల్ల మీదున్న ఆర్జీల ఫైల్ తియ్యబోయాడు.

"అదలా ఉంచండి. నేను చూడాలి." కుర్చీ ఇంకొంచెం వెనక్కి లాగి వెళ్ళబోతున్న గోపాలాచారిని ఆగమన్నట్లు చెయ్యి చూపించారు సి.ఇ గారు.

"మీరు కొంచెం ఆగండి." ఇస్మాయిల్ ని పిలిచి ఎవర్నీ రానివ్వద్దని చెప్పాడు శ్రీనివాస్.

సుందర్రావు వెళ్ళిపోయాక, రాములు ఇద్దరికీ చెరో కప్పు కాఫీ ఇచ్చి, తలుపు వేసి వెళ్ళిపోయాడు. సి.ఇ గారికి ఏ అలవాటు లేదు కానీ రెండు గంటలకోసారి కాఫీ మాత్రం కావాలి.

గోపాలాచారి చిన్న ప్లాన్ పాడ్ పట్టుకుని, కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు.

"ఈ టెంపరరీ స్టాఫ్ ని పర్మనెంట్ చేస్తూ ఆర్డర్స్ వస్తున్నాయి. అవి ఎక్కడో ఆగిపోయాయి. ఇక్కడ కొంతమంది, పదేళ్ళనుంచీ టెంపరరీగానే ఉన్నారు. ఎప్పటికైనా తీసుకోకపోతారా అని ఓపిగ్గా ఎదురు చూస్తున్నారు. వాళ్ళే అసలు సరిగ్గా పనిచేసేది, ఒళ్ళు దాచుకోకుండా. అదొకటి చూడాలి."

"పర్మనెంట్ చేస్తే వాళ్ళు కూడా.. అంతే.." గోపాలాచారి నవ్వి, తన పాడ్ లో పాయింట్లు రాసుకున్నాడు.

శ్రీనివాస్ కూడా నవ్వుతూ అవునన్నట్లు తలూపాడు.

"నిజమే అనుకోండి. అయినా తప్పదు కదా!"

గోపాలాచారి వచ్చినప్పట్నుంచీ సి.ఇ గారికి చాలా హాయిగా ఉంది. మనసులో మాట ఉండగానే అమలు చెయ్యడానికి చూస్తాడు. ఒక్క నిముషం కూడా కూర్చోకుండా బొంగరంలా తిరుగుతూనే ఉంటాడు. రోజూ అన్ని యూనిట్లు చూసి రావలసిందే.

"కోల్ ప్లాంట్ లో కొత్త ఇబ్బంది వచ్చింది. ఇవేలే నానోటీస్ కొచ్చింది. రేక్ లు రావడం మానేశాయిట. ఎమెర్జెన్సీ వచ్చేలాగుంది. ముందుగా దాని సంగతి చూడాలి. అవసరమైతే మీరు రంగం లోకి దిగాలి." శ్రీనివాస్ ఆందోళనగా అన్నాడు.

రేక్ అంటే ఒక గూడ్సు బండి వంటిది. అందులో ఇరవై నుంచీ ఇరవై ఐదు వరకు వేగన్లుంటాయి. అటువంటి రేక్ లు రోజుకి నాలుగో ఐదో వస్తాయి. రోజూ ఇంచుమించు ఇరవై నాలుగు వేల టన్నుల బొగ్గు కాలుతుంది.

"సరే సార్. వాళ్ళ యస్.ఇ గారు వచ్చేవరకు నేను చూస్తాను. మొదట రెండు యూనిట్లు అపెయ్యమని చెప్తాను." గోపాలాచారి రెండంగల్లో బైటికి వెళ్లి తన గది బయటున్న అటెండర్ కి సూచనలిచ్చి, సివిల్ డి.ఇ ఆఫీస్ కేసి నడిచాడు.

....................

గోపాలాచారి, సుందర్రావు దగ్గరికి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి సివిల్ యస్.ఇ దగ్గర కూర్చుని, ఏం చెయ్యాలనేది ప్రణాలిక వేసుకున్నారు.

ఎంత బడ్జెట్ ఇచ్చినా సివిల్ పనులకి సరిపోదు. కొన్ని తప్పని సరిగా కాంట్రాక్ట్ కివ్వాలి. వాళ్ళు నాసి రకం సరుకులు వాడుతారు.

"కావలసిన సరుకులు మనం కొనిద్దాం. ముక్కుసూటిగా వెళ్ళే సూపర్ వైజర్ని పని జరిగే చోట పెడదాం. మొదటగా వీధి దీపాల సంగతి చూడాలి. లైట్లున్న స్థంభాలు చెట్ల పైకంటా ఎత్తుగా ఉన్నాయి. చెట్లు, వాటి కాంతిని నేల మీద పడకుండా ఆపేస్తున్నాయి. అంత ఎత్తు అవసరం లేదు. పోల్స్ కట్ చేయించి స్థంభాల పొడవు తగ్గించండి. బల్బులు దొంగతనం చెయ్యకుండా వైర్ మెష్ లు పెట్టిద్దాం."

అదివరకు స్థంభాలు పొట్టిగానేఉండేవి. పెట్టిన రెండో రోజుకల్లా బల్బులు మాయం అయిపోయేవి. అందుకని, వాటి ఎత్తు రెట్టింపు చేసి, ఆ సమస్య తొలగిపోయిందనుకున్నారు. కొత్తసమస్య వచ్చింది. రోడ్లన్నీ చీకటి గుయ్యారాల్లా తయారయ్యాయి.

"సార్! సార్.." ఇద్దరు వర్కర్లు పరుగెత్తుకుంటూ వచ్చారు రొప్పుతూ. నోట్లోంచి మాట రావట్లేదు.. సైగ చేస్తూ ఏదో చెప్పబోతున్నారు.

వాళ్ళ చేత నీళ్లు తగించి, ఆయాసం తగ్గాక చెప్పమన్నారు యస్.ఇ గారు.

"ఫస్ట్ స్టేషన్లో యూనిట్ టు బాయిలర్ దగ్గర యాక్సిడెంట్ సర్. ఒక వర్కర్ కాలిపోయాడు."

❦❦❦

**రోజు అలారం మోగక ముందే లేస్తాడు చక్రపాణి.** అయినా అలారం పెట్టుకోవడం మానడు.

లేచిన వెంటనే గడియారం నెత్తిన ఓ మొట్టు మొట్టి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి బాత్రూం లోకి వెళ్తాడు. అలారం మోగిందంటే ఇంటిడు మందీ లేచి గందరగోళం చేస్తారు. అందరి సంగతీ ఎలా ఉన్నా, అతని భార్యే సహించదు.

తెల్లవారు జామున నాలుగు అవుతోందనగా లేచి, స్నానంతో సహా అన్ని పనులూ ముగించుకుని, మార్నింగ్ వాక్ కి వెళ్తాడు. ఎపార్ట్ మెంట్ తలుపు తీసుకుని వస్తుంటే సరిగ్గా ఐదవుతూ ఉంటుంది.

ఆ రోజు కూడా ఒక చేతిలో కర్ర, ఇంకో చేతిలో టార్చి పట్టుకుని మెట్లు దిగి కిందికి వెళ్ళాడు.

"గుడ్ మార్నింగ్ సర్." అటూ ఇటూ తిరుగుతున్న వాచ్మన్ పలుకరించాడు. రాత్రిళ్ళు ఏం కాపలా కాసినా కాయకపోయినా, చక్రపాణి కిందికి వచ్చే సమయానికి డ్యూటీ చేస్తుంటాడు.

చక్రపాణి గేటుదాటి బయటికి వచ్చాడో లేదో.. ఇంటి ముందు ఒక ఆటో ఆగింది.

పొద్దున్నే ఎవరో ఏదో బస్సుకి వచ్చుంటారనుకుని, పక్కకి తిరిగి వెళ్ళబోయాడు.

"నాన్నా!" తననే..

అమ్మాయి గొంతులా ఉందే.. ఉండడమేమిటి.. అమ్మాయే.

"నాన్నా! ఆటో అతనికి డబ్బిచ్చి పంపవా?" ఇద్దరు పిల్లల్నీ కిందికి దింపుతూ అంది. చేతుల్లో ఏమీ సామాన్లు లేవు.

"తల్లీ! నువ్వా.. ఇలా చెప్పా పెట్టకుండా.. అల్లుడుగారేరి? సామాన్లేవి?" ఎందుకో చక్రపాణికి ఏదో అపశ్రుతి అనిపించింది. వాళ్ళమ్మ పేరు పెట్టుకున్నందుకు కూతుర్ని 'తల్లీ' అని పిలుచుకుంటాడు. అదే అందరికీ అలవాటైపోయింది.

"సామాన్లేం లేవు నాన్నా. ఇదిగో బుజ్జీ, చిట్టీ. ఇంట్లోకెళ్ళి మాట్లాడుకుందామా?"

చక్రపాణి తేరుకుని, ఆటో అతనికి డబ్బిచ్చి పంపించాడు. మనవరాళ్లిద్దరినీ చెరో చేత్తో పట్టుకుని, మెట్లెక్కించి, తన అపార్ట్ మెంట్ కి తీసుకెళ్ళాడు. తన దగ్గరున్న తాళంతో తలుపు తీసి లోపలికెళ్ళాడు.

"రామ్మా. మంచినీళ్ళు కావాలా?" నీరసంగా ఉన్న కూతుర్ని చూసి గదిలోకి వెళ్లి భార్యని పిలుచుకొచ్చాడు.

"అప్పుడే వచ్చారేంటి.. వానేమైనా వచ్చిందా?" హాల్లోకి వస్తూనే అక్కడున్న కూతుర్నీ, మనవరాళ్ళనీ చూసి, ఆశ్చర్యంతో నిలబడి పోయింది.

"కాసేపు పడుక్కుంటానమ్మా!" అమ్మని చూడగానే ఆవిడ ఒళ్ళో తలపెట్టుకుని పడుక్కోవాలని అనిపించడంలో ఆశ్చర్యమేముంది..

కానీ.. కన్నతల్లి సుభద్రకి మాత్రం కడుపు తరుక్కుపోయింది.

తన చిన్నారి పాప.. ఉన్నంతలో ఎంతో గారంగా పెంచుకున్నారు. బొద్దుగా చక్కగా ఉండేది. ఏదీ ఆ అందం?

కళ్ళకింద నల్లని చారలు, లోతుకు పోయిన బుగ్గలు.. పుల్లల్లా ఉన్న చేతులు. ఒక చేత్తో పెద్దమ్మాయిని పట్టుకుంది. దానికి నాలుగేళ్ళు. ఇంకో చేత్తో చిన్నమ్మాయిని ఎత్తుకుంది. దానికి రెండేళ్ళు. పిల్లలిద్దరూ నిద్ర నిండిన కళ్ళతో చూస్తున్నారు.

ఆర్నెల్లే అయింది వాళ్ళని చూసి. అంతలో ఇంత మార్పా! అప్పుడూ బాగా చిక్కినట్లే అనిపించింది కానీ.. "డైటింగ్ అత్తయ్యా.." అని అల్లుడు తేల్చి పారేశాడు. ఎప్పుడూ ఒక్కదాన్నీ పంపడు. ఇప్పుడిలా..

అర్ధమయీ అవనట్లుంది, చక్రపాణి, సుభద్రలకి.

ముందు పిల్లలకి ఏమైనా ఇవ్వాలి. రాత్రినుంచీ ఏమీ తిన్నట్లు లేదు.

"లోపలికెళ్ళి, మొహాలు కడుక్కుని రండి. పాలు కాచి ఇస్తాను." సుభద్ర, ముగ్గుర్నీ తమ గదిలోకి తీసుకెళ్ళి, కొత్త టూత్ బ్రష్ లుంటే ఇచ్చింది. వాళ్ళు వచ్చేలోపు పాలు కాచి, పిల్లలకి బోరన్ వీటా కలిపింది. తమ ముగ్గురికీ చిక్కని కాఫీ కలిపి, మేరీ బిస్కట్ల పాకెట్ తెరిచి తీసుకొచ్చింది.

ఎప్పుడూ ఫ్రిజ్ లో పాలు ఉంచుకుంటుంది సుభద్ర.. కొడుకు పిల్లలు ఒక్కోసారి రాత్రి అడుగుతుంటారు. లేచి.

తల్లీ, పిల్లలు బుజ్జీ, చిట్టీ హాల్లో భోజనాల బల్ల దగ్గర కూర్చుని బిస్కట్లన్నీ ఖాళీ చేశారు. కాఫీలో, బోర్న్ వీటాలో నంచుకుంటూ. పిల్లలతో సమానంగా ఆవురావురు మంటూ తిటున్న తల్లిని చూస్తుంటే దుఃఖం ఆగలేదు సుభద్రకి. కష్టం మీద ఆపుకుని కాఫీ తాగింది.

చక్రపాణి, మూగవాడిలా అందర్నీ పరికించి చూస్తున్నాడు.

"అమ్మా! ఇంక పడుక్కోనా?"

ముగ్గుర్నీ లోపలికి తమ గదిలోకి తీసుకెళ్ళి, పక్కలు సర్ది పడుక్కోబెట్టింది సుభద్ర.

చక్రపాణి చేసేదేం లేక వాకింగ్ కి బయలుదేరాడు. రోజూ కలిసే మిత్రులు ముందే వెళ్లి పోయారు. ఒక్కడే నడుస్తూ.. తన గురించే ఆలోచిస్తున్నాడు. ఏమిటో ఈ జీవితాలు.. అంతా మన చేతిలోనే ఉందనుకుంటాం. ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు.

చక్రపాణి రాణీ గంజ్ లో ఉన్న ఒక ఆటో డీలర్ షాపులో మానేజరు. ఫరవాలేదనేట్లున్న ఉద్యోగం. క్లుప్తంగా కాలం గడుపుతూ ఇద్దరు పిల్లల్నీ పెద్ద చేశాడు. ఎప్పుడో మరీ తనకిష్టం లేని పనైతే తప్ప సుభద్ర కూడా అతను చెప్పినట్లే నడుచుకుంటుంది.

కూతురు బి.ఏ చదువుతుండగానే మంచి సంబంధం వచ్చిందని పెళ్లి చేశాడు. దగ్గరి బంధువులే.. వియ్యపురాలు చెల్లెలి వరుస. ‘తల్లి’ చక్కదనం అణకువ చూసి ముచ్చటపడి అడిగి చేసుకుంది.

“కట్న కానుకలేం వద్దురా అన్నయ్యా! పెళ్లి కూడా పెద్ద ఆర్భాటాలేం పెట్టుకోకు..”

ఎంతో మురిసిపోయారు సుభద్ర, చక్రపాణీ. తన ప్రైవేటు ఉద్యోగానికి, చిన్న జీతానికి.. మంచి సంబంధం వచ్చిందని చుట్టాలందరూ పొగిడారు, అదృష్టవంతుడివంటూ! అత్తమామలు మంచివాళ్ళు. అల్లుడు ఇంజనీర్. పెద్ద క్వార్టర్.. ప్రశాంతమైన ఊరు. నాలుగు రోజులుండి, సంసారానికి కావలసినవన్నీ సర్ది వచ్చారు.

చక్రపాణి కొడుకు రఘు, ఒక ప్రైవేట్ బాంక్ లో జూనియర్ ఎగ్జిక్యూటివ్. తల్లి కంటే ఏడేళ్ళు పెద్దవాడు. కోడలు శశి ఏదో కన్స్ట్రక్షన్ కంపనీలో ఆర్కిటెక్ట్. ఇద్దరూ పొద్దున్న తొమ్మిదింటికల్లా వెళ్లి సాయంత్రం ఆరింటికి ఇల్లు చేర్తారు. రఘుకి ఇద్దరు కొడుకులు. ఐదు, మూడు ఏళ్ళు.

చిన్న అపార్ట్ మెంట్. అందులోనే సర్దుకుని ఉంటున్నారు.

ఇంట్లో వంటపని అంతా సుభద్రే చేస్తుంది. శశి, పిల్లల్ని తయారు చేసి, తను తయారయి, టిఫిన్ డబ్బాలో సర్దుకుని, పెద్దకొడుకుని స్కూల్లో దింపేసి వెళ్ళిపోతుంది. చక్రపాణి ఎనిమిదింటికి, రఘు పదింటికి భోజనాలు చేసేసి వెళ్తారు. అందరూ ఇల్లు వదిలాక, చంటాడికి కావలసినవి చూసుకుంటూ, సాయంత్రం వంట చేసేసి.. కోడలు వచ్చాక గుడికి వెళ్తుంది సుభద్ర.

అంతా సాఫీగానే సాగిపోతోంది.

చక్రపాణికి వచ్చిన జీతం ఇల్లు గడపడానికి సరిపోతుంది. ఎప్పుడైనా తక్కువైతే మొహమాట పడుతూ కొడుకుని అడుగుతాడు. అపార్ట్ మెంట్ రఘు లోన్ తీసుకుని కొన్నాడు. రిటైర్ అయ్యాక ఎలాగూ రఘు చూసుకుంటాడు కదా.. పెన్షన్ లేకపోతేనేం. ప్రావిడెంట్ ఫండ్ బాంక్ లో వేసుకుంటే వడ్డీతో సాదరు వెళ్ళకపోదు.

చెట్టంత కొడుకున్నాడు.. దర్జాగా కాలి మీద కాలేసుకుని కూచుంటే గడిచిపోతుంది.

రఘు, శశి ఆదివారం వచ్చిందంటే సినిమాకి వెళ్తారు. వారమంతా కష్టపడినప్పుడు ఆ మాత్రం ఆటవిడుపుండద్దూ! పిల్లల్ని తాత, నాన్నమ్మ చక్కగా చూసుకుంటారు. “ఆదర్శ కుటుంబం.”

శశి కళ్ళు నులుముకుంటూ గదిలోంచి బైటికి వచ్చింది.

“ఎవరొచ్చారు? ఏవో మాటలు వినిపిస్తున్నాయి.” కాఫీ కలుపుతున్న అత్తగారిని అడిగింది.

“తల్లి వచ్చింది, పిల్లల్ని తీసుకుని. రాత్రంతా ప్రయాణం చేసి వచ్చింది కదా! కాసేపు పడుకోమన్నా. సాయంత్రం మాట్లాడుకోవచ్చులే. మీరు ఆఫీసులకి వెళ్ళిపొండి.”

అప్పుడే అక్కడికొచ్చిన రఘుని చూసి కనుబొమ్మలెగరేసింది శశి.

"తల్లా! ఇంత హఠాత్తుగానా! ఫోన్ చేస్తే బస్టాండ్ కి వెళ్ళే వాడినే కదా. ఒంట్లో బాగో లేదేమో అడిగావా? అయినా అక్కడ వాళ్ళకి అన్ని సదుపాయాలతో హాస్పిటల్ ఉంది కదా! ఇక్కడికెందుకు వస్తుంది? డెలివరీకి కూడా రాలేదు. బావ ప్రతీ వారం ఫోన్ చేస్తున్నాడనుకో. అతనైనా ఫోన్ చేసి చెప్పలేదే.." ఆపకుండా మాట్లాడుతున్న రఘుకి అడ్డు తగిలింది శశి.

"ఎందుకు చేస్తాడు? ఏదో తెమ్మని తరిముంటాడు." కనుబొమ్మలు ముడిచి అంది శశి.

"ఇంకా ఏమీ కనుక్కోలేదమ్మా! అలిసిపోయి పడుక్కుంది. లేచాక కనుక్కుంటాం." అప్పుడే వాకింగ్ నుంచి వచ్చిన చక్రపాణి కోడలితో అన్నాడు.

మామగారికి కనిపించకుండా మూతి మూడు వంకలు తిప్పింది శశి.

కొడుకు కోడలు ఆఫీసులకి వెళ్ళాక, వంటిల్లంతా సర్ది హాల్లోకి వచ్చింది సుభద్ర. చక్రపాణి ఆఫీస్ కి సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోయాడు.

రఘు, శశి వెళ్ళే వరకూ మధ్య మధ్య గదిలోకి వెళ్లి ఏవో మాట్లాడుకుంటూనే ఉన్నారు.

రఘు చిన్న కొడుక్కి  స్నానం, ఫలహారం కానిచ్చి, పని పిల్ల చేత పార్క్ కి పంపించింది సుభద్ర. వాళ్ళ కాంప్లెక్స్ పక్కనే పిల్లలు ఆడుకునే ఉయ్యాల, జారుడుబండ వంటి వాటితో మంచి పార్క్ ఉంది.

"ఏదో సమస్య వచ్చినట్లుంది." అప్పటివరకూ పేపరు ముందుపెట్టుకుని ఆలోచిస్తున్న చక్రపాణి అన్నాడు.

"పిల్లలకి పెళ్లిళ్ళు అయి మనవలు పుట్టాక కూడా అమ్మయ్య అనుకునేట్లు లేవు రోజులు. పని చేసుకుంటున్నానే కానీ దేని మీదా దృష్టి నిలవడం లేదు. ఇప్పటి వరకు నిక్షేపంలా నడిచిన సంసారం.. ఏమి ఉంటుంది? తల్లి అంత తొందరపడే రకం కాదే!" సుభద్ర కొంగుతో మొహం తుడుచుకుంటూ అంది.

ఇదివరకు పొడిపొడిగా ఉండే వాతావరణం.. కాలక్రమేణా కాలుష్య మహిమతో.. భరించలేని ఉక్కగా తయారయింది. అందులో వాళ్ళ అపార్ట్ మెంట్లో వంటింట్లో గాలే ఆడదు.

రిటైర్ అయ్యాక ఏం చెయ్యాలా అవి ఆలోచిస్తున్న చక్రపాణికి ఇప్పుడు భవిష్యత్తంతా గజిబిజిగా కనిపిస్తోంది.

నీరసంగా అడుగులో అడుగు వేసుకుంటూ బయటికి వచ్చింది తల్లి.

"రామ్మా! ఇడ్లీ పెట్టాను. స్నానం చేసి వస్తావా?"

అయోమయంగా చూసింది తల్లి. బట్టలు..

"నా బట్టలు పెట్టాను గదిలో. వెళ్లి చేసిరా. ఈ లోగా ఫలహారం తయారు చేస్తా."

మాట్లాడకుండా వెళ్ళి, స్నానం చేసి వచ్చింది.. ఒక యంత్రం లాగ. సుభద్ర కొంచెం లావుగా ఉంటుంది. ఆమె జాకెట్టు వేసుకుంటే తల్లి.. మరీ, కర్రకి బట్టలు వేసినట్లుంది.

చక్రపాణి చూడలేక కళ్ళు మూసుకున్నాడు.

బల్లమీదున్న పొగలు కక్కుతున్న ఇడ్లీలు ఒకదాని వెంట ఒకటి అరడజను తినేసింది. పక్కనే గ్లాసులో ఉన్న కాఫీ కూడా తాగేసి కూర్చుంది. కొంచెం మొహం తేట పడినట్లు అనిపించింది.

"దా తల్లీ! ఇలా వచ్చి కూర్చో." సోఫాలో తన పక్కనే జాగా చూపించాడు.

"చెప్పమ్మా! ఏమిటి సమస్య?"

"ఇంక నేను అతని దగ్గర ఉండలేను నాన్నా!" కన్నీరు ఉబుకుతుండగా అంది తల్లి.

"ఏమైంది రా? ఇప్పటి వరకూ బాగానే ఉన్నాడు కదా?"

"లేదు నాన్నా! పెళ్ళైన రెండో రోజునుంచే అతని అసలు రూపం చూపించాడు. నేనే.. పరువు పోతుందనీ, అందర్నీ బాధ పెట్టడం ఇష్టం లేక కొంతా, మారతాడేమోనని మరి కొంతా నోరు మూసుకుని భరించాను. విచిత్రమైన స్వభావం. ఎవరికీ తెలియకుండా ఎదుటి వాళ్ళను హింసించి ఆనందిస్తాడు. అందరితో మంచిగా ఉంటాడు. కానీ ఒక బలి పశువుని చూసుకుని వారి మీద చూపిస్తాడు ప్రతాపం. అదీ తిడుతూ, కొడుతూ."

"ఏం చేస్తాడు?" నూతిలోంచి వచ్చినట్లుంది చక్రపాణి స్వరం.

"ఏం చెయ్యడో అడగండి. పొద్దున్న కాఫీ దగ్గర్నుంచీ మొదలు. కాఫీ ఎలా ఇచ్చినా మొదటి కప్పు మొహానికేసి కొడ్తాడు. వేడిగా ఇస్తే వేడి.. గోరువెచ్చగా ఇస్తే చల్లగా అని. మొదటి సారి గట్టి దెబ్బే తగిలింది. హాస్పిటల్ కి వెళ్ళి కుట్లు వేయించుకున్నాను, నల్లా మీద జారి పడ్డానని చెప్పి. తర్వాత దెబ్బల్నుంచి కాచుకోవడం నేర్చుకున్నాను. అప్పట్నుంచీ తలుపు తాళం వేసుకుని వెళ్తాడు. తాళం కప్ప కనిపించకుండా గాడ్రెజ్ తాళం పెట్టించాడు. నేను లోపల్నుంచి తియ్యడానికి లేకుండా. పెరటి తలుపుక్కూడా అంతే. అది ఇల్లు కాదమ్మా.. జైలు." భోరుమంది.

"హింస అతని స్వభావం అయితే మరి.. పెళ్లి అవకముందు.." చక్రపాణి మాట పూర్తి కాకముందే వెక్కుతూ అందుకుంది తల్లి.

"వాళ్ళ అమ్మని హింసించే వాడు. అత్తయ్యకి తెలుసు కాబోయే కోడలి కష్టాలు. అందుకే కట్నం అదీ వద్దని నన్ను అడిగి చేసుకుంది. సీటు వచ్చినా కూడా యూనివర్సిటీ కాంపస్ కాలేజ్ లో కాకుండా వాళ్ళ ఊర్లో ప్రైవేట్ కాలేజ్ లో చదివించారు. అప్పుడే సైకియాట్ రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే ఏమైనా ఉపయోగముండేదేమో.. మావయ్యకి అంతా తెలీదు. కోపిష్టి మాత్రమే అనుకుంటున్నారు. నేనేదైనా చెప్పబోతే అత్తయ్యకి అర్ధం కాదు. మా వాడ్ని పిచ్చాడంటావా అని నిష్ఠూరం వేసింది. బి.ఏ లో సైకాలజీ చదివిన నాకు తెలిసింది.. అతనికి ఏదో ప్రాబ్లమ్ ఉందని. నేనే బాగు చేద్దామని ప్రయత్నించాను."

"మరి పిల్లలు?"

"మొదట్లో వాళ్ళని బాగానే చూసుకునే వాడు. ఈ మధ్యని వాళ్ళని కూడా కొడుతున్నారు. అతను ఆఫీసు నుంచి వస్తున్న చప్పుడవగానే మంచాలక్రింద దాక్కుంటారు అందకుండా. సదుపాయాలు బాగుంటాయని, పురిటికి కూడా పంపలేదు చూశారా? ఒక్కరే ఉండలేరు మళ్ళీ."

నిజమే అనుకుంది సుభద్ర. తనే వెళ్లి రెండేసి నెలలు ఉండి వచ్చింది. ఆలోచిస్తుంటే అనిపిస్తోంది.. అప్పుడు కూడా అల్లుడి మొహంలో, నడవడిలో ఏదో తెలియని టెన్షన్ ఉండేదని. పని ఎక్కువగా ఉండటం వలన అలా ఉన్నాడు కాబోలనుకుంది. ఎప్పుడూ భార్యని వంటరిగా వదిలే వాడు కాదు. సెలవుపెట్టి ఇంట్లోనే ఉండి పోయాడు. ఎంత శ్రద్ధో అనుకుంది. ఉదాసీనంగా ఉంటే కూతురిదే తప్పేమో అనుకుంది కూడా.

అయినా చెప్పదలుచుకుంటే ఎప్పుడో ఒకప్పుడు సమయమే దొరకలేదా? ఒకవేళ చెప్తే.. ఏం చేసి ఉండేది తను? ఏమో.. అందుకే తల్లి ఊరుకుని తనే బాధ దిగమింగుకుని ఉంటుంది.

"అమ్మా! చూడండి.." చీర కుచ్చిళ్ళు పైకి లేపి చూపించింది.

చూడగానే చక్రపాణికీ, సుభద్రకీ నోట మాట రాలేదు. గుండె పిండేసినట్లయింది.

రకరకాల మచ్చలు. కొన్నిపెచ్చుకడుతున్నాయి. కొన్ని మానుతూ ఉన్న కాలిన మచ్చలు. కొన్ని కముకు దెబ్బలు. కొన్ని కోసినట్లున్న గీతలు. కొంచెం కూడా ఖాళీ లేకుండా కాళ్ళ నిండా ఉన్నాయి.

"గట్టిగా అరవడానికి కూడా లేకుండా నోరు మూసేస్తాడు. లేకపోతే పళ్ళు కదిలేలా నోటి మీద కొడ్తాడు. అలాగే పళ్ళు కరుచుకుని భరించడం నేర్చుకున్నాను."

"అమ్మా!" కళ్ళు నులుముకుంటూ చిట్టి వచ్చింది. దాని చేతుల మీద కూడా నల్లగా మచ్చలు.

ఫోన్ మోత విని ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు అందరూ.

"హలో.." తేరుకుని చక్రపాణి తీశాడు.

"నేను మామయ్యా! మీ అమ్మాయి కానీ వచ్చిందా? తను పిల్లలు కనిపించడం లేదు. వాళ్ళు లేకుండా నేను బ్రతక లేను మామయ్యా!"

"నాన్నా! నన్ను పంపిచద్దు. అతను అలాగే అంటాడు. నేనింక భరించలేను. పిల్లలు కూడా బెదిరిపోతున్నారు. నిన్న రాత్రి చాలా గొడవ చేశాడు. కూర బాగుందని పిల్లలు కొంచెం ఎక్కువ వేసుకున్నారు. అక్కడికీ ఉన్నదంతా అతనికే వేశాను. మళ్ళీ చేద్దామంటే పావు కిలోకి మించి తేదు. వినడానికి సిల్లీగా అనిపిస్తుంది కానీ అన్నీ ఇటువంటి విషయాలకే చేస్తాడు గొడవ. దానికి తోడు అనుమానం. అసలు ఎవరూ ఇంటికి రారు.. బయట ఎటువంటి పిక్చర్ ఇస్తాడో కానీ. నేను అతనితో కానీ బయటికి వెళ్ళడానికి లేదు. అందరూ నాగురించి ఏమనుకుంటున్నారో తెలియదు. తలుపులు ఎప్పుడూ వేసే ఉండాలి." కళ్ళల్లో నీళ్ళు తిరుగు తుండగా మాట్లాడలేక ఆగిపోయింది తల్లి. దీవాన్ మీద వెనక్కి జరిగి కూర్చుని, మోకాళ్ళలో తల దూర్చి వెక్క సాగింది.

"వెళ్ళద్దమ్మా! ఇక్కడే ఉందువుగాని. నాకు నువ్వు పిల్లలు భారం కాదు." చక్రపాణి అంటుండగానే వీధి తలుపు చప్పుడయింది. రఘు, శశి లోపలికి వచ్చారు.

తల్లి ఉలిక్కి పడి లేచి కూర్చుంది. కళ్ళు, మొహం ఉబ్బి చూస్తుంటే మనసు ద్రవించిపోయేలా ఉంది.

"ఏంటి రా.. అప్పుడే వచ్చేశారు?" సుభద్ర తల తిప్పి చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది.

"అదే.. తల్లి చెప్పా చెయ్యకుండా వచ్చేసింది కదా! ఏమయిందో కనుక్కుందామని సెలవు పెట్టి వచ్చేశాం." రఘు చెప్పులు విప్పి మూలన పెట్టి వచ్చి కూర్చున్నాడు.

శశి గదిలోకి వెళ్ళి, బాగ్ లోపల పెట్టి, డైనింగ్ టేబుల్ దగ్గరి కుర్చీలో తీరిగ్గా కూర్చుంది.

తల్లికి కొంచెం ఇబ్బందిగా అనిపించింది.

అమ్మా, నాన్నలతో కాస్త మనసు విప్పి మాట్లాడు కుందామనుకుంటే.. ఇలా మధ్యలో వచ్చి, పంటి కింద రాయిలా..

అన్నా వదినలు పరాయి వాళ్ళని కాదు.. ఎప్పుడూ అంత చనువివ్వలేదు రఘు చెల్లెలికి. శశికూడా అంటీ ముట్టనట్లే ఉంటుంది. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించింది తల్లికి. అంతకు ముందు ఏదో హుషారు, బలం ఉందని కాదు.. మనసులో బాధ చెప్పుకుంటుంటె కొంచెం ఉపశమనగా అనిపించింది. తండ్రి ఓదార్పులో సాంత్వన దొరినట్లు అయింది.

అంతలో బుజ్జి కుడా లేచింది. పార్క్ కి వెళ్ళిన రఘు కొడుకు, చిన్నా కూడా వచ్చేశాడు.

తల్లి లోపలికి వెళ్ళి, చిట్టి, బుజ్జిలకి స్నానాలు చేయించి, తన చేతి సంచీలో తీసుకొచ్చిన రెండు గౌన్లు ఇద్దరికీ వేసింది. ఇడ్లీలు పెట్టి, బాల్కనీలో కూర్చోపెట్టి, వాళ్ళ ముందు రెండు బొమ్మలు పడేసి వచ్చి కూర్చుంది. స్నానాలు చేయిస్తుంటే పిల్లలిద్దరూ 'నొప్పి' అని సన్నగా ఏడుస్తూనే ఉన్నారు.

సుభద్ర, చిన్నా సంగతి చూసుకుంది. అరగంటకోసారి ఏదైనా తినడానికి కావాలి వాడికి. కాసిని బిస్కట్లు పెట్టి, బాల్కనీలో పిల్లల దగ్గర కూర్చోపెట్టింది. అదేదో అత్తగారి పనే అన్నట్లు శశి పేపర్ చదువుతూ కూర్చుంది.

పనిపిల్ల ఇంటి పనిలో పడింది. తనని పంపించే సరికి గంట పట్టింది.

"సుభద్రా! పన్నెండవుతోంది.." చక్రపాణి ఆకలికి ఆగలేదు.

"అయ్యో! వంట సంగతే మార్చి పోయాను. ఎంత.. అరగంట."

సుభద్ర వంటింట్లోకి వెళ్ళి, రెండు కుక్కర్లలో అన్నం, పప్పు వేసి, చారు పెట్టి అప్పడాలు వేయించింది.

అందరూ భోజనాలు చేశారు. పిల్లలు నిద్ర పోయారు. ఇంక కూర్చుని మాట్లాడు కుందాం అనుకునే లోపు ఫోన్ మోగింది.

రఘు తీశాడు.

"రఘు! నేను.. మీ సిస్టర్ వచ్చిందా? తను, పిల్లలు కనిపించడం లేదు. వాళ్ళు లేకుండా నాకు బ్రతుకే లేదు." దీనాతి దీనమైన బావగారి కంఠం విని రఘు ఏదో అనబోతుండగా, చక్రపాణి ఫోన్ లాక్కున్నాడు.

"రాలేదు బాబూ! అక్కడే ఎవరింటి కైన వెళ్ళారేమో చూడు." అతనేదో చెప్పబోయేలోగా ఫోన్ పెట్టేశాడు. మళ్ళీ చేస్తాడేమోనని, రిసీవర్ పక్కకి పెట్టాడు.

"అదేంటి నాన్నా.. అతను అంత బాధ పడుతుంటే అలా చెప్పారు?"

"నీకు తెలియదు రఘూ! అసలు విషయమేమిటంటే.." జరిగిందంతా వివరంగా చెప్పుకొచ్చాడు చక్రపాణి.

మొహాల్లో ఏ బావము కనిపించకుండా విన్నారు రఘూ, శశీ.

"నాక్ గా మానేజ్ చెయ్యాలి. పైగా ఇద్దరు పిల్లలు పుట్టాక ఎలా వదిలేసి వస్తుంది?" అంతా విని అన్నాడు రఘు.

శశి ఎక్కువగా మాట్లాడదు. మాట్లాడిన రెండు మాటలూ చాలు ఎదుటి వారు హద్దులు తెలుసుకోవడానికి.

"మరి వాళ్ళ అమ్మా నాన్నలు పట్టించుకోరా?"

"చెప్పాను కాదు నాన్నా! ఎవరికీ పట్టించుకోవడానికి ఛాన్సే లేదని. కనీసం వరండా లోకి కూడా తల్లి వంటరిగా వెళ్ళడానికి లేదు. మూడో మనిషికి చెప్పుకోడానికి లేకుండా కుమిలి పోయింది. ఇంతకాలం మనం ఏమంటామో అనే సర్దుకు పోయింది." చక్రపాణి రుద్ధ కంఠంతో అన్నాడు.

"నిన్న రాత్రి ఎలా బయలు దేరి వచ్చింది?" బోనులో ముద్దాయిన ప్రశ్నిస్తున్నట్లు అడిగింది శశి.

"వెనుక వరండా తాళం వెయ్యడం మర్చిపోయాడు. కాంపౌండ్ గోడ దూకి వచ్చేశాం. బుజ్జి పురిటికి నువ్వు వచ్చినప్పుడు ఇచ్చిన డబ్బు అతని కంట పడకుండా దాచ గలిగాను." అసలే సగం చచ్చి ఉన్న తల్లి, తల భూమిలోకి దించుతూ అంది.

"నువ్వెంతైనా చెప్పు నాన్నా! పిల్లల కోసం తను అడ్జస్ట్ అవాలి. వాళ్ళకి తండ్రి ఉండి కూడా లేకుండా చెయ్యడం చాలా దారుణం. అందులో ఆడ పిల్లలు.. పెళ్ళిళ్ళు అవీ చెయ్యాలంటే ఒక్క దాని వల్లా ఏమవుతుంది? అసలు వాళ్ళని పెద్ద చెయ్యడం చదివించడం ఎలాగ?"

"పెద్ద చెయ్యడానికి వాళ్ళు, నేను బ్రతికి ఉండాలి కదా!" ఎలాగోనోరు పెగల్చుకుని అంది తల్లి.

"ఒక్కత్తీ ఎందుకవుతుందిరా? నేనూ, అమ్మా లేమా? మేముండగా అది ఒంటరి కాదు."

"ఇప్పుడు సంసారాలు, సంసారాలు భరించడం ఎవరి వల్లవుతుంది? ఇల్లేమో చిన్నది. మీరు రిటైర్ అవుతున్నారు. ఎక్కడుంటారు?"

రఘు మాటలు ఈటెల్లా గుచ్చుకుంటుంటే నిర్ఘాంత పోయి చూశాడు చక్రపాణి.

***

**"యాక్సిడెంటా?" డి.ఇ సుందర్ ఆశ్చర్యంగా** అడిగాడు. ఆ పవర్ స్టేషన్ లో యాక్సిడెంట్ కేసులు చాలా అరుదుగా జరుగుతాయి. అంతా ఇంపోర్టెడ్, స్టాండర్డ్ మెషినరీ.

"డి.ఇ గారూ! మీరు ఆ పోల్స్ సంగతి చూడండి." సివిల్ డి.ఇ కి ఆదేశాలిచ్చి, గోపాలాచారి లేచి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బాయిలర్ దగ్గరికి నడిచాడు. వెనుకే సివిల్ యస్.యి పరుగులాంటి నడకతో అనుసరించాడు.

చెప్పడానికొచ్చిన వర్కర్లు కూడా పరుగెత్తారు, మరికొన్ని నీళ్ళు గటగటా తాగి.

ఎలా తెలిసిపోయిందో కానీ, ప్లాంట్ లో పనిచేసే సగం మంది అక్కడికొచ్చేశారు. సెక్యూరిటీ నుంచి అరడజను మంది వచ్చి, లావు పైపుతో కాలిపోయిన వర్కర్ మీదికి నీళ్ళు వదిలారు.

కానీ ఆ వర్కర్ అప్పటికే పూర్తిగా కాలిపోయి నల్లగా గుర్తు పట్టలేకుండా అయిపోయాడు. ప్రాణం ఎప్పుడో పోయుంటుంది.

"సెక్యూరిటీ వాళ్ళు తప్ప మిగిలిన అందరూ ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళండి. బాయిలర్ దగ్గర చేసే వాళ్ళు మాత్రం ఇటు రండి." గోపాలాచారి మాటలు విని గుంపులుగా మాట్లాడుకుంటూ అందరూ వెళ్ళి పోయారు.

"ఏమయింది?" తన దగ్గరికి వచ్చి చెప్పిన వర్కర్లని అడిగాడు గోపాలాచారి.

"పది నిముషాల పాటు డోమ్ మీద, యాష్ చిట్లం కట్టింది సార్. వ్యూ ఫైండర్ లోంచి పొడిచి కింద పడేస్తాం ఎప్పుడూ. మంటలో తేడా వచ్చిందని రీడింగులు చూపించాయి. సూపర్వైజర్ గారు పొడవమన్నారు. మామూలుగా అయితే, బూడిదంతా క్రింద పడి పాండ్ లోకి వెళ్ళి పోతుంది కదా! ఈ సారి మాత్రం మధ్యలో ఉండ గానే ఒక్క సారి మంట పైకి ఎగతన్నింది. మేమైతే పొడిచేసి పక్కకి తప్పుకుంటాం." గొంతు దెక్కు పడగా మాట్లాడలేక పోయాడతను.

"ఈడు ఇక్కడ కొత్త సార్! అక్కడే నుంచుని చూత్తన్నాడు. వీడి పని రోజూ కింద బూడిద ఎత్తి పొయ్యడం. ఇవేళ ఇద్దరు వర్కర్లు లీవైతే ఈడిని పంపారు సార్. అక్కడికీ మేం వార్నింగిత్తానే ఉన్నాం.." పాపం ఈ వర్కర్ కూడా మాట్లాడలేక పోయాడు. కాలి పోయిన వాడి స్థానంలో తానైనా ఉండి ఉండచ్చు.. కర్మ కాలితే..

వణికి పోతున్నాడతను. పేరు నాయుడు. ఎప్పుడూ ఆ పని అతడే చేస్తాడు. పక్కనున్నతను నాయుడి రెండు భుజాలూ పట్టుకున్నాడు.

సి.ఇ శ్రీనివాస్ గారికి కూడా కబురెళ్లినట్లుంది. పరుగులాంటి నడకతో వచ్చారు. జరిగిందంతా విని అడిగారు,

"ఎవరితను?"

"వీర్రాజని.." అంటూనే ధామ్మనికింద పడిపోయాడు నాయుడు.

★★★

"లక్ష్మమ్మా! సి.ఇ గారు పిలత్తన్నారు." అంట్లు తోముతున్న లక్ష్మమ్మ దగ్గరగా వచ్చి చెప్పాడు రాములు. ఆమెని వెతకడానికి గంట పైనే పట్టింది.

"ఏందన్నా! నరిసి గాని మల్ల ఏమైనా సేసిందా? నిన్నంతా ఏడత్తానే ఉంది పిల్ల."

"నరిసి మంచిగనే ఉందక్కా! అది గాదు.. సారే చెప్తారు. ఆఫీసుల కెల్లాలి పద."

తను పని చేస్తున్న అమ్మగారికి చెప్పి, చేతులు తుడుచుకుంటూ గోలెం పక్క పంద బెట్టిన చంటాడ్నెత్తుకుని రాములు వెంట నడిచింది.

దారి పొడవునా అడుగుతూనే ఉంది..

"ఏందన్నా.. ఏమయింది?"

రాములు ఏమీ చెప్పలేక పోయాడు. అతను అందర్తో స్నేహంగా ఉంటాడు. అందులోనూ వీర్రాజు ఇంటి పక్క నుండే క్వార్టర్లోనే ఉంటాడు. టెంపరరీ వాళ్ళకి ఇల్లు ఇవ్వరు. ఒక ఇంటిని రెండు భాగాలుగా చేసి వాడు కుంటారు.. మధ్యలో తడికె కట్టి. అద్దె మాత్రం రాములే కడతాడు. ఆ మాత్రం దొరకడం కుడా గగనమే మరి.

రోజూ లక్ష్మమ్మ, వీర్రాజుల భాగోతం చూస్తూనే ఉంటాడు.

"నాకేం తెల్వదక్కా! అదిగో వచ్చేసినం కదా!"

సి.ఇ గారి ఆఫీసులోకి వెళ్ళారిద్దరూ.

వీర్రాజు బాడీని హాస్పిటల్ కి తీసుకెళ్ళారు. పోస్ట్ మార్టం చేసి కానీ ఇవ్వరు.

యూనిట్ దగ్గరంతా శుభ్రం చేసి, అందరినీ పనుల్లోకి వెళ్ళమని, సి.ఇ గారు యస్.ఇ లిద్దరూ సి.ఇ ఆఫీసుకి వచ్చేశారు. ఇంక అక్కడ చెయ్యగలిగిందేముంది కనుక.. ఆ యూనిట్ ఆ రోజుకి షట్ డౌన్ చెయ్యమన్నారు.

"లోపలికి రామ్మా!" తలుపు దగ్గరే నిలుచున్న లక్ష్మమ్మని పిలిచారు శ్రీనివాస్.

"నరసి తల్లివా నువ్వు?" ఏవిధంగా మాట్లాడాలో తెలియక సి.ఇ గారు ఆగిపోతే, గోపాలాచారి అందుకున్నారు. చెడు వార్త చెప్పవలసి రావడం చాలా కష్టం. అందరికీ ఆ ధైర్యం ఉండదు.

"అవునయ్యగారూ! ఏం చేసిందండీ? నిన్నటాల్నే బాబు పారిపోయాడని ఒకటే ఏడిచిందయ్యా! ఏమనకండయ్యా. బాబు ఎలా ఉన్నాడు సారూ?"

"అబ్బే అది కాదమ్మా! నరసి బాగానే ఉంది. తన గురించి కాదు.."

"మరేమయిందయ్యా? ఓ.. నా పెనిమిటేమైన చేశాడా? రోజూమొత్తుకుంటూనే ఉన్నా పాక దగ్గరికి పోమాకయ్యా అని.. వింటేనా?" ఏడుపు కంఠంతో అంది లక్ష్మమ్మ.

"పాకా? పాకేంటి?" సి.ఇ గారికి అర్ధం అవలేదు.

"కల్లు పాక సార్." రాములు అందించాడు.

"ఓహ్.. అది కాదమ్మా! వీర్రాజు ప్లాంట్ లో పని చేస్తున్నప్పుడు ఫైర్ యాక్సిడెంటయింది."

"మంట లెక్కినయ్యక్కా!" అయోమయంగా చూస్తున్న లక్ష్మమ్మకి చెప్పాడు రాములు.

"అమ్మో! ఎం జరిగిందిరా? ఏమయిందు? నన్ను పిల్లల్ని అన్నాయం చేసి పోయాడా? నేనేమై పోదున్రా.." ఒక్క సారి కూలబడి వెర్రి చూపులు చూస్తూ వెక్క సాగింది.

"నీకు, పిల్లలకి ఏం గాదమ్మా. మేమందరం ఉన్నాం కద. మనిషిని తీసుకురాలేం కానీ మాకు చేతనయింది మేం చేస్తాం." చెప్పేసి గోపాలాచారి, బల్ల మీదున్న గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు.

అప్పటికి కానీ లక్ష్మమ్మకి జరిగింది అర్ధం కాలేదు.

"ఓరి దేముడా.. అన్నాయం చేసేశావురో.."హృదయ విదారకంగా ఏడుస్తున్న లక్ష్మమ్మని ఎవరూ ఓదార్చ లేకపోయారు.

లక్ష్మమ్మ చంకలో నిద్రపోతున్న చంటాడు కూడా ఉలిక్కిపడి లేచి గట్టిగా ఏడుపు మొదలెట్టాడు.

రాములు, లక్ష్మమ్మని నెమ్మదిగా లేపి వరండా లోకి తీసుకొచ్చాడు. వర్కర్ల కాలనీలో అందరికీ తెలిసినట్లుంది. మూడొంతుల మంది ఆడవాళ్ళు వచ్చేశారు.

సి.ఇ గారింటికి ఎవరో ఫోన్ చేసినట్లున్నారు. నర్సిని తీసుకుని భారతి వచ్చింది. నర్సిని చూడగానే లక్ష్మమ్మ దుఃఖం మరీ ఎక్కువయింది.

"రేపటిక్కానీ బావయ్యనియ్యరక్కా! మనం ఇంటికెళ్ళి పోదాం." రాములు లక్ష్మమ్మని నడిపించ సాగాడు. చంటోడ్ని ఎవరో ఎత్తుకున్నారు.

"రాములు! నువ్వు వాళ్ళక్కావలసినవి చూడు.." రాములు చేతికి రెండు వందలిచ్చి, శ్రీనివాస్, భారతిని ఇంటికెళ్ళి పొమ్మని చెప్పారు.

"నేనింటి కెల్లనమ్మా. మీ తోనే వస్తా." నరసి, భారతి కొంగు పట్టుకుంది.

"అలాగే పద."

"గోపాల్ గారూ! ముందు జరగవలసింది చూడండి. వీర్రాజు పి. యఫ్ లాంటివి, కోఆపరేటివ్ సొసైటీ వాళ్ల ఇచ్చే కాంపెన్సేషన్, ఎక్కడ్నుంచి ఎంత వీలైతే అంత వచ్చేట్లు చూద్దాం. లక్ష్మమ్మని క్లాస్ ఫోర్ కింద తీసుకునేలా రికమెండ్ చేద్దాం. మన చేతిలో ఉన్నది చేస్తే ఆ సంసారం ఒడ్డున పడుతుంది. వీళ్లు నలుగురు పిల్లలకి తక్కువ కాకుండా చూసుకుంటారు. కెలామిటీ వస్తే చూడండి ఏమవుతుందో.. ఎప్పటికి తెలుసుకుంటారో.." అందరూ వెళ్లి పోయాక ఖాళీగా ఉన్న వరండాలో నిల్చుని అన్నారు శ్రీనివాస్.

ఆ రోజు రాజు మానసిక స్థితి అత్యంత దయనీయంగా ఉంది. షిఫ్ట్ కి వెళ్ళే ముందు జరిగిన గొడవతో రాత్రంతా మనసు మనసులో లేదు.

ఎప్పుడూ బిక్కమొహం వేసుకుని చూసే పెద్దకూతురు ఎదురుతిరిగేసరికి కోపం పట్టలేకపోయాడు. అయినా తన సంగతి తెలిసి ఆదైనా ఊరుకోవచ్చు కదా! చిన్నపిల్లనుకుంటే ఎన్నెన్ని మాటలంది? ఐదేళ్ళు కూడా లేవు చూస్తే.. తను ఇంట్లోంచి వెళ్ళిపోతే అమ్మా, మేము చక్కగా హాయిగా ఉంటాం అంటుందా! పళ్ళు గట్టిగా పిండుకుంటూ తిరిగాడు.. ఏమీ చెయ్యలేక.

పవర్ స్టేషన్ లో అందరికీ రాజు పరిస్థితి తెలియడం వల్ల సర్దుకుపోతుంటారు. కీలకమైన పనులేవీ చెప్పరు. ఒక చోట కూర్చుని అంతా గమనిస్తుండడమే.

ఆ గమనించడమే అప్రమత్తంగా చెయ్యాలి. ఎప్పటికప్పుడు రీడింగ్సన్నీ రాసుకుంటుండాలి. బాయిలర్ ఉష్ణోగ్రత దగ్గర్నుంచీ, విడుదలైన విద్యుత్తు ఎన్ని కిలోవాట్స్ ఉందో చూడ్డం వరకూ నిరంతరం గమనిస్తుండాలి.

అన్నీ ఇంపోర్టెడ్ మెషీన్లే.. వాటి పని అవి నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతాయి. మరీ ఎక్కువ తేడాలుంటే అలారం మోగుతూ సంకేతాలు వస్తాయి. ఆ రీడింగుల్లో ఏ మాత్రం భేదమొచ్చినా తగిన చర్యలు తీసుకోవాలి.

రాజు పొద్దున్నే డ్యూటీ అయి ఇంటికి వచ్చేముందే బాయిలర్ ఉష్ణోగ్రత సరిగ్గా లేకపోవడం గమనించాడు. తన తరువాత వచ్చే షిఫ్ట్ అతను చూసుకుంటాడులే అని ఊరుకున్నాడు.

అదే రాజు  చేసిన పెద్ద తప్పు. అతన్ని రిలీవ్ చేసిన ఏ.ఇ వచ్చి చూసి యాక్షన్ తీసుకునే లోపే జరగాల్సిన అనర్ధం జరిగిపోయింది. అట్ట కట్టిన బూడిదలో నున్న నివురుగప్పిన నిప్పు ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది.

రాజు, సూర్యం కలిసి ఇంటికెళ్తున్నప్పుడు కూడ దాని మాటలే రాలేదు. షిఫ్ట్ లో పని ఎలా ఉంది అని సూర్యం కుశలప్రశ్నల్లా అడిగినా బైట పడేదేమో!

సూర్యం తన ఇంట్లోకి వెళ్ళిపోయాక, తన ఇంటి ముందు కిటికీకి సైకిల్ కట్టేసి, తలుపు తాళం తీసిన రాజు లోపలికి వెళ్ళలేదు. వెనక్కి తిరిగాడు. అస్థిమితంగా అటూ ఇటూ తిరిగాడు. మళ్ళీ తాళం వేసి, హాస్టల్లో మెస్ కి వెళ్లి కాఫీ తాగి టిఫిన్ తిన్నాడు.

అతను రాగానే హాస్టల్ మానేజర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాడు. నెలలో ఇరవై రోజులు అక్కడే తింటాడు మరి. అక్కడే రెండు గంటలు కూర్చుని, పేపరు చదివి.. పొద్దున్న టిఫిన్ తినడానికి వచ్చిన బ్రహ్మచారులతో కబుర్లు చెప్పి, హాస్టల్ నుంచి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి ఇంటి తలుపు తీశాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎప్పుడూ అతను వచ్చేసరికి తుఫాను ముందు ప్రశాంతత లాగా అలాగే ఉంటుంది. పిల్లలు ఇంకా స్కూలుకి వెళ్ళడం లేదు. పెద్దదానికి ఐదు నిండిందీ మధ్యనే. ఇంక వెయ్యాలి..

రాజు ఇంట్లో అడుగు పెట్టాడో లేదో..

ఆ నిశ్శబ్దంలో గుండెలదిరేలా ఫోన్ మోగింది. పాతకాలం ఫోన్. వాల్యూమ్ సవరించడానికి లేదు. చేతులు వణుకుతుండగా ఫోన్ తీశాడు. ఈ మధ్యనే ఆ వణుకు వచ్చింది.

"ఇంత చిన్న వయసులో ఇదేంటి.. డాక్టర్ కి చూపించుకో రాదా?" సూర్యం రోజూ అడుగుతూనే ఉంటాడు.

తీరిక చూసుకుని వెళ్ళాలి ఎప్పుడో..

"హలో.." అది ఆ టౌన్ షిప్ లో మాత్రమే పని చేసే ఫోన్. ప్లాంట్ నుంచే అయుంటుంది. కాలనీలో ఎవరు చేస్తారు.. తమ ఇంటికి! తమ సంగతి అందరికీ తెలిసిందే..

"సార్! మిమ్మల్ని సి.ఇ గారు ఉన్నపళంగా వచ్చెయ్యమన్నారు." ఇస్మాయిల్.. గొంతు కంగారుగా ఉంది.

"నేను ఇప్పుడే ఇంటికి వస్తున్నాను. నన్ను రిలీవ్ చేసే ఏ.ఇ వచ్చాకే ప్లాంట్ వదిలాను." రాజు నీరసంగా అన్నాడు.

"తెలుసు సార్ ఎమర్జన్సీ.. సి.ఇ గారు వెంటనే బయల్దేరమన్నారు." వచ్చి తీరాలి అన్నట్లు ఇస్మాయిల్ నొక్కి అన్నాడు.

"సరే.. వస్తున్నా." షూస్ విప్పకుండానే అలాగే వెనక్కి తిరిగి తలుపు తాళం వేసి, సైకిల్ తీసి మళ్ళీ  పవర్ స్టేషన్ కేసి తొక్క సాగాడు.

ఏమయి ఉంటుందబ్బా.. వచ్చే ముందు అన్ని రీడింగులు నోట్ చేశాడే.. ఏదయినా ట్రిప్ అయిందా అయినా అది మామూలే కదా..

ఆలోచనల్లో ఉండగానే సి.ఇ గారి ఆఫీస్ వచ్చింది.

ఎప్పుడూ ఖాళీగా ఉండే వరండాలో గుంపులుగా మనుషులు చేరారు. అందులో ఎక్కువ మంది ఆడవాళ్ళు. వర్కర్లలాగున్నారు. విచారంగా మాట్లాడుకుంటూ వెళ్లి పోవడానికి తయారయ్యారు.

రాజు మనసు ఏదో కీడు శంకించింది. అలాగే నిలుచుండిపోయాడు.

ఇస్మాయిల్ ఎదురొచ్చి సి.ఇ గారి ఆఫీసులోకి తీసుకెళ్ళాడు.

సి.ఇ గారి బల్ల చుట్టూ అందరూ కూర్చుని ఉన్నారు. అందరూ అక్కడి ఉన్నతాధికారులు. కొందరి పేర్లు కూడా తెలియవు రాజుకి.

"ఆ పొడవాటి ఆయన యస్ ఇ ఏ.డి.యమ్. కొత్తగా వచ్చాడు. రాత్రిళ్ళు కూడా రౌండ్స్ కి వస్తుంటాడు.. సమ్ ఆచారి. గుచ్చుకునే చూపుల్తో ఎప్పుడూ ఎవరేం చేస్తున్నారో వాచ్ చేస్తుంటాడు. అరే.. ఆయన దగ్గర తమ రీడింగ్ బుక్ ఉందే..తనని రిలీవ్ చేసిన ఏ.ఇ కూడా ఉన్నాడు. ఏదో పెద్ద గడబిడే అయినట్లుంది. సివిల్ డి.ఇ, కోల్ ప్లాంట్ డి.ఇ.. వీళ్లంతా ఇక్కడేం చేస్తున్నట్లు.." ఆలోచిస్తూ రాజు నెమ్మదిగా యస్.ఇ గారి దగ్గరగా వెళ్ళాడు.

"యు ఆర్ మిస్టర్ రాజు?" గోపాలాచారి తలెత్తి రాజు కళ్లల్లోకి చూశాడు.

"యస్ సార్."

"ఈ సిగ్నేచర్ మీదేనా?"

"అవును సార్."

"బాయిలర్ టెంపరేచర్ లో వేరియేషన్స్ వస్తుంటే యాక్షన్ తీసుకోలేదేం?" గోపాల్ కంఠం కఠినంగా మారింది. రాజు మోకాళ్లు వణకడం మొదలెట్టాయి.

"నా డ్యూటీ అయిపోతోందని ఆగాను సర్."

"పోనీ మీ రిలీవర్ కి చెప్పారా?"

"అతనే చూసుకుంటాడు కదా అని.." రాజు తల వంచుకున్నాడు.

"నిజమే. కానీ అతన్ని హెచ్చరించవలసిన బాధ్యత మీకు లేదా? అన్నీ చెక్ చేయాలంటే అతనికి టైమ్ పడుతుంది కదా!"

"రోజూ అలానే చేస్తున్నాం సర్." రాజు గొంతు నూతిలోంచి వస్తున్నట్లు ఉంది.

" కానీ రోజూ రీడింగ్స్ లో ఇంత వేరియేషన్ లేదు కదా!"

సమాధానం చెప్పలేక బెదురుచూపులు చూస్తూ నిల్చున్నాడు రాజు. ఆ తేడాల వలన ఏం జరుగుతుందో అతనికి అవగాహన లేదు. ఎప్పుడో చేరిన కొత్తల్లో అన్నీ నేర్చుకున్నాడు. ఆ తరువాత ఎప్పుడూ వాటి గురించి పట్టించుకోలేదు. అతనితో పనిచేసే వాళ్ళే అన్నీ చూసుకునే వాళ్ళు.. అలా నడిచిపోయింది.

ఈ విధంగా చాలా చోట్ల జరుగుతుంటుంది. మొహమాటపడో, జాలిపడో, చెప్పి చేయించడానికి విసుగుపుట్టో సహ ఉద్యోగుల పని చేసేస్తుంటారు కొందరు. అది చాలా తప్పు. పై అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ఒక్కొక్క సారి పై అధికారులు కూడా పట్టించుకోరు. అప్పుడు నలుగురి దృష్టికి తీసుకురావాలి. ఆ విధంగా చేసేటప్పుడు నిష్ఠూరాలు పడతాయి. అయినా సరే.. క్రమశిక్షణ గురించే కాకుండా సంస్థ బాగోగుల దృష్ట్యా కూడా అటువంటి వారి గురించి అందరూ పట్టించుకోవాలి. లేకపోతే ఎటువంటి హాని అయినా జరగడానికి అవకాశం ఉంటుంది.

ఇప్పుడు రాజు విషయంలో అదే జరిగింది. అతనికి, రీడింగ్స్ లో ఎంత తేడా వస్తే ఎం జరుగుతుందో తెలియదు. అసలు అతనే డ్యూటీ అయిపోయినా ఆగి చూడాలిసింది. బాధ్యత కల ఇంజనీర్ అయితే ఆపనే చేస్తాడు. లేదా రిలీవర్ కి యస్.ఓ.యస్ సిగ్నల్ ఇవ్వాలి. ఆ రెండూ చెయ్యాలని అతనికి తెలియలేదు.

అటువంటి కీలకమైన స్థానంలో ఉండి ఏమి చెయ్యాలో తెలియకపోవడం క్షమించరాని నేరం. తెలిసీ చెయ్యకపోతే.. ఇంక నిష్కృతే లేదు.

"యస్ మిస్టర్ రాజూ! ఆన్సర్ ది క్వశ్చన్." సి.ఇ గారు భావ రహితంగా అడిగారు.

ఏం చెప్తాడు రాజు? తల దించుకున్నాడు.

"గోపాల్ గారూ! ఇతనికి మెమో ఇష్యూ చెయ్యండి. డిసిప్లినరీ యాక్షన్ ఎందుకు తీసుకోకూడదో.. పదిహేను రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని రాయండి. ఇవ్వలేకపోతే అప్పుడు చూద్దాం ఏమి చెయ్యాలో."

ఒక్క సారి ప్రపంచం అంతా గిర్రున తిరిగినట్లయింది రాజుకి. కాళ్ళు తేలిపోతుండగా, అడుగులో అడుగు వేసుకుంటూ బైటికి నడిచాడు. సైకిల్ సంగతి మర్చిపోయి నడుచుకుంటూ తన క్వార్టర్ కేసి తిరిగాడు.

"సార్! మీ సైకిల్.." ఇస్మాయిల్ కేకలు వినిపించలేదు.

**రవికి డ్యూటీ రెండు గంటలకి మొదలవుతుంది.**

ఆగకుండా గట్టిగా మోగే టి.వీ గోల భరించలేక వీలైనంత తొందరగా ఇంటినుంచి బైట పడతాడతను. లైబ్రరీకి వెళ్లి నిశ్శబ్దంగా ఉండే పరిసరాల్లో, మంచి పుస్తకం పట్టుకుని కూర్చుంటాడు.

అభిరుచులకు తగిన జీవిత భాగస్వామి దొరకడం అపురూపమైన వరం.

రవికి చాలా ఆశయాలున్నాయి. అన్నీ చిన్నచిన్నవే.

చిన్న ఇల్లయినా అద్దంలా మెరిసిపోయేట్లు శుభ్రంగా ఉండాలనీ, చెవులకి ఇంపుగా చక్కని సంగీతం.. చౌరాసియా ఫ్లూటో, కదిరిగోపాలన్, బాల మురళీ, మాండలిన్ శ్రీనివాస్.. సన్నగా వినిపిస్తుంటే భార్యతో చెస్ కానీ, స్క్రాబుల్ కానీ ఆడుకోవాలనీ, పిల్లలతో తామిద్దరూ సరదాగా గడుపుతూ వాళ్ళకి మన పురాణాల గురించీ, సంస్కృతి గురించీ నేర్పించాలనీ..

ఏదీ అనుకున్న విధంగా జరగదు కదా!

పెళ్లి చూపులప్పుడు సుగుణ ఎంతో సాంప్రదాయకంగా ఒద్దికగా కనిపించింది.

"మరుగేలరా.." అంటూ ఎంతో శ్రావ్యంగా పాడింది. తనకి సంగీతం నేర్పించి పెద్ద విద్వాంసురాలిని చెయ్యచ్చనుకున్నాడు. సుగుణ వాళ్ళ ఇల్లు తన ఊహల్లో ఉండే ఇల్లులాగా ఉంది. ఆఖరికి బాత్రూమ్ కూడా మొహం కనిపించేంత శుభ్రంగా ఉంది. ఇటువంటి ఇంట్లో పెరిగిన అమ్మాయి తనకి సరిగ్గా సరిపోతుందని అనుకున్నాడు.

"నాకు పాటలంటే చాలా ఇష్టమండీ.. నిద్ర కూడా పోకుండా వినమంటే వింటాను." ఎంతో మురిసిపోయాడు.

చెప్పినట్లుగానే అర్ధరాత్రి మసాలా పాటలు టి.వీలో చూస్తూ వింటూనే ఉంది. అందుకే పొద్దున్న తొమ్మిది దాటాక కానీ లేవలేదు.

"అబ్బో! ఇల్లు క్లీన్ చెయ్యడమా? నావల్లకాదు. ఇంట్లో పనివాళ్ళు చేస్తారు. నాపని ఎక్కడివక్కడ పడెయ్యడమే!"

"ఇక్కడ కూడా పనిమనిషి ఉందికదా! చేయించు.." కొత్తలో రవి చాలా శ్రమ పడ్డాడు.. తనకనుకూలంగా మార్చుకోవాలని.

"నేనా! మా ఇంట్లో అమ్మ చూసుకుంటుంది అన్నీ. ఇన్ ఫాక్ట్ నాకు అన్నం కూడా కలిపి నోట్లో పెడుతుంది తెలుసా?"

"అయితే రోజూ మీ అమ్మని పిలు." మనస్సులోనే గొణుక్కున్నాడు.

పిల్లలు పుడ్తే మారుతుందేమో.. బాధ్యత తెలుస్తుంది.. అత్యాశే అయింది.

మారేదేమో! టి.వీలో అనేక ఛానళ్ళు వచ్చి సమయం లేకుండా చేశాయి. పిల్లల్ని కూడ రావే చూసుకోవలసి వచ్చింది.

అలా.. సీరియల్స్ లో తను కూడా ఒక పాత్ర అయి, సుగుణ కాలం గడిపేస్తుంటే.. వివాహ వ్యవస్థ మీద నమ్మకం, గౌరవం ఉన్న రవి, పిల్లల్ని ప్రయోజకుల్ని చెయ్యడమే తన ధ్యేయంగా పెట్టుకున్నాడు.

సుగుణను మార్చే ప్రయత్నం, తనతో గొడవ పడ్డం మానేశాడు. తన కిష్టమైన ప్రవృత్తుల్ని ఎంచుకుని వాటిల్లోనే ఆనందం పొంద సాగాడు.

"సార్!" చదువుతున్న పుస్తకంలోంచి తల ఎత్తి చూశాడు రవి.

తన షిఫ్ట్ లోనే పనిచేసే ఏ.ఇ.

"మన యూనిట్ లో యాక్సిడెంట్ అయిందిట మీకు తెలుసా? యూనిట్ షట్ డౌన్ చేశారు."

"ఎప్పుడు? ఏమి యాక్సిడెంట్?"

రవి వెంటనే లేచి తన బాగ్ సర్దుకుని బైటికి నడిచాడు.

ఏ.ఇ ప్రకాశం, రవితో గబగబా పెద్ద పెద్ద అంగలు వేస్తూ, దారిలో జరిగిందంతా చెప్పాడు.

యూనిట్ దగ్గర అంతా గందరగోళంగా, హడావుడిగా ఉంది.

చిచ్చుబుడ్డిలా పైకి దూసుకొచ్చిన బూడిద అందినంత మేర ఆక్రమించింది. అదంతా పెద్ద పెద్ద నీళ్ళగొట్టాలతో కడుగుతున్నారు. యూనిట్, యాక్సిడెంట్ అయిన వెంటనే షటాఫ్ చేసేశారు.

"అయ్యో! వీర్రాజా? నాకు బాగా తెలుసు. ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తాడు. కిందికి, పాండ్ లోకి వెళ్ళకుండా బయట పడిన బూడిదని ఎత్తి పోస్తుంటాడు." రవి విచారంగా అన్నాడు. ప్రకాశం ఔనన్నట్లు తలూపాడు.

బొగ్గుతో పనిచేసే విద్యుత్ ఉత్పత్తి కర్మాగారాల్లో, బూడిదని వదిలించుకోవడం చాలా పెద్ద సమస్య. ఇది ఫ్లై యాష్ అనీ, బోటమ్ యాష్ అనీ రెండు రకాలు. తేలిగ్గా ఉన్న ఫ్లై యాష్ కణాలు గాలిలోకి ఎగిరిపోతుంటాయి.. వాటిని 'ఎలెక్ట్ రో స్టాటిక్' వడపోత ద్వారా ప్రెసిపిటేట్ చేసి, బోటమ్ యాష్ లో కలిపేస్తారు. మిగలిన ఫ్లూ వాయువులు (నైట్రొజెన్, కార్బన్ డైఆక్సైడ్, ఆక్సిజెన్ మొదలైనవి..)చిమ్నీ ద్వారా పైకి ఎగసిపోతాయి. కాలుష్య పదార్థాలని శోషిత వడపోతల (స్క్రబ్బర్స్) ద్వారా తొలగిస్తారు.

ఎగిరే బూడిద, కింద నిలిచిన బూడిదలని కలిపి కోల్ యాష్ అంటారు. ఇందులో అధిక శాతం సిలికాన్ డైఆక్సైడ్ (స్ఫటికాకారం, పొడి రెండూ కలిపి..), కాల్షియమ్ ఆక్సైడ్ ఉంటాయి. కొద్దిశాతంలో మాంగనీస్, క్రోమియం, అల్యూమినియమ్ ఆక్సైడ్, ఐరన్ ఆక్సైడ్ మొదలైనవి కూడా ఉంటాయి.

కొండలా పేరుకుపోయిన ఈ కోల్ యాష్ ని, లోయల్లాంటి యాష్ పాండ్స్ తవ్వి, అందులోకి పడేలా చేస్తారు. అక్కడ్నుంచి, జెట్ పైపులతో నీళ్ళు పంప్ చేసి, కాలువలోకి కొట్టుకుపోయేట్లు ఏర్పాటు ఉంటుంది. ఆ కాలువలో నీళ్ళని పెద్ద చెరువులు తవ్వి అందులోకి మళ్ళిస్తారు.

నీళ్లు ఇగిరి పోయాక టన్నులకొలదీ బూడిద పాండ్స్ లో చేరి పోయి ఉంటుంది. కొంత బూడిద గొయ్యిలో పడకుండా పక్కన పడి పేరుకుపోతుంది. దాన్ని వర్కర్లు తవ్వి పాండ్ లో పడేస్తారు. ఈ బూడిద అంతా లారీల్లో కాంట్రాక్టర్లు తీసుకుపోతారు.

టెండర్లు పిలిచి కాంట్రాక్ట్ ఇస్తారు.

మొదట్లో దానివల్ల ఉపయోగాలేం ఉంటాయో తెలియలేదు. ముందర యాష్ ని వదుల్చుకోవడమే ప్రధానం అయింది. కానీ.. పోనుపోను ఆ బూడిదని ఉపయోగించడం తెలిసింది. కొంత ఎరువు కింద వాడుతారు. కొంత శాతం సిమెంటులో కలుపుతారు. ఈ మధ్యన ఇటుకలు కూడా చేస్తున్నారు.. ఇతర మిశ్రమాలతో కలిపి. రోడ్లు వెయ్యడలో వాడుతున్నారు. చాలా రకాలుగా ఈ వ్యర్ధ పదార్ధం అనుకున్నదాన్ని ఉపయోగిస్తున్నారు.

ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి ఈ బూడిద మీద. అందుకని దానికి కూడా కొంత డబ్బు వసూలు చెయ్యాలని యోచిస్తోంది. యాజమాన్యం.

కోల్ యాష్ ని ఎత్తి పొయ్యడం చాలా కష్టమైన పని. పైకి లేచిన బూడిద ముక్కులోకి, కంట్లోకి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి.

ఒక్కోసారి బద్ధకించి వర్కర్లు జాగ్రత్తలు తీసుకోరు. అందుకే అక్కడ పనిచేసే చాలామందికి (బొగ్గు గనుల్లో పనిచేసే వాళ్లల్లాగ) ఆస్తమా ఉంటుంది. ఇంకా ఇతర శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చి, ఒక పట్టాన వదలవు.

ఇంక నడుం నొప్పి వంటివి సరే సరి..

"కళ్ళముందు మెదులుతున్నాడోయ్ వీర్రాజు. మంచి వర్కరు. "" ఇంకా ఏదో అనబోతున్న రవిని ఆపేసాడు ప్రకాశం.

" ఈ మధ్యన మారాడు సార్. తాగుడికి బానిసైపోయాడు. డ్యూటీకి కూడా తాగి వస్తుండే వాడు. ""

" తాగి వస్తుంటే డి.ఇ గారెలా ఊరుకునే వారు? వర్కర్ల క్రమశిక్షణ చూసుకోవాలి కదా? ""

" ఏం చేస్తారు సార్? తాగలేదని వర్కర్లంతా ఏకగ్రీవంగా వత్తాసు పలుకుతారు. ఏమైనా అంటే, యూనియన్లు, స్ట్రైకులు.. గొడవ. పని బానే చేస్తున్నాడు కదాని చూసీ చూడనట్లు వదిలేస్తారు."

"హు.. అదే ఇప్పుడతని ప్రాణం తీసింది కదా! ఏమరుపాటు లేకుండా పనిచెయ్యవలసిన ఇటువంటి చోట్ల అజాగ్రత్తగా ఉండే వాళ్ళని సహించకూడదు. మనం కంట్రోల్ చెయ్యలేమని ఊరుకోకూడదు. యస్సీ ఏడియమ్ గారికి చెప్పి, బ్రీత్ అనలైజర్ పెట్టించాలి. డ్యూటీ కొచ్చేముందు అందర్నీ చెక్ చేయించాలి."" రవి సాలోచనగా చూశాడు. తప్పదు.. ఇప్పుడు అతనొక్కడే పోయాడు.. ఇంకేదైనా అయితే..ఎంత ప్రాణ నాశనం జరిగేదో ఊహాతీతమే! కొందరు ఇంజనీర్లు కూడా ఆ స్థితిలోనే వస్తుంటారు. ఇదే అవకాశం.. బ్రీత్ అనలైజర్ గురించి చెప్పి, అమలు జెయ్యమని ప్రపోజల్ పెట్టాలి. రవి గట్టిగా నిట్టూర్చాడు.

""డి.ఇ గారూ! "" రాములు రొప్పుతూ రవి దగ్గరకొచ్చాడు.

""ఇక్కడున్నారా.. మీ కోసం మీ ఇల్లు, లైబ్రరీ.. అన్నీ తిరిగొచ్చా. ""

“”ఏంటి.. అంత అర్జంటా? ””

“”యస్పీ ఏడియమ్ గారు పిలుసున్నారు. ””

”యూనిట్ షట్ ఆఫ్ అయింది కదా.. ఇంకెక్కడో వేస్తారు డ్యూటీ. ” రవి ఆలోచిస్తూ యస్పీ ఆఫీసుకెళ్ళాడు.

“”రండి రవీ! మీరు అర్జంట్ గా, ఒక గంటలో కాంప్ కెళ్ళాలి. ””

గోపాలాచారి మాట్లాడుతున్న ఫోన్ కి చెయ్యి అడ్డుగా పెట్టి అన్నాడు.

నోట మాట రాక నిలుచుండి పోయాడు రవి.

5

కొండల మధ్యనున్న అడవీ ప్రాంతం అది. ప్రకృతిమాత అందాలన్నీ అక్కడ కుప్ప పోసినట్లుంటుంది.

పేపరు తయారు చెయ్యడానికో, ఇల్లు కట్టడానికో.. వంట చెరుక్కో చెట్లని నరుక్కు పోలేకుండా.. నరుల కంట పడలేని ప్రాంతం. అంత దట్టంగా, సూర్యరశ్మి నేల మీద పడనంత ఎత్తుకి ఎదిగిపోయిన చెట్లతో నిండి పోయింది.

ఒక్క మాటలో చెప్పాలంటే.. కాకులు దూరని కారడవి.

అక్కడ జింకలు స్వేఛ్ఛగా దాగుడు మూతలాడుకుంటాయి. కోతులు చెట్లకొమ్మలమీద కొమ్మచ్చి లాడుతుంటాయి. కుందేళ్ళు చిటుకు చిటుకు పరుగులు పెడుతుంటాయి.

అన్ని రకాల జంతువులతో పక్షులు సావాసం చేస్తుంటాయి.

పులులు, సింహాల వంటి క్రూర మృగాలున్నాయేమో కానీ చూసినవారు లేరు. ఒక ఏనుగుల తండా మాత్రం తిరుగుతూ ఉంటుంది.

ఆ అడవి మొత్తం మీద నాలుగు గిరిజన గూడాలున్నాయి. ఒక్కో గూడెంలో వందకు మించి జనాభా లేరు. ప్రభుత్వం దాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించింది.

ఎవరూ వేటకి వెళ్ళడానికి కానీ, ఇళ్ళు కట్టడానికి కానీ వీల్లేదు. గిరిజనులు తప్ప, అక్కడెవరూ గజం స్థలం కూడా ఆక్రమించడానికి లేదు.

అటువంటి ప్రాంతంలోకి, ఏవిధంగా వచ్చారో కానీ, నూటాభై మంది సాయుధులు ప్రవేశించారు.

ప్రకృతి ఆరాధకులు వచ్చి, గుడారాలేసుకుని పదేసి రోజులుండి, కవిత్వమో, కథలో వ్రాసుకుని వెళ్ళడం అక్కడి గిరిజనులకి అలవాటే. దానికి ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వాళ్ళు అనుమతినిస్తారు. వచ్చేటప్పుడు, తిరిగి వెళ్ళేప్పుడు, మనుషులని లెక్కపెట్టి, సామాన్లు తణిఖీ చేసి మరీ వదులుతారు.

గిరిజనులు మాత్రం ఎప్పుడూ అడవి వదిలి బైటికి రారు. వారికి ఆధునిక ప్రపంచంలో ఏమి జరుగుతోందో అక్కర్లేదు. దేశ ప్రధానమంత్రి ఎవరో కూడా తెలియదు. అడవిలోకి వచ్చిన ఆరాధకుల దగ్గర, పూసలో, గాజులో దువ్వెన్నలో అడుగుతారు.

ఆ సాయుధులు అధికారుల కంట పడకుండా ఒక రహస్య మార్గం గుండా ప్రవేశించారు. ఆ మార్గాన్ని ఎవరికీ తెలియకుండా సుగమం చేశారు. బైటినుంచి చూస్తే అక్కడ తోవ ఉన్నట్లే తెలియదు. ఆ ఆగంతకులు ఎవరికీ తెలియని భాష మాట్లాడుతున్నారు.

వారి నాయకుడి పేరు కుంభా. అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. అతనికి ఆరుగురు అంగ రక్షకులున్నారు. అందరి దగ్గరా ఆధునికమైన తుపాకులు, అరచేతిలో ఇమిడిపోయే బాంబులు, లెక్కకి మించి ఉన్నాయి.

వారు ఆక్రమించిన స్థలానికి దగ్గర్లో ఉన్న గూడెం నాయకుడికి, రంగురంగుల సీసాల్లో సారా పోసి ఇచ్చాడు కుంభా. మొదట్లో వీళ్ళని ఆటంక పరచిన గూడెం వాళ్ళే, సారా సీసాలకోసం ఉండమని బ్రతిమాలి, భోజనం కూడా పెట్టడం మొదలుపెట్టారు. పైగా.. తుపాకులెందుకున్నయ్యో కానీ వాళ్ళు చీమకైన అపకారం చెయ్యట్లేదు.

“అన్నలేమో.. పోలీసులకి చెప్తే బహుమతిస్తారు.“ ఒకరోజు ఒకడు, గూడెం పెద్ద చెవిలో గొణిగాడు.

“”ఛప్.. ఊరుకోరా. ఆళ్ళ జోలి మనకెందుకు?” కసిరేశాడు పెద్ద. ఎందుకొచ్చిన గొడవ.. దుష్టులతో జాగ్రత్తగా ఉండాలి. ”

కుంభావాళ్ళు అడవిలో ప్రవేశించే మార్గానికి దగ్గర్లోనే ఒక పట్టణం ఉంది. అక్కడినుంచే సెల్ ఫోనుల ద్వారా వారి యజమానులతో మంతనాలు జరుపుతుంటారు. అడవిలోపల, ఒక కిలో మీటరు లోపే ఉంటుంది వారి స్థావరం.

ఆ రోజు కుంభా ఒక సమావేశం ఏర్పరచాడు. ప్రతీ రోజూ పదిమందీ కలిసి వారికి ఆదేశించిన పనులను చర్చిస్తారు. పదేసిమందికి ఒక నాయకుడు. ఆ మీటింగ్ కి నాయకులంతా హాజరయ్యారు. అందరూ పై అధికారి ఆదేశాలను కుంభా ద్వారా అందుకుంటారు.

ఏదో కోడ్ భాషలో వారు మాట్లాడుకోసాగారు. వారు గిరిజనుల ఆహార్యాన్నే ధరించారు. ఎవరైనా పర్యాటకులు కానీ, ప్రభుత్వ అధికారులు కానీ చూస్తే గూడెం వాళ్ళు సరదాగా మాట్లాడుకుంటున్నట్లు అనిపిస్తుంది.

“”ఒక గ్రూప్ యాక్షన్ లోకి దిగింది. దాని రియాక్షన్ ఇంకా మొదలవలేదు. ఒక వారంలోగా పనయిపోవాలి. ఇవేళ సోమవారం కదూ! ””

“”కాదు, మంగళవారం. ”” ఒక అనుచరుడు అందించాడు.

కుంభా చేతివేళ్లు ముడిచి, తెరిచి ఏవో లెక్కలు వేశాడు.

“”అవును. వచ్చే మంగళవారం మనం అనుకున్న ఫలితం చూపించాలి. ఆఖరి బాచ్ సోమవారం పని మొదలుపెట్టాలి. అందరూ మీకు అప్పగించిన పనులను మరీ మరీ చూసుకుంటూ జాగ్రత్తగా తయారవండి. రెప్పపాటు కాలం కూడా వేస్ట్ చెయ్యకూడదు. మీ టీమ్ వాళ్లతో గొడవలేం లేవు కదా? ””

అందరూ అడ్డంగా తలలూపారు. ఎంత తక్కువ మాట్లాడుతే అంత మంచిది. అది ట్రైనింగ్ లోనే చెప్పారు. సాధ్యమైనంత వరకు సైగలతో నడుస్తుంది వ్యవహారం.

“”ఎవరెవరు ఎక్కడెక్కడికెళ్తున్నారో, ఏం పని చేస్తున్నారో.. ఒక్కొక్కళ్ళు నాకు వచ్చి చెప్పండి. ”” కుంభా పేరు పెట్టి పిలవసాగాడు.

అందరూ వాటర్ ప్రూఫ్ కాగితాలమీద, రంగుల కోడ్ లతోమామూము వాళ్ళకి , అర్ధంకాని భాషలో విడమర్చి చెప్పి వెళ్లి పోతున్నారు.

“”గుడ్. ఇంక రేపట్నుంచీ మీమీ పనుల మీద వెళ్ళండి. నాకు సహాయానికి ఆరుగురు చాలు. ఎప్పటికప్పుడు ప్రొగ్రెస్ నాకు చెప్తుండండి. ””

“”సెల్ ఫోన్లు..? ”” ఎవరో గొణిగారు.

“”ఒక్క రోజే వాడుతాం. టెంపరరీ కార్డ్ పెట్టి. ఇక్కడ రిసీవ్ చేసుకునే వాళ్ళ వద్ద కూడా రోజుకొక కార్డ్ మారుతుంది. ఏ రోజు ఏ నంబరో మీ కిచ్చిన కోడ్ కాగితం మీద ఉంది.    ఏం ప్రమాదం లేదు. రోజూ కొన్ని లక్షలమంది మాట్లా డుతుంటారు. ఎవరు కనిపెట్టగలరు? పైగా మన సమాచారం అంతా ఇన్నొసెంట్ సంభాషణ లాగానే ఉంటుంది. ””

కుంభా మాటలకి అందరి మనసూ కుదుట పడింది. అయినా.. పనిని సక్రమంగా చెయ్యలేమేమో  అనే కానీ, ప్రాణ భయం ఎవరికీ లేదు. ఈ ఉద్యమంలో చేరే ముందే, ప్రాణ త్యాగానికైనా వెనుదియ్యమని ప్రమాణం చేస్తారు.

అందరూ పాతికేళ్ళ లోపు పిల్లలు. ఎంతో భవిష్యత్తు ఉన్న వాళ్ళు. ఉన్మాదుల మాయ మాటల మత్తులో పడి జీవితాలని చేతులారా నాశనం చేసుకుంటున్నారు.

“”ఎక్కడికి సార్? ఎన్ని రోజులు? ”” కాంప్ కి వెళ్ళాలని యస్పీ గారు చెప్పగానే రవికి గుండెల్లో రాయి పడింది. తనెళ్లిపోతే ఇల్లెలా గడుస్తుంది? పిల్లలు, స్కూలు.. ఎం చెయ్యాలో పాలుపోలేదు. అత్తగారిని పిలిపిస్తే? ఎన్నింటికని, ఎన్ని సార్లు పిలుస్తాం.. కాంపుల గొడవ ఉండదనే షిఫ్ట్ డ్యూటీ  వేయించుకున్నాడు తను.

ఇంట్లో ఇబ్బందులు ఆఫీస్ లో చెప్పుకుని చులకనైపోవడం ఇష్టం ఉండదు రవికి. స్పోర్ట్స్ లోనూ, ప్లాంట్ లో పని దగ్గర చాలా చురుగ్గా ఉంటాడని పేరు అతనికి. టర్బైన్ దగ్గర ఏ సమస్య వచ్చినా సులువుగా పరిష్కరిస్తాడు. అతన్ని అందరూ టర్బైన్ ఎక్స్పర్ట్ అని అంటారు.

అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న బొగ్గు, బాయిలర్ లో నీళ్ళని మరిగిస్తే, ఆ నీటి ఆవిరి వల్ల ఉత్పత్తి అయే పీడనానికి ఒక పెద్ద గుండ్రని పళ్ళున్న చక్రం తిరుగుతుంది. దానినే టర్బైన్ అంటారు. అది మూడువేల ఆర్.పి.యమ్ వేగంతో తిరుగుతుంటుంది. టర్బైన్ కి జనరేటర్ (ఆల్టర్నేటర్ అని కూడా అంటారు.) కలపబడి ఉంటుంది. రెండూ ఒకే వేగంతో తిరుగుతుంటాయి.. పెడల్ తొక్కితే సైకిల్ రెండు చక్రాలు తిరిగినట్లుగా. ఆ జనరేటర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

టర్బైన్ ఏ కారణం చేతనైనా తిరగడం మొరాయిస్తే యూనిట్ ఆగిపోతుంది. నెమ్మదిగా ఒక్కొక్క యంత్రమే ఆగిపోతూ బొగ్గు మంట కూడా తగ్గి యూనిట్ షటాఫ్ అయిపోతుంది.

రవి ప్లాంట్ లో ఉన్నంత సేపూ అన్నింటా తానై తిరుగుతుంటాడు. వర్కర్లకి కూడా అతనంటే చాలా ఇష్టం. అందర్నీ హుషారు చేస్తూ, యోగక్షేమాలడుగుతూ.. ఎవరూ ఏమరుపాటుగా ఉండకుండా పనులు చేయిస్తుంటాడు. ఆరోగ్యంగా, చలాకీగా, నవ్వుతూ.. నవ్విస్తూ, ఇంట్లో రవికీ, యూనిట్లో రవికి పోలికే లేదు.

గోపాలాచారి వచ్చిన వారంరోజుల్లోనే ఎవరెలా పని చేస్తారో కనిపెట్టేశాడు.

ఎట్లాగూ రవి పని చేసే యూనిట్ నాలుగైదు రోజులవరకూ పని చెయ్యదు. బొగ్గు లేదని కొన్ని యూనిట్లు మూసేద్దామని ముందే అనుకున్నారు. అందుకే రవిని బొగ్గు ఎందుకాగిపోయిందో ఎన్ క్వయరీకి పంపుదామని సి.ఇ గారికి చెప్పాడు గోపాలాచారి

" గుడ్ ఐడియా. రవి చాలా రెస్పాన్సిబుల్ పెర్సన్. కోల్ మైనస్ నుంచి వాళ్ళ మానేజర్ ఫోన్ చేశాడు. వాళ్ళు కూడా చాలా వర్రీడ్ గా ఉన్నారు. అడవిలో స్టాల్ అయిపోయినట్లు అనిపిస్తోందిట. ఏదయినా అటువంటి మెకానికల్ ప్రాబ్లం అయితే డ్రైవర్ టచ్ లోఉండాలి కదా! ఇదే కాదు.. నార్త్ మైన్ నుంచి వచ్చే రెక్ లు కూడా మిస్సింగ్. ఇదేదో చిన్న వ్యవహారం లాగ లేదు.

ట్రైన్ వచ్చే ట్రాక్ ప్లాన్ చూసుకుని రెండు జీపుల్నిండా మనవాళ్ళని పంపాలి. రెక్ లు వదిలిని ఆఖరి స్టేషన్ కీ, చేరవలసిన తరువాతి స్టేషన్ కీ మధ్య దూరం చూసుకుని, అవసరమైతే.. కాదు కాదు, తక్షణం పోలీసుల హెల్ప్ కూడా తీసుకోండి. మెకానిక్ లు సరే సరి."

""సార్! మీరు..? "" గోపాలాచారి అందోళనగా అడగ బోయాడు.

" "ఏదీ రూలవుట్ చెయ్యడానికి లేదు. నేను జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడాను. ఏదో టెర్రరిస్ట్ యాక్టివిటీ జరుగుతోందని అనుమానంగా ఉందని చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్స్ వల్నరబుల్ కదా! మనం చాలా అప్రమత్తంగా ఉండాలి. పోలీస్ ఫోర్స్ ని కాంటాక్ట్ చేద్దాం. "" శ్రీనివాస్ ఫోన్ తీశాడు.

" "అయితే ఒక డి.ఇ, ఇద్దరు ఏడి.ఈలు, ఇద్దర్ సూపర్ వైజర్లు, ఇద్దరు మెకానిక్ లు సరిపోతారంటారా? " క్వాలిస్ వాన్ లో పంపుతాను. ""

" "యస్. ఒక జీప్ లో పోలీస్ ఫాలో అయేలా చూద్దాం. మన వాళ్ళల్లో ఫిజికల్ గా ఫిట్ గా ఉన్న వాళ్ళని చూడండి.రిస్క్ గురించి కూడా వార్నింగ్ ఇవ్వండి. నాలుగు రోజులయినా పట్టచ్చని చెప్పండి. ""

శ్రీనివాస్ డి.యస్పి తో మాట్లాడ్డానికి పక్కకి తిరిగాడు.

" "గుడ్ మార్నింగ్ అఫ్ఫీసర్! అవునా.. యస్. మాక్కూడా వర్రీడ్ గా ఉంది. యాక్సిడెంట్ గురించి మీ వాళ్ళు వచ్చారు. పోస్ట్ మార్టమ్ కి తీసుకెళ్ళారు. మావేగన్ల గురించి ఇందాకా మాట్లాడాను కదా! అరగంటలో వస్తారా? థాంక్యు. ""

" "మేటర్ చాలా సీరియస్ గా ఉన్నట్లుంది. యస్.పి గారు అలర్ట్ అయిపోయారు. పోలీస్ జీపు వస్తోంది. మనవాళ్ళని త్వరగా తయారవమనండి." " యస్. ఐ గారికి సూచనలిచ్చి, హెడ్ ఆఫీస్ కి మాట్లాడ్డానికి ఫోన్ తీశాడు శ్రీనివాస్.

" "సర్!" " అంతకు ముందు సి.ఇ గారికి, తనకీ మధ్యజరిగిన సంభాషణ గురించి ఆలోచిస్తున్న గోపాలాచారి తలెత్తి చూశాడు.

""కాంప్.. ఎక్కడికి, ఎన్ని రోజులు..? "" రవి సందేహిస్తూ అడిగాడు. యస్సీ గారితో అంత దగ్గరగా ఉండి మాట్లాడడం అదే..

" యస్.. యస్, రవీ! నాలుగు రోజులు పట్టవచ్చు. ఇప్పుడే నేనేం చెప్పలేను." " తమకి వచ్చిన సమస్య గురించీ, అంతకు ముందు సి.ఇ గారు తనకి చెప్పిన విషయం, రవికి విపులంగా చెప్పాడు.

" వెళ్ళబోయే టీమ్ లో మీరే సీనియర్ పర్సన్. మీరే ఇన్ చార్జ్ గా ఉంటారు. వంశీకృష్ణ ప్లాంట్ లో ఉంటాడు. మిగిలిన యూనిట్లన్నీ నడుస్తున్నాయి కదా! పొద్దున్న యాక్సిడెంట్ ఎందుకు జరిగిందో కూడా ఎంక్వయిరీ చెయ్యాలి. ""

యస్సీ గారు చెప్పిందంతా విని రవి సీరియస్ గా అయి పోయాడు.

చాలా పెద్ద క్రైసిస్ లాగానే ఉంది. తను చెయ్యగలిగింది చెయ్య వలసిందే. ఇంట్లోనా.. సుగుణకి గట్టిగా చెప్పి వెళ్తాడు. తనేం ఇన్ వాలిడ్ కాదు కదా! అవసరమైతే చేసుకోక ఏం చేస్తుంది.. కాక పోతే చికాగ్గా ఉంటుంది. పెద్దవాడు ఫోర్తుకి వచ్చాడు. వాడినే తమ్ముడిని కూడా తయారు చెయ్యమని చెప్పాలి. ఎలాగ చెప్పడం.. స్కూల్ కి వెళ్లి చెప్పేసి, ఇంటికెళ్ళి బట్టలు సర్దుకుని వచ్చేస్తే సరి.

" ఓ.క్ సర్. అరగంటలో వచ్చేస్తాను." " ఆలోచిస్తూనే యస్పీ గారికి చెప్పేసి, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ బయటికి నడిచాడు రవి.

**కుంభా అటూ ఇటూ అసహనంగా తిరుగుతున్నాడు.** రెండు రోజుల్లో ఆపరేషన్ అంతా పూర్తి చెయ్యాలని పై వాళ్ళ దగ్గర్నుంచి మెస్సేజ్ వచ్చింది.

తమ కార్యక్రమం గురించి ఎక్కడో లీక్ అయిందని వార్త వచ్చిందట. పోలీస్ ఫోర్స్ మొత్తం అప్రమత్తం అయిపోయిందట.. సెలవుల్లో ఉన్న వాళ్ళందర్నీ వెంటనే డ్యూటీ లోకి చేరిపొమ్మన్నారుట.

ఈ రాష్ట్రంలో జరగబోయే ఇప్పటి ఆపరేషన్ ఫలిస్తే, దీన్ని మోడల్ గా తీసుకుని, ఇటువంటివే దేశమంతా అమలు పరచాలని ఆర్గనైజేషన్ ప్లాన్. ఇది కనుక ఫైల్ అయితే సీరియస్ యాక్షన్ తీసుకుంటామని మొదట్లోనే వార్నింగ్ ఇచ్చారు.

తాము ప్రాణ త్యాగానికే వెరవనప్పుడు ఇంక సీరియస్ యాక్షన్ ఏముంటుంది? ఉంటుంది..

తమ కుటుంబం.

భార్యా, పిల్లలు కొంత మందికి.. ముసలి తల్లిదండ్రులు కొందరికి.. ఇంకా అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, దాదీ, దాదాలు.. తమ జీవితాలు ఎలాగూ తాకట్టుకెళ్లి పోయాయి. కనీసం వాళ్ళయినా క్షేమంగా ఉండాలి.

అసలు ఎలా లీక్ అయిందో పెద్దవాళ్ళకే అర్థం అవడం లేదట..

మొదటగా వెళ్ళిన బాచ్ అయితే అంతా సవ్యంగా జరిగిందని అంటున్నారు. వీళ్లు పదిమందయితే, అక్కడ పదిమందిని నిర్బంధించాల్సి వచ్చిందిట. మొత్తం ఇరవై మందికి ఆ అడవిలో ఆహారం సమకూర్చాలంటే కష్టంగా ఉందని మొత్తుకుంటున్నాడు ఆ గ్రూప్ లీడరు. పైగా.. చుట్టుప్రక్కల ఎవరికీ అనుమానం కలుగ కుండా చెయ్యాలి.

బందీలకి నిర్విరామంగా ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయిట. అందరూ ఆందోళనగానే ఉన్నారు. అది కొంత వరకూ గుడ్ న్యూస్.. అయితే ముమ్ముందు జరుగ బోయే పనులకు ఆటంక మేర్పడబోయేట్లుంది. అదే తమ పెద్దల భయం.

"అయ్యా!" ముఖ్య అనుచరుడు..

కుంభా తలెత్తాడు.

"అందరు వచ్చారు."

కుంభా గట్టిగా నిటూర్చి, ఎడమ ప్రక్కకి తిరిగి, బాగా దట్టంగా ఉన్న పొదల్లోకి వెళ్ళాడు.

గ్రూప్ లీడర్లంతా లేచి నిలబడ్డారు.

"మీ మీ అసైన్ మెంట్లు గుర్తున్నాయి కదా!" అందరూ నిశ్శబ్దంగా తలలూపారు.

"మీరు సాయంత్రం బయలుదేరి వెళ్ళిపోవలసి ఉంటుంది. విడి విడిగా వెళ్ళాలని తెలుసు కదా? " మళ్ళీ తలలూగాయి.

అంత టెన్షన్ లోనూ కుంభాకి నవ్వొచ్చింది. ఎదురుగా ఉన్న వాళ్ళల్లో ఒక్కొక్కడూ కనీసం పదిమందినైనా చంపిన, కరుడుగట్టిన టెర్రరిస్టులు. నెత్తి మీద ఈకలతో తలలూపుతుంటే, కోయవాళ్ళు నాట్యం చేస్తున్నట్లుంది. చొక్కాలేకుండా, చిన్న చిన్న పంచెలు గోచీ పోసి కట్టుకుని, మధ్య మధ్య వీపులు, కాళ్ళు చేతులు గోక్కుంటున్నారు. అడవిలో పురుగులకీ, దోమలకీ కొదవ ఏముంటుంది..

కష్టపడి నవ్వాపుకుని, ఒక్కొక్కళ్ళనీ దగ్గరికి రమ్మని వాళ్ళ ప్లాన్ చెప్పమన్నాడు.

ఒకో గ్రూప్ లో ఉన్న పదిమందీ మళ్ళీ రెండు గ్రూపులవ్వాలి. ఒక గ్రూప్ రైల్వే ట్రాక్స్ దగ్గర కాపు కాస్తే, ఇంకొకటి టౌన్ లో నిర్దిష్ట ప్రదేశంలో ఆగి రాబోయే ఆదేశాలకోసం ఎదురు చూడాలి. అన్ని గ్రూపులవీ కోడ్ నంబర్లు, ప్లాన్ వివరాలు తన దగ్గరున్న చిన్న పుస్తకంలో రాసుకుని, గుర్తులు పెట్టుకున్నాక, అందర్నీ వెళ్ళిపొమ్మని ఆర్డరిచ్చాడు.

అడవి దాటుతున్నప్పుడే అందరు డ్రస్ లు మార్చుకుని టౌన్ లో ప్రవేశించాలి. అక్కడ్నుంచీ ఎవరి దారి వారిదే.

తుచ తప్పకుండా ఎవరి పని వారు, ఎన్ని అడ్డంకులు వచ్చినా  చేసేస్తారు.

కాకపోతే సడన్ ఎమర్జన్సీ వస్తే ఏమిచెయ్యాలనేది తెలియదు. ఆదేశాలకోసం ఎదురు చూడ్డమే.

ఎక్కడైనా ఒకళ్ళకొకరు ఎదురు పడినా కొత్తవాళ్ళని చూసినట్లు చూడ్డంలో, మారు వేషాలు వెయ్యడంలో నిష్ణాతులు అందరూ. రైలు బోగీల దగ్గర డ్యూటీ వాళ్ళు మాత్రం కలిసే ఉంటారు.

“మాకు మాన్ పవర్ కావాలి. అంత పెద్ద ప్రాజక్ట్, ఇంత కొద్దిమంది మనుషులతో ఎలా చెయ్యడం?” కొందరు లీడర్స్ నిలదీసారు.

“ఇక్కడ సరుకుండాలి. మనుషులక్కర్లేదు.” తల చూపిస్తూ అన్నాడు కుంభా.

“అమెరికాలో అంత పెద్ద బిల్డింగులని పడగొట్టి, వేలమంది ప్రాణాలు తియ్యడానికి ఎంతమంది వెళ్ళారు?”

మారు మాట్లాడకుండా ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళిపోయారు.

కుంభా అనుచరులు తమకు నిర్దేశించిన స్థానాల్లోకి వెళ్లి నిలుచున్నారు.

ఎవరో కుంభాకి వెదురు బియ్యం అన్నం, పచ్చి పులుసు, ఉల్లి, దోస ముక్కలు తెచ్చి ఇచ్చారు.

అక్కడున్న వాళ్ళందరూ పొద్దున్నే మాంసం కూర, రోటీతో రోజు ప్రారంభించే వాళ్ళే. మూడు పూటలు ముక్కలుండాల్సిందే. అందులో అన్నం తినడం అస్సలు అలవాటు లేదు. కానీ, వాళ్లంతా తాము నమ్మిన సిద్ధాంతం కోసం, ఏమైనా చెయ్యడానికీ, ఎటువంటి పరిస్థితుల్లోనైనా జీవించడానికి, అవసరమైతే ప్రాణాలు వదలడానికి సిద్ధ పడిన వాళ్ళే. కడుపుకి కావలసింది ఏదైనా తినేసి, రెండు మూడు రోజులు నిద్ర లేకుండా ఉండగలిగిన సమర్థులు.

అంత బలం, అటువంటి లక్ష్యం, త్యాగం ఉన్నవాళ్ళు అభివృద్ధి పనులకు తమ ప్రతిభని ఉపయోగిస్తే ఈ ప్రపంచం సస్య శ్యామలంగా ఉండేది. ఎక్కడా ఆకలి చావులూ, నిరక్షరాస్యత ఉండేవి కాదు.

కానీ యుగాల ఆరంభం నుంచీ రాక్షసుల్లాంటి మనుషులు, వాళ్ళ కుయుక్తుల్నీ, కుతంత్రాలనీ ఎదుర్కొనే శ్రీ కృష్ణుడి వారసులు ఉంటూనే ఉన్నారు. అదే ఆ సృష్టి కర్త నిర్దేశించిన జీవన శైలి ఏమో!

చెడు ఉంటేనే మంచి ఏదో తెలుస్తుంది. దాని విలువ అవగతమవుతుంది.

చీకటి ఉంటేనే వెలుగు..

దుఃఖం ఉంటేనే సుఖం విలువ..

అందుకే.. కలిమిలేములూ, కష్టసుఖాలు, వెలుగు నీడలు.. కవలల్లా పెనవేసుకుపోయాయి.

కుంభా కడుపునిండుగా తిని పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు.

వారం రోజులు అనుకున్నది రెండు రోజుల్లో పూర్తి చెయ్యాలంటే ఎంత కష్టం? ముందు వాలంటీర్లు, అన్ని మైళ్ళు ప్రయాణం చేసి

అంత దూరం వెళ్ళాలంటేనే రోజున్నర పడుతుంది. తనకి అప్పగించిన పని చెయ్యలేకపోతే ఆత్మత్యాగమే శరణ్యం.

"బా!" ముఖ్య అనుచరుల్లో అతి ముఖ్యుడు పరుగెత్తుకుని వచ్చాడు.

"మెసేజ్.."

"ఏమిటది?"

"ఎలర్ట్."

నిటారుగా అయాడు కుంభా.

❦❦❦

రవి ఒక బాక్ పాక్ లో రెండు జతల బట్టలు, టాయిలెట్ సామాన్లు పెట్టుకుని ముందు గదిలోకి వచ్చాడు.

సుగుణకి అంతా వివరించి, తను కాంప్ కి వెళ్తున్నట్లు చెప్పాడు. వినోదం సినిమా నాలుగోసారి చూస్తున్న సుగుణ తల మాత్రం తిప్పి అంది,

"మీది కాంపుల డ్యూటీ కాదు కదా?"

అనుమానంగా చూస్తున్న సుగుణకి పరిస్థితి విపులంగా వివరించాడు.

"అదేంటో.. అంత మంది ఉన్నారు కదా! మీరే కావలసి వచ్చారా?" అపనమ్మకంగా అంది సుగుణ.

ఎవరితోనో విహారానికి చెక్కేయ్యడం లేదు కదా! ఈ మగాళ్ళని నమ్మడానికి లేదు.. అతికినట్లు చెప్తారు.

"నువ్వు చదువుకున్న దానివి కదా! ఆ మాత్రం అర్ధం చేసుకోలేవా? నేను ఆ టీమ్ కి ఇన్ ఛార్జ్ ని. పైవాళ్ళ ఆదేశాలు పాటించాలి కదా!" ఇంకా ఇందులో ఉన్న రిస్క్ చెప్పలేదు. పరిస్థితి ఎంత అపాయకరంగా ఉన్నా సుగుణకి అర్ధం కాదు.

ఒకరకంగా హాపీ సోల్ అనుకోవాలి.. రవి విరక్తిగా నవ్వుకున్నాడు.

"సరే.. వెళ్ళండి."

"పిల్లల్ని స్కూల్ కి తయారు చెయ్యాలి. వాళ్ళకి పొద్దున్న తినడానికి పెట్టాలి. లంచ్ డబ్బా కట్టి ఇవ్వాలి. అలివేలుని తొందరగా రమ్మని నీకు సాయం చెయ్యమను." రవికి తెలియదు పాపం.. అలివేలుకూడా అమ్మగారితో టి.వీ ఎంజాయ్ చేస్తుందని.

"అలాగే.." రవి వెళ్తుంటే సోఫాలోంచి లేవను కూడా లేవదు సుగుణ.

ఎప్పుడూ ఎంతో హుషారుగా ఉండే రవి, డిప్రెస్డ్ గా ఇంట్లోఉంచి బయటికి నడిచాడు.

"మళ్ళీ తిరిగి రాగలుగుతానా.." అనుకుంటూ.

అప్పుడు.. సుగుణ లేచి వీధిలోకి వచ్చి, రవిని వెనుక నుంచి చూసింది.

"ఏంటో.. అంత సోదిగా నడుస్తున్నాడు.. సామ్రాజ్యం పోగొట్టుకున్న చక్రవర్తి లాగ." సుగుణ నిరాసక్తంగా చూసి నిట్టూర్చింది, అతను టెన్నిస్ రాకెట్ పట్టుకుని జాగింగ్ చేస్తూ వెళ్తున్నప్పుడు ఒక్క సారిగూడా చూడని సుగుణ.

❦❦❦

సి.ఇ గారి ఆఫీస్ దగ్గరికి రాగానే రవికి కాస్త హుషారు వచ్చింది.

రవిని చూడగానే యస్.వి. రంగారావులాగా గోపాలాచారి వరండాలోకి నడుచుకుంటూ వచ్చాడు.

"రా రవీ! నా రూం లో లంచ్ అరేంజ్ చేశాను. అందరూ రెడీగా ఉన్నారు. అరగంటలో రెండు పోలీస్ జీపులు వస్తున్నాయి, విత్ ఆరమ్డ్ పర్సనల్. "

రవిని చెయ్యి పట్టుకుని లాగుతున్నట్లుగా నడుస్తూ తన గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ మంచి కండ పుష్టిగల ఐదుగురు కొత్తవాళ్ళు, వంశీ భోజనాలు చేస్తున్నారు.

ఒక్క క్షణం రవి మనస్సు చివుక్కుమంది. ఊరికి వెళ్తున్నానని చెప్పినా.. లంచ్ టైమ్ లో ఇంటికి వెళ్ళినా, భోజనం చెయ్యమని అడగని భార్య గుర్తుకొచ్చింది. తల విదిల్చి, ప్రపంచంలోని సంతోషమంతా తనలోనే నింపుకుని అన్నాడు,

"హాయ్! అ యాం రవి."

గోపాలాచారి వచ్చి పరిచయం చేశాడు. " ఇక నుంచీ మీరు ఆరుగురు ఈ టీమ్ లో ఉంటారు. ఇతను చైతన్య.. బి స్టేషన్ లో ఏ.ఇ." ఉంగరాలజుట్టు, చిన్ని చిన్ని కళ్ళు ఉన్న చైతన్య, సగం లేచి విష్ చేసినట్లు అభివాదం చేసి కూర్చున్నాడు.

"ఆంజనేయులు. కోల్ ప్లాంట్ ఏ.ఇ" అప్పుడప్పుడే ఏర్పడుతున్న బట్టతల, పెద్ద పెద్ద చెవులు ఉన్న ఆంజనేయులు, ఈ చెవినుంచి ఆ చెవి వరకు నవ్వుతూ తమాషాగా తల తిప్పాడు. అతని చెవులు వింతగా ఊగాయి.

"బల్వంత్ సింగ్. బి స్టేషన్ లో ఏ.ఇ." బాగా కోటేసినట్లున్న ముక్కు, గుబురు మీసాలతో సింగ్, చెయ్యి చాపాడు, కరచాలనం చెయ్యడానికి. అతనికి కుడి ఎడమ తేడా లేదు. రెండు చేతుల్తోటీ చపాతీని విరుచుకుని తింటున్నాడు.

"భీమారావు. కోల్ ప్లాంట్ లో సూపర్వైజర్." మరీ సినిమాల్లో చూపించే భీముడిలా లేకపోయినా బలంగానే ఉన్నాడు. నవ్వినప్పుడు కుడి బుగ్గ మీద అంగుళం లోటు పడే సొట్ట అతని ప్రత్యేకత. తీర్చైన పలువరుసతో, నలుపు కిందికే వచ్చే శరీర ఛాయతో ఇట్టే ఆకట్టుకున్నాడు.

"రండి సార్! భోంచేద్దాం." తన ప్రక్కనున్న కుర్చీ చూపించాడు. ముందు ముందు మంచి స్నేహితుడవుతాడనుకున్నాడు రవి అతన్ని చూసి.

"రహీమ్. వాటర్ అనాలిసిస్ అండ్ ట్రీట్ మెంట్ లో కెమిస్ట్." రవి సాలోచనగా రహీమ్ ని, గోపాల్ ని మార్చి మార్చి చూశాడు. కెమిస్ట్ కేం పని తన ఆపరేషన్ లో. గోపాల్ తల పంకించాడు, తరువాత చెప్తానన్నట్లుగా. రహీమ్ కూడ చాలా బలంగా ఉన్నాడు.

గోపాలాచారి చాలా కష్ట పడవలసి వచ్చింది.. ఈ టీమ్ ని సెలెక్ట్ చెయ్యడానికి. మొట్ట మొదటి అర్హత.. అంత ఒత్తిడికి తట్టుకోగలగడం.

రెండు.. ఆకలికి, నిద్రలేమికి ఆగగలగాలి. అవసరమైతే ఎదుటి వాళ్ళతో తలపడగలగాలి. దానికి జిమ్ కి వెళ్తూ మంచి ఫాం లో ఉండాలి.

మూడు.. నెగోషియేషన్స్ చెయ్యగలగడం. ఈ టీమ్ లో ముగ్గురికి, రవి, భీమారావు, రహీమ్ లకి ఆ ప్రతిభ ఉంది.

అన్నింటి కంటే అత్యంత ముఖ్యమైనది.. ఎట్టి పరిస్థితిలోను బెదిరిపోకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించగలగడం. ఇన్ని విషయాలు దృష్టిలో పెట్టుకుని వెతకడం అంత సులభం కాదు. అదీకా అభ్యంతరాలు పెట్టకుండా వెళ్ళడానికి మనస్ఫూర్తిగా ఒప్పుకోవాలి.

సెలెక్ట్ చేసిన ఇంకొక ఏ.ఇ భార్యకి పురిటి రోజులని రాలేనన్నాడు.

సి.ఇ గారి సహాయంతో రెండుగంటల్లో ఆఫీస్ రికార్డ్ లు తిరగేసి, ఆయా అధికారుల దగ్గర వారి గురించి ఎంక్వయిరీ చేసి, వ్యక్తిగత జీవన విధానాలు తెలుసుకుని.. అని రకాలుగా మథించి ఆరుగురిని ఒక దగ్గర చేర్చగలిగారు.

ఈ టీమ్ ని తన గదిలోనుంచి చూస్తుంటే తన శ్రమకి తగిన ఫలితం కనిపించింది గోపాలాచారికి.

ఇందులో ఎవర్నీ తానింతకు ముందు కలవకపోవడం రవికి ఆశ్చర్యం కలిగించింది. మూడు వేలమంది పైగా పనిచేసే చోట అలా జరగడానికి అవకాశం లేకపోలేదు. అయినా రవి, తన పనేమో, టెన్నిసేమో, అంతే. ఖాళీ ఉన్నప్పుడు లైబ్రరీ..

ఈ సారినుంచీ కామన్ గా జరిగే ప్రోగ్రామ్స్ లో పాలు పంచుకోవాలి.. అందరూ తెలిస్తే లైఫ్ వేరేగా ఉంటుంది. నిశ్చయించుకున్నాడు రవి.

“రవీ! రహీమ్ తాతగారు అనంతపురంలో స్వాతంత్ర సమరంలో పాల్గొన్నారు. రహీమ్ వాళ్ల అమ్మమ్మ దగ్గరుండి, హైదరాబాద్ లో అన్వరులుం కాలేజ్ లో ఉర్దూ మీడియం లో బి.యస్సీ చదివాడు. రహీమ్ తండ్రి కుడా దేశ భక్తుడు. రహీమ్, ఉర్దూలో నేటివ్ పాకీస్తానీ లాగా సంభాషించగలడు. మతం కంటే దేశంముఖ్యం అనుకునే వ్యక్తి. అలా అని ఐదు సార్లు నమాజ్ చెయ్యడం మానడు. రోజూ వ్యాయామ్శాలకి వెళ్లి కుస్తీపట్లు ప్రాక్టీస్ చేస్తాడు.” యస్పీ గారి వివరణకి రవి మనసు కుదుట పడింది.

కెమిస్ట్ ఎందుకు అనుకున్న తన ఆలోచనకి సిగ్గుపడ్డాడు రవి.

కోల్ వచ్చే బళ్ళు ఎందుకాగిపోయాయో తెలుసుకోవడానికి ఇంజనీరే కావాలా? యస్పీ గారి సెలెక్షన్ చాలా బాగుంది.

రహీమ్ కేసి చూసి స్నేహ పూర్వకంగా నవ్వి, భుజం మీద చెయ్యేసి, అతని పక్కన కూర్చుని, ప్లేటులో పదార్థాలు వడ్డించుకున్నాడు.

“మళ్ళీ ఇటువంటి భోజనం ఎన్నాళ్లికో..” తింటూ అనుకున్నాడు. గోపాల్, హాస్టల్ మానేజర్ తో చెప్పి ప్రత్యేకంగా వండించాడు.

బొగ్గు గనులకీ, విద్యుదుత్పత్తి కర్మాగారాలకీ మధ్య ప్రత్యేకమైన రైలు పట్టాలుంటాయి. వాటి మీద పవర్ ప్లాంట్ కి బొగ్గు సప్లై చేసే రెక్ లు తప్ప ఇంకేం నడవవు. మధ్యలో రైల్వే స్టేషన్లేం ఉండవు. అతి నెమ్మదిగా నడిచే ఆ గూడ్స్ ట్రైన్ ప్లాంట్ చేరడానికి రోజున్నర పడుతుంది, అట్టే దూరం లేకపోయినా. మధ్యలో ఒక జంక్షన్ దగ్గర ఉత్తర దేశం నుంచి వచ్చే ట్రాక్ కలుస్తుంది. అందులో నార్త్ నుంచి వచ్చే బొగ్గు రెక్ లు పవర్ ప్లాంట్ కి బొగ్గు సరఫరా చేస్తాయి.

మూడు రోజుల క్రితం, ప్లాంట్ కి దగ్గర్లో ఉన్న గని నుంచి బయలు దేరిన రెండు రెక్ లు జంక్షన్ దాటి నలభై కిలోమీటర్లు వచ్చాయి. పది మంది సాయుధులు, ఏ.కె ఫార్టీ సెవెన్ తుపాకులు పట్టుకుని, రెండు ఇంజన్ల లోకీ ఎక్కి బళ్లని ఆపేశారు, ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి ఎదుర్కొని రెక్ డ్రైవర్లు, అసిస్టెంట్లు, వర్కర్లు.. పది మందీ నిర్ఘాంతపోయి చూస్తుండగా. అందరినీ ఒక దగ్గర బందీలుగా చేర్చి, చుట్టూ నిలుచున్నారు.

బొగ్గు రైళ్ళని నడిపి నడిపి, బందీలకి శరీరం మీద ఒక పొర ఏర్పడిపోయింది. అందరూ కండలు తిరిగిన శరీరాలతో, తలకి కట్టుకున్న నల్లని బట్టలతో, చెమటకి చొక్కాలు తీసేసి.. నిగనిగ మెరుస్తూ ఆఫ్రికా అడవుల్లో తిరిగే పొడ మానవుల్లా ఉన్నారు.

ఈ మైన్స్ వర్కర్లని బందీలుగా పట్టుకున్న సాయుధులు, పైనుంచి కింది వరకూ పొడవు చేతుల చొక్కాలు, దళసరి పాంట్లు వేసుకుని.. అర్థం కాని భాషలో మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళకి రైళ్ళని ఆపి, వర్కర్లని హోస్టేజిల్లాగ పెట్టమని ఆర్డర్లొచ్చాయి. తరువాత ఏం చెయ్యాలనేది మళ్ళీ మెసేజ్ రావాలి. అది రెండు రోజుల్నుంచీ వారం వరకూ ఉండచ్చని వాళ్ళ నాయకుడు చెప్పాడు.

బొగ్గు వేగన్లని ఆపిన చోటుకి అరా కిలోమీటరు దూరంలో ఒక ఊరుంది. ఆ ఊర్లోనే, ఒక ఇంట్లో ఇరవై మందికీ వంట

చెయ్యడానికి ఏర్పాటు చేశారు. అక్కడ స్టేషన్ లేక పోయినా ట్రాక్ ఎత్తు పల్లాలు లేకుండా సమానంగా ఉంది.

ఇంజన్లోకి ఎక్కి దిగడానికి వీలుగా ఉంది. మొత్తం అంతా దట్టమైన చెట్లతోనిండి, అక్కడ రైలువేగన్లు ఆగిన జాడ తెలియడం లేదు.

బాగా క్షుణ్ణంగా పరిశీలించి, ఆ చోటు ఎన్నుకున్నారు కుంభా వాళ్ళు.

రెక్ డ్రైవర్లలో ఒకతనికి ఉర్దూ వచ్చు. ఆ భాషలో అడిగాడు,

"ఎందుకు ఆపారు? ఏం కావాలి? మా దగ్గర బొగ్గు తప్ప ఇంకేం లేదు."

"తొందర్లోనే తెలుస్తుంది. మీరు ఇక్కడ కుర్చుని మీకిష్టం వచ్చినట్లు కాలక్షేపం చెయ్యచ్చు. అవసరాలకి వెళ్ళాలంటే మాలో ఒకడు మీతో వస్తాడు." నాయకుడిలా కనిపించిన వాడు సమాధానం ఇచ్చాడు.

ఒక పెద్ద చెట్టు కింద చదును చేసి, పదిహేను మంది విశ్రాంతిగాకూర్చునే లాగ.. కొంత మంది పడుక్కోడానికి అనువుగా తయారు చేశారు.

బందీలందర్నీ అక్కడికి తీసుకెళ్ళి వదిలేసి, తుపాకుల్ని జాగ్రత్తగా చూస్తూ.. సగం మంది సాయుధులు, కూర్చుని సగం మంది కాపలా తిరుగుతున్నారు.

అలా రెండు రోజులు గడిపారు.

మూడో రోజు కుంభా దగ్గర్నుంచి మెస్సేజ్ వచ్చింది.

"ఇంకొక్క రోజు గడుస్తే మీ పని పూర్తవుతుంది. అంత వరకు జాగ్రత్తగా ఉండండి."

బాగానేనడుస్తోంది అనుకుంటున్న సమయంలో అనుకోని అవాంతరం వచ్చింది. ఉత్తర హిందుస్థాన్ నుంచి వచ్చిన ఒక రెక్, రెండు బళ్ళ వెనుక వచ్చి ఆగింది.

ఆ ట్రాక్ లో రైల్వే ట్రాఫిక్ కానీ స్టేషన్లు కానీ లేకపోవడం వలన, రెక్స్ కి వెనుక ఉన్న వేగాన్ కి ఎర్రరంగు వేసి, ఎర్ర జండాలు, రాత్రిళ్ళు ఎర్ర దీపం ఉంటాయి.. హెచ్చరికగా.

అందుకనే కొత్త రేక్ నెమ్మదిగా వచ్చి వెనుక ఆగింది.

**ఎర్రలైటు వెలుగుతూ, ఫోన్ అదిరింది.**

కుంభా ఉలిక్కిపడి లేచి స్విచ్ ఆన్ చేసి, చెవి దగ్గర పెట్టుకుని, దూరంగా నడిచాడు. అప్పుడే గూడెం వాళ్ళు వచ్చారు ఏదో చెప్పడానికి.

"ప్లానింగ్ సరిగ్గా చెయ్యలేదా సాబ్? ఇంకొక గూడ్స్ బండి వచ్చింది. ఏం చెయ్యాలి? "

కుంభా వెంటనే రైలు ఆగిన ప్రదేశానికి దగ్గర్లో ఉన్న పక్క రాష్ట్రంలోని ముఠా నాయకుడితో మాట్లాడాడు.

"ఎమర్జెన్సీ! వెంటనే కొంతమందిని సైట్ వన్ కి పంపండి. అలాగే ఏ.టి.యమ్ లో డబ్బు డ్రా చేసి కావలసిన ఏర్పాట్లు చెయ్యండి. "

రేక్ ల దగ్గరున్న వాళ్ళకి కూడా మెస్సేజ్ ఇచ్చాడు.. అదనంగా బలం వస్తోంది.. వర్రీ అవద్దని.

"అది కాదు భా! కొత్త బండిలో ఇరవై మంది స్టాఫ్ ఉన్నారు." మళ్ళీ ఖంగారు కాల్..

"అయితే ఏం? మీ దగ్గర తుపాకులు, బాంబూ ఉన్నాయి కదా! భయపెట్టండి. నో కిల్లింగ్."

మిగిలిన టీములు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో..

తనే స్వయంగా చూసుకుంటే నయం..

కుంభా అడవి పక్కనున్న పట్నానికి వెళ్ళాడు.

రాష్ట్రంలో బొగ్గుతో నడిచే పెద్ద పవర్ స్టేషన్లు రెండున్నాయి. ఒక స్టేషన్ ని నిర్వీర్యం చెయ్యడానికి అప్పటికే ఒక టీమ్ పనిలో ఉంది. ఇంకొకటి పని చెయ్యకుండా చూడడానికే కుంభా వాళ్ళ ప్రయత్నం.

కొంతమంది ముఖ్యమైన సబ్స్టేషన్ల దగ్గర, బాంబులతో ఛార్జ్ అయి తయారుగా ఉన్నారు. ఏ క్షణంలో ఆర్డర్ వస్తే ఆ క్షణంలో అటాక్ చెయ్యడానికి.

కుంభా స్వయంగా వెళ్లడం మంచిదే అయింది. అప్పటికి పూర్తీ ప్లాన్ తో రెడీ అయి, అతనికి సమాచారం పంపారు యజమానులు.

మరునాడు రాత్రి పదింటికల్లా అన్ని టీములు ఒక్కసారిగా విరుచుకు పడి, పదిగంటలకల్లా రాష్ట్రాన్ని చీకటి మయం చేసెయ్యాలి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా సప్లై రాకుండా ఆపు చేసెయ్యాలి.

తరువాత అసెంబ్లీ, సెక్రెటేరియట్, ముఖ్యమంత్రి నివాసం. ఎయిర్ పోర్ట్, రైలవే స్టేషన్లు, బస్ స్టేషన్లు.. అన్నింటి మీద ఒకే సారి పడి ఎం జరుగుతోందో తెలియకుండా చెయ్యాలి. రాత్రి పన్నెండుకల్లా పని అయిపోవాలి.

ఆ తరువాత ప్రధానితో చర్చలు జరిపి తమకు కావలసింది సాధించుకోవాలి.

కుంభాకి ఒకటే అర్ధం కాలేదు.. దానికి ఈ రాష్ట్రం ఎందుకు ఎంచుకున్నారు? ఇంత దూరం ఎందుకు రావడం? పైన రాష్ట్రాలేవా? అక్కడయితే.. ఇంతంత దూరాల్లో వెతుకులాడే పని తప్పుతుంది కదా! కావలసిన మాన్ పవర్ కూడా సులభంగా లభిస్తుంది.. వాళ్ళకి అలవాటే ఇటువంటివి. వాళ్ళవాళ్ళు ఎక్కువగా కూడా ఉన్నారు అక్కడ.

అదే అడిగాడు యజమానులని. పైగా అడవిలోంచి బయటికి వచ్చాడేమో సిగ్నల్స్ కూడా బాగా వస్తున్నాయి.

"ఉత్తరాన ప్రభుత్వం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. అక్కడ ఏ టెర్రరిస్ట్ వ్యవహారాలు జరుగుతున్నాయో అని వెయ్యి కళ్ళతో కనిపెడుతూ ఉంటారు. దక్షిణ రాష్ట్రాలకి అటువంటి భయాలుండవు. వాళ్ళ ఆలోచనలెప్పుడూ నక్సలైట్స్ మీదనే ఉంటాయి. కానీ తమని ఎవరూ అనుమానించరు. అందుకే అంధ్రప్రదేశ్ ని సెలెక్ట్ చేశాం. ఇక్కడ తడాఖా చూపిస్తే అక్కడ దిగి వస్తారు. అందులో రెండు ప్రభుత్వాలు ఒక్కళ్ళవే కూడా.." నిజమే కదా అనుకున్నాడు కుంభా.

ఈ ఆపరేషన్ మొత్తానికి ఇన్ ఛార్జ్ నువ్వే. ఆ అడవి ఖాళీ చేసెయ్యండి. హైదరాబాద్ లో ఎవరికీ అనుమానం రాని మధ్యతరగతి హిందూ లొకాలిటీలో మీకు ఒక స్థావరం ఏర్పాటు చేశాం. అక్కడికి తక్షణం మకాం మార్చెయ్యండి. రేపు పొద్దున్నకల్లా చేరాలి. రేపట్నుంచీ నీకు అన్ని ముఖ్యమైన సమాచారలు సంకేతాలతో వస్తాయి. నువ్వే మమ్మల్ని కంటాక్ట్ చేసి మంచి పని చేశావు. టైమ్ కలిసొచ్చింది. "

కుంభా టైమ్ చూసుకున్నాడు. నాలుగున్నర. ఆరింటికి బయలు దేరిన పొద్దున్న నాలుగులోపు హైదరాబాద్ చేరచ్చు. వెనుకకి తిరిగి అడవిలోకి వెళ్లి అనుచరులని కలిశాడు.

"ఇక్కడ ఏమాత్రం ఆనవాళ్ళు లేకుండా చెయ్యండి." ఆదేశాలిచ్చి, గూడెం నాయకుడిని కలిశాడు.

"మేం వెళ్తున్నాం అబ్బా! ఇన్ని రోజులు మాకు ఆతిధ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇంక మనం కలవం. మీకిక్కడ ఉన్నట్లు ఎవరికీ చెప్పద్దు."

గూడెం పెద్ద లేచి కన్నీళ్ళతో కుంభాని కౌగిలించుకుని వీడ్కోలు పలికాడు.

ఇంక తమకి ప్రత్యేకమైన సారా దొరకదని అందరూ విచారించారు. రోజూ వాళ్ళు తాగే దానికంటె ఎన్నో రెట్లు బాగుంది మరి..

బైటి ప్రపంచంలో జరుగుతున్నా మార్పులతో, జరగబోయే అనర్ధాలతో ఏమాత్రం సంబంధం లేని అదృష్టవంతులు.

ఇంక ఆలశ్యం చెయ్యడానికి లేదు. అందరూ హుటాహుటిని అడవి బయటికి వచ్చారు. కొంత మంది జీన్స్, టీ షర్టులతో.. కొందరు ఇన్ షర్ట్ టై తో తయారయారు.

కుంభా తెల్లని లాల్చీ పైజామా, నుదుట కుంకం బొట్టుతో, పల్లెటూరి మధ్యతరగతి యువకుడిలా ఉన్నాడు. అతనితో వెళ్ళే ఆంతరంగికుడు, మామూలు పాంటు, షర్ట్ తో కుంభా కంటే ఐదారేళ్ళు చిన్నగా కనిపిస్తున్నాడు. తమ్ముడిని కాలేజ్ లో చేర్పించడానికి వెళుతున్న అన్నగారిలా ఉన్నాడు.

ఇద్దరూ బస్ స్టాండుకి వెళ్ళారు.

జీన్స్, టీ షర్టులిద్దరూ రైల్లో, ఇన్ షరతులు టాక్సీలో వెళ్ళడానికి నిశ్చయమయింది.

సూపర్ డీలక్స్ బస్ ఎక్కినా కుంభా, అనుచరుడు సీట్ల లో కూర్చుని వెనక్కి తిరిగారు.

వెనుక సీట్ లో.. యూనిఫామ్ లో ఉన్న యస్. ఐ , అతని అసిస్టెంట్ వీరి కేసి తీక్షణంగా చూస్తూ కనిపించారు.

6

రఘు మాటలకి, నోట్లో మాట రానట్లు నిలబడిపోయిన చక్రపాణి, సుభద్రలని వదిలేసి, రఘు, శశి వాళ్ళ గదిలోకి వెళ్లి పోయారు. మెదడు, మనసు మొద్దు బారిపోగా తల్లి వెళ్లి, చక్రపాణి మంచం మీద ముడుచుకు పోయింది.

ఇంతలో.. బాల్కనీ లోంచి గొల్లుమని గోల. పిల్లలు బొమ్మల కోసం దెబ్బలాడుకుంటున్నారు. చిట్టి, బుజ్జి ఒక పక్షం అయిపోయారు. రఘు కొడుకు ఇద్దర్నీ నాలుగు మొట్టికాయలు మొత్తాడు.

శశి విసవిసా గదిలోనుంచి వచ్చేసింది.

"ఊరుకోరా! ఇంక రోజూ మనకీ పెంట తప్పదు." వాడినో గిల్లు గిల్లింది. ఇంక వాడు ఊరూ వాడా ఏకం చెయ్య సాగాడు.

సుభద్ర చిట్టి, బుజ్జిలకి చెరో బెల్లమ్ముక్కా ఇచ్చి ఊరుకో బెట్టింది. ఏమీ మాట్లాడ్డానికి కూడా లేదు. ఏం మాట్లాడినా ఇల్లంతా వినిపిస్తుంది.

గుడ్ల నీళ్ళు కుక్కుకుని సుభద్ర, పేపర్ వెనకాల తల పెట్టి చక్రపాణి, ఎవరి అలోచనల్లోకి వాళ్ళు వెళ్లి పోయారు.

శ్రీధర్.. రఘు కొడుకు పడుక్కున్నట్లున్నాడు. రఘు, శశి బయటికి వచ్చారు.

"ఒక గంటలో వస్తాం బాంక్ పని చూసుకుని.." గోడకి చెప్పినట్లు చెప్పి, ఇద్దరూ ఇంట్లోనుంచి వెళ్లి పోయారు.

"మనం కాసేపు తిరిగొస్తే వాళ్ళు మాట్లాడుకుని, ఏం చెయ్యాలో తేల్చుకుంటారు." శశి, రఘుతో అంటున్న మాటలు స్పష్టంగా వినిపించాయి.

చక్రపాణి, సుభద్ర లేచి తమ గదిలోకి వెళ్ళారు. పిల్లలు బిక్కు బిక్కు మంటూ బాల్కనీలోనే కూర్చుండిపోయారు. వాళ్ళకి తండ్రితో గొడవలు అలవాటే కద.

తల్లి, గోడకి ఆనుకుని కూర్చుని, మోకాళ్ళలో తల దూర్చి, కడుపులో పేగులు కదిలేలా వెక్కుతోంది.

మధ్య తరగతి సంసారాల్లో ఇటువంటి అనుకోని సమస్యలు వచ్చినప్పుడు లోకం అంతా శూన్యంగా అనిపిస్తుంది. దారే కనిపించదు. రఘుకి కొంచెం విశాలహృదయం ఉండి, సమయానికి ఆదుకుంటే పరిస్థితి వేరుగా ఉండేది. కానీ నేను.. నా సంసారం. ఆ తరువాతే ఏదైనా.. అదే స్వార్ధ పూరిత మానవ స్వభావం.

"ఇదేమిటండీ.. ఇలా అంటాడు వాడు?" ఎలాగో నోరు పెగల్చుకుని అంది సుభద్ర.

"నిజమే.. అందరం ఒకటే కదా అని న దగ్గరున్న సేవింగ్స్ అంతా వాడికిచ్చేశాను. ఈ విధంగా అవుతుందని ఊహించలేదు కదా! ఇప్పుడు కర్తవ్యం ఏంటని ఆలోచించాలి మనం." చక్రపాణి మాటలకి తల్లి బెదురుగా చూసింది.

"నిన్నొక్కదాన్నీ అతని దగ్గరికి పం లేమ్మా! నేను నీ బాధ్యత తీసుకుంటాను... రఘుకి ఇష్టం ఉన్నా లేకపోయినా. కానీ ఇక్కడుండం మనం. ఏం చెయ్యాలా అనేదే ఆలోచిస్తున్నా."

"అంతా అగమ్య గోచరంగా ఉంది. ఏం చెయ్యగలం?" సుభద్రకి మోకాళ్ళ నొప్పులు మొదలయ్యాయి. నిద్రపోతున్నప్పుడు తప్ప చంటాడు ఆవిడని వదలడు. ఇంటిపని, వాడిని చూసుకోవడం.. పగలు ఒక్క నిముషం తీరికుండదు.

ఎవరి గురించో మాట్లాడుకుంటున్నట్లుగా తల్లి శూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

"సరే సుభద్రా! నేనొక నిర్ణయానికి వచ్చాను. మూడు నెలలు సెలవు పెడతాను. బోలెడు సెలవుంది. వచ్చే ఏడు రిటైర్ అవుతున్నా కదా! తల్లిని తీసుకుని అల్లుడి దగ్గరికి వెళ్దాం."

నిలువెల్లా వణికిపోతున్న శరీరంతో తల్లి లేచి నిలబడింది.

"భయం లేదురా! మేం నీతోనే ఉంటాం. అక్కడ అందరికీ నీ పరిస్థితి, అల్లుడి స్వభావం తెలియాలి. నా క్లాస్ మేట్ ఒకతను ఈ మధ్యనే అక్కడికి బదిలీ అయ్యాడని విన్నాను. అల్లుడు పనిచేసే పవర్ ప్లాంట్ లోనే చాలా పెద్ద పొజిషన్ లో ఉన్నాడు. అతని సహాయం తీసుకుందాం. మూడు నెలలు అయ్యాక, అల్లుడి జీతంలో సగం ఇచ్చేలాగ అడిగి, వేరే ఇల్లు చూసుకుందాం. అవసరమైతే నేను సెలవు పొడిగిస్తాను."

"అయితే అబ్బాయి, కోడలు రాగానే చెప్పేద్దాం." కొడుకు కోడళ్ళ ప్రవర్తనకి సుభద్ర చాలా నొచ్చుకుంది. మనసు విరిగిపోయింది.

"మీరు వెళ్ళండి. అమ్మ కూడా ఎందుకు? అమ్మ ఇక్కడే ఉంటుంది." రాగు మాటలకి తల అడ్డంగా ఊపాడు చక్రపాణి.

రఘు, శశి ఇంటికొచ్చి గంటయింది. తాము ఏమి చెయ్యబోతున్నారో శాంతంగా వివరించాడు చక్రపాణి. అరుచుకుని, దెబ్బలాడుకుంటే ఏం ప్రయోజనం?

"తల్లిని చూశావా ఎలా ఉందో! కళ్ళల్లో ఉన్నాయి ప్రాణాలు. దాన్ని ముందు మనుషులలోకి తీసుకురావాలి. అయినా.. నేనూ అమ్మా విడివిడిగా ఉండే ప్రసక్తే లేదు. ఎక్కడైన, ఎప్పుడైనా ఇద్దరం కలిసే ఉంటాం.. ఆ రోజు వచ్చేవరకూ!"

ఇప్పుడున్న విచక్షణా, ఆలోచనా రఘు పెళ్ళయినప్పట్నుంచీ ఉంటే.. తమకంటూ కొంత దాచుకోగలిగే వారు. ఇప్పుడు ఆఫీసులో అడ్వాన్స్ తీసుకుని బయలుదేరాలి. రఘుని అడిగినా ఇస్తాడని నమ్మకం లేదు. ఇద్దరి జీతాలు ప్రతీనెలా దాచుకోవడమే!

"మరి చంటాడెలాగా? పెద్దాడొచ్చేసరికి ఇంట్లో ఎవరో ఉండాలి కదా!"

"ఆ సంగతి మీరు చూసుకోండి. ఏవో ఏర్పాట్లు చేసుకోండి. ఇప్పుడు నా మొదటి డ్యూటీ నా కూతుర్ని కాపాడుకోవడం." ధృఢంగా అన్నాడు చక్రపాణి.

"అన్నీ ఆలోచించుకున్నారా? మా మానాన మమ్మల్ని వదిలేస్తే ముందు ముందు మేం అక్కర్లేదా?" రఘు మాటలకి తిరస్కారంగా

చూశాడు చక్రపాణి.

"అప్పటి సంగతి చూద్దాం లే. ఎప్పుడు ఎం జరుగుతుందో.. ఎవరికి ఏ అవసరం వస్తుందో.. ఎవరు చెప్పగలరు?" చెప్పులు వేసుకుని అటూ ఇటూ చూడకుండా బైటికి నడిచాడు.

"మనం కూడా పెద్దది స్కూల్ కి వెళ్దాం పదండి. అక్కడే బేబీ కేర్ కూడా ఉంది. వాళ్ళు ఎలా చూసినా అక్కడే వదిలేద్దాం.. ఎం చేస్తాం?" సుభద్రని సెంటిమెంటల్ గా కొడుతూ.. శశి, రఘుని తీసుకుని బైటికి నడిచింది.

సుభద్రకి తెలుసు.. పెద్దాడి స్కూల్లో మంచి డే కేర్ ఉంది. పిల్లల్ని చాలా బాగా చూస్తారు. కాకపోతే చాలా ఖరీదు.

"ఇన్నాళ్ళూ అన్నీ ఫ్రీగా నడిచిపోయాయి కదా! ఇప్పుడు బాధగానే ఉంటుంది మరి." అనుకుంది సుభద్ర. మనసు విరిగిపోతే స్పందన అలాగే ఉంటుంది.

నిస్త్రాణగా పడిపోయిన తల్లిని లేపి బత్తాయిరసం ఇచ్చి, పిల్లల్ని లేపి పాలు పట్టించింది.

సాయంత్రం వంటకి తయారు చెయ్యాలి.. ఈ గొడవతో మానసికంగా, శారీరికంగా కూడా అలిసిపోయింది సుభద్ర. కానీ తప్పదు.

చక్రపాణికి వాళ్ళ ఆఫీసులో చాలా మంచిపేరు. సాదా సీదాగా ఉండి, ఎవరిజోలికీ వెళ్ళకుండా తన పనేదో తను చేసుకుపోతుంటాడు. అనవసరంగా ఒక్క రోజు కూడా సెలవు పెట్టడు. ప్రతీ ఏడూ సెలవులన్నీ మురిగి పోతుంటాయి.

అతని గురించి వాళ్ళ యమ్. డికి కూడా తెలుసు. వెళ్తూనే ఎవరినీ సంప్రదించకుండా సీదా యమ్డి గారిని కలవడానికి ప్రయత్నించాడు.

"మీటింగులో ఉన్నారు. ఒక్కరగంటయాక పిలుస్తా మిమ్మల్ని.." సెక్రెటరీ చెప్పింది.

ఆ అరగంటలోనూ ఏం మాట్లాడాలో క్లుప్తంగా పాయింట్లు రాసుకున్నాడు. అక్కడికి వెళ్ళాక అలోచించడం మొదలు పెడితే అయన సమయం వృధా అవుతుంది కదా! తను సెలవులో వెళ్తున్నాడు కనుక, తనపని ఎవరికి అప్పచెప్పాలో చూసుకుని అంతా రెడీ చేసుకున్నాడు.

"రండి చక్రపాణిగారూ! ఎంతో అత్యవసరమైతే తప్ప మీరు రారు.." అక్కడ పని చేసిన అన్ని సంవత్సరాలలోనూ, కంపెనీ ఫంక్షన్లలో తప్ప, యమ్డి గారిని కలిసింది రెండు సార్లకంటే లేదు.. అదీ పిల్లల పెళ్ళిళ్ళకి పిలవడానికే!

యమ్డి తన సెల్ ఫోన్ ఆఫ్ చేసేసి, డిస్టర్బ్ చెయ్యద్దని సెక్రెటరీకి చెప్పి రెడీగా కూర్చున్నాడు.. వినడానికి.

"కూర్చోండి.. పాణిగారూ!"

"ఫరవాలేదండీ.." నిలుచునే పరిస్థితి అంతా వివరించాడు చక్రపాణి.

మధ్యలో కంఠం పూడుకుపోయింది. యమ్డి గారే లేచి మంచినీళ్ళిచ్చారు.

"మన పిల్లలు కష్టంలో ఉన్నప్పుడు తప్పకుండా హెల్ప్ చెయ్యాలి. మీ వర్క్ అంతా మీ పై అతనికి హేండోవర్ చెయ్యండి. రెండు మూడు నెలలయినా ఫరవా లేదు. ఈ ఇయర్ ప్రాఫిట్స్ ని బట్టి బోనస్ ఇద్దామనుకున్నాను. అదీ.. మీరు నెల నెలా కట్టేట్లు కొంత లోన్ ఏర్పాటు చెయ్యమని సెక్రెటరీకి చెప్తాను. ఎవ్విరి థింగ్ విల్ బి ఆల్ రైట్."

రెండు చేతులో జోడించి, కళ్ళల్లో నీళ్లు బైటికి రాకుండా ఆపుకుంటూ బైటికి నడిచాడు చక్రపాణి.

అంతా సెటిల్ చేసుకుని, సర్దుకుని బైట పడేసరికి గంట పైన పట్టింది.

మొత్తం ఇరవై వేలు చేస్తిలో పెట్టింది కేషియర్. నోట మాట రాక, కృతజ్ఞతతో కళ్ళు చెమర్చగా నిలబడిపోయాడు.. ఎప్పుడూ ఎవ్వరి దగ్గరా చెయ్యి చాపని చక్రపాణి.

ఇంటికి వెళ్తూ వెళ్తూ ఆర్.టి.సి బస్టాండ్ కి వెళ్లి టికెట్లు కొన్నాడు.

ఇంటికి వెళ్లగానే, చిన్ననాటి స్నేహితులకి ఫోన్లు చేసి, అల్లుడి ప్లాంట్ లో పని చేసే తన స్నేహితుడి నంబరు తీసుకున్నాడు. గుర్తు పడతాడో లేదో.. పట్టినా ఎలా మాట్లాడ్తాడో.. పెద్ద పొజిషన్ లో ఉన్నాడుట. ఏదయినా మంచి లాడ్జ్ చూడమని చెప్పాలి..

తడబడుతూనే ఫోన్ తీసి డయల్ చేశాడు.

రెండో రింగుకే అతను ఎత్తాడు.

"గోపాల్!"

"యస్.."

"నా పేరు చక్రపాణి. మనం చిన్నప్పుడు స్కూల్లో కలిసి చదువుకున్నాం." మొహమాటంగా అన్నాడు.

"ఒరినీ.. ఎన్నాళ్ళికి గురుతుకొచ్చాన్రా! ఎక్కడ్నుంచీ, ఏమిటి.. పన్నాన్రా అంటే చాలదూ.. అంత ఇంట్రడక్షన్ ఇవ్వాలా?"

చక్రపాణికి టెన్షన్ అంతా చేత్తో తీసేసినట్లు పోయింది.

గోపాలాచారి, చక్రపాణీ స్కూల్లో ఆరో క్లాసునుంచీ పన్నెండో క్లాసు వరకూ ఒకే బెంచ్ మీద కూర్చుని చదువుకున్నారు. పెళ్లిళ్లయేవరకూ ఉత్తరాలు రాసుకున్నారు. తరువాత కొన్నాళ్లు ఏడాది కొక గ్రీటింగ్.. ఆ తరువాత ఎవరి సంసారాల్లో.. ఉద్యోగాల్లో వాళ్లు మునిగిపోయి దూరంగా జరిగిపోయారు.

గోపాల్ కి వాళ్ళ నాన్న పదిహేను రోజులకొక సారి చెంబు గుండు చేయించేవాడు. జుట్టు పావు అంగుళంకి మించడానికి లేదు. అందుకే అందరూ గుండు అని పిలిచేవారు. గోపాల్ సన్నగా పొడుగ్గా.. చక్రపాణి అతని ఎత్తులో సగం.. గుండ్రంగా.. ఇద్దర్నీ లారెల్ హార్డీ అని పిలిచేవారు.

ఇద్దరికీ ఆసంగతులు గుర్తుకొచ్చి ఒకే సారి నవ్వుకున్నారు.

"నేనేరా గుండూ! రాత్రి బస్ లో ఫామిలీతో బయలుదేరి మీ ఊరొస్తున్నా. ఏదైనా మంచి హోటల్లో గది బుక్ చేయించు." పొద్దుట్నుంచీ అనుభవిస్తున్న వేదన అంతా తీరిపోగా, హాయిగా నవ్వుతూ అన్నాడు చక్రపాణి.

"ఒరినీ! హోటల్లో దిగే వాడివి నాకెందుకురా ఫోన్? పైగా నేనే చేయించాలా రిజర్వేషన్? ఎన్ని గుండెలు.. ఎన్ని గంటలకొస్తుందో మీ బస్సు చెప్పు చాలు." ఇంకా పెద్ద తిట్లు తిట్టేవాడే.. కానీ ఎదురుగా ముగ్గురు కొలీగ్స్ కూర్చుని ఉన్నారని ఆగాడు.

"కానీ ముగ్గురు పెద్ద వాళ్ళం, ఇద్దరు పిల్లలు.. నీకు ఇబ్బంది.."

"నోరు మూసుకుని ఎన్ని గంటలకొస్తున్నావో చెప్పు చాలు."

ఫోన్ కట్ చేసి ఎదురుగా కూర్చున్న వంశీకృష్ణ, సుందర్రావు, రమేష్ ల కేసి తిరిగి బిడియంగా నవ్వాడు.

"నా చిన్నప్పటి ఫ్రెండ్. చాలా రోజుల తరువాత వాడి గొంతు వినికొంచెం.."

ఎంతో గంభీరంగా, డిగ్నిఫైడ్ గా ఉండే గోపాలాచారి అలా మాట్లాడడం వింతగా నిపించినా.. అర్ధం చేసుకున్నామన్నట్లు నవ్వేశారు ముగ్గురూ.

వెంటనే సీరియస్ గా అయిపోయి, తన ఎదురుగా ఉన్న కాగితం మీదున్న దాన్ని చదివాడు గోపాల్. . అన్నీ సి.ఇ గారి దగ్గర నోట్ చేసుకున్న పాయింట్స్.

"మనం సివిల్ పనులను పోస్ట్ పోన్ చేద్దాం. ఇప్పుడు అందరం ఈ క్రైసిస్ మీద దృష్టి నిలపాలి. రమేష్ గారూ! మీ హెల్ప్ కూడా

కావాలి.”

“ష్యూర్.”

”కోల్ ప్లాంట్ యస్.ఇ లీవ్ లో ఉన్నారు. మీరు కోల్ ప్లాంట్ ఛార్జ్ తీసుకోవాలి. అక్కడి క్రైసిస్ లోంచి బయట పడ్డం ముఖ్యం. నార్త్ నుంచి వచ్చే రేక్ కూడా ఆగిపోయింది. టెర్రరిస్ట్ ల పనే అని కన్ఫర్మ్ అయింది. వాళ్లు మొత్తం పవర్ ప్లాంట్స్ నే టార్గెట్స్ కింద పెట్టుకున్నట్లు అనుమానం. అందరికీ యస్.ఓ.యస్ ఆర్డర్స్ వెళ్లిపోయాయి. గత రెండు గంటల్లో చాలా డెవలప్ మెంట్స్ అయ్యాయి.”

రమేష్ సర్దుకుని కూర్చుని, చెప్పండి అన్నట్లు చూశాడు.

యస్.ఇ లు అందరు సమానమైన, ఏడియమ్ మాటలకి ఎదురు చెప్పరు ఎవరూ. అతనే మరి అంతా చుసుకోవలసింది. అదే పోస్ట్ రమేష్ కి వచ్చినా అంతే.

“సుందర్! మీరు కూడా వంశీకృష్ణకి హెల్ప్ చెయ్యాలి. ప్రతీ పావుగంటకీ రేక్ స్టాఫ్ కి రింగ్ ఇస్తుండండి. ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళకి ఫోన్ చిక్కుతుందేమో!”

“కొన్ని యూనిట్స్ మూసెయ్యాలేమో?” రమేష్ సందేహంగా చూశాడు.

“తప్పదు. ఏ స్టేషన్ అంతా షట్ ఆఫ్ చేసేద్దాం. మొత్తం ఐదు యూనిట్స్ మూసెయ్యాలి. అలా అయితే కోల్ పదిహేను రోజుల వరకు సరిపోతుంది.

వంశీ! మన వాళ్ళతో మీరు టచ్ లో ఉండండి. రవిని ప్రతీ అరగంటకీ రిపోర్ట్ ఇమ్మనండి. పోలీస్ ఫోర్స్ ఉన్నా కూడా వీళ్ళు చాలా కేర్ ఫుల్ గా ఉండాలి. ట్రయిన్ డ్ టెర్రరిస్ట్ లు వాళ్ళు. అన్నట్లు సరిపడా ఫుడ్ పాక్ చేశారు కదా?”

“మూడు రోజులకి సరిపోయేట్లు పెట్టించా సర్!”

నమ్మలేనట్లు చూశాడు గోపాలాచారి. ఇప్పటి రెడీ మేడ్ పదార్థాలతో అంత కష్టమేం కాదనుకున్నాడు మళ్ళీ.

“వారం పదిరోజుల వరకూ పాడవని సోయా మిల్క్ పాకెట్లు, బ్రెడ్, బిస్కట్స్, జామ్, సీరియల్స్, చపాతీలు.. వేజ్జీలు డ్రై చేసి పొడులు.. “ వివరించబోతున్న వంశీని వారించాడు గోపాల్.

“అర్థం అయింది. గుడ్ జాబ్. ఇంక మనం పనిలోకి దిగుదామా? రమేష్! మీరు నా రూమ్ ప్రక్క గదిలోకి మారిపొండి. వంశీ! మీరు నా రూం లోనే ఒక పక్క అరేంజ్ చేసుకోండి.” అందరూ స్ప్రింగుల్లా లేచి బయటికి వచ్చారు.

గోపాలాచారి సి.ఇ గారి గదిలోకి వెళ్తుండగా సెక్యూరిటీ చీఫ్ ఎదురయి విష్ చేశాడు.

**ప్రతీ పవర్ ప్లాంట్ కీ, ఇతర కర్మాగారాలకి** ఉన్నట్లే సెక్యూరిటీ డిపార్ట్ మెంట్ ఉంటుంది. అందులో ఎక్కువమంది ఉద్యోగులు పోలీస్ ఫోర్స్ నుంచి డెప్యుటేషన్ మీద వస్తారు. కొద్ది మందిని డైరెక్ట్ గా కూడా తీసుకుంటారు. పవర్ ప్లాంట్ రక్షణ వాళ్ళ డ్యూటీ. సి.ఇ గారి పర్సనల్ సేఫ్టీ కూడా వాళ్ళే చూస్తారు.

పవర్ ప్లాంట్ గేటు పక్కనే సెక్యూరిటీ బిల్డింగ్ ఉంటుంది. యాక్సిడెంట్ కేసుల్ని కూడా వాళ్ళే చూస్తారు.

“ఏమైనా తెలిసిందా సి.ఇ గారూ?” గోపాలాచారి సి.ఇ గారి గదిలోకి వెళ్తూనే కుర్చీ లాక్కుని కూచుంటూ అడిగాడు.

“ఆ వీర్రాజు పోస్ట్ మార్టం రిపోర్ట్..” తన చేతిలోని కాగితాన్ని గోపాలాచారికి అందించారు సి.ఇ.

“అవును కదూ! ఆ సంగతే మర్చిపోయాను.” కాగితం తీసుకుని చూశాడు.

"తాగేసున్నాడు.. అనుకున్నట్లుగానే."

"అదే చూస్తున్నాను.. అతనికి ఎంత వస్తుందో అంతే ఇవ్వగలుగుతాం. సానుభూతి అంటూ అతని భార్యకి ఉద్యోగం ఇవ్వడానికి కుదరదు."

"ఇవ్వకూడదు కూడా.. " గోపాలాచారి సాలోచనగా అన్నాడు. "ఇస్తే అదొక వంకగా తాగేస్తారు. కొన్నాళ్ళయ్యాక కాంట్రాక్ట్ లేబర్ కింద అతని వైఫ్ ని తీసుకుందాం. ఎట్లాగూ వర్కర్స్ కాంపెన్సేషన్, పి.యఫ్, గ్రాట్యుఇటీ ఉంటాయి కదా! క్వార్టర్స్ ఖాళీ చెయ్యక్కర్లేదని చెబ్దాం. ఏమంటారు?"

"కరెక్ట్. నేనూ అదే అనుకుంటున్నాను. బాడీని రేప్పొద్దున్న ఇస్తారుట. ఫ్యునరల్ అరేంజ్ మెంట్స్ చూడమని యూనియన్ ప్రెసిడెంట్ కి చెప్పాలి." అని బెల్ నొక్కారు శ్రీనివాస్.

"ఇస్మాయిల్! ఆ యూనియన్ వాళ్ళని పిలు."

పవర్ ప్లాంట్ లో చాలా బలమైన యూనియన్ ఉంది. ఏ వర్కర్ కి ఏ అవసరం వచ్చినా ఆదుకోవడానికి తయారుగా ఉంటారు.

పదినిముషాల్లో జమ జెట్టీల్లాంటి వాళ్ళు నలుగురు వచ్చేశారు.

ఏం బాలన్స్ డ్ ప్రోటీన్ ఫుడ్ తింటారో కానీ, విశాలమైన ఛాతీలూ, కండలు తిరిగిన శరీరాలూ..

కాకీ యూనిఫామ్ కి గంజిపెట్టి, ఇస్త్రీ చేసి, ఫెళఫెళ్ళాడుతూ ఉన్న బట్టలు.. కొంచెం కూడా నలగలేదు. యూనియన్ లో చురుకుగా ఉన్నవాళ్ళు ప్లాంట్ లో అంత కష్టమైన పనులు చెయ్యరు.

"వర్కర్స్ అందరూ ఇలాగే ఉంటారా?" అనుకున్నాడు గోపాలాచారి, నలిగిపోయిన తన చొక్కా చూసుకుని. చాకలి పెట్టీ పెట్టనట్లు గంజిపెట్టి, ఇస్త్రీ పెట్టి తిప్పాడో లేదో అన్నట్లు విస్త్రీ చేసిన షర్టు.. వేసుకున్న అరగంటలో నలిగిపోయింది. అందులో ఐ టెన్షన్ కి షర్టు చేతులు ముడిచీ, తీసీ.. ఇన్ షర్ట్ గుంజి.. కాలర్ నలిపి చిత్ర హింసలు పెడతాడా డ్రస్ ని.

పోదూ.. అనుకుని తల విదిల్చి లీడర్స్ ని కూర్చో మన్నాడు.

కానీ యూనియన్ లీడర్లు చాలా మర్యాదగా ఉంటారు.

చేతులు కట్టుకోకపోయినా, వినయంగా నిలుచుని, "చెప్పండి సార్! ఫరవాలేదు." అన్నాడు యూనియన్ సెక్రెటరీ.

"వీర్రాజు సంగతి.." అంతా వివరించాడు గోపాలాచారి.

"మీరు అంతా చూసుకుంటారు కదా! ఆఫీసర్స్ ఎసోసియేషన్ నుంచి పదివేలు ఇచ్చేలా చూస్తాను. అతని వైఫ్ కి మాత్రం.."

"స్వీపర్ జాబ్ ఇవ్వాలి సర్!" సెక్రెటరీ ఖచ్చితమైన కంఠస్వరంతో అన్నాడు.

"రూల్స్ అన్నీ తెలిసిన మీరే అలా మాట్లాడితే ఎలా? తాగేసున్నాడని ప్రూవ్ అయింది కదా!"

"రిపోర్ట్ కొంచెం.." భయం భయంగా అన్నాడు జాయింట్ సెక్రెటరీ.

వెంటనే కఠినంగా మారిపోయింది గోపాలాచారి గొంతు.

"నో! అటువంటి పనులు మేం చెయ్యం. అతని భార్యకి కాంట్రాక్ట్ లేబర్ కింద ఇస్తాం. అది మా చేతుల్లోనే ఉంది. "

"సరే సార్!" అని తన వాళ్ళని ఊరుకోమని కసిరాడు సెక్రెటరీ. కాంట్రాక్ట్ జాబ్ అయినా నెలకి మూడువేలు వస్తుంది. అది సరిపోతుంది లక్ష్మమ్మకి. గట్టిగా మాట్లాడుతే అది కూడా ఇవ్వకపోవచ్చు.

"ఇద్దరు వెళ్ళి ఫ్యూనరల్ సంగతి చూడండి. ఇద్దరు కూర్చోండి. ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి." సి.ఇ గారి సీరియస్ గొంతు

విని, బల్లకి ఒక పక్కనున్న కుర్చీలు రెంటినీ చప్పుడవకుండ లాగి ఒద్దికగా కూర్చున్నారు సెక్రెటరీ నారాయణ, జాయింట్ సెక్రెటరీ సంతోష్.

"మన పవర్ ప్లాంట్ కి ఒక అనుకోని ఆపద వచ్చింది." బొగ్గు సప్లై ఆగిపోవడం, టెర్రరిస్టుల పనేమోనని అనుమానం.. గవర్న్ మెంట్, పోలీసుల అప్రమత్తత.. అన్నీ వివరించారు శ్రీనివాస్.

"కోల్ ప్లాంట్ లో కానీ, మిగిలిన మిషన్ల దగ్గర, ట్ర న్స్ ఫార్మర్ల దగ్గర, ఎవరినా కొత్త వాళ్ళు కానీ, అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న వాళ్ళు కానీ ఉన్నారేమో యుద్ధ ప్రాతిపదికన కనుక్కోవాలి మనం. ఇరవై నాలుగ్గంటల్లో ఏదో మేజర్ అటాక్ జరగబోతోందని తెలిసింది." గోపాలాచారి అందుకున్నాడు.

నారాయణ, సంతోష్ నిటారుగా అయ్యారు.

వర్కర్ల ప్రాబ్లంస్ అంటే యాజమాన్యంతో దెబ్బలాడుతారు కానీ.. తమకి అన్నం పెట్టే ఫాక్టరీకి ఏదయినా జరుగుతుందంటే ఊరుకోరు. అది ఎవరైనా వాడి కండలు బైటికి రావలసిందే.

"సార్! అలా అయితే వీర్రాజు బాడీని మార్చురీలో ఇంకొక రోజు ఉంచచ్చు కదా! ఎట్లాగూ పోయినతని గురించి ఇప్పుడు అర్జంటేముంది సార్? మనం పోస్ట్ మార్టం రిపోర్ట్ గురించి ఇప్పుడే చెప్పద్దు ఎవరికీ. మేము అన్ని చోట్లా ఎంక్వయిరీ చేస్తాం. మీకు ఒక గంటలో ఏదయినా ఉంటే చెప్తాం. "

నారాయణ సి.ఇ గారితో మాట్లాడుతుండగానే, సంతోష్ సెల్ ఫోన్ తీసి, కాలనీలోకి వెళ్ళిన ఇద్దరినీ వెనక్కి రమ్మన్నాడు.

" వర్కర్లకి సెల్ ఫోనెందుకు.. పనికి అడ్డం తప్ప.. అనుకునే గోపాలాచారి సిగ్గుపడ్డాడు తన ఆలోచనకి. యూనియన్ లీడర్లంటే దాదాపు వెయ్యి మంది ఉద్యోగుల బాగోగులుచూసే వాళ్ళు. సెల్ ఫోన్ ఉపయోగం ప్రత్యక్షంగా చూస్తున్నాడు కదా!"

"నయం అన్నా! ఏక మినట్ అయితే లక్ష్మక్క ఇంట్లో ఉండే వాళ్లం." హడావుడిగా వచ్చిన ఇద్దరూ అన్నారు.

వాళ్ళు వచ్చేలోపు ఎం చెయ్యాలో గోపాలాచారి వివరించాడు. సైనికులకి ఒక కమాండర్ ఉండాలి కదా!

సంతోష్ మిగిలిన లీడర్లనీ, చురుకుగా ఉండే కొంతమంది వర్కర్లనీ పిలిచాడు. అరగంటలో సి.ఇ గారి ఆఫీస్ ముందు యాభైమంది గుమికూడారు.

నారాయణ వాళ్లతో బయటికి వచ్చిన గోపాలాచారి కళ్ళు పెద్దవయ్యాయి..

అవును మరి.. వెయ్యిమంది పైన వర్కర్లు పని చేసే ప్లాంట్ అది.. ఆశ్చర్యమేముంది?

"మీరు వర్రీ గాకండి సార్. ఎవడైనా ఏశాలేస్తే ముక్కలుగా నరుకుతాం." సంతోష్ ఆవేశంగా అన్నాడు.

"వీళ్ళందరూ..?"

"ఇరవై ఏళ్ళనుంచీ ఇక్కడ పని చేస్తున్న వాళ్ళే సారూ! ప్లాంట్లో మొలిచిన కలుపు మొక్కల్ని ఏరి పారేస్తాం. మీరు బైటి వాళ్ళ సంగతి చూసుకోండి." నారాయణ చెయ్యి నొక్కాడు సంతోష్.. ఆవేశాన్ని అదుపులో పెట్టుకోమని.

"ఫరవా లేదోయ్.. నేను అర్థం చేసుకోగలను." గోపాలాచారి సి.ఇ గారి ఆఫీసులోకి నడిచాడు.

ఆ టౌన్ షిప్ లో మూడు స్కూల్స్ ఉన్నాయి.

వాటిలో ప్రభుత్వ పాఠశాల ఒకటి. అందులో ఒకటో తరగతి నుంచీ పదో తరగతి వరకు ఉన్నాయి క్లాసులు. మధ్యాన్నం భోజనం కూడా పెడతారు. వర్కర్ల పిల్లలందరూ అక్కడికే వెళ్తారు.

లక్ష్మమ్మ పిల్లలు కూడా అందులోనే చదువుతున్నారు. పుస్తకాలు వాళ్ళే ఇస్తారు. పాఠాలు కూడా బాగా చెప్తారు. ఎవరైనా బాగా

చెప్పకపోతే వెంటనే బదిలీ అయిపోతుంది. యూనియన్ లీడర్లు ఆ జాగ్రత్త తీసుకుంటారు. స్కూలు టీచర్లకి, కాలనీలో క్వార్టర్ కూడా ఇస్తారు. ఒక సారి చేరిన టీచర్ రిటైర్ అయ్యే వరకూ అక్కడే ఉండిపోవడానికి ఇష్టపడతారు. అంత సదుపాయంగా ఉంటుంది.

మూడు గంటలకి స్కూల్ వదలగానే ఇంటికొచ్చిన లక్ష్మమ్మ పిల్లలకి అర్ధమైపోయింది.. ఏదో జరిగిందని.

"అయ్యా తన్నిండా అమ్మని? అమ్మకి గట్టి దెబ్బలు తగిల్నయ్యా?" వాళ్ళ దృష్టిలో అదే జరిగేది ఇంట్లో. అమ్మ తన్నులు తినడం, రోజూ తెల్లవారినంత సహజం వాళ్ళకి.

"ఇంత మందున్నారేంటి ఇంటికాడ?" బిక్కు బిక్కు మంటూ ఇంట్లో అడుగు పెట్టారు.

అమ్మ బానే ఉందే.. కాళ్ళుజాపుకుని, గోడ కానుకుని కూర్చుంది.. ఒకళ్లనొకళ్ళు చూసుకుంటూ అమ్మ దగ్గరికి వెళ్ళారు.

"వారి నా కొడుకుల్లారో.. నాయన న్నాయం జేసి పోయిండే.." లక్ష్మమ్మ మళ్ళీ అందుకుంది.

"ఏం జేసిండు?" అయోమయంగా చూశారిద్దరూ.

రాములు పక్కకి తీసుకెళ్ళి, వాళ్ళకి అర్ధమయే భాషలో వివరించాడు.

ఏడుపు కూడా రాని అమాయకత్వంతో బెదురూ చూపులు చూస్తున్న ఆ పిల్లల్ని చూస్తుంటే కడుపు తరుక్కు పోయింది అక్కడున్న ప్రతీవారికీ.

ఆ టౌన్షిప్ లో ఉన్న రెండు ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో ఒకటి మిషనరీది. రోమన్ కాథలిక్స్ నడిపే కాన్వెంట్. పాతిక సంవత్సరాలనుంచీ అక్కడుంది. అందులోనే అనాధశరణాలయం కూడా ఉంది.

ఫీజులు మధ్యతరగతి వాళ్ళకి అందుబాటులో ఉంటాయి. ఆ కాన్వెంట్ పట్టణానికి, టౌన్ షిప్ కీ మధ్యలో ఉండడం వల్ల చలా మంది విద్యార్ధులు ఉంటారు. సండే స్కూల్ కూడ ఉంటుంది. ఎక్కువగా క్రిస్టియానిటీ ప్రభావం ఉంటుంది. కొత్త స్కూల్ రాకముందు టౌన్ షిప్ లో ఇంజనీర్ల పిల్లలు అక్కడే చదివే వారు.

ఐదు సంవత్సరాల క్రితం కార్పొరేట్ స్కూల్ ఒకటి ప్రారంభించారు. పేరు, "విద్యా నికేతన్". ఆ సంవత్సరమే టెన్త్ క్లాస్ కి మొదటి బాచ్ తయారవుతున్నారు. ఫీజులు ఎక్కువే అయినా, పే స్కేల్స్ కూడా పెరగడంతో డిమాండ్ బాగాపెరిగింది. ఏ మతానికీ చెందకుండా సెక్యూలర్ గా ఉండడంతో అందరికీ నచ్చింది.

పొద్దున్నే జరిగే ప్రార్ధన కూడా ఏ దేముడినీ ఉద్దేశించకుండా ఉంటుంది. కేరళ నుంచి నిష్ణాతులైన టీచర్లని తీసుకొచ్చారు.

రవి పిల్లలు అవినాశ్, అఖిల్ విద్యా నికేతన్ లోనే చదువుతున్నారు. మూడున్నరకల్లా స్కూల్ బస్ కాలనీ గేటు దగ్గర ఆగుతుంది. అమ్మ ఎక్కువ పట్టించుకోకపోవడం వల్లనో ఏమో కానీ అవినాశ్ చాలా జాగ్రత్తగా ఉంటాడు.

గేటు దగ్గర్నుంచీ తమ్ముడిని చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా నడిపిస్తూ తీసుకొస్తాడు.

ఆ రోజుకూడా నిండా తొమ్మిదేళ్ళు లేని అవినాశ్, తమ్ముడిని, వాడి బాగ్ కింద పడిపోకుండా భుజాలు పట్టుకుని తీసుకొచ్చి ఇంట్లో అడుగు పెట్టాడు. డాడీ స్కూలుకొచ్చి జాగ్రత్తలు చెప్పారు కదా మరీ!

డాడీ లేకపోతే అన్నం ఎవరు పెడతారు? రోజూ ఇంటికి వెళ్లగానే బల్ల మీద రవి పెట్టి ఉంచిన బిస్కట్లు, చేగోణీలు లాంటివి తింటారు. అలివేలు పాలు ఇస్తే తాగి, ఆడుకుంటారు.

అఖిల్, వెనుక వరండాలో చాప వేసుకుని బిల్డింగ్ బ్లాక్స్ పెట్టుకుని రెండు గంటలు కూర్చుంటాడు. ఒక రోజు డాం, ఒకరోజు ఫ్లై

ఓవర్.. ఇంకో రోజు హోటల్.. రకరకాల నిర్మాణాలు కట్టేస్తుంటాడు.

అవినాశ్ సైకిల్ వేసుకుని కాలనీలో తోటి పిల్లలతో తిరుగుతూ ఉంటాడు. ఏడింటి లోపు ఇంటికి వచ్చి, డాడీ వచ్చే లోపు తనకి చేతనయినంత వరకూ హోమ్ వర్క్ చేసి, తమ్ముడి చేత కూడా చేయిస్తాడు.

"అమ్మా!" అఖిల్, సుగుణ దగ్గరగా వెళ్ళాడు.

"ఉండు. డిస్టర్బ్ చెయ్యకు." సుగుణ సినిమాలో లీనం అయింది. మిస్టర్ పెళ్ళాం సినిమా. అందులో మమ్మీ పిల్లలకి చదువులు చెప్తూ మంచ్ లు చేస్తోంది.

అవినాశ్ ఒక సారి సినిమా కేసీ, ఇంకో సారి అమ్మకేసీ మార్చి మార్చి చూశాడు.

"అఖీ! దా. డ్రస్ మార్చుకుందాం." ఇద్దరూ బాత్రూం లోకి వెళ్లి మొహాలు కడుక్కున్నారు. అలమారులోంచి బట్టలు తీసుకుని వేసుకున్నారు. తీసేటప్పుడు బట్టలన్నీ కింద పడిపోయాయి. అవి తొక్కుకుంటూ, లాగు తిరగేసి వేసుకుని, షర్ట్ బటన్లు అడ్డదిడ్డంగా పెట్టుకుని గదిలోంచి బైటికి వచ్చారు..

"మమ్మీ! అలివేలు రాలేదా.. ఆకలేస్తోంది." అవినాశ్ అమ్మని కదిలించడానికి ప్రయత్నం చేశాడు.

"వస్తూ ఉంటుంది. ఆగండి." తల తిప్పకుండా అంది సుగుణ.

అవినాశ్ బైటికి, అఖిల్ వెనుక వరండాలోకి వెళ్లి పోయారు.

రవి, రోజూ లగే బల్లమీద బిస్కట్లు అవీ పెట్టాడు. కానీ డాడీ ఊరికెళ్ళాడు కదా అనుకున్నాడేమో.. అవినాశ్ చూసుకోలేదు. ఆటల్లో పడి ఆకలి సంగతి మర్చిపోయారు.

అలివేలు వచ్చి, ఆనందంగా బిస్కట్లు, జంతికలు ఖాళీ చేసేసింది.

❦❦❦

క్వాలిస్ వాన్ లో వెళ్తున్న రవి టైమ్ చూసుకున్నాడు. నాలుగు దాటింది. పిల్లలు స్కూలు నుంచి వచ్చుంటారు. ఏమైనా తిన్నారో లేదో!

రోజూలాగే.. తినే ఉంటారు. ఏంటో పిల్లలతో మరీ ఆటచ్మెంట్ పెరిగిపోతోంది. తల విదిల్చాడు.

వాన్ లో ముందు సీట్లో కూర్చున్నాడు రవి. వెనుక ముగ్గురు, సింగ్, భీమారావు, రహీమ్. ఆ వెనుక ఇటూ అటూ ఉన్న సీట్లలో మిగిలిన చైతన్య, ఆంజనేయులు కూర్చున్నారు.

వాన్ కి ముందు ఒకటి, వెనుక ఒకటి పోలీస్ జీపులు వెళ్తున్నాయి. ఇద్దరు, హెడ్ కాన్స్టేబుల్స్, ఒక ఇన్స్పెక్టర్, ఇద్దరు కాన్స్టబుల్స్ ఉన్నారు. ఇవి కాక, హైద్రాబాద్ నుంచి మిలిటరీ వాన్ కూడా బయలుదేరింది.. నిండఆర్మీతో.

"ఇంత హంగుతో వెళ్తున్నాం. సుమారు ఎంతమందుంటారు సార్?" ఆంజనేయులు అడిగాడు చెవులూపుతూ.

"నో ఐడియా. ఎంతమందున్నా వాళ్ళు ప్రాణాలకు తెగించిన వాళ్ళు. ఒక ప్లస్ పాయింటేమిటంటే .. అందులో వాళ్ళ నాయకుడొకడే స్వతంత్రం కలిగిన వాడుంటాడు. మిగిలిన వాళ్ళు గుడ్డిగా ఫాలో అవవలసిందే. మనం కూడా ఆలోచించ గలం కదా అని తొందర పడ కూడదు. ఆచి తూచి అడుగు వెయ్యాలి. సినిమాల్లో హీరోల కింద ఫీలయిపోకూడదు. అసలు మనం టెర్రరిస్టుల గం రేంజ్ లోకి వెళ్ళనే కూడదు. పోలీసులకి వదిలేయాలి." రవి మాటలకి అందరూ భయంగా చూశారు.

"ఏదో పిక్నిక్ కి వెళ్తున్నట్లు వెళ్తున్నామనుకున్నాము కానీ సార్! యస్పీ గారు చెప్పినా ఇంత డేంజర్ అనుకోలేదు. ఇంతకీ మనం ఎం చెయ్యాలక్కడ?" రహీం అడిగాడు.

"అంటే అదొక సైడ్ అనుకోండి. అంత ప్రమాదం ఏమీ లేకపోవచ్చుకూడా. మన పని రేక్ లు ఎక్కడాగిపోయాయో కనుక్కోవడం. ఆ ట్రాక్ కామన్ గా వాడేది కాదు కదా! మనకే తెలుస్తుంది. టెర్రరిస్టులని నెగోషియేట్ చేసి, రేక్ లని విడిపించి నడిపించడం మన పని. ఎలా చెయ్యాలీ అనేది అక్కడి పరిస్థితులని బట్టి నిర్ణయించాల్సిందే. ముందు స్పాట్ కనుక్కోవాలి."

"సార్!" పరచిన సామాన్ల మీద మాప్ పెట్టి చూస్తున్న చైతన్య అరిచాడు.

"ఏమిటి?" రవి వెనక్కి తిరిగాడు.

"స్పాట్ దొరికినట్లే. రేక్ లు బయలుదేరి సగం దూరం వచ్చేవరకూ మైనస్ తో కాంటాక్ట్ ఉందన్నారు కదా! పైగా నార్త్ నుంచి వస్తున్నా బండి కూడా ఆగిపోయిందంటే జంక్షన్ కు ఇవతలే అయుంటుంది. ట్రాక్ కి దగ్గరలో ఒక్క చోటే ఊరు ఉంది. ఆ చుట్టు ప్రక్కలే ఉండి ఉంటారు."

"కానీ అక్కడికి రోడ్ లేదు. ఎలా వెళ్తాం?" చైతన్యతో పాటు వంగి మాప్ పరిశీలిస్తున్న ఆంజనేయులు అన్నాడు.

రవి దగ్గరున్న సెల్ మోగింది.

"రవీ! మీరు రూట్ మార్చాలి. వెనక్కి తిరిగి పది కిలోమీటర్లు వెళ్లండి. ఈ పాటికి డెబ్బై కె.యమ్ వెళ్ళారా ?" గోపాలాచారి సరిగ్గానే ఊహించారు.

"యస్ సర్! డెబ్బై ఐదు."

"అయితే పది హేను కె.యమ్ వెనక్కి వెళ్ళండి. అక్కడ్నుంచి రైట్ కి డైవర్షన్ తీసుకోవాలి. ఆ రూట్ లో ఉన్న పల్లేరు దగ్గర ఆపారనిపిస్తోంది."

"ఒక్క నిముషం సార్!" ముందు వెళ్తున్న పోలీస్ వాన్ కి ఆగమని సిగ్నల్ ఇచ్చాడు.

"చైతన్య! ఆ ఊరి పేరేమిటి?"

"పల్లూరు అనుకుంటా సార్. అంత క్లియర్ గా లేదు."

"ఓకే. సార్! మేం కూడా అదే అనుకుంటున్నాం. అదే రిమోట్ గా ఉంది. చుట్టూ ఫారెస్ట్. మేము వెనక్కి వెళ్లి యాభై కే,యం పైగా కచ్చా రోడ్ లో వెళ్తే కానీ ఆ ఊరు రాదు. అక్కడ సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉన్నాయో లేదో!"

"ఉండే ఉంటాయి సార్. దుష్మన్లు కూడా కాంటాక్ట్ చెయ్యాలి కదా!" సింగ్ అందుకున్నాడు. రవి అభినందిస్తూ చూశాడు.

"యస్ సర్! మేము వెనక్కి తిరుగుతున్నాం." రవి ఫోన్ కట్ చేసి పోలీసులకి చెప్పాడు.

అందరూ వెనక్కి తిరిగారు.

లక్కీగా ఆ డైవర్షన్ దగ్గర ఓ చిన్న పల్లె, రోడ్డు మీద బడ్డీ కొట్లు ఉన్నాయి.

అందరూ కిందికి దిగి, కాళ్ళు చేతులు సాగ దీసుకుని, బోరింగ్ దగ్గర మొహాలు కడుక్కుని టీలు తాగారు.

"అబ్బ.. ఎంత హాయిగా ఉందో! మళ్ళీ ఎన్నాళ్టికి వేడి వేడి టీ తాగుతామో." సొట్టలు పడిన అల్యూమినియమ్ గ్లాసులో, కిరసనాయిల్ వాసన వేస్తున్న టీ ని ఆస్వాదిస్తూ అన్నాడు చైతన్య.

పొడవాటి తన ముక్కుని విరిచాడు సింగ్.

"ఇదీ ఒక టీనా?" ఆంధ్రప్రదేశ్ లో రెండో తరం సింగ్ అతను. తెలుగు బాగా వచ్చు. వాళ్ళు టీని అద్భుతంగా తయారు చేసి, ఒక్కోళ్ళు ఒక్కో పాట్ తాగుతారు.

"ఏదో.. వేడిగా, నాలుక్కాలుతూ రుచి తెలియట్లేదు కదా!" భీమారావు పళ్ళు మెరుస్తుండగా నవ్వుతూ అన్నాడు.

"ఈ పాటికి పల్లేరులో ఫైవ్ స్టార్ హోటల్ వెలిసి ఉంటుందిలే, మన ఫ్రెండ్స్ ధర్మమా అని." ఆంజనేయులు మాటలకి అందరూ నవ్వారు.

"బాగుందయ్యా. టెన్షన్ తగ్గాలంటే ఇలా సరదాగా ఉండాలి. పిక్నిక్ అనే అనుకుందాం.. ఏదైనా విరుచుకు పడే వరకు. కానీ ఏమరుపాటు పనికి రాదు. నాలుగు కళ్ళుండాలి ఒక్కొక్కళ్ళకి." రవి దూరంగా గుండ్రంగా కుర్చుని టీ తాగి కబుర్లు చెప్పుకుంటున్న పోలీసులకి సైగ చేశాడు.

"యస్సార్!" ఒక యస్సై ముందుకి వచ్చి సెల్యూట్ చేశాడు.

అందరూ రెండంగల్లో జీపులెక్కారు.

రవీ వాళ్ళు కూడా తమ వాన్ ఎక్కారు.

"జై బజరంగ్ భళీ!" ఆంజనేయులు అంటుండగా పల్లేరు కేసి బయలు దేరాయి బళ్ళన్నీ.

"భాయ్! టేపు లేదా?"

"ఉంది సార్."

"నువ్వు డ్రైవ్ చెయ్యి. నేను పెడతాను." రవి టేప్ రికార్డర్ ఆన్ చేశాడు.

హుషారైన కొత్త పాటలు. అర్థం లేక్పోయినా.. తెలియక పోయినా.. రిథిమ్ బాగుంది.

సింగ్ చేతులు తిప్పుతూ ఎంజాయ్ చేస్తున్నాడు.

"భాయ్!" అరిచాడు రహీమ్. పాట హోరులో అరుస్తే కానీ వినిపించట్లేదు.

"సారీ.." రిథిమ్ కి అనుగుణంగా తల తిప్పుతూ తను కూడా పాడసాగాడు సింగ్.

"మా కంటే తెలుగు పాటలు బాగా పాడుతున్నావు గురూ!"

"ఏమనుకున్నావ్? ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు తెలుసా మనకి." సింగ్ గర్వంగా తలెగరేశాడు.

"మనకి అనకు. నాకు హిందీ." భీమారావు సిగ్గుగా అన్నాడు.

"ఫర్లేదు గురూ! మీకు రక్తంలో ఉంటుంది కదా! వేరే నేర్చుకోవడం ఎందుకు?"

"ఎందుకా? ఒక పేజీ చదవడానికి ఒక గంట పడుతుంది. అందుకు." రవి అంటుండగా వాన్ లో ఒక పెద్ద కుదుపు వచ్చింది. అందరూ ముందుకు పడబోయి ఆగారు.

"ఇక నుంచీ రోడ్ ఇంతే అనుకుంటా సాబ్." బండిని సెకండ్ గేర్ లో పోనిస్తూ అన్నాడు డ్రైవర్.

చీకటి పడబోతోంది. సంధ్యాకాంతులు, ఆదవిలోనుంచి రావాలా వద్దా అన్నట్లు చూస్తున్నాయి.

"ఈ రాత్రికి తమ కోసం ఏం పొంచి ఉందో.." అందరి హృదయాలు భారం అయ్యాయి.

సుగుణ సోఫా లోంచి లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. ఆరవుతోంది. పిల్లలేం చేస్తున్నారో!

అలివేలు వచ్చి వెళ్ళినట్లు లీలగా గుర్తుంది. టి.విలో సీరియల్స్, సినిమాలు అయిపోయాయి. న్యూస్ లు, వాదనలు, విశ్లేషణలు.. విజ్ఞానం. బోర్. లేచి బాహ్యప్రపంచంలో ఎం జరుగుతోందో చూస్తోంది సుగుణ.

వంటింట్లోకి వెళ్దామని వెనుక వరండాలోకి నడిచింది. డైనింగ్ టేబుల్ పక్కన, బిల్డింగ్ బ్లాక్స్ మధ్యలో ముడుచుకుని అఖిల్ పడుక్కున్నాడు. అమాయకంగా కనిపిస్తున్న వాడి మొహం చూస్తుంటే ముద్దొచ్చింది. వంగుని, నుదుటిమీద ముద్దు పెట్టుకోబోతుంటే 'హు..' అంటూ నీరసంగా ఇట్నించి అటు పక్కకి తిరిగాడు వాడు. అరడజను బ్లాకులు కాళ్ళకి, చేతులకి, వీపుకి గుచ్చుకున్నాయి.

"అమ్మా!" అంటూ నిద్రకళ్ళతో అరిచి మళ్ళీ పడుక్కున్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది.. పిల్లలు 'ఆకలి, ఆకలి' అని అడిగినట్లు.

రోజూ ఏదో తింటారే.. ఇవేళ ఏమయిందో!

బల్ల శుభ్రంగా ఉంది. అలివేలు అంతా శుభ్రం చేసి, బియ్యం కడిగి, కూరలు తరిగి, గిన్నెలు తోమి వెళ్లింది.

అవినాశ్ వచ్చి, సైకిల్ వరండా గ్రిల్ కి కట్టి, తాళం వేసి లోపలికి వచ్చాడు.

"అరే! ఇప్పుడు పడుక్కున్నాడా? హోమ్ వర్క్ చెయ్యాలి.." అఖిల్ ని లేపి కూర్చోపెట్టాడు.

"అన్నా! హంగ్రీ.." కళ్ళు నులుముకుంటూ అన్నాడు అఖిల్.

సుగుణలోని అమ్మ కదిలిపోయింది.

"ఉండు కన్నా! అరగంటలో అన్నం పెట్టేస్తా. అంతవరకూ పాలు తాగండి." అలివేలు తాగగా మిగిలిన పాలని కాచి గ్లాసుల్లో పోసి ఇచ్చింది. అమ్మ కేసి వింతగా చూస్తూ, పాలు తాగేసి, పుస్తకాలు ముందేసుక్కూర్చున్నారు పిల్లలు.

గోపాలాచారి సి.ఇ గారి గదిలోకి వెళ్తుండగా వచ్చారు నారాయణ, సంతోష్ లు.

"రండి.. లోపలికెళ్ళి మాట్లాడుకుందాం."

"సార్! ఇరవై మందిని పట్టుకున్నాం. అందర్నీ సెక్యూరిటీ ఛీఫ్ గారికి అప్పచెప్పాం. వాళ్ళని పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళి లాకప్ లో పెట్టి ఎంక్వయిరీ చేస్తామన్నారు." నారాయణ మాటలకి ఆశ్చర్యంగా చూశాడు గోపాలాచారి.

"కూర్చుని చెప్పండి, ఏం జరిగిందో!" శ్రీనివాస్ అభినందనగా చూస్తూ అన్నాడు.

"ఇది చాలా లాంగ్ ప్లానింగ్ సర్! చాపకింద నీరులా నెమ్మదిగా చాలా మంది చేరిపోయారు అన్ని చోట్లా." కుర్చీలో కూర్చుంటూ అన్నాడు నారాయణ.

"బొగ్గులో రాళ్ళు కలడం దగ్గర్నుంచీ మొదలయింది సార్! అసలదంతా ఆటోమాటిక్ గా జరిగిపోతుంది కదా.. ఎవరు పట్టుకుంటార్లే అనుకున్నారు. సంతోష్ పట్టుకున్నాడు. హాపర్ లోంచి వెళ్ళకుండా వేగాన్ లో మిగిలిన కోల్ తీసి నీళ్ళల్లో వేశాడు. కొంత సేపటికి నల్ల రంగు పోయి, కొన్ని తెల్లగా అయ్యాయి. అలా ఎప్పట్నుంచీ జరుగుతోందో!"

కోల్ వాగన్లు రాగానే ఒక ప్లాట్ ఫామ్ చివర ఇంజన్ వేరయిపోతుంది. ఒక్కో వేగన్, కొంచెం ఎత్తుగా ఉన్న ప్లాట్ఫామ్ మీదికి ఆటోమాటిక్ గా వెళ్ళే ఏర్పాటు ఉంటుంది. అక్కడ పైనుంచి ఒక చక్రం లాంటిది పైనుంచి వేగన్ కి బంధింపబడి దాన్ని లేపుతుంది. అప్పుడా వేగన్ పక్కకి టిల్ట్ అయి, బొగ్గుని హాపర్ లోకి వంచుతుంది.

హాపర్ అంటే పెద్ద ఫన్నెల్ వంటిది. అందులోనుంచి బొగ్గు జల్లెడలద్వారా కిందికి పడుతుంది. ఒకే సైజులో ఉన్న బొగ్గంతా వెల్ లోకి పడుతుంది. అక్కడ్నుంచి క్రషర్ లలోకి వెళ్తాయి.

క్రషర్ లు పెద్ద గుండ్రని డ్రమ్ముల్లాంటివి. అవి గుండ్రంగా తిరుగుతూ ఉంటాయి. అందులో ఇనప బాల్స్ ఉండి అవికూడా

తిరుగుతూ బొగ్గుని చిన్న చిన్న ముక్కలుగా చేస్తాయి. అక్కడ్నుంచి మిల్స్ కి వెళ్తుంది. మిల్స్ లో బొగ్గంతా కాటుక లాగ అయిపోతుంది. ఆ తరువాత హై ప్రెజర్ తో ఫర్నేస్ లోకి వెళ్లి ఇంధనంగా మండుతుంది.

ఈ విధంగా చెయ్యడం వల్ల వేడి యూనిఫామ్ గా ఉండి ఎఫిషియన్సీ బాగా పెరుగుతుంది.

"అయ్యో! రాళ్ళు కలుస్తే ఎంత ప్రమాదం? ఆ పొడి బొగ్గుపొడిని కిందికి లాగేస్తుంది కదా మండకపోవడం అటుంచి.." గోపాలాచారి విచారంగా అన్నాడు.

"వీర్రాజు యాక్సిడెంట్ కి అది కూడా ఒక కారణం కావచ్చు సార్!"

నిజమే అన్నట్లు చూశారు సి.ఇ గారు.

"పాసిబుల్. అన్ని పారా మీటర్లతో మన వాళ్ళని కూడా రిపోర్ట్ ఇమ్మందాం."

"ఇంతకీ ఈ రాళ్ళు కలిపింది ఒక కాంట్రాక్ట్ లేబర్ సార్. వాగన్ల దగ్గర ఏదో పనున్నట్లు తచ్చాడుతుంటే మన వాళ్ళు పట్టుకున్నారు. నాలుగు తగిలిస్తే ఒప్పుకున్నాడు."

"నిరుటేడు నుంచీ వీళ్ళందరూ దూరారు సర్. అందరూ చుట్టు ప్రక్కల పల్లెల నుంచి వచ్చామని చెప్తున్నారు. కానీ ఎంత వరకూ నిజమో.. అసలు అంతా ఎవరి ద్వారావచ్చారో కనుక్కోవాలి." నారాయణ, సంతోష్ ఇంకా వివరిస్తుంటే ఆశ్చర్యంగా విన్నారు సి.ఇ గారు, యస్పీ గారు.

వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లో జరిగే అవకతవకలు..

నీటిని శుద్ధి చేసి కానీ బాయిలర్ దగ్గరికి పంపరు. పంపే ముందు ఎంత మలిన మున్నదీ.. గంట గంటకీ చూడాలి. కొంత పి.పి.యమ్ (పార్ ట్స్ పర్ మిలియన్) వరకే మలినాలు ఉండవచ్చు. నీళ్ల టాంకుల్లో ఆలం వేసి సుద్ధి చేశాక, కార్బొనేట్ ట్రీట్ మెంట్ ఇచ్చి ఆమ్ల, క్షారనిష్పత్తి చూడాలి. ఇవన్నీ కూడ అత్యంత ఆధునిక పరికరాలతో చేస్తారు. ఆ రీడింగ్స్ చూపే పరికరాలని, రసాయనాలనీ ఇద్దరు కుర్రాళ్ళు, పాతికేళ్ళ లోపు వాళ్ళు టాంపర్ చేస్తున్నట్లు అనుమానం వచ్చింది. వాళ్ళు కూడా కాంట్రాక్ట్ లేబరే. ఇద్దర్నీ పట్టుకున్నారు. తర్బైన్స్ దగ్గర, ట్ రాన్స్ ఫార్మర్ల దగ్గర.. ఒకటేమిటి.. అన్ని చోట్లా వైరస్ లా పాకిపోయారు.

నెమ్మదిగా కాలనీలో ఎవరింటికో బంధువుల్లాగా రావడం.. వచ్చిన వాళ్ళు గుత్తేదార్లని పట్టుకుని ఎందులోనో దూరడం.. ఇంచుమించు ఏడాదిగా సాగుతోంది వ్యవహారం.

చుట్టు పక్కల పల్లెల్లో అప్పటికే అప్రమత్తత వచ్చేసింది. ఎవరినా కొత్త వాళ్ళు కనిపిస్తే పోలీసులకి అప్ప చెప్తున్నారు.

"మేము వంతులు వేసుకుని, పోలీసులకి సహాయంగా కాపలా కష్టం సార్. ఈగ కూడా ఇక్కడ దూరలేదు. మీరు ఇంటికి వెళ్ళమంటే ఇలా వెళ్లి అలా వచ్చేస్తాం."

సి.ఇ గారి అనుమతి తీసుకుని వెళ్ళిపోయారు నారాయణ, సంతోష్.

"సార్! ఇంకొక అరగంటలో పల్లేరు చేరుతున్నాం." రవి ఫోన్ చేశాడు.

"ఇక్కడ చాలా విశేషాలున్నాయి.." అంటూ నారాయణ వాళ్ళు చెప్పిందంతా చెప్పారు గోపాలాచారి.

"మనం ఎలాగైనా వాళ్ళ ప్లాన్ సాగనియ్యకూడదు. ఇంకెక్కడెక్కడ ఏం చెయ్యబోతున్నారో తెలుసుకోవాలి."

"అలాగే సర్! ప్రతీ అరగంటకీ మీకు ఫోన్ చేస్తుంటాను." రవి ఫోన్ పెట్టెయ్యగానే సి.ఇ గారి కేసి తిరిగాడు గోపాలాచారి.

"ఈ రాత్రంతా టెన్షనే మనకి."

“అవును. ఎట్లాగూ సెల్ ఉంది కదా! మనం కూడా ఇంటికెళ్దాం.” శ్రీనివాస్ అలసటగా అన్నాడు. అతను మధ్యాన్నం లంచ్ కూడా తినలేదు.

“యస్. మనం ఇక్కడ చెయ్యగలిగింది కూడా ఏమీ లేదు. రేప్పొద్దున్నే నాకు గెస్ట్ లు వస్తున్నారు. పాతికేళ్ళ తరువాత స్నేహితుడిని కలవబోతున్నాను. వస్తే అన్నీ ఒక్కసారే వస్తాయి చూడండి. ఇంత కాలానికి ఇప్పుడే దొరికిందా మా వాడికి..” ఇద్దరూ బయటికి వచ్చి తమ ఇళ్ళ కేసి నడవ సాగారు. సాయంత్రం చల్లగాలి వేస్తుంటే కాలనీలో నడక చాలా బాగుంటుంది.

“మమ్మీ! మా మిస్ నాకు గుడ్ ఇచ్చింది. మోనికా నా జుట్టు పీకింది..” ఆపకుండా కబుర్లు చెప్తున్న అఖిల్ హోం వర్క్ చూస్తోంది సుగుణ. బల్ల దగ్గర కూర్చుని, తమకి కావలసినవి అమరుస్తున్న అమ్మని అపురూపంగా చూస్తున్నాడు అవినాశ్.

“మమ్మీ ఆల్ ఫ్రై చేయవా?” అలివేలు తరిగి పెట్టిన కూరలు తీద్దామని ఫ్రిజ్ తీసిన సుగుణ ఆగిపోయింది.

అవినాశ్ సంకోచంగా చూశాడు.

“నేను హెల్ప్ చేస్తా మమ్మీ!”

సుగుణకి నవ్వొచ్చింది. అమ్మ నవ్వు మొహం చూసి అవినాశ్ కి ఉత్సాహం ఉబికి వచ్చింది.

కూరల బుట్టలోంచి ఆలు గడ్డలు తీసి తొక్కు తీశాడు. సుగుణ పప్పు, అన్నం కుక్కర్ లో పెట్టి వెల్లుల్లి పాయలు ఒలిచింది. అఖిల్ అమ్మ కొంగు పట్టుకుని తిరుగుతుంటే ఎత్తుకుని గట్టు మీద కూర్చోపెట్టింది. వాడు కేరట్ నములుతూ అమ్మ మొహం లోకి చూస్తూ కూర్చున్నాడు.

“మమ్మీ! మనం రోజూ ఇలా చేసుకుందామా?”

“మరి హోం వర్క్ ఎవరు చేస్తారు పండూ?”

“నేను తొందరగా ఆటల్నుంచి వచ్చేసి చేసేస్తా. తరువాత మనం కుక్ చేద్దాం. మమ్మీ! రేపు బెండకాయ చెయ్యవా?”

“నేను కూడా చేస్తా..” అఖిల్ అందుకున్నాడు.

సుగుణకి వింతగా కొత్తగా ఉంది. రోజూ పిల్లలు దగ్గరకే రారే! అవును.. వచ్చినప్పుడు తను పట్టించుకుంటే కదా!

రోజూ మొక్కుబడిగా వండే సుగుణ ఇప్పుడు శ్రద్ధగా వండింది. ఆలు ముక్కలు మాడకుండా కలుపుతూ.. పప్పు మెత్తగా ఉడికించి, వెల్లుల్లి పాయలు దోరగా వేయించి.. చింతపండు సమపాళంలొ తుక్కులు రాకుండా వేసీ.. పులుసు పోపు నేతిలో వేయించీ.. తలుచుకోవాలే కానీ ‘రుచి’ వెయ్యడం ఎంత పని?

అమ్మ వంట చేస్తున్నంత సేపూ ఏదో అద్భుతం చూస్తున్నట్లు చూశారు పిల్లలు.

ఆ రోజు కళ్ళకి కప్పిన టి.వి పొర తొలగించి తిరిగింది ఇంట్లో. సుగుణ ఆ ఇంటికొచ్చినప్పట్నుంచీ రవి లేకుండా ఒక్క రోజు కూడా గడపలేదు. అంతా అతనే చూసుకుంటాడులే అని పట్టించుకోకుండా గడిపింది. ఇవేళ.. అతను రాడు అనుకుంటే తను ఏదో చెయ్యాలి అనేది మనసుకి పట్టింది.

అనుకోవాలే కానీ అంతా సహజంగా జరిగిపోతుంది. పిల్లలకి ఎలా ఉంటే అలా సర్దుకుపోయే మనస్తత్వం ఉంటుంది. ఎటో చూస్తూ ఏదో లోకంలో ఉండే అమ్మకి దూరంగా తిరిగారు ఇన్నాళ్ళూ. ఇప్పుడు తమ దగ్గరగా వచ్చిన అమ్మని కూడా అలాగే చూస్తున్నారు. ఎంత ఇస్తే అంతే వస్తుంది. అదే జీవిత సత్యం.

దగ్గరుండి పిల్లలకి అన్నాలు కలిపి పెట్టిన సుగుణ చూసుకోలేదు.. కూర ఖాళీ. అన్నం కూడా కొంచెమే మిగిలింది.

అవినాశ్ చేతులు కడుక్కునొచ్చి చూశాడు.

“అయ్యో! మమ్మీ.. ఏం తింటారు? మీకు ఉంచుకుని మాకు వెయ్యద్దా?”

వయసుకి మించిన మాటలు మాట్లాడుతున్న కొడుకుని చూసి తను కోల్పోయిందేమిటో తెలిసింది సుగుణకి.

అవినాశ్ నిముషంలో రెండు ఆలుగడ్డలు తొక్క తీసేశాడు. తరగ బోతుంటే ఆపింది సుగుణ, “చెయ్యి కోసుకుంటావు.” అంటూ.

ఒక గ్లాసు బియ్యం కొలిచి పెట్టాడు.

“ఇవన్నీ ఎలా తెలుసు నాన్నా?”

“సండేస్ డాడీ నేర్పించారు మమ్మీ!”

తను దీక్షగా భాగవతం, ఆ పైన పాడాలని ఉంది చూస్తుంటే తండ్రీ కొడుకులు చేసే పని ఇదా? పావు గంటలో మళ్ళీ వంట చేసేసింది. సుగుణ తింటున్నంత సేపూ పక్కన కూర్చుని కబుర్లు చెప్పారు పిల్లలు. సాయంత్రం చాలా సేపు నిద్ర పోయాడేమో.. కళ్ళు పెద్దవి చేసి వింతలన్నీ చెప్పాడు అఖిల్.

భోజనం అయాక దగ్గరుండి పిల్లల చేత హోమ్ వర్క్ చేయించింది.

నాలుగో క్లాసు పుస్తకాలు చూస్తుంటే కళ్ళు తిరిగాయి సుగుణకి. ఇంతింత సిలబస్ లా? అవినాశ్ చురుకుగానే ఉన్నాడు. హోం వర్క్ ఎప్పుడు చేస్తాడో కానీ అప్ టు డేట్ గానే ఉంది.

“డాడీ రాగానే పడుక్కుంటాం కాదు మమ్మీ! పొద్దున్నే సిక్స్ కల్లా లేచేస్తాం. అప్పుడే నేను హోం వర్క్ చేస్తా. తమ్ముడి చేత సాయంత్రం నేను చేయిస్తాను.” అమ్మ మనసులో మాట గ్రహించినట్లు అవినాశ్ ఆరిందాలా అన్నాడు.

అవినాశ్ మాటలు సుగుణని బాగా కదిలించాయి. ఇన్నాళ్ళూ తను చేసిన పనేమిటి?

ఒక్క రోజులోనే మనిషిలో మార్పు వస్తుందా? ఎందుకు రాదు? కటిక బోయ ఒక్క సంఘటనతో మారిపోలేదా! మహా రాజ భోగా లనుభవిస్తున్న రాజు ఒక బిచ్చగాడిని చూసి సన్యసించలేదా?

అఖిల్ అక్షరాలు ముత్యాల్లా ఉన్నాయి. డ్రాయింగ్ బాగా వేస్తాడు వాడు. ప్రతీ నోట్ బుక్ లోనూ వాడి కళ కనిపిస్తోంది.

“రేపు నీకు డ్రాయింగ్ బుక్ కొనిస్తాను. అందులో వెయ్యి. ఇలా అన్ని పుస్తకాల్లోనూ వెయ్యకూడదు.”

“క్రేయాన్స్ కూడా అయిపోయాయి మమ్మీ!” అలాగే అని బుర్ర ఊపుతూ అన్నాడు అఖిల్.

ప్రక్కన పడుక్కుని కథలు చెప్పింది. తనకే ఆశ్చర్యమేసింది.. ఇంత బాగా ఎలా చెప్పగలిగానా అని. అన్నేళ్ళనుంచీ చూసిన టి.వీ సీరియల్స్ ఫలితం. ఆ కథలనే చిన్న పిల్లలకి అన్వయించి, మనుషుల స్థానాల్లో జంతువులని ఊహించి.. అలా ప్రవాహంలా వచ్చింది. తన క్రియేటివిటీకి తనే నవ్వుకుంది.

కడుపు నిండా తిన్నారేమో, కథ వింటూనే నిద్రపోయారు పిల్లలు. కల్మషంలేని పిల్లల మొహాలు చూస్తుంటే, ఇన్ని రోజులు తానేమి కోల్పోయిందో అర్ధమయింది.

అఖిల్ చొక్కా గుండీలు సరి చేసింది. తిరగేసి వేసుకున్న లాగు చూసి నవ్వుకుంది.

ఆ రాత్రి.. కుట్ర మీద కుట్రలు పన్నుతున్న కార్పొరేట్ ఆడవాళ్ళు కలల్లోకి రాలేదు. పొట్టి లాగులు, బ్రా లాంటి బ్లవుజులు వేసుకున్న హీరోయిన్లు, ఫుల్ సూట్ వేసుకున్న హీరో.. వెనుక వెలిసిపోయిన బట్టలేసుకున్న గుంపులు చేస్తున్న డాన్సులు, కళ్ళ ముంది కనిపించ లేదు. హాయిగా నిద్ర పోయింది.

ఎప్పట్నుంచీ మోగుతోందో ఫోను..

ఉలిక్కి అడి లేచింది సుగుణ. టైమ్ చూసింది. అర్ధ రాత్రి రెండు దాటింది.

"హలో!" కళ్ళు నులుముకుంటూ ఫోన్ తీసింది.

"సుగుణ గారూ! రవి గారికి దెబ్బలు తగిలాయి. సి.ఇ గారు, యస్పీ ఏడి.యమ్ గారు మీ ఇంటికి వస్తున్నారు. నేను డి.ఇ వంశీకృష్ణని."

పోలీస్ ఇనస్పెక్టర్ని చూసిన కుంభా నిర్వికారంగా ముందుకి తిరిగాడు. మనసులో ఆందోళనగానే ఉంది. కుంభా, అతని అనుచరుడు మౌనంగా పుస్తకాలు చదువుకుంటూ కూర్చున్నారు.

బస్ లో సెల్ ఫోన్ మోగుతే ఎలా? కుంభాకి సందేహం... చుట్టూ చూశాడు. లోలోపల నవ్వుకుంటూ తలెగరేశాడు. సగం మంది పైగా సెల్ ఫోన్లలో మాట్లాడుకుంటూనే ఉన్నారు. మునుపటి రోజుల్లో పక్కవాళ్లతో మాట్లాడితేనే బస్సంతా గోలగా ఉండేది. ఇప్పుడు.. గట్టిగా ప్రపంచ రాజకీయాల దగ్గర్నుంచి పెళ్లి సంబంధాల వరకూ, అందరూ ఫోన్లలో అరుస్తుంటే.. ఎవరి మాటా ఎవరికీ అర్థం కాకుండా.. అంతా గందరగోళం.

అంతలో కుంభా భయపడినట్లుగానే అతని సెల్ అదిరింది. అరచేతిలో పట్టే సెల్, ఎవరికీ కనిపించకుండా చెవి దగ్గర పెట్టుకున్నాడు, గట్టిగా ఊపిరి పీల్చి వదులుతూ.. అదే సంకేతం.

"హైద్రాబాద్, లోవర్ టాంక్ బండ్ రోడ్ లో ఒక ఫంక్షన్ హాల్ ఉంది.." హాలు పేరు రాసుకున్నాడు, మనో ఫలకం మీద.

"అక్కడ పెళ్లి ఎంగేజ్ మెంట్ జరుగుతుంది రేపు. పొద్దుటినుంచీ సాయంత్రం వరకూ గానా బజానా, ఖానా.. అన్నీ ఉంటాయి. అక్కడే మొత్తం ప్లానంతా పకడ్బందీగా సాగుతుంది. రాత్రి డిన్నర్ అయ్యాక మనం అనుకున్నది చేసేస్తాం." కుంభా మాట్లాడకుండా ఫోన్ ఆపేసి, జేబులో పెట్టుకున్నాడు.

మధ్యలో భోజనానికి ఒక చోట ఆపారు. ఇద్దరూ వెళ్లి భోజనం చేసొచ్చి బస్సెక్కారు. చాలా రోజుల తర్వాత.. చికెన్ బిరియానీ. అనుచరుడి ఆనందానికి అంతు లేదు. బాత్రూంకి వెళ్ళొస్తానని లేచాడు కుంభా. అక్కడి పాన్ షాపు పక్కనున్న పబ్లిక్ బూత్ లోంచి ఎవరికో ఫోన్ చేశాడు. తిరిగొచ్చి, తమ్ముడు ఖుషీగా ఉండడం చూసి నవ్వుతూ భుజం తట్టాడు. కిటికీ లోంచి చల్లని గాలి వేస్తోంది. బస్ కదిలింది. సీటు సర్ది వెనక్కి వేసుకుని, తల వాల్చి కళ్లు మూసుకున్నాడు.

ఇరవై సంవత్సరాల తరువాత ఆ నంబరుకి ఫోన్ చేశాడు కుంభా. తనకి కావలసిన, సరయిన మనిషే ఎత్తి ఉంటాడని అనుకున్నాడు. ఎవరు ఎత్తారో.. తను మాట్లాడింది అర్థం చేసుకున్నారో లేదో! తనకి ఇచ్చిన సూచనల ప్రకారమే చేశాడు. అవతల్నుంచి ఫోన్ ఎత్తగానే చెప్పదల్చుకున్నది చెప్పేసి పెట్టెయ్యాలని నిర్దేశించారు.. అలా చెప్పిన వారున్నారో లేదో! తను చెయ్యగలిగింది చేశాడు.. ఇస్ కా ఊపర్.. అల్లా దయ.

ఎన్ని మార్పులైనా జరిగుండచ్చు. ఇరవై ఏళ్లంటే తక్కువ కాలం కాదు కదా!

ఫోన్ లో మాట్లాడి వచ్చినప్పట్నుంచీ, ఇన్ని సంవత్సరాల తన జీవితం తలుచుకుంటే తన మీద తనకే అసహ్యం వేస్తోంది. పైకి మాత్రం, నవ్వుతూ చేరబోయే కాలేజ్ లో ఎలా నడుచుకోవాలో తమ్ముడికి చెప్పాడు.. పక్కవాళ్లకి వినిపించేట్లు. వాడు సగం బోర్ చూపులతో,

సగం ఉత్సాహంతో విన్నాడు.. అచ్చు కాలేజ్ స్టూడెంట్ లాగే.

కుంభా, పైకి నవ్వుతూ నటించాడే కానీ.. లోపల తన జీవితాన్ని నిర్దేశించిన సంఘటనల గురించే ఆలోచిస్తూ ఉన్నాడు. ఎలా ఉండవలసిన జీవితం? ఎలా అయిపోయింది.. "బాబా! ఎక్కడున్నావు? నాకు నువ్వు నేర్పించిన సిద్ధాంతాలనే తూచా తప్పకుండా పాటిస్తున్నా! చూస్తున్నావా? ఇటువంటి జీవనం నీకు ఇష్టం ఉండదని తెలుసు నాకు. కానీ.. అందరం విధి చేతులో ఆడే బొమ్మలమే కదా!" కనుకొలకుల్లో నిండిన నీటిని పక్కనున్నవాడు చూడకుండా, కర్చీఫ్ తో అద్దుకుని, గతం.. ఎన్నో సారో లెక్కలేదు, నెమరు వేయసాగాడు.

కల్నల్ ప్రభాకర్ అంటే రకరకాల అభిప్రాయాలున్నాయి పరిచయస్థులకి. కొందరికి కష్ట సుఖాలు పంచుకునే స్నేహితుడు. కొంతమంది, ఎక్కడ ఎదురుపడ్తాడో అని భయంతో తప్పించుకుని తిరుగుతారు. కొందరు దేముడిలా కొలుస్తారు.

పదేళ్ల భాస్కర్ కి మాత్రం తండ్రే సర్వస్వం. ఆరాధ్య దైవం. భాస్కర్ కి మూడేళ్లు పెద్దదయిన అక్క ఉంది. పిల్లలిద్దరికీ తండ్రి దగ్గర బాగా చేరిక. పొద్దున్న వెళ్లే జాగింగ్ మొదలు, రాత్రి చదివి వినిపించే కథల వరకూ ప్రభాకర్ కొడుకుని తన వెంటే ఉంచుకుంటాడు. తప్పని సరై.. తన ఆఫీస్ కి కొడుకు లేకుండా వెళ్తాడు.

తెలంగాణాలో ఒక చిన్న పల్లె నుంచి, స్వశక్తితో పైకొచ్చి, డిగ్రీ చదివి.. సైన్యంలో చేరి, అంచెలంచలుగా ఎదిగాడు ప్రభాకర్. దేశంలో పలు ప్రాంతాల్లో పని చెయ్యడం వల్ల పిల్లలకి అరడజను దాకా భాషలు సునాయాసంగా వచ్చేశాయి. పైగా వాళ్లు, ఏ రాష్ట్రంలో ఉన్నా అక్కడి పిల్లలతో వారి భాషలోనే మాట్లాడుతుండడంతో.. అన్ని భాషలు వారి మాతృ భాషే అన్నట్లు క్షుణ్ణంగా, స్పష్టంగా మాట్లాడ్డం వచ్చింది.

అవి ప్రభాకర్ కాశ్మీర్ లో పని చేసే రోజులు. తాత్కాలిక గృహాలయినా సదుపాయంగా ఉంటాయి.. వారు ఉండే చోట ఒక సరస్సు కూడా ఉంది. ఆఫీసర్ల అందరి క్వార్టర్లూ కొంచెం దూరం దూరంగా ఉండేవి. చక్కని ప్రశాంత వాతావరణం.. కానీ అనుక్షణం యుద్ధ భయమే. సాధారణంగా కుటుంబాలని అటువంటి చోట ఉండ నియ్యరు. ఆ సమయంలో.. ఒక సంవత్సరం నుంచీ శాంతియుతంగానే ఉందని.. పిల్లలకి సెలవలిచ్చినప్పుడు కుటుంబాలని తెచ్చుకోవచ్చని పర్మిషన్ ఇచ్చారు.

రెండు రోజులు సరస్సులో ఈత కొడుతూ, బాట్మింటన్, చదరంగం ఆడుతూ గడిపారు.

ఆ రోజు.. రాత్రి అంత్యాక్షరీ ఆడుకుని, భోజనాలయ్యాక, ప్రభాకర్ గుండమ్మ కథ సినిమా కథంతా చెప్పి అందర్నీ నవ్వించాడు. కుటుంబం అంతా ఆనందంగా పడుక్కున్నారు. మధ్యరాత్రి, భాస్కర్ బాత్రూం కని లేచి వెళ్ళాడు.

తలుపు తీసుకుని రాబోతుండగా వినిపించాయి తుపాకీ శబ్దాలు. భయంతో వణికిపోతూ, తలుపు సందులోంచి చూసిన భాస్కర్ కి తన వాళ్లంతా రక్తపు మడుగులో కనిపించారు. ఇంకా ఎవరైనా ఉన్నారేమోనని వెతుకుతున్నారు, ముగ్గురు వ్యక్తులు, తుపాకీలు పట్టుకుని.

బాత్రూంకి వెనుక పక్కనున్న తలుపు తీసుకుని బయటికి పరుగెత్తాడు భాస్కర్. వెదురు బొంగులతో చేసిన ఆ ఇంటిని అంటించి, ముగ్గురూ మోటారు సైకిళ్ల మీద పారిపోయారు. భాస్కర్ స్పృహ తప్పి పడిపోయాడు.

తెలివి వచ్చేసరికి కొత్త పరిసరాల్లో ఉన్నాడు. అటూ ఇటూ చూస్తుండగా ఒక ఆఫీసర్ లోపలికి వచ్చాడు.

"హౌ ఆర్ యు భాస్కర్?"

"అంకుల్.. అమ్మ, నాన్న, అక్క.." భోరుమన్నాడు వెక్కుతూ.

"ఐ నో.. నువ్వు వాళ్లని చూశావా?"

"చూశాను ఇస్మాయిల్ అంకుల్. అందరూ ఉర్దూలో మాట్లాడుతున్నారు."

ఇస్మాయిల్ లెఫ్ట్ నెంట్. ప్రభాకర్ దగ్గర పని చేస్తాడు. పాతికేళ్ళుంటాయి. ప్రభాకర్ వాళ్ళూరు నుంచే వచ్చాడు. తెలుగు స్పష్టంగా మాట్లాడుతాడు.

"అంకుల్! వాళ్లందర్నీ చంపెయ్యాలి.. పదండి." భాస్కర్ మళ్లీ గట్టిగా ఏడ్చాడు.

ప్రభాకర్ ని గురువుగా భావించే ఇస్మాయిల్, భాస్కర్ ని పొదివి పట్టుకుని ఓదార్చాడు. "నువ్వు కూడా ఆ ఇంట్లో ఉన్నావనుకుంటున్నారు అందరూ. మంటల్ని ఆర్పేలోగా అందరూ కాలి బూడిదైపోయారు. నేను పక్క కాటేజ్ లోనే ఉన్నాను. అందుకని మంటలు చూసి పరుగెత్తుకుని వచ్చి నిన్ను తీసుకొచ్చేశాను. నువ్వు ఇక్కడే ఉండు.. ఎవరికీ తెలియకుండా.. కక్ష గట్టిన వాళ్ళు ఏమైనా చెయ్యచ్చు."

"అమ్మా, నాన్న, అక్క.." భాస్కర్ బెదురుగా చూశాడు.

"నీకు తెలుసుగా! యు ఆర్ ఎ బిగ్ బాయ్. మీ నాన్నగారు రోజూ చెప్పే కథలు, పాఠాలు గుర్తు తెచ్చుకో. బాగా చదువుకుని, ఆర్మీలో చేరి నీ వాళ్లని చంపిన వాళ్లని చంపెయ్యి. ఇప్పుడు ఒక్కడివీ ఏం చెయ్యగలవు చెప్పు? అవునా.."

కళ్ళనిండా నీళ్లతో తలూపాడు భాస్కర్.

కాశ్మీర్ పండిట్ లని ఊచకోత కూసిన మిలిటెంట్లలో పదిమందిని పట్టుకున్నారు, ప్రభాకర్ బెటాలియన్. అందులో ఎనిమిది మంది కాల్పుల్లో పోగా ఇద్దరు బందీలుగా పట్టుబడ్డారు. అందుకే వాళ్లు ప్రభాకర్ ని టార్గెట్ చేసుకున్నారు.

ప్రభాకర్ కుటుంబం, కాల్పుల్లో హతమయ్యారని దేశం మొత్తం తెలిసింది. వాళ్ల ఊరినుండి తమ్ముడు, పినతండ్రి వచ్చి, చితాభస్మం తీసుకెళ్ళారు.. ఇల్లు కాలిన బూడిద లోంచి, భారమైన హృదయాలతో. వాళ్ళు వచ్చిన సంగతి భాస్కర్ కి తెలియకుండా జాగ్రత్తపడ్డాడు ఇస్మాయిల్.. మిలిటెంట్లకి తెలిస్తే అందరికీ ప్రమాదమే!

ఇస్మాయిల్ పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు. భాస్కర్ నాలుగు రోజుల్నుంచీ ఏమీ తినలేకపోతున్నాడు. కదలకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఏది తిన్నా వాంతి అయిపోతోంది. ఇంట్లోనే ఉండటం ఒక విధంగా మంచిదే కానీ.. ఇదే విధంగా కొన సాగితే మటుకు.. పిల్లవాడు ఎక్కువ రోజులు బ్రతకడు.

ఏదో చెయ్యాలి..

ఒక నిశ్చయానికి వచ్చి, భాస్కర్ దగ్గరికి వెళ్లి, నెమ్మదిగా పాలు తాగించి.. చెప్ప సాగాడు..

భాస్కర్ కళ్లు పెద్దవి చేసుకుని విన్నాడు. వయసు చిన్నదే అయినా.. అనేక ప్రదేశాలు తిరిగి, రకరకాల మనుషులతో మెదిలిన అనుభవం ఉన్నవాడు. అంకుల్ చెప్పినది అర్థం చేసుకోడానికి కొంచెం సమయం పట్టినా, ఫలితం దక్కింది.

"ఏమంటావు భాస్కర్?"

తల ఊపాడు.

"మరి ఇప్పట్నుంచీ సరిగ్గా తింటావా?"

మళ్ళీ తల ఊపాడు.

సరిహద్దుల్లో జరిగిన ఘోరం నెమ్మదిగా అందరూ మర్చిపోతున్నారు. భాస్కర్ ని కాపాడ్డం పెద్ద సవాలైపోయింది ఇస్మాయిల్ కి.

అంతులేని ఎంక్వయిరీలు.. కానీ బెటాలియన్ ని కదప లేదు. దగ్గర్లో ఉన్న ఒక ఊర్లో, బీద కుటుంబంలో ఉంచాడు భాస్కర్ ని. అతను ఇచ్చే డబ్బు కోసం ఆనందంగా ఒప్పుకున్నారు వాళ్ళు.

"అడ్జస్ట్ అవ్వాలి, కొంతకాలం ఇక్కడ. మనం తినే తిండి ఉండదు.. ఉండగలవా? మీ ఊరికి పంపెయ్యమంటావా?" యుద్ధ వాతావరణం తగ్గాక అడిగాడు.

"ఇక్కడే ఉంటానంకుల్!" మీరు చెప్పినట్లే చేస్తాను.

పెద్ద పెద్ద కళ్లతో అమాయకంగా తిరిగే భాస్కర్, ఒక సారి తాహెర్ కంట పడ్డాడు. తాహెర్ ఆ చుట్టు పక్కలున్న ఊళ్ళన్నింటికీ ఏలిక లాంటి వాడు. అక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న పట్నంలో అతని నివాసం. కొండ వాలుల మీద పంటలు పండిస్తూ, ఊర్లలో జనాలకి పని కల్పిస్తుంటాడు. సంపన్నుడు. రెండు దేశాలలోని పల్లెలకీ రేషన్ సరుకులు చేరేస్తుంటాడు. ఇరుప్రక్కల వారితో స్నేహంగా ఉంటాడు.

పదకొండేళ్లు దాటుతున్న భాస్కర్ పీలగా ఏడేళ్ల పిల్లవాడిలా ఉంటాడు. తాహెర్ దగ్గరికి పిలిచి వివరాలడిగాడు.

"పేరెంట్స్ యాక్సిడెంట్ లో మర్ గయా.. ఏక్ సాల్ అయింది. ఒక అంకుల్.. ఫామిలీ ఫ్రెండ్.. నన్ను ఇక్కడుంచారు." ఇస్మాయిల్ గురించి చెప్పి, భోరుమన్నాడు.

తాహెర్ అడిగిన ప్రశ్నలన్నింటికీ కాశ్మీరీ ఉర్దూలో తడుముకోకుండా సమాధానం చెప్పాడు భాస్కర్.

"మా దగ్గరుంటావా.. మా బేటాలా?" తాహెర్ కి పిల్లల్లేరు. అల్లానే పంపినట్లు కనిపిస్తున్నాడు ఈ బేటా.. బీబీ ఎంత ఖుష్ అవుతుందో!

తాహెర్ వెంట వెళ్లిపోయాడు భాస్కర్. పేరు అక్బర్ ఆలీ అని చెప్పాడు. ఇస్మాయిల్ వెళ్లి, భాస్కర్ ని ఉంచుకున్న దంపతులకి డబ్బులు ఇచ్చి, తాహెర్ ని కలిశాడు.

"మంచి పని చేశారు తాహెర్ సాబ్! అసలు నేనే పెంచుకునే వాడిని. నాది తిరిగే ఉద్యోగం. అదీ కాక నాకు నిఖా అయింది. నా బీబీ ఒప్పుకోలేదు.. బహుత్ శుక్రియా.." కళ్ల నీళ్ళు చిప్పిల్లుతుండగా భాస్కర్ ని తాహెర్ చేతుల్లో పెట్టాడు.

తరువాతి రెండు సంవత్సరాలు కాశ్మీర్లోనే ఉన్న ఇస్మాయిల్ భాస్కర్ ని కలుస్తూనే ఉన్నాడు. చదువులో బాగా రాణిస్తున్నాడు భాస్కర్.. కానీ ఆ రాత్రిని మర్చిపోలేదు.

"ఇంకా అదే ఆలోచిస్తునావా భాస్కర్?" ఇస్మాయిల్ వెళ్ళిపోతూ అడిగాడు.

"యస్ అంకుల్!" ధృఢంగా అన్నాడు భాస్కర్.

"అయితే.. అవకాశం వచ్చినప్పుడు, నీ ధ్యేయాన్ని పూర్తి చెయ్యడంతో పాటు దేశాన్ని కూడా కాపాడు." కొన్ని సూచనలిచ్చాడు భాస్కర్ కి. పన్నెండేళ్ల భాస్కర్ శ్రద్ధగా విన్నాడు. వినడమే కాదు.. మనసులోకి ఎక్కించేశాడు.

ప్రతీ రోజూ క్రమం తప్పకుండా మసీదుకెళ్తూ, రోజుకి ఐదు సార్లు, స్కూల్లో ఉన్నా కూడా నమాజు చేస్తూ అందరి దృష్టిలో పడ్డాడు. భాస్కర్, తాహెర్ దంపతుల కన్నబిడ్డే అనుకుంటున్నారు ఊరివాళ్ళు. వాళ్లు కూడా ఎవరికీ చెప్పలేదు.

వ్యాయామాలు చేస్తూ, మాంసాహారం తింటూ, కండలు పెంచి.. పదిహేనేళ్ళు వచ్చేసరరికి ఇరవయ్యేళ్ళ యువకుడిలా అయ్యాడు అక్బర్ గా మారిన భాస్కర్. అతను పన్నెండో తరగతిలో ఉండగా జరిగిందా సంఘటన. వెంటనే ఇస్మాయిల్ కి ఫోన్ చేసి చెప్పాడు.

స్కూల్ నుంచి ఇంటికి వస్తుంటే నలుగురు యువకులు అక్బర్ ని కలిశారు. అతని కంటే నాలుగైదేళ్ళు పెద్దయి ఉంటారు.

ఇంజనీరింగ్ చదువుతున్నాం అంటూ పరిచయం చేసుకుని, దగ్గర్లో ఉన్న హోటల్ కి తీసుకెళ్ళారు. అక్బర్ ఆశయం కూడా ఇంజనీర్ అవ్వాలనే.

శరీరం గడ్డ కట్టించే చలిలో వేడి వేడి చాయ్ తాగుతూ బోలెడు కబుర్లు చెప్పుకున్నారు. చాలా వరకూ అభిప్రాయాలు కలిశాయి.

ఆ తరువాత వారం రోజులకి పరీక్షలు మొదలయ్యాయి. సెలవుల్లో, అక్బర్ ఖురాన్ చదువుకోవడం, లైబ్రరీ, ఆటలతో కాలక్షేపం చెయ్యసాగాడు. రిజల్ట్స్ వచ్చిన రోజు అమ్మీజాన్ ఆనందానికి అవధుల్లేవు. అక్బర్ ఫ్రెండ్స్ అందరికీ పార్టీ ఇచ్చింది. కొత్తగా పరిచయం అయిన ఇంజనీరింగ్ ఫ్రెండ్స్ కూడా వచ్చారు. డ్రాయింగ్ రూంలో అక్బర్ పేరెంట్స్ తో ఉన్న ఫొటోలన్నీ చూశారు.

"నేను మరీ చిన్నగా ఉన్నప్పుడు పల్లెలో ఉండే వాళ్ళం.. అక్కడ స్టూడియోలు లేవు." డ్రాయింగ్ రూంలో ఫొటోలు చూస్తున్న ఫ్రెండ్స్ కి వివరించాడు అక్బర్. ఆ ఫొటోల్లో అక్బర్ ఏడెనిమిదేళ్ళ కుర్రాడిలా ఉన్నాడు.

"రేపు ఒక చోటికి తీసికెళ్తాం వస్తావా?" అందరిలోకి పెద్ద కుఱాడు అడిగాడు.

"సరే.. ఎక్కడికి?" కుతూహలంగా అడిగాడు అక్బర్.

"నువ్వే చూస్తావు కదా!"

"వెల్ కమ్.రండి రండి. ఒక అతిథిని తీసుకొచ్చారే!" తలుపు తీసి లోపలికి ఆహ్వానిస్తున్న వ్యక్తిని చూస్తుంటే అక్బర్ రక్తం ఉడికిపోయింది. కాటేజ్ మీదికి కిరసనాయిల్ చల్లి అగ్గిపుల్ల విసిరేసినతను. మొహంలో కుతూహలం తప్ప ఏ భావం కనిపించకుండా లోపలికి నడిచాడు అక్బర్.

సోఫాల్లో కూర్చున్న ఆరుగుర్నీ పరిచయం చేశాడు అక్బర్ దోస్త్. అందులో ముగ్గురు తన తల్లిదండ్రుల్ని, అక్కని నిర్దాక్షిణ్యంగా కాల్చేసిన వాళ్లు. ఒక సారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలి అందర్కీ సలాం చేశాడు.

ఈ రోజు కోసమే ఐదేళ్ళుగా ఎదురు చూస్తున్నాడు. ఇక నుంచీ అప్రమత్తతతో ఉండాలి.

అప్పుడు ఒక గంట సేపు అక్బర్ కి అంతా వివరించారు. చదువు మానకుండా.. తమ కలాపాల్లో పాల్గొనాలి. తన వాళ్లెవరికీ ఏం చేస్తున్నారో.. తను మిలిటెంట్ గ్రూప్ లో చేరినట్లు చెప్ప కూడదు. అక్బర్ చేత ప్రమాణం చేయించారు. మనసులో ఇస్మాయిల్ అంకుల్ కి, తల్లి దండ్రులకి, భారత దేశానికి, ఈ మిలిటెంట్ సమూహాన్ని సర్వనాశనం చేస్తానని ప్రమాణం చేస్తూ, బయటికి వాళ్ళు చెప్పినట్లు చేశాడు.

అప్పటి నుంచీ ఎన్నో సాహసాలు చేసి లీడర్ల నమ్మకాన్ని సంపాదించాడు. కొన్ని ఆపరేషన్స్ అనుమానం రాకుండా విఫలమయ్యేట్లు చేశాడు. అలా ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. తాహెర్ దంపతులు ఇద్దరూ కాలం చేశారు. ఇప్పుడు అక్బర్ సేవలు పూర్తిగా గ్రూప్ కే అంకితం. ఎవరికీ ఏ సమాధానం ఇవ్వనక్కర్లేదు. తన ధ్యేయం కోసం పెళ్ళి మానుకున్నాడు.. ఎందరో అడిగినా..

అక్బర్ గ్రూప్ లో చేరక ముందే ఇస్మాయిల్ కలిశాడు.

"ఇంక నిన్ను కలవను బేటా! మరొక్క సారి ఆలోచించుకో.. దేశం కోసం చాలా పెద్ద త్యాగం చెయ్య బోతున్నావు.." ఇంకా ఏదో చెప్పబోయిన ఇస్మాయిల్ ఆగిపోయాడు.. అక్బర్ కళ్లల్లోని ధృఢ నిశ్చయాన్ని చూసి.

"సరే.. చాలా పెద్ద ఆపరేషన్.. దేశానికి అత్యంత ప్రమాద కరమైనది జరగ బోతున్నప్పుడు కానీ.. అందరూ ఒక దగ్గర దొరుకుతారనుకున్నప్పుడు కానీ.. అప్పుడు మాత్రమే సంకేతం పంపు. అంత వరకూ నువ్వు స్లీపింగ్ మోల్" ఒక ఫోన్ నంబర్, ఒక కోడ్ నంబర్ ఇచ్చి, " ఒకే ముక్క.. ఒక ప్లేస్ అడ్రస్ మాత్రమే.. అదీ పబ్లిక్ బూత్ నుంచి చెప్పు. మళ్ళీ ఇకొక సారి ఆలోచింధు.. నీ లైఫ్ రిస్క్.. తెలుసు కదా!"

సమాధానంగా అక్బర్ ఉరఫ్ భాస్కర్ నవ్విన నవ్వు, ఇస్మాయిల్ గుండెని కదిలించింది. కళ్లల్లో చిప్పిల్లిన నీటిపొరలోంచి మసకగా

కనిపిస్తున్న భాస్కర్ కేసి చెయ్యూపి వెళ్ళి పోయాడు ఇస్మాయిల్.

మళ్ళీ ఇద్దరూ కలుస్తారో లేదో.. కాలమే చెప్పాలి.

అక్బర్, కుంభా గా రూపాంతరం చెందింది, తను పెద్ద పెద్ద ఆపరేషన్లు తను స్వయంగా నడుపుతున్నప్పట్నుంచీ. అతని అసలు పేరు అక్బర్ అని ఎవరికీ తెలియదు.. లీడర్లకి తప్ప.

మర్నాడు హైద్రాబాద్ లో జరగబోతున్న ఫంక్షన్ లో పెద్ద పథకాలే వేస్తున్నారు. అందులో కుంభాదే ప్రధాన పాత్ర. ముఖ్య నాయకులు, ఈ దేశంలో ఉండే సైనికులు.. అందరూ కలుస్తారు. ఇంతకంటే మంచి అవకాశం ఏముంటుంది? అందుకే ఇస్మాయిల్ ఇచ్చిన నంబర్ కి ఫోన్ చేశాడు భాస్కర్ అలియాస్ కుంభా!

జరిగిన విషయాలన్నీ మననం చేసుకుంటుంటే మూసుకున్న కుంభా కన్నులలోంచి ధారగా కన్నీరు.. పక్కనున్న తమ్ముడికి కనిపించకుండా, మొహం మీద తువ్వాలు కప్పుకుని పడుక్కున్నాడు..

ఆర్మీలో ఉన్న ఒక ప్రత్యేక విభాగంలో గంట గణగణా మోగింది. అది సంవత్సరాలు సంవత్సరాలలో అరుదుగా మోగుతుంది.. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ వింగ్ లో.

గంట మోగగానే సంబంధిత అధికారులందరికీసంకేతాలందిపోతాయి.. వాళ్ల సెల్ ఫోన్ల ద్వారా.

కల్నల్ ఇస్మాయిల్ వెంటనే ఎలర్ట్ అయిపోయాడు. అది యస్.ఓ.యస్ సిగ్నల్. దేశ రక్షణకి సంబంధించినది. అధికారులంతా అరగంటలోగా కాన్ఫరెన్స్ హాల్ లోకి చేరారు.

ఏజంట జీరో పంపిన సిగ్నల్ మీద ఏ విధమైన చర్య తీసుకోవాలో అందరూ కలిసి చర్చించారు. కల్నల్ ఇస్మాయిల్ ని ఇన్ చార్జ్ చేశారు. అతను ప్రత్యేక విమానంలో హైద్రాబాద్ వెళ్ళి స్వయంగా యాక్షన్ లో పాల్గొనాలి. అతనికి అక్కడి అర్మీ సహాయం అందిస్తుంది.

వెంటనే హైద్రాబాద్ కి డైరెక్ట్ లైన్లో మాట్లాడాడు ఇస్మాయిల్.

“పోలీస్ ఫోర్స్ సహాయం తీసుకుని మిలిటెంట్లకి కొంచెం కూడా అనుమానం రాకుండా అంతా నడిపించాలి. రెండు గంటల్లో అక్కడుంటాను. ఎమెర్జెన్సీ మీటింగ్ పెట్టండి. డిజిపిని కూడా పిలవండి. మన స్పెషల్ ఫోర్స్ ని, ఇంకా అత్యవసర సర్వీసులని.. ఎంత మంది దొరుకుతే అంతమందిని తీసుకురండి” . అప్పుడు రాత్రి పదకొండు.

**అడవిలో గాలివాన వెలిసిన** తరువాత వచ్చే ప్రశాంతత వచ్చింది. పుందూరు నుంచి అంబులెన్స్ తెప్పించి ప్రాణాలు కోల్పోయిన వారి బాడీలని మార్చురీకి పంపించారు.

ఆర్మీ వాన్ లో రవిని హాస్పిటల్ కి తీసుకెళ్ళార్. ఆంజనేయులు టీమ్ కి చార్జ్ తీసుకున్నాడు.అందరూ హాస్పిటల్ కి చేస్రుకున్నారు. వెళ్ళే ముందు కోల్ మైన్స్ వర్కర్లని, వీలైనంత త్వరగా వేగన్లని ప్లాంట్ కి చేర్చమని ఆదేశించారు. అవి వెళ్తే గానీ మూసేసిన యూనిట్లు పని చెయ్యవు. కోల్ ప్లాంట్ లో బొగ్గు లెక్కలూ అవీ చూసేది ఆంజనేయులే.

అశోక్ రెడ్డి మిలిటెంట్ల సంగతి చూసుకున్నాడు. పోలీసుల్ని పల్లేరులో ఆగమని, రెండు జీపుల్లో ఉగ్రవాదుల్ని వేసుకుని హైద్రాబాద్ బయలుదేరాడు.. తరువాతి చర్య కోసం.

బొగ్గు బళ్ళ డ్రైవర్లు, వారి అసిస్టెంట్లు తమతమ ఇంజన్లలో కూర్చుని, వేగన్లని పరుగెత్తించారు. అర చేతుల్లో ప్రాణాలు మళ్ళీ శరీరంలోకి వెళ్ళినట్లనిపించింది అందరికీ. మూడు రోజులు కానీ, మూడు గంటలు కానీ, తుపాకీ గురిని చూస్తూ జీవించడం సామాన్యమైన విషయం కాదు.

రవిని లేడీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళినప్పుడు, చిన్నయ్య, బాల గడగడ వణుకుతూ నిలుచున్నారు.

"ఇంక మీకేం భయం లేదు. మీ ఇంటికెళ్ళిపోండి." ఆంజనేయులు వాళ్ళని పంపేశాడు. బతుకు జీవుడా అనుకుని జారుకున్నారు.

పుందూరులో ఒక గవర్నమెంట్, రెండు ప్రయివేట్ హాస్పిటల్స్ ఉన్నాయి. పల్లేరులో డాక్టర్ సూచించిన జనప్రియ నర్సింగ్ హోమ్ కి తీసుకెళ్ళారు రవిని. అక్కడ డ్యూటీ డాక్టర్ వెంటనే పెద్ద డాక్టర్లని పిలిచాడు.

క్షణాలమీద చేసేశారు ఏర్పాట్లు. వచ్చిన పేషెంట్ ఆర్మీ రక్షణలో మిలిటరీ వాన్ లో వచ్చాడు కూడా. ఎమెర్జెన్సీకి ఉంటుందని గోపాలాచారి పదివేలు ఇప్పించాడు అకౌంట్స్ వాళ్ళకి చెప్పి. అదే ఉపయోగపడిందిప్పుడు. రక్తం అవసరమయింది.. ఆంజనేయులు, రహీమ్ ఇచ్చారు.

వరండాలో కునికి పాట్లు పడుతున సింగ్, చైతన్య డాక్టర్ పిలిచినట్లయి లేచారు.

"ఆపరేషన్ అయింది. మిస్టర్ రవి కులాసా. లోపల చాలా కుట్లు వెయ్యవలసి వచ్చింది. పైగా బ్లడ్ లాస్. పేషంట్ చాలా స్ట్రాంగ్. అందుకే తట్టుకోగలిగారు. తెలివి వచ్చింది. మీరు వచ్చి పలకరిస్తే, మేం మళ్ళీ మత్తిచ్చి పడుక్కో బెడతాం." డాక్టర్ ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్ళారు.

"డి.ఇ గారూ ఎలా ఉన్నారూ? వినిపిస్తోందా?" చైతన్య పిలిచాడు. కళ్ళు తెరిచాడు రవి.

"బావున్నా.. అం..ద..రూ.. ఎలా ఉన్నారు?"

"మేమంతా ఓ.కే. ఎవరికీ ఏం గాలేదు." సింగ్ మాటలకి నీరసంగా నవ్వి అటూ ఇటూ చూశాడు రవి.

"ఆంజనేయులు, రహీం పడుక్కున్నారు సర్. మీరు రెస్ట్ తీసుకోండి. రేపు మాట్లాడుదాం."

డాక్టర్ ఇంజక్షన్ ఇస్తుండగానే కళ్ళు మూసి, నిద్రలోకి నెమ్మదిగా వెళ్ళిపోయాడు రవి.

"మీ కొలీగ్స్ పక్క గదిలోనే ఉన్నారు. బ్లడ్ తీస్తుండగానే నిద్రపోయారు. మీరు కూడా పడుక్కోవచ్చు. ఒక ఖాళీ గది ఇస్తాను." డాక్టర్ మాటలకి కృతజ్ఞతగా చూశారి సింగు, చైతన్య.

సుగుణ ఫోన్ పెట్టేసి గోడకానుకుని నిలబడిపోయింది. తను ఏం వింటోందో .. కలో నిజమో ఏమీ అర్ధం కాలేదు. రవి ఏంటి. దెబ్బలేంటి.. నా పక్కన లేరా? మంచం మీద చూసింది. రవి లేడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది.. రవి కాంప్ కి వెళ్ళారు కదూ! పిల్లల గదిలోకెళ్ళి చూసింది. ఇద్దరూ హాయిగా నిద్రపోతున్నారు.. ప్రశాంతంగా, చిరునవ్వుతో పెదవులు కొద్దిగా విచ్చుకుని.

ఎంత సీరియస్ దెబ్బలో.. సి.ఇ గారు స్వయంగా ఈ సమయంలో వస్తున్నారంటే.. ఎలా ఉందో! ఏం చెయ్యాలి? రవి లేకపోతే.. ఊహించుకోడానికి కూడా భయం వేసింది. ఇన్నాళ్ళూ, నిర్లక్ష్యంగా రవి మీదికి తోసేసింది అంతా. ఫోన్ కాల్ సారాంశం బుర్రలోకి ఎక్కేసరికి కాళ్ళూ చేతులూ వణక సాగాయి. ఎవర్ని పిలవాలి? రవికి అమ్మ మాత్రమే ఉంది. వాళ్ళ ఊర్లో ఉంటుంది. రెండు సార్లు కొడుకు దగ్గర

కొన్నాళ్ళు ఉందామని వచ్చి, సుగుణ వ్యవహారం చూసి రెండ్రోజుల్లోనే పారిపోయింది. మళ్ళీ రాలేదు. ముందు ఆవిడకి ఫోన్ చేసి చెప్పాలి. తర్వాత అమ్మా నాన్నలకి.. సుగుణ ఆలోచిస్తోంది.

పిట్టలు కర్ణ కఠోరంగా అరుస్తున్నాయి. . కాలింగ్ బెల్! పగలు ఎంతో హాయిగా వినిపించే పిట్టల కూతలు.. అర్ధరాత్రి నిశ్శబ్దంలో ఆ గాభరాకి అలా అనిపించింది.

అయోమయంగా చూస్తూ తలుపు తీసింది. సి.ఇ గారు, బృందం లోపలికి వచ్చారు. తడబడుతూ కూర్చోమని ఫాన్ వేసింది.

సి.ఇ గారు కూర్చున్నాక అందరూ కూర్చున్నారు. నైటీతో, జుట్టు రేగిపోయి.. కళ్ళు ఎర్రబడి.. వణుకుతూ తలుపు పట్టుకుని నిలుచుంది సుగుణ. ఆ సమయంలో సుగుణ బట్టల్ని కానీ జుట్టుని కానీ పట్టించుకునే స్థితిలో లేరెవ్వరూ.

"అమ్మా! మీరిలా కూర్చోండి." గోపాల్ తను కూర్చున్న సోఫా ఖాళీ చేసి సి.ఇ గారి పక్కన కూర్చున్నాడు. మౌళి చొరవగా లోపలికి వెళ్ళి, గ్లాసుతో మంచి నీళ్ళు తెచ్చి సుగుణకి ఇచ్చాడు. మాట్లాడకుండా తాగేసింది. గొంతు తడారి పోగా.. భోజనాల బల్ల దగరి కుర్చీ తెచ్చుకుని కూర్చున్నాడు మౌళి.

"మీరు.." గోపాల్ ని చూస్తూ అడిగింది తడబడుతూ. వచ్చిన వాళ్లలో సి.ఇ గారిని తప్ప ఎవర్నీ చూడలేదు. ఆయన్ని కూడా ఏదో ఫంక్షన్ లో చూసింది.

సి.ఇ గారే అందర్నీ పరిచయం చేశారు.

"రవి ఎలా ఉన్నారు?" అయోమయంగా అడిగింది.

"బాగానే ఉన్నాడమ్మా! ఆపరేషన్ చేశారు. తెలివి వచ్చింది ఏం భయం లేదు." గోపాల్ అన్నాడు.

"భయం లేదా.. మరి అర్ధరాత్రి మీరంతా ఎందుకు వచ్చారు?"

"ఏం లేదమ్మా.. మేము ప్లాంట్ పని మీద పంపించాం రవిని. అక్కడ ఏం జరిగినా మాదే బాధ్యత. అందుకని అర్ధరాత్రి ఐనా వచ్చాం.. మీకు ధైర్యం చెప్పాలని. రవి ఎక్కడికి వెళ్తున్నాడో చెప్పాడా?" సి.ఇ గారు అన్నారు.

లేదన్నట్లు అడ్డంగా తలూపింది సుగుణ.

చెప్తే గాభరా పడ్తుందని చెప్పలేదేమో అనుకున్నారు శ్రీనివాస్. రవి వెళ్ళిన పనిని వివరించారు.

"మీరేం చదువుకున్నారమ్మా?"

"డిగ్రీ పాసయానండీ."

"గుడ్.. రవినీ ఇంకా నలుగురు ఇంజనీర్లనీ పంపించవలసి వచ్చింది.. నెగషియేషన్స్ కి. అక్కడ సడన్ గా ఫైరింగ్ మొదలెట్టారు. అప్పుడు.. " పవర్ ప్లాంట్ లో వచ్చిన ఎమర్జెన్సీ వివరించి, రవికాల్లోంచి గుండు దూసుకుపోయిన సంగతి చెప్పారు .

"వాళ్ళంతా ఎలా ఉన్నారు?"

"ఎవరికీ ఏమీ కాలేదమ్మా! అందులో ఇద్దరు రవికి రక్తం ఇచ్చారు. హి ఈజ్ ఆల్ రైట్. తెలివి వచ్చి మాట్లాడారుట. మీరు రేపు మాట్లాడవచ్చు. ఫోన్ చెయ్యమని ఏ.ఈ గారికి చెప్తాను." వంశీకృష్ణ అన్నాడు.

"ఎప్పుడు వస్తారు?"

"రెండు మూడు రోజుల్లో.. ఒక నెల రెస్ట్ తీసుకుంటే అంతా సర్దై పోతుంది." సి.ఇ గారు నెమ్మదిగా అన్నారు.

"తుపాకీ గుండా? రవిని టెఱరిస్టుల దగ్గరికి పంపారా?" ఏదో లోకం లో ఉండి శూన్యం లోకిచూస్తున్నట్లుగా అంది సుగుణ.

ఎవరో కొట్టినట్లు ఉలిక్కి పడ్డారు సి.ఇ శ్రీనివాస్, యస్.ఇ గోపాలాచారీ. అమాయకంగా సుగుణ అడిగిన ప్రశ్నకి వారి వద్ద ఏ సమాధానం ఉంది?మొదట్లో ఏవో టెక్నికల్ ప్రాబ్లంస్ వల్ల రేక్ లు ఆగిపోయాయనుకున్నారు. అప్పుడు తమ టీమ్ ని పంపించాలని నిర్ణయించారు. టెర్రరిస్టుల పని అని తెలిశాక ఎందుకు పంపించారు? అది తమ పని కాదు కదా! ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

“అక్కడ అంతా కోఆర్డినేట్ చెయ్యడానికి పంపారండీ. రవిగారికి పొరపాటున తగిలింది.” వంశీ కృష్ణ జవాబు చెప్పాడు.

నిజమే.. అదృష్టం బాగుంది. ఎవెరికీ ఏమీ పెద్ద దెబ్బలు తగలకుండా బైట పడ్డారు. ఆ గుండు తగల రాని చోట తగిలుంటే.. శ్రీనివాస్ గట్టిగా నిట్టూర్చారు.

“మేం వెళ్ళడానికి వీలవుతుందా?” సుగుణ ఇంకా నిద్రలోనే మాట్లాడుతున్నట్లు ఉంది.

“వెళ్ళచ్చమ్మా! కానీ రెండ్రోజుల్లో ఇక్కడికి తీసుకొచ్చే ఏర్పాటు చేస్తాం. అక్కడ మన వాళ్ళు బాగా చూసుకుంటున్నారు. రవి క్షేమంగా ఉన్నాడు. మీకు మరీ మరీ చెప్తామనే మేం వచ్చాం. రేపు మీతో మాట్లాడుతాడు.” శ్రీనివాస్ సుగుణకి చెప్పి లేచారు.

“మీకు ఏం కావలన్లినా నిస్సంకోచంగా నన్ను పిలవచ్చు. నా లోకల్ నంబర్ తెలుసు కదా?”

సుగుణ తలూపింది. కాలనీలో ఇంటర్ కమ్ కనెక్షన్స్ ఉన్నాయి. లోకల్ గా ఎవరితోనైనా మాట్లాడుకోవచ్చు. డైరెక్టరీలో మొదటి నంబరే సి.ఇ గారిది.

“నా వైఫ్ పొద్దున్నే మీతో మాట్లాడుతుంది. ఎవరికైనా ఫోన్ చేసి చెప్పమంటారా?” సి.ఇ గారు సెల్ తీశారు.

“వద్దండీ. రవితో మాట్లాడాక చేస్తాను.”

“సరేనమ్మా. వెళ్ళొస్తాం. పిల్లల్ని స్కూల్లో దింపడానికి కారు పంపిస్తాను.”

“అఖ్ఖర్లేదండీ. స్కూల్ బస్ వస్తుంది.”

మౌనంగా బయటికి నడిచారు సి.ఇ గారి బృందం.

కళ్ళ మండిపోతుంటే బలవంతాన కళ్ళు తెరవడానికి ప్రయత్నించాడు గోపాలాచారి. ససేమిరా తెరుచుకోనని మొరాయిస్తున్నాయి కళ్ళు. బలవంతాన కళ్ళు తెరుస్తే గడియారంలో ముళ్ళు ఆరు గంటలయిందని చెప్తున్నాయి. రాత్రి ఇంటికి వచ్చి పడుక్కునే సరికి నాలుగయింది.

“ఓహ్.. ఇవేళ చక్రపాణి వస్తున్నాడు కదూ.. మర్చే పోయాను.” చటుక్కున లేచి, కళ్ళజోడు పెట్టుకుని హాల్లోకి వచ్చాడు. “బస్సు తొందరగా వచ్చేసినట్లుందే.. అయ్యో! అరుణకి వీళ్ళు వస్తున్నట్లు చెప్పనే లేదు..” తిట్టుకుంటూ.. అక్కడ జరుగుతున్న హడావుడికి తెల్లబోయి చూస్తున్నాడు.

డ్రైవర్ చక్రపాణి వాళ్ల పెట్టెల్ని గెస్ట్ రూంలో పెట్టేశాడు.

“రండి సార్!” డ్రైవర్ మాటల్ని వినిపించుకోకుండా వరండాలోనే నిలుచుండి పోయారు.. సంకోచిస్తూ, చక్రపాణి బృందం.

ఇంటికి రమ్మని పిలిచి బైటికి రాడేం? ఇంట్లో ఆడవాళ్ళని అడక్కుండా, ఫోన్లోనే రమ్మనేశాడు.. ఎలా ఉంటుందో! శశి లాంటి భార్య అయితే..

“రేయ్! ఏంట్రా పరాయి వాళ్ళలా బైటే నిలుచుండి పోయారు? లోపలికి రారా శుంఠా!” కరవు తీరా తిడుతూ చక్రపాణిని కౌగలించుకున్నాడు గోపాల్.

చాటంత అయిన మోహంతో చక్రపాణి పులకించిపోయాడు మిత్ర పరిష్వంగంతో. ఇద్దర్నీ చూస్తూ సుభద్ర పక్కకి జరిగింది.. ఇక్కడయినా మంచి స్వాగతం లభించింది అనుకుంటూ.

“అయ్యయ్యో.. అందర్నీ బైటే నిలబెట్టేశారేంటి? రండన్నయ్యా! అరెరే.. బంగారు తల్లులూ.. ఏంటలా చూస్తున్నారు? రండమ్మా. అందరూ మొహాలు కడుక్కుంటే వేడి వేడి కాఫీ తాగేద్దాం.” అరుణ హడావుడికి ప్రాణం లేచొచ్చినట్లయింది సుభద్రకి.

కాఫీ వాసనకి అందరికీ హుషారొచ్చింది. గోపాల్ అయోమయంగా చూస్తుంటే అరుణ అంది, “డ్రైవర్ చెప్పాడు లెండి, చక్రపాణిగారు వస్తున్నారని. ఆయన గురించి మీరు కథలు కథలుగా చెప్తూనే ఉన్నారుగా పాతికేళ్ళుగా, అవకాశం వచ్చినప్పుడల్లా.. మీ ఇద్దరి లీలలూ అల్లర్లూ.”

ఇంకా వరండాలోనే నిలబడి పోయిన సుభద్రనీ, తల్లినీ చెరో చెయ్యీ పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. వెనుకే చక్రపాణి, పిల్లలు నడిచారు.

కమ్మటి కాఫీ తాగుతూ వరండాలో కుర్చీల్లో కూర్చున్నారు గోపాల్, చక్రపాణీ, సుభద్ర, అరుణ. తల్లి, పిల్లల్ని తీసుకుని బాత్రూంలోకి వెళ్ళింది.

“ఇది మీ ఇల్లే అనుకోండి. ఎక్కడా ఎప్పుడూ, ఎందులోనూ మొహమాట పడద్దు. పిల్లలకి ఏది కావలసినా సంకోచించకుండా అడగండి” అరుణ పలకరింపుగా నవ్వి అంది.

అరుణ ప్రశాంతమైన మొహం, ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే పెదవులు చూస్తే ఎవరికైనా ఎప్పట్నుంచొ తెలిసిన మనిషిలా అనిపిస్తుంది. అందుకే సుభద్ర మనసు వచ్చినప్పట్నుంచీ తేలిగ్గా ఉంది.

“మీకు ఇబ్బంది కలిగిస్తున్నామేమో!”

“ఇబ్బందా! మేమిద్దరమే ఉంటామేమో బోరు కొట్టేస్తోందనుకోండి. మాకు ఇద్దరమ్మాయిలు. ఇద్దరూ అమెరికా.. వాళ్ళ దగ్గర్నుంచి ఫోను ఎప్పుడొస్తుందా, కంప్యూటర్ లో ఫొటోలు ఎప్పుడు చూస్తామా అని ఎదురు చూడ్డం తప్ప వేరే పని లేదు. మీ అన్నయ్య రోజులో పద్దెనిమిది గంటలు ప్లాంట్ లోనే ఉంటారు. ఏం చేసినా ఎంత చదివినా రోజు గడవడం కష్టం గానే ఉంది. నేను టి.వి ఎక్కువగా చూడను. మిమ్మల్ని చూస్తుంటే ప్రాణం లేచొచ్చినట్లుంది.” అరుణ గలగలా మాట్లాడేస్తుంటే హాయిగా నవ్వింది సుభద్ర.

పిల్లలకి స్నానాలు చేయించి, తను కూడా స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చింది తల్లి. తన వాళ్ళంటూ ఉన్నారు... తన సమస్యలు తీర్చడానికి అనుకోగానే కాస్త ధైర్యం వచ్చింది.

స్నానం చేయిస్తుంటే చిట్టి అడిగింది, భయంగా, “అమ్మా! మనింటికి వెళ్తామా?”

“లేదమ్మా. ఒకవేళ వెళ్లినా తాతయ్య ఉన్నారు కదా! నాన్నకి చెప్తారు కొట్టద్దని.” చేతులు వణుకుతుంటే గట్టిగా పట్టుకుని అంది.

పిల్లల్ని చూడగానే అరుణ తనే లేచి పాలు తీసుకొచ్చి ఇచ్చింది ఇద్దరికీ గ్లాసుల్లో. లోపలికి తీసుకెళ్ళి తాగించ సాగింది

“మీ పేర్లేంటి బంగార్లూ?”

“నేను చిట్టి, ఇది బుజ్జి..”

“ముద్దుగా ఉన్నాయే! మరి స్కూల్లో కూడా ఇవే పేర్లా?

“ఇంకా స్కూలుకి వెళ్ళట్లేదమ్మమ్మా. కొంచెం పెద్దయ్యాక వెళ్తా.”

ఐదేళ్ళకి కానీ పంపరేమో పిల్లల్ని. మంచిదే.. తన చిన్నప్పుడు అలాగే ఉండేది కదా అనుకుంది అరుణ. తల్లి కాఫీ తాగేసి వచ్చింది.

చూడడానికి కలుపుగోలుగానే ఉన్నారు కానీ ఎందుకో ముడుచుకుపోతున్నారు ముగ్గురూ.. చక్రపాణిగారి అమ్మాయయితే వంచిన తల పైకెత్తడం లేదు.. ఏదో పద్ద సమస్యే వచ్చినట్లుంది.. వాళ్ళనే చెప్పనిద్దాం. అడుగుతే బాగుండదు కదా! తనకి చేతనైనంత వరకూ వాళ్ళని ఉత్సాహంగా ఉంచడానికి ప్రయత్నించాలి. ఇంతకాలానికి బాల్య స్నేహితులిద్దరూ కలుసుకున్నారు.. అరుణ ఆలోచిస్తూ, పిల్లల దగ్గర్నుంచి గ్లాసులు అందుకుంది.

"బైట ఆడుకోండి." ఇద్దర్నీ తోటలోకి పంపించింది.

"కొత్తమ్మమ్మా! పూలు కోసి పెట్టమా?" చిట్టి బంతిలా వెనక్కి వచ్చింది.

"చిన్న పూలు కొయ్యండి. గులాబీ చెట్ల దగ్గరికి వెళ్లద్దు. ముళ్ళు గుచ్చుకుంటాయి." చిన్న గిన్నె ఇచ్చి అంది అరుణ. అలాగే అంటూ పరుగెత్తింది చిట్టి.

"నా పేరు అరుణ.. మీరు?" లోపలికి వచ్చిన సుభద్రతో అంది.

"అయ్యో.. మర్చి పోయాను. సుభద్ర. అమ్మాయిని ఇంట్లో తల్లి అని పిలుస్తాం. అసలు పేరు..." పూర్తి చేసేంతలో.. గట్టిగా నవ్వుతూ లోపలికి వచ్చారు గోపాల్, చక్రపాణి.

---

చక్రపాణిని అంత ఉత్సాహంగా ఎప్పుడూ చూడలేదు సుభద్ర. తల్లి రాకముందు కూడా, ఏదో యాంత్రికంగా జరిగిపోతూ ఉండేది. అందరూ కూర్చుని సరదాగా మాట్లాడుకోవడం, నవ్వుకోడం.. ఏదీ? ఇంటెడు మందీ ఎప్పుడూ ఏదో కొంపమునిగిపోతున్నట్లు ఉండడమే.

"టిఫిన్ ఏం చేస్తున్నావు? మా పన్నాకి ఇడ్లీ, సెనగపిండి పచ్చడి చాలా ఇష్టం. ఇడ్లీ అయ్యరు స్కూలుకి తెచ్చి ఇచ్చేవాడు. గిన్నెలోంచి చట్నీ తీసేసుకుని, అయ్యరు చూడకుండా నీళ్ళు కలిపేసే వాడు.. ఏరా?" గోపాల్ బల్లదగ్గర కూర్చుని అడిగాడు.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావా.. తెలుగు మాష్టారు తెల్లని బట్టలు వేసుకొసే, వెనక్కి తెఇరగ్గానే ఇంకు చల్లలేదూ? అప్పుడు మాష్టారు దస్తరు తిరగేసి ముణుకులమీద కొట్టలేదూ?"

"ఇంక చాల్లేరా? అవునూ.. ఇందాకట్నుంచీ చూస్తున్నాను.. ఎందుకు దూరం దూరం ఉంటున్నావు?" నిష్ఠూరం వేశాడు గోపాల్.

"నేనా! అదేంటి?"

"అదిగో.. 'ఏరా' అనట్లేదు. నేనేమో చిన్నప్పటి పన్నాలా మాట్లాడేస్తున్నాను."

"ఓ.. అదా! నువ్వేమో పెద్ద ఇంజనీరువు. నేనేమో.."

"నువ్వూ, నేనూ ఎప్పటికీ పన్నా, గుండూలమే. తెలిసిందా?"

"సరే. సరే.. ఒప్పుకున్నా లేరా! నీ కళ్ళేమిటీ ఎఱగా ఉన్నాయి. ఇందాకట్నుంచీ అడుగుదామనుకుంటున్నా." ఆదుర్దాగా అడిగాడు చక్రపాణి, తన గొడవ పూర్తిగా మర్చిపోయి.

"రాత్రంతా నిద్ర లేదురా. ప్లాంట్ లో ఏదో ప్రాబ్లం."

"అవునన్నయ్యా! రాత్రి నాలుగింటికి ఇంటికొచ్చారు. సుభద్రగారూ! మీరు కూడా స్నానం చేసి రండి. టిఫిన్ తిందాం." అరుణ వంటింట్లోకి నడిచింది. తల్లి అక్కడ్నుంచి ఎప్పుడో లేచి లోపలికి వెళ్ళిపోయింది.

సియి గారి బృందం వెళ్లగానే జరిగిందేమిటో అర్థమయింది సుగుణకి. దుఃఖం ఆపుకోలేక మంచం మీద అడ్డంగా పడి కరవు తీరా ఏడిచింది. ఎన్ని రోజులుగా రవి తనతో సర్దుకుపోతున్నాడూ.. తను రోజు చూసే టివి సీరియల్లా కళ్ళ ముందు కదిలింది గతం.

సుగుణది బద్ధక స్వభావం.. ప్రతీదీ తేలిగ్గా తీసుకుంటుంది. స్వతహాగా మంచిదే. పుట్టింట్లో ఏ విధంగా పట్టించుకోనట్లుండేదో, అలాగే తన ఇంట్లో కూడా ఉండచ్చనుకుంది. దానికి తోడు రవి కూడా ఏమనకుండా వదిలేశాడు.. ఎందుకొచ్చిన గొడవలే అనుకుని. ఇంక టివీ.. అందులో రకరకాల చానల్స్.. సుగుణ బద్ధకాన్ని ఎక్కువ చేశాయి.

సినిమాల్లో, టివి నాటకాల్లో చూపించే మంచిని గ్రహిస్తే బాగానే ఉండేది. అందులో కొంతమంది ఆలుమగలు ఎంత అన్యోన్యంగా ఉంటారో.. ఆడవాళ్ళు ఇంటినీ పిల్లల్నీ ఎంత శుభ్రంగా ఉంచుతారో. అలా ఉండడానికి ప్రయత్నిస్తే కదా! అలా ఉంటే టివి చూడడానికి ఉండదు. రెంటికీ సమతుల్యం ఉంటే జీవితాన్ని బాగా అనుభవించచ్చు.

అలా ఏడ్చి ఏడ్చి పడుకుండిపోయింది సుగుణ.

"అమ్మా! ఫోన్.." అవినాశ్ ఫోన్ తీసి పిలిచాడు. ఇంకా పలకకపోతుంటే దగ్గరగా వచ్చి లేపాడు.

"హలో.. హలో.." ఫోన్లో ఎవరో గట్టిగా అరుస్తున్నారు.

ఒక్క ఉదుట్న లేచి ఫోన్ పైకెత్తి చెవి దగ్గరగ పెట్టుకుంది. "చెప్పండి.." గొంతు బొంగురుగా అయిపోయింది.

"మేడమ్! వంశీకృష్ణ. రవిగారికి బాగా ఉందిట. నాతో మాట్లాడారు. అంబులెన్స్ లో సాయంత్రానికి వచ్చేస్తారు. మీరు ఇంట్లో చూసుకోగలనంటే సరే.. లేకపోతే మన హాస్పిటల్ లో.."

"అబ్బే.. వద్దు. ఇంటికే తీసుకొచ్చేయండి. ఇక్కడంతా సర్ది పెడతాను." సుగుణ గాభరాగా అంది.. తన పెన్నిధిని ఎవరో కొట్టేస్తారేమో అన్నట్టుగా.

"సరే మేడమ్! సాయంత్రం ఆరు ఏడు మధ్యలో రావచ్చు రవి గారు. నేను తొమ్మిది గంటలకి వస్తాను. మీరు రవిగారితే మాట్లాడుతారా?"

"అలాగే. రండి." కాలనీలో కొన్ని పోస్ట్ లకి తప్ప పి అండ్ టీ వాళ్ళ ఫోన్లుండవు. కావలసిన వాళ్ళు పెట్టించుకోవాలి. రవి సెల్ ఉంది కదాని ఊరుకున్నాడు. సెల్ అతను పట్టుకెళ్ళిపోయాడు."

వంశీకృష్ణ ఫోన్ పెట్టేశాక టైమ్ చూసింది సుగుణ. ఏడు దాటింది. పిల్లలు ఎన్నింటికి వెళ్తారో!

"అవినాశ్! మీరు స్కూల్ కి ఎన్నింటికి వెళ్తారు?"అడిగాక ఎందుకో సిగ్గుగా అనిపించింది.

"ఎయిట్ కి బస్సు గేటు దగ్గరకొస్తుంది మమ్మీ!" అవినాశ్ అప్పటికే తమ్ముడిని లేపేశాడు. ఇద్దరూ బ్రష్ చేసేసుకుంటున్నరు. రవి బాగా అలవాటు చేసేశాడు. పిల్లలు చెప్పించుకోకుండా వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటారు.

సుగుణ లేచింది. కానీ ఏం చెయ్యాలో అర్ధం కాలేఉద్ ముందు కాఫీ తాగుతే కానీ బుఱ పని చెయ్యదు. కాఫీ డికాక్షన్ వేసి, పాలు గిన్నెల్ పోసి పొయ్యి మీద పెట్టి మొహం కడుక్కుని వచ్చింది. కాఫీ కలుపుకుని తాగుతుంటే, పిల్లలిద్దరూ స్నానాలు చేసేసి, బట్టలు వేసుకుని, షూస్ వేసుకుంటున్నారు.

అఖిల్ ఏదో పేచీ పెడుతూనే ఉన్నాడు. అవినాశ్ ఆరిందలా సర్ది చెప్తున్నాడు.

"డాడీ లేరు కదా! మనమే అన్నీ చేసుకోవాలని చెప్పారా లేదా?"

"అవ్ను. బాగా బిహేవ్ చేస్తే డాడీ గిఫ్ట్ ఇస్తాన్నారు కదా!'

బ్రెడ్, జామ్ తీసి పెట్టాడు అవినాశ్.

"మమ్మీ! మాకు బూస్ట్ కలిపి పాలు ఇస్తావా?"

సుగుణ అలాగే ఇచ్చింది.

"రోజూ బ్రెడ్, జామ్ తింటాం మమ్మీ! ఇవేళ ఆమ్లెట్ వేసివ్వవా?" అఖిల్ మొహమాటంగా అడుగుతుంటే సుగుణకి కలుక్కుమంది.

రవి అన్నీ తెచ్చి పడేశ్తాడు ఇంట్లో. గుడ్లు ఉడికించి పెడుతుంటాడు. సిగుణ శ్రద్ధగా ఆమ్లెట్ వేసి, బ్రెడ్ కాల్చి పెడ్తే పిల్లలు ఆనందంగా తిన్నారు.

"మమ్మీ! రోజూ నువ్వే పెట్టవా టిఫిన్?" అఖిల్ కి హుషార్ వచ్చింది.

అవినాశ్ కి మాత్రం అటువంటి ఆశ లేదు. "ఇవేళ డాడీ లేరు కదా.. రోజూ ఎందుకు పెడుతుంది.. ఎలాగైనా మమ్మీ చేస్తే ఆ టేస్టే వేరు" అనుకున్నాడు.

"అలాగే. నేనే పెడ్తా. ఎనిమిదవుతోంది. మరి బస్ వెళ్ళిపోతే ఎలా?" సుగుణ అంటుండగానే ఇద్దరూ బాగులు పట్టుకుని పరుగెత్తారు.

పిల్లలు వెళ్ళిపోయాక ఇల్లంతా తిరిగింది. కిటికీల్లో, వరండాల్లో గ్రిల్స్.. ఎక్కడ పడితే అక్కడ దుమ్ము. వెనుక వరండాలో అయితే బూజులు వేళ్ళాడుతున్నాయి.. సాలీళ్ళతో సహా.

"అలివేలు ఏం చేస్తోందో.. ఇవన్నీ ముందే మాట్లాడుకున్నాం కదా!"

గదులు కూడా లాగే ఉన్నాయి. పిల్లలు బట్టలన్నీ నేల మీద పడేశారు. వంటిల్లయితే.. సుగుణ తిరుగుతోందనే భయం లేకుండా బొద్దింకలు, ఎలుకలు వీర విహారం చేస్తున్నాయి.అక్కడ చెదలు కూడా ఎక్కువే. తలుపుల్నిండా అరచేతి మందాన పట్టేశాయి. సుగుణకి తన చిన్నప్పుడు ఎలా ఉండేదో గుర్తుకొచ్చింది. అమ్మ గట్టిగట్టిగా అరచి పనివాళ్ళ చేత పనుఉ ఎలా చేయించేదో.. తనని కూడా ఎప్పుడూ తిడుతూనే ఉండేది.పొద్దున్న కాలేజ్ కీ వెళ్ళేటాప్పుడు ఎక్కడివక్కడ పడేసి వెళ్తే, ఇంటికొచ్చేసరికి శుభ్రంగా సర్ది ఉండేది. అవునూ.. ఈ చెదలూ అవీ ఎలా పోతాయి?

బెల్ మోగింది. తీసి ఉన్న తలుపు తోసుకుని అలివేలు ప్రవేశించింది. లేచి అంతా పరికిస్తున్న అమ్మగారిని చూసింది.

అయ్యో.. ఇంట్లో ఏం తినకుండా వచ్చింది. నాస్తా పస్తే.. పాట పాడుకుంటూ చీపురు తీసింది, వాకిలి తుడవటానికి. సుగుణ వెనుకే వెళ్ళింది. అలివేలు జాగ్రత్తగా తుడవాల్సొచ్చింది. రోజూ అటూఇటూ నెట్టేసే తుక్కుని ఒక మూలగా పోగు పెట్టి ఎత్తి చెత్త బుట్టలో పడేసింది.

"ఈ చెదలూ, బొద్దింకలూ ఎలా వదుల్తాయే?" అలివేలు లోపలికి వచ్చాక అడిగింది సుగుణ.

"పెద్దబజార్లో కొత్తగా షాప్ పెట్టారమ్మా! ఆరే ఇంటికొచ్చి మిషన్లతో గోడలకి, తలుపులకీ ఏవో ఇంజషన్లిస్తారంట. ఆడ యస్సీ అమ్మగారింట్లో ఏయించుకున్నారు. అన్నీ మటుమాయం."

"ఏ యస్ ఈ గారు?"

"అదే నమ్మా ఏడియంగోరు. ఆరింట్లో నేను ఆకిలి, అంట్లు చేస్తా. ఇంట్లోకి ఏరే అమ్మాయుంది." అలివేలు బల్ల, కుర్చీలు దులుపుతూ సమాధానం ఇచ్చింది. ఒక్క నిముషం కూడా వ్యర్ధ పరచకుండా పనిచేసేస్తుంది. టైమ్ మానేజ్ మెంటుకి పెద్ద ఉదాహరణ అనుకుంది సుగుణ దాని పని చూస్తూ.

ఓహ్.. నిన్న రాత్రి ఆయన కూడా వచ్చినట్లున్నారు కదూ! మధ్యాన్నం ఫోన్ చేసి కనుక్కోవాలి.

"ఇదిగో నమ్మా.. ఆరు పేపరిస్తే దాచిపెట్టా. తీసుకోండి." అలివేలు సోషల్ సర్వీస్ కి ముచ్చటేసింది. పెస్ట్ కంట్రోల్ కి ఏదో సర్వీసు ఈ ఊళ్ళోకూడా పెట్టేశరనుకుంటే అశ్చర్యం అనిపించింది సుగుణకి. ఇంట్లో పనులయ్యాక వెళ్ళి ఫోన్ చెయ్యాలి..

అలివేలు వెనుకే తిరిగి పని చేయించింది. ఇద్దరూ కలిసి పిల్లల గది సర్దారు ముందుగా.

“పెదబాబు చక్కగా పెట్టుకుంటాడమ్మా. చిన్నబాబే..”

“వాడి వయసెంతని..” అలివేలుని అడ్డుకుంది.. ఇప్పటికే దానికి అవసరమయిందాని కన్నా ఎక్కువే చనువుంది ఇంట్లో.. అసలే పని తక్కువా, మాటలెక్కువా!

“ఇయాల టివీ పెట్టలేదమ్మా.. ఆ సీరీలేటయిందో ఏటో.”

“ఏం గాదులే. రేపు చూడచ్చు. రాత్రికి సారు వస్తారు. మా గది అంతా దులిపి సర్దాలి పద..”

అలివేలుని వెంటపెట్టుకుని, అన్నీ తీసి దులిపింది. బొద్దింకలు పడగ్గదిలో కూడా ప్రవేశించి హాయిగా నిద్రపోతున్నాయి. లక్ష్మణ రేఖ రాయించింది. అక్కడక్కడా మూలల్లో ఎలుకల మందు పెట్టించింది. మంచం మీది దుప్పటి తీసి కొత్తది వేయించింది. ఆఖరుగా టి.వీ తెచ్చి రవి మంచం ఎదురుగా పెట్టించింది. నెలరోజులు మంచం మీదే.. మరి కాలక్షేపం ఉండాలి కదా!

ఇంటి ఇల్లాలు తలుచుకోవాలే కానీ భువికి స్వర్గమే దిగి రాదా! బెడ్ రూం స్వరూపమే మారిపోయింది.

“అమ్మా! టివీ లోన ఎట్టించేశార్ఏటమ్మా?” అలివేలు ఆక్రోశం. అసలే దానికి కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. రోజూ ఈ పాటికి వంటిల్లు సర్దుతూ కనిపించినవన్నీ లాగించేసేది.

“సర్ లోపల పెట్టమన్నారు.”

ఇంక మారు మాట్లాడలేదు అలివేలు. సుగుణ వంటింట్లోకి నడిచి కూరగాయలు తీసిచ్చింది. అన్నీ కోయించి గోధుమ నూకతో ఉప్మా చేసింది. అలివేలుకి కడుపునిండా పెట్టి, తను కుడా స్నానం చేసి తింది. రాత్రంతా కలత నిద్రేమో. కళ్ళు తిరుగుతున్నాయి.

పనంత చేయించినా అమ్మ చెయ్యి చాలా పెద్దది. అలివేలు నాస్తా తినేసి, హుషారుగా పనంతా ముగించి బైట పడింది. అయినా లోపల బాధగానే ఉంది. “ఆ డ్రైవర్ కనిపెట్టాడో లేదో.. సీరియల్ ఏటైపోయిందో..”

సుగుణ గదిలోకి వెళ్ళి టి.వీ పెట్టింది. మంచి ప్రోగ్రాములేం ఇప్పుడు రావులే అనుకుంటూ కట్టేసింది. ఇల్లంతా తిరిగి ఏం కావాలో చూద్దామనుకుంది... చాలా కనిపించాయి.

చెత్తబుట్టల దగ్గర్నుంచీ, బకెట్లు, చీపుళ్ళు.. అన్నీ శిధిలావస్థలో ఉన్నాయి. వంటింట్లో కూడా చాలా కావాలి. రవి తనకి తోచినవి తెచ్చి పడేస్తాడు. ఉన్న వాటిల్తో తను వంట చేస్తుంది.

బల్ల దగ్గర కూర్చుని లిస్ట్ రాయడం మొదలుపెట్టింది. పిట్టలు కూయడం వినిపించి లేచింది.. ఎవరొచ్చారో అనుకుంటూ.

“గుడ్ మార్నింగ్ మేడం.” వంశీకృష్ణ నవ్వుతూ పలుకరించాడు తలుపు తియ్యగానే.

“సారీ మేడమ్! రాత్రి పడుక్కునే సరికి నాలుగు దాటింది. త్వరగా లేవ లేకపోయాను. రవి గారితో మాట్లాడండి.” నంబర్ నొక్కి ఫోన్ ఇచ్చాడు.

“హలో..” బిడియంగా, సంకోచంగా వణుకుతున్న గొంతుతో అంది.. ఎప్పుడూ తన ప్రపంచం తప్ప బైటి విషయాలు పట్టించుకోని సుగుణ.

వంశీ కృష్ణ వరండాలోకి వెళ్ళిపోయాడు.

"సుగుణా! నువ్వా.. వంశీ వచ్చారా? పిల్లలు స్కూలుకెళ్ళారా?" మత్తుగా ఉన్నా స్పష్టంగా మాట్లాడుతున్నాడు రవి. అటువంటి పరిస్థితుల్లో కూడా పిల్లల గురించే ఆలోచన. సుగుణకి కళ్ళు తిరిగినట్లయింది. సోఫాలో కూలబడిపోయింది, కళ్ళనిండా నీళ్ళతో.

"హలో.. హలో.. సుగుణా! ఉన్నావా.."

"ఆ! మీరెలా ఉన్నారు? బాగా నొప్పిగా ఉందా?" గొంతు పెగల్చుకుని అడిగింది.

"నొప్పా! ఉంది.. మార్ఫిన్ ఇస్తున్నారు. ఎప్పుడూ నిద్రే. ఇప్పుడే లేపారు. ఇవేళ వచ్చేస్తున్నా. అక్కడ హాస్పిటల్లో ఉంటాను. ఇంట్లో నీకు కష్టం.. చెయ్యలేవు." రవి మాటలకి దుఃఖం ఎక్కువయింది. ఇన్నేళ్ళ నుంచీ ఏం చేసిందని? ఇప్పుడు కూడా ఎవరూ లేనట్లు హాస్పిటల్ కి పంపడమా!

"నో.. నో! ఇంటికే వచ్చెయ్యండి. అంతా సర్దాను. పిల్లలు మీకోసం బెంగ పెట్టుకున్నారు.. దెబ్బతగిలిందంటే."

"నిజంగానా సుగుణా.. నీకు ఇబ్బంది అవదా?"

"నిజంగానే.. మీరు ఇంటికే వస్తున్నారు. రెస్ట్ తీసుకోండి. ఎదురు చూస్తుంటాము." సుగుణ ఫోన్ కట్ చేసి వరండాలోకి వెళ్ళింది. వంశీ కృష్ణ గేటు దగ్గర నుంచుని బైటికి చూస్తున్నాడు.

"చాలా థాంక్సండీ. రండి కాఫీ తాగి వెళ్దురుగాని."

"అయ్యో.. థాంక్స్ దేనికమ్మా! రవికి అలా అయిందని అందరం ఎంతో ఫీల్ అవుతున్నాం. కాఫీ వద్దమ్మా! ప్లాంట్ దగ్గరకెళ్ళాలి. రేక్ లు వస్తున్నాయి. మీకు బజార్నుంచి ఏమైనా కావాలంటే జీపు పంపిస్తాను. రవిగారికి కావలసినవి తీసుకోవాలి కదా! కొన్నాళ్ళు బెడ్ మీదనే అంటే మరి.."

అవును కదా! బెడ్ పాన్ లాంటివి.. మర్చే పోయింది.

"మీకు ఇబ్బంది లేకపోతేనే.. రిక్షాలో వెళ్తాను." మొహమాటంగా అంది..

"అయ్యో! భలేవారే. ఒక గంటలో పంపుతాను. మీకు కావల్సినవన్నీ తీసుకోండి."

వంశీకృష్ణ వెళ్ళిపోయాక, లోపలికి వచ్చి సుగుణ లిస్ట్ రాయసాగింది.

మౌళికి సి.ఇ గారింటి మెట్లు ఎక్కుతుంటే కొత్తగా ఉంది. ఎప్పుడూ ఏ సంకోచం లేకుండా వచ్చేసే వాడు. ఇవేళ ఎందుకిట్లా ఉంది? తన ఆలోచనల్లో మార్పు వల్లేనేమో!

"రావయ్యా మౌళీ! ఇడ్లీ తింటావా? సాంబారు చాలా బాగుంది చూడు." శ్రీనివాస్ ఆప్యాయంగా పిలిచారు.

మౌళి, కుర్చీ జరిపి బల్ల దగ్గర కూర్చున్నాడు. ఉష తలెత్తి పలకరింపుగా నవ్వింది. ఒక్కసారిగా గుండె లయ తప్పింది. ఇది వరకెప్పుడూ ఇట్లా అవలేదే!

"అంకుల్! రవి గారికెలా ఉంది?"

"ఫరవాలేదు.. ఇవేళ సాయంత్రానికి వచ్చేస్తున్నారు. ఇంకో గంటలో రేక్ లు వస్తున్నాయి. రేపట్నుంచీ అన్ని యూనిట్ లూ నడిపించచ్చు."

"అంకుల్! నేనొకటి చెప్పచ్చా?"

శ్రీనివాస్ చెప్పమన్నట్లు తలూపగానే బల్లదగ్గరున్న వాళ్ళంతా కుతూహలంగా చూశారు.

"ఈ కాలనీ ఇంత ప్లాన్డ్ గా ఉంటుంది కదా! ఇంత మురికిగా, దర్టీగా వదిలేశారేం అంకుల్? ఇదే నీట్ గా, గ్రీన్ గా చేస్తే ఎంత బాగుంటుంది?"

"అవునయ్యా! నేనూ అదే అనుకుంటుంటాను. మునిసిపాలిటీ వాళ్ళు సరిగ్గా పని చెయ్యరు. ఇక్కడ నివసించే వాళ్లకి అవగాహన లేదు."

"మీరు ఏదైనా పట్టించుకోవచ్చు కదా అంకుల్! మెయిన్ చెత్తంతా తీయించేసి, యువత అంతా కలుస్తే.. కాలనీని ఎంతో అందంగా తయారు చెయ్యచ్చు. అదే కదా.. మన ప్రధాన మంత్రిగారు చెప్పున్నది? స్వచ్ఛ భారత్! ఏమంటావు ఉషా?"

అప్పటికే మౌళి మాటలకి ఉష ఆలోచనలో పడింది.

"ఇప్పుడెట్లాగూ కాలేజ్ కి పది రోజులు సెలవలే. ఇలాంటి ప్రాజక్ట్ మొదలు పెడితే, పిల్లలకీ అవేర్ నెస్ వస్తుంది.. రోజూ రెండు గంటలు గడుపుతే చాలు." మరి కొంత సాంబారు వడ్డించుకుంటూ అన్నాడు మౌళి.

"అలాగే! మునిసిపల్ కమీషనర్ తో మాట్లాడుతాను. ఉషా! కాలనీ లో పిల్లలందరికీ 'జన్మభూమి' లాంటి కార్యక్రమం ఉంటుందని ఒక పిలుపు ఇయ్యి. సగం మంది వచ్చినా చాలు. నేను మా తోట మాలితో కూడా మాట్లాడ్తాను. ఆ తుప్పలన్నీ తీయించడానికి ఎంతవుతుందో! సివిల్ బడ్జట్ లోంచి అరేంజ్ చేద్దాం.." రోజూ చూస్తున్నా కూడా ఎక్కడ మొదలుపెట్టాలో, ఎలా మొదలు పెట్టాలో.. అసలు దాని మీద ధ్యాస పెట్టడానికి సమయం లేక ఊరుకున్న శ్రీనివాస్ ఉత్సాహంగా లేచారు.

"అంకూల్.." బబ్లూ పరుగెత్తుకుంటూ వచ్చి మౌళి మీద పడ్డాడు.

"బ్రేవో.. హీరో!" కిట్ కాట్ చేతిలో పెట్టి బబ్లూని ఒళ్ళో కూర్చో పెట్టుకున్నాడు.

"మేము రేపు వెళ్తున్నాం మౌళీ! మళ్ళీ ఇంకోసారి థాంక్స్." బబ్లూని చూస్తూ అంది సుధీర.

"మనం మళ్ళీ మళ్ళీ కలుస్తూనే ఉందాం సిస్టర్. హీరో ని మిస్ అవుతుంటా కదా!" అనుమానంగా చూసిన ఉష కేసి చూస్తూ అన్నాడు మౌళి.

"సరే! పద మౌళీ! ఒంటి గంటకి కమ్యూనిటీ హాలు దగ్గర కలుద్దామని అందర్నీ పిలుద్దాం. ఎవరెవరు ఊళ్ళకెళ్ళారో, ఉన్నా.. ఎవరొస్తారో చూడాలి. వర్కర్స్ కాలనీ లో చాలా మంది ఉన్నారు కాలేజ్ లో. వాళ్లందరినీ ఇన్వాల్వ్ చెయ్యాలి." ఉష ఛెంగున లేచి, సి.ఇ గారి ఆఫీసు గదిలో ఉన్న ఫోన్ డైరెక్టరీ, కాగితం పెన్ను పట్టుకొచ్చింది. హాల్లో ఫోన్ దగ్గరికి రెండు కుర్చీలు జరుపుకుని కూర్చున్నారిద్దరూ.

మౌనంగా ఉంటే తన ప్రాజక్ట్ నచ్చ లేదేమో అనుకున్నాడు మౌళి. ప్లాన్ చేస్తోందన్నమాట. ఫరవాలేదు.. అభిప్రాయాలు కలుస్తునట్లే ఉన్నాయి.

"మౌళీ! టీ తాగి మొదలుపెట్టండి." భారతి ఇదరికీ చెరో కప్పు టీ ఇచ్చి, కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఏవేం మొక్కలు నాటితే బాగుంటాయో కనుక్కుందాం. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వాళ్ళు ఫ్రీగా ఇస్తారు మొక్కలు. వీటి సంగతి టౌన్ కి ఫోన్ చేసి కనుక్కుంటాను. లేడీస్ క్లబ్ వాళ్ళకి కూడా పని పెడదాం. పార్టీలు, కబుర్లు తప్ప ఉపయోగించే పనులేం జరగటం లేదక్కడ." లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ అయిన భారతి అంది. సి.ఇ గారి భార్య టౌన్ షిప్ లో లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ అవుతుంది సాధారణంగా.

మౌళికి ఎగిరి గంతేయాలనిపించింది. ఏమంటారో అని తడబడుతూ చేసిన ప్రపోజల్ రాకెట్ లా దూసుకు పోతుంటే ఎవరికి సంతోషంగా ఉండదు?

అలా కదలకుండా రెండు గంటలు కూర్చుని కాలనీలో పిల్లలున్న ఇళ్ళల్లో అందరికీ ఫోన్లు చేశారు. ఇంటర్ విద్యార్థుల దగ్గర్నుంచీ.. ఒకళ్ళ ద్వారా ఇంకొకరి పేరూ, ఫోన్ నంబర్ తీసుకుని.. అందరికీ కుతూహలమే!

"ఏంటక్కా.. ఏదైనా ఫంక్షనా.. పిక్నిక్కా?"

"పిక్ నిక్ లాంటిదే. కాంపిటీషన్ అనుకోండి. అందరూ కలిసి మాట్లాడుకుందాం. వస్తారు కదూ?" ఉష ఓపిగ్గా అందరికీ సమాధానాలు చెప్పింది. నాలుగింటికి టంచన్ గా వచ్చేస్తామన్నారు. నారాయణ కొడుక్కి ఫోన్ చేసి, వర్కర్స్ కాలనీలో అందరికీ చెప్పమంది. కమ్యూనిటీ హాలు వాళ్ళకి చెప్పి, మైకులూ అవీ,అందరికీ టీ, స్నాక్స్ ఏర్పాటు చేసింది.

"టీ, శ్నాక్స్ నేను స్పాన్సర్ చేస్తా.." భారతి మాట ఇచ్చింది.

సి.ఇ గారమ్మాయి రమ్మందంటే ఆషామాషీ కాదు.. కాలనీలో దావానలం లా వ్యాపించింది వార్త. పది రోజులు సెలవులు.. ఏం చెయ్యాలా అని చూస్తున్నారంతా..

ఇదేదో మంచి ఛాన్సే!

మౌళి కంప్యూటర్, స్క్రీన్.. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేద్దామన్నాడు.. అవన్నీ ప్లాంట్ లోనే ఉంటాయి. నెట్ లోనుంచి తనకి కావలసినవి సి.డి లోకి బదిలీ చేశాడు. ఉష, తను కూర్చుని ఏం మాట్లాడాలా, ఎలా నడిపించాలా అని ప్రణాళిక వేసుకున్నారు.

భారతి కూడా లేడీస్ క్లబ్ మీటింగ్ పెట్టింది ఐదు గంటలకి. క్లబ్ కార్యకలాపాల్లో అంతగా ఆసక్తి చూపని ప్రెసిడెంట్ గారి మీటింగంటే.. ఏదో ప్రత్యేకత ఉండే ఉంటుంది.. అందరూ తప్పకుండా వస్తామన్నారు.

అరుణ మాత్రం రాలేనంది. "సారీ భారతీ! ఇంటికి గెస్ట్స్ వచ్చారు. రాలేను."

"వాళ్ళని కూడా తీసుకొచ్చెయ్యండి."

"వాళ్ళకి చిన్న పిల్లలున్నారు భారతీ! ప్లీజ్. అర్థం చేసుకుంటారు కదూ! మీరేం ప్రపోజ్ చేసినా నేను రెడీ."

కొంచెం నిరుత్సాహం అనిపించినా సర్దుకుంది భారతి. అరుణ ఉంటే తనకి చాలా సహాయం గా ఉంటుంది నిజమే! కానీ ఎవరు ఉన్నా లేకపోయినా అనుకున్నది చెయ్యగలగాలి.. అదే మనుషుల్లో ఉండాల్సిన ధైర్యం, స్థైర్యం.

"అమ్మా! సి కాలనీలో ఎవరో ఇంజనీరు మందు మింగిండట. ఆసుపత్రికి తీస్కెళ్ళారు. సీరియస్సంటమ్మా! పేరు రాజట." నర్సి మాటలకి అదిరి పడ్డారందరూ!

# 11

"దజను ఇడ్లీలు చులాగ్గా లాగించేసేవాడివి.. ఏవిట్రా ఆ తిండి? అరుణా! ఇంకో రెండిడ్లీలు, రెండు గరిటల పచ్చడీ.." గోపాలాచారి మాటలకి, రెండు చేతులూ తన పళ్ళెంలో అడ్డంగా పెట్టాడు చక్రపాణి.

"వద్దమ్మా! చిన్నప్పుడు తిన్నట్లు తింటే ఇప్పుడు హరాయించుకోగలమా? ఇప్పటికే ఎక్కువ తినేశాను." ఆయాస పడుతూ నీళ్ళు తాగాడు.

"అన్నయ్య ఫరవాలేదు కానీ, తల్లి అస్సలు తినడం లేదు. అరగంట నుంచీ రెండిడ్లీలు తింటోంది." అందరూ భోజనాల బల్ల చుట్టూ కూర్చుని తింటున్నారు.

సీతాలు కావలసినవి అందిస్తోంది. పిల్లలిద్దరు ఆవురావురుమని తినేశారు. ఇంత కాలానికి వాళ్ళకి హుషారైన వాతవరణం దొరికింది. మొహాల్లోకి కళ వచ్చింది. సుభద్ర కూడా కల్పించుకుని పనుల్లో అరుణకి సహాయం చేస్తోంది. ఒక్క తల్లి మాత్రమే.. వచ్చినప్పట్నుంచీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

"తల్లీ!" సుభద్ర పిలుపుకి తలెత్తి చూసి, గబగబా తినేసింది.

"సెకండ్ డోస్ కాఫీ ఇస్తావేమిటోయ్!" గోపాల్ అడుగుతూనే ఉన్నాడు.. సీతాలు కాఫీ కప్పులు తెచ్చి అందరికీ అందించింది.

"వెరీ గుడ్. రారా బయట కూర్చుందాం." కప్పులు తీసుకుని వరండాలోకి వెళ్ళారు స్నేహితులిద్దరూ.

సుభద్ర, అరుణ కూడా వచ్చి కూర్చున్నారు. కాఫీ రుచిని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తాగారందరూ.

"ఇప్పుడు చెప్పరా.." గోపాల్ కాళ్ళు వరండాకున్న పిట్టగోడ మీదుంచి అడిగాడు.

తలెత్తి ఏమిటన్నట్లు చూశాడు చక్రపాణి.

"ఇన్ని సంవత్సరాల తర్వాత, ఈ ఊరికి నన్ను వెతుక్కుంటూ వచ్చావనుకోను. ఇక్కడేదో పనుండి, నేనున్నానని తెలుసుకుని, నా దగ్గరికి వచ్చావు. ఎందుకొచ్చావో.. నేనేదైనా సహాయం చెయ్యగలనేమో.. చెప్పు."

అరుణ, సుభద్ర కేసి చూసింది సాలోచనగా. సుభద్ర రెండుసార్లు కనురెప్పలార్పి, తల దించుకుంది. ఆ చూపులే చెప్పాయి.. సమస్య ఎంత క్లిష్టమయిందో!

"నువ్వు ఆఫీసుకి.." గొణిగాడు చక్రపాణి.. మొహమాటంగా.

"నిన్న పొద్దుట్నుంచీ, ఇవేళ పొద్దున్న నాలుగింటివరకూ కూర్చోకుండా పని చేశాను. ఇప్పుడా ఎమర్జెన్సీ ఎవర్ట్ అయింది. ఏ పదకొండింటికో వెళ్తాను. ప్లాంట్ మామూలుగా నడుస్తుంటుందిలే.. నువ్వు చెప్పు."

మా అల్లుడు మీ ప్లాంట్ లోనే పని చేస్తాడు. అమ్మాయి ఫైనల్ ఇయర్ డిగ్రీలో ఉండగా.. కావల్సిన సంబంధం, వాళ్ళే కోరి అడిగారని చెశాం పెళ్ళి. చుట్టాలే కదాని అబ్బాయి గురించి సరిగ్గా కనుక్కోలేదు..." చక్రపాణి చెప్తున్నంత సేపూ కదలకుండా విన్నారు గోపాల్, అరుణ. గంట పైన పట్టింది. చివరికి రఘు, శశిల గురించి కూడా చెప్పేశారు. అందుకే గదా.. ఒక్క రోజులోనే తిరిగి రావలసి వచ్చింది..

"తల్లీ!" చక్రపాణి పిలుపుకి అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది.

"చూడరా.." చూపించ గలిగినంత వరకు దెబ్బలన్నీ చూపించాడు.

"మనం చూడ లేని చోట్ల ఇంకా పుండ్లలా ఉన్నాయిట." సుభద్ర అవునన్నట్లు తలూపింది, కళ్ళల్లో నీళ్లు తిరిగుతుండగా.

"మీ అల్లుడి పేరేమిటన్నావు?"

"సార్!" జీపు డ్రైవర్, ఇంకో కొత్తతను పరుగెత్తుకుంటూ గేటు తీసుకుని లోపలికి వచ్చారు.

"మీరు.."

"నా పేరు సూర్యం సార్. 'ఏ' స్టేషన్ లో షిఫ్ట్ ఏ.ఈ ని."

"ఏమయింది?"

"మా ఇంటి దగ్గరే ఉంటాడు సర్! మా స్టేషన్ లోనే షిఫ్ట్ ఏ.యి. పురుగుల మందు తాగేశాడు. నురగలు కక్కుతుంటే తీసుకెళ్ళి హాస్పిటల్లో చేర్పించాం. డాక్టర్లు సీరియస్ అంటున్నారు. మీరొకసారి హాస్పిటల్ కి ఫోన్ చేస్తే ముందు సరైన ట్రీట్ మెంట్ ఇస్తే.. తర్వాత పోలీస్ కేస్ చూడచ్చు కదా సార్.."

“ఉండు నేను కుడా వస్తాను. అతని పేరేంటి?” కుర్చీలోంచి లేచి అడిగాడు గోపాల్.

“అతని వైఫ్ చాలా గయ్యాళిట సార్. రోజూ చిత్ర హింసలు పెడుతుందట. నిన్న కొట్లాడి పిల్లల్ని తీసుకుని పుట్టింటికెళ్ళిపోయిందట. చాలా అప్సెట్ అయ్యాడు. రాత్రి డ్యూటీకి రాలేదు. పొద్దున్న కనుక్కుందామని వెళ్ళాను. వరండాలో పడున్నాడు.”

“పేరేమిటయ్యా?” విసుగ్గా అన్నాడు గోపాల్. అడిగిందానికి సమాధానం చెప్పకుండా సోది..

చక్రపాణి, సుభద్ర నిటారుగా అయ్యారు.

“రాజు సార్!”

ధబ్బుమని శబ్దమయింది గుమ్మం దగ్గర. తల్లి స్పృహ తప్పికింద పడి పోయింది. సుభద్ర లేచి కూతురి పక్కన కూర్చుని చేతులు కదప సాగింది. అరుణ లోపలికి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి మొహం మీద చిలకరించింది.

గోపాల్, చక్రపాణి మొహం కేసి చూశాడు. అతను అవునన్నట్లు తలూపాడు.

“నిన్న యూనిట్ లో యాక్సిడెంట్ అయింది.. అక్కడ పనిచేసే అతనేనా?” గోపాల్ కి చటుక్కుని స్ఫురించి అడిగాడు.

“అవును సార్! అది కూడా అప్సెట్ చేసింది చాలా సెన్సిటివ్ సర్.”

‘ఎంత సెన్సిటివ్ నో తెలుస్తోందిలే..’ అనుకుంటూ, “పాణీ! నువ్వు కూడా రారా!” లోపలికెళ్ళాడు గోపాల్, బట్టలు మార్చుకోడానికి.

తల్లికి తెలివి వచ్చింది. సుభద్ర నెమ్మదిగా లేపి, భుజం పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. పట్టుకున్న చోట నొప్పికి మొహం చిట్లిస్తూ, బాధ దిగమింగుకుంటూ నడిచింది తల్లి. మంచం మీద పడిపోయి, నోరు నొక్కుకుని, శబ్దం బయటికి రాకుండా వెక్కి వెక్కి ఏడవసాగింది.

“మా అత్తగారి పేరు.. జానకి అని పెట్టుకున్నారు. పెళ్ళయినప్పట్నుంచీ జానకమ్మ కష్టాలే నా తల్లికి.” సుభద్ర, గుమ్మం దగ్గర నిలబడ్డ అరుణతో అంది, గద్గద స్వరంతో.

“ఊరుకోమ్మా! మేమంతా లేమా..” లోపలికి వచ్చి ఓదార్పుగా అంది అరుణ.

“నేను గయ్యాళినట ఆంటీ! ఇంట్లోంచి బయటికి వచ్చి ఎవరితో ఏదైనా చెప్పుకోడానికి కూడా లేదు.” పేగులు కదిలేలా ఏడుస్తూ, చెప్పిందే చెప్తోంది తల్లి.

“సుభద్రా! మీరు కూడా వెళ్తారా హాస్పిటల్ కి? పిల్లల్ని నేను చూస్తుంటాను..”

“వద్దులెండి. మగ వాళ్ళని వెళ్ళనియ్యండి. అక్కడి జనాల చూపులు తట్టుకోలేం.”

అదీ నిజమే అనుకుంది అరుణ. ఫాన్ వేసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

హాస్పిటల్ లొ చాలా హడావుడిగా ఉంది. షట్ ఆఫ్ అయిన ఏ స్టేషన్ యూనిట్ స్టాఫ్ అంతా అక్కడే ఉన్నారు. వాళ్ళకి వేరే దగ్గర డ్యూటీ వేసినా, ఒకటి రెండు రోజుల్లో అందుకునే పనులేం ఉండవు.

“ఏంటో.. మన యూనిట్ కే కష్ట కాలం. నిన్నొక యాక్సిడెంట్.. ఇవేళ ఇట్టా.. ఆ సార్ చాలా బాధ పడ్డారురా! ఇంట్లో సరిగ్గా తిండి కూడా పెట్టేది కాదంట పెండ్లాం.” ఒక వర్కర్ వాపోతున్నాడు.

చక్రపాణి పిడికిలి బిగుసుకుంది. అతని చెయ్యి పట్టుకుని నొక్కాడు గోపాల్, “కంట్రోల్..”

యస్పీ గారిని చూసి అందరూ పక్కకి తొలిగారు. డాక్టర్ దగ్గరికి వెళ్ళి కలిశారిద్దరూ.

“ఎలా ఉందో ఇంకా చెప్పలేం యస్.ఇ గారూ! క్రిటికల్. స్టమక్ వాష్ చేశాము. యాంటి డోట్ ఇంజెక్షన్స్, లైఫ్ సేవింగ్ మెడిసిన్స్ ఇచ్చాము. అతని ఫామిలీకి కబురు చేస్తే బెటర్. ఆక్సిజెన్ ఇస్తున్నాము. బాగా ఆయాసంగా ఉంది.” గోపాల్ అడిగిన ప్రశ్నలకి డాక్టర్

సమాధానం చెప్పాడు.

"ఇతను రాజు మామగారు. పేరెంట్స్ కి కూడా కబురు చేశాము. వాళ్ళు సాయంత్రం వస్తారు. మీరు చెయ్యగలిగింది చెయ్యండి."

"అమ్మయ్య.. వాళ్ళవాళ్ళు వస్తే మేము ట్రీట్ మెంట్ సరిగ్గా చెయ్యడానికి వీలవుతుంది. కొన్ని డ్రగ్స్ రిస్కీగా ఉంటాయి. అవి ఇవ్వడానికి వెనుకాడుతున్నాము. ఎవరైనా బాధ్యత కలవాళ్ళు సైన్ చేతే అడ్మినిస్టర్ చెయ్యచ్చు."

"ఆగగలిగితే అతని పేరెంట్స్ వచ్చే వరకూ ఆగండి డాక్టర్! వాళ్ళు బయల్దేరారు." డాక్టర్ మాటలకి చక్రపాణి వెంటనే అన్నాడు.

"సరేనండి. ఐ విల్ ట్రై మై బెస్ట్."

హాస్పిటల్ కి వచ్చే దారిలోనే రాజు తల్లిదండ్రులు విమల, శేషగిరిలకు గోపాల్ సెల్ నుంచి ఫోన్ చేశారు. టౌన్ షిప్ కి రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణంలో ఉంటారు వాళ్ళు. శేషగిరి బాంక్ లో పని చేసి రెండు నెలల క్రితమే రిటైర్ అయ్యాడు.

ఐసియుకి వెళ్ళి రాజుని చూసి బైటికి వచ్చారు గోపాల్, చక్రపాణి.

"అమ్మాయిని తీసుకొద్దామంటే భయమేస్తోందిరా. చూశావు కదా వాళ్ళెలా మాట్లాడుతున్నారో!" చక్రపాణి విచారంగా అన్నాడు.

"రాజుని నిన్న పొద్దున్న నేను చూసి మాటాడాను." నిదానంగా అంటున్న గోపాల్ ని ఆశ్చర్యంగా చూశాడు చక్రపాణి.

"నిన్న ఒక ఎమర్జెన్సీ వచ్చింది. దానికి రాజు చాలా వరకూ బాధ్యుడు. అతను షిఫ్ట్ నుంచి వెళ్ళిపోయేటప్పుడు.." అంటూ.. బాయిలర్ దగ్గర జరిగిన యాక్సిడెంట్ గురించి అంతా చెప్పాడు.

"తర్వాత నేను వాళ్ల డి.ఇ తో మాట్లాడాను. రాజు చాలా ఇర్రెస్పాన్సిబుల్. అసలు పనేం చెయ్యడుట. ఏమన్నా అంటే ఇంట్లో నాకు ఎన్ని ప్రాబ్లంసో మీకేం తెలుసు అంటూ చిట్టా విప్పుతాడుట. మొత్తం ప్లాంటంతా తన భార్య గురించి ప్రచారం చేశాడు. అతను సైకిక్ అని నా అనుమానం. ఒక రకమైన శాడిజమ్. ఇటువంటి వాళ్ళకి ట్రీట్మెంట్ ఇప్పిస్తే ఫలితం ఉంటుంది. బై గాడ్స్ గ్రేస్ బతికి బైట పడితే హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ చేయిద్దాం. అక్కడ మెడికల్ ఫెసిలిటీ బాగుంటుంది. మీరు చూసుకుంటూ ఉండచ్చు.. అదీ అమ్మాయికి ఇష్టమైతేనే.." గోపాల్ చక్రపాణి భుజం మీద చెయ్యేసి చెప్పాడు.

"చాలా థాంక్స్ రా! నువ్వే లేకపోతే ఇక్కడ నేనేం చెయ్యగలిగే వాడ్నో.. తలుచుకుంటేనే గాభరా కలుగుతోంది." కళ్ళల్లో నీళ్ళు తిరుగుంటే అన్నాడు చక్రపాణి.

"సార్!" వెనక్కి తిరిగి చూశాడు గోపాల్.

నారాయణ, సంతోష్.

"మీరు ఇక్కడున్నారా సార్! మేం ఆఫీసంతా తిరిగి వస్తున్నాం. వీర్రాజు బడీని ఇప్పుడిచ్చేస్తమన్నారు సార్. తీసుకెళ్దామని.." నారాయణ హడావుడిగా అన్నాడు.

"ఇక్కడింకో ఎమెర్జెన్సీ వస్తే ఇలా వచ్చానయ్యా."

"తెలిసింది స్సా. పాపం ఆ సారు.."

"ఏవిటయ్యా పాపం.." గోపాల్ కోపం ఆపుకోలేకపోయాడు. దీనంగా చూస్తున్న తల్లి మొహం కనిపించింది.

"అతనెటువంటి వాడో తెలుసా? అసలు వీర్రాజు యాక్సిడెంట్ కి అతనే కారణం. అంత సబ్జెక్ట్ తెలియని వాళ్ళు, పని మీద శ్రద్ధలేని వాళ్ళు ఇటువంటి ప్లాంట్స్ లో పని చేస్తే ఎంత ప్రమాదం?" ఆపకుండా పావుగంట మాట్లాడాడు గోపాలాచారి.

"మాకు తెలీదు సార్! ఆ సారు చెప్పేదంతా నిజమే అనుకున్నాం. అమ్మాయి గార్ని ఎవరూ ఏమీ అనకుండా మేం చూసుకుంటాం.

అందుకే ఒకళ్ళే చెప్పింది నమ్మకూడదంటారు. వీర్రాజు పని అయిపోనివ్వండి సార్! యూనియన్ నుంచి పది వేలిచ్చారు. మేం బాడీని తీసుకుని వాళ్ళింటికెళ్తాం సర్! ఇవేళ సాయంత్రం లోగా పనయిపోతుంది. లేకుంటే కాలనీలో ఎవరూ తిండి తినడానికుండదు. మేమ్ సాయంత్రం వచ్చేస్తాం సార్. ఇంటికెళ్ళి అమ్మాయిగార్ని తీసుకొద్దాం." నారాయణ అంతా అర్థం చేసుకుని భరోసా ఇచ్చాడు.

"సార్! ప్లాంట్ లో ఏశాలేసినోల్లేమయ్యారు సర్?" సంతోష్ అడిగాడు.

"హైద్రాబాద్ తీసుకెళ్ళారు.. ఇంటరాగేట్ చెయ్యడానికి."

***

సువిశాలమైన ఆవరణలో కట్టబడిందా కళ్యాణ మండపం. లోవర్ టాంక్ బండ్ లో నాలుగెకరాల స్థలం.. ఎప్పుడో నిజాంగారి జమానాలో కట్టారు.

పొద్దుట్నుంచీ అక్కడ హడావుడి మొదలయింది. వంటవాళ్ళు తెల్లారే ముందే వచ్చి, పెద్ద పెద్ద రాగి దేగిసాల్లో రకరకాల వంటలు చేస్తున్నారు. నగరంలో ముప్పై సంవత్సరాల నుంచీ వజ్రాల వ్యాపారం చేస్తున్న ప్రముఖ వర్తకుడు షేక్ జీ కుమార్తె 'నిఖా' అవుతోంది.

పెళ్ళి కూతురికి ఒక స్టేజ్.. ఆవరణ వేరుగా ఉన్నాయి. మెయిన్ హాల్లో పెళ్ళి కొడుక్కి ఏర్పాటు చేశారు. జిగేల్ మనిపించే వజ్రాల నగల్తో, బట్టలతో ఆడవాళ్లు తిరుగుతున్నారు. మగ వాళ్ళు షేర్వాణీలు వేసుకుని కబుర్లు చెప్పు కుంటూ, చాయ్ లు తాగుతూ కాలక్షేపం చేస్తు న్నారు.

ఆ వర్తకుడు రాజస్థాన్ నుంచి వచ్చాడు. అతని బంధువులు, స్నేహితులు చాలా మంది ఉత్తర హిందూస్థాన్ లో ఉన్నారు. ముందురోజు రాత్రి నుంచీ అన్ని విమానాల్లోనూ అతిథులు వస్తూనే ఉన్నారు. పైగా పెళ్ళికొడుకు ఢిల్లీ వాడు. ఇంక ఢిల్లీ విమానాలన్నీ వాళ్ళతోనే నిండిపోయాయి. అందరికీ ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లల్లో బస ఏర్పాటు చేశారు.

అనుకున్న, రావలసిన అతిథులందరూ వచ్చే సరికి పన్నెండు దాటుతుంది. అందుకనే అన్ని రకాల బిరియానీలతో, నోరూరించే మాంసం కూరలతో మధ్యాన్న భోజనం ఏర్పాటు చేశారు. విందు అయ్యాక, ప్రత్యేకంగా, విడిగా ఉన్న హాల్లో ఇచ్చిపుచ్చుకోవడాలు మాట్లాడుకోవడానికి ఇరు పక్షాల పెద్దలూ.. మగవాళ్ళు కలవాలి. ఆడవాళ్ళు ఎట్లాగూ వేరే ఉంటారు. వాళ్ళకి గానా బజానాలు అలగ్ ఉంటాయి.

అందరూ కోట్ల విలువ చేసే వజ్రాల నగలు ధరించారు. అందుకేనేమో.. యూనిఫామ్ లతో, గన్ లతో.. ప్రత్యేకమైన సెక్యూరిటీ వాళ్ళు వెయ్యి కళ్ళతో కాపలా కాస్తున్నారు. గేటు దగ్గర శుభలేఖ, గుర్తింపు కార్డు ఉంటేనే లోపలికి రానిస్తారు.

***

**కుంభా, అతని అనుచరుడూ** బస్ దిగి, బస్టాండ్ దగ్గరున్న హోటల్ లో స్నానం, నాస్తా కానిచ్చారు. రైల్వే స్టేషన్ కి వెళ్ళి క్యూలో నిల్చున్నారు... ఢిల్లీకి టికెట్లు కొనుక్కోడానికి. చాలా పెద్ద క్యూ.. ఎప్పటికీ కదలట్లేదు.

"సాబ్! నేను తెచ్చిచ్చేదా? నాకు తెలిసిన వాళ్ళున్నారు. టికెట్ కి దస్ రుపియా చాలు." ఇరవయ్యేళ్ళ యువకుడు అడుగుతున్నాడు.

"పైసలిచ్చేట్టైతే ఇక్కడ వేళ్ళాడ్డమెందుకు? ఇంటికే తెచ్చిస్తారు కదా?" గొణుక్కుంటూ మొహాలు తిప్పుకున్నారు అందరూ.

"దో ఢిల్లీ.." కుంభా మాత్రం ఆ కుర్రాడిని పిలిచాడు.

"అచ్ఛా సాబ్!" రిజర్వేషన్ ఫార్మ్, డబ్బు తీసుకుని ఆ కుర్రాడు మాయమయ్యాడు.

పది నిముషాల్లో టికెట్లు తెచ్చిచ్చి, మళ్ళీ క్యూలో వాళ్ళని అడగడం మొదలెట్టాడు.

"దేఖానా సాబ్! దస్ మినట్ మే మిలేంగే.."

"వీడికీ కౌంటర్ దగ్గర వాళ్ళకీ ఏదో లాలూచీ ఉన్నట్లుంది.." ఎప్పటికీ కదలని క్యూలో నిలుచున్న వాళ్ళు గొణుక్కున్నారు. కొంతమంది నిలబడలేక వాడికి డబ్బులిచ్చారు.

కుంభా టికెట్లు జేబులో పెట్టుకుంటూ చొక్కా మడతలో ఉన్న ఇంకో చిన్న కాగితాన్ని తీశాడు. అది క్లోక్ రూం స్లిప్. క్లోక్ రూంకి వెళ్ళిమ్ స్లిప్ చూపించి లాకర్ లోంచి ఒక పార్సిల్ తీశాడు.

బైటికి వచ్చి మళ్ళీ హోటల్ కి వెళ్ళిపోయాడు అనుచరుడ్ని తీసుకుని. గదిలోకి వెళ్ళగానే, చేతికొచ్చిన డబ్బుల కట్ట తీసి, మంచి ఖరీదైన షేర్వాణీ, పైజామా కొనుక్కురమ్మని పంపాడతన్ని.

"మనం పెళ్ళికెళ్తున్నాం. మంచి బట్టలు కావాలి." అనుచరుడు ప్రశ్నలేం వెయ్యకుండా వెళ్ళిపోయాడు.

ఆ తరువాత కుంభా చురుకుగా తన పని సాగించాడు. పార్శిల్ విప్పి చూస్తే, యాభై శుభలేఖలు, గుర్తింపు కార్డులూ ఉన్నాయి. తమ ఇద్దరికీ తీసుకుని మళ్ళీ పాక్ చేశాడు. పబ్లిక్ బూత్ దగ్గరికి వెళ్ళి నంబర్ డయల్ చేసి, హోటల్ పేరు చెప్పి పెట్టేశాడు.

కౌంటర్ లో పార్శిల్ ఇచ్చి, "భాస్కర్" అని పేరు చెప్పిన వాళ్ళకి ఇమ్మన్నాడు. గదిలోకి వెళ్ళి కళ్ళకి సుర్మా పెట్టుకుని ధనవంతుడైన అతిథిలా మేకప్ చేసుకున్నాడు. అనుచరుడు రాగానే వాడిని కూడా తయారవమని ఇద్దరూ బట్టలు మార్చుకుని బ్రీఫ్ కేసుతో బయల్దేరారు. దారిలో ఖరీదైన ఏ.సి కారు అద్దెకు తీసుకుని కల్యాణ మండపానికి చేరారు. అప్పుడు టైమ్ పదకొండు.

పార్శిల్ ఏమయింది అని అనుచరుడు అడగలేదు. చెప్పింది చెయ్యడం తప్ప ప్రశ్నలు వెయ్యరు సైనికులు.

రెండు కార్డులూ తీసుకుని, అతిధులని పరకాయించి చూసి లోపలికి వదిలారు సెక్యూరిటీ వాళ్ళు.

"ఆయియే ఆయియే ఆలీసాబ్! ప్రయాణం బాగా జరిగిందా?" గట్టిగా కౌగిలించుకుని, తల మూడు సార్లు ఇటూ అటూ తిప్పి ఆదరంగా ఆహ్వానించాడు, పెళ్ళికొడుకు తండ్రి శేర్ జీ. ఆ ఆపరేషన్ అంతటికీ అతనే అధికారి.

"ఖాందాన్ లో అంతా కులాసాగా ఉన్నారా?" కుశలప్రశ్నలు వేసి వెనక్కి జరిగాడు. అంటే మీ దగ్గర ఉన్న వాళ్ళందరికీ వార్త అందిందా అని..

"అంతా ఠీక్ హై సాబ్! మీ ఇన్విటేషన్ అందిన వాళ్లందరూ తప్పక వస్తారు." మిగిలిన వాళ్ళని పలుకరించడానికి పక్కకి తిరిగాడు కుంభా. షేర్వాణీ జేబులో బరువుగా తగిలింది. చేత్తో తడిమి చూశాడు. ఆటోమాటిక్ పిస్టల్. కుంభా అనుచరుడిక్కూడా అటువంటిదే అందింది. దాని అవసరం ఉండక పోవచ్చు.. అయినా చెప్పలేం.. కాఫిర్ లోగ్ వస్తే!

చిన్నప్పుడు కుంభా చూసి గుర్తు పెట్టుకున్న వాళ్ళలో ఇద్దరు అక్కడ కీలక స్థానాల్లో ఉన్నారు. ఒకడైతే ఆ సంస్థకే రెండో స్థానంలో ఉన్నాడు. అతనే పెళ్ళికొడుకు తండ్రి. 'శేర్ జీ' అంటున్నారక్కడ.

"ఆయియే!' మళ్ళీ కలకలం.

ఎవరా అని చూశాడు కుంభా. మహారాష్ట్రలో కార్యకలాపాలు నడిపే లీడర్. చాలా పెద్ద సమావేశం. అవును మరి.. ఇవేళ రాత్రే కదా.. అనేక చోట్ల ఒక్క సారే అటాక్ జరిపే ప్లాన్ వేసేది!

కల్నల్ ఇస్మాయిల్ తన స్టాఫ్ తో ఎయిర్ ఫోర్స్ వాళ్ల చార్టర్డ్ ప్లేన్ లో ఎయిర్ ఫోర్స్ ఫీల్డ్ లో దిగాడు. వెంటనే రహస్య సమావేశాలు నిర్వహించే ఆర్మీ కాన్ఫరెన్స్ హాలుకి వెళ్ళాడు. అక్కడికి అప్పటికే సంబంధిత అధికారులంతా వచ్చేశారు. ఆర్మీ అధికారులే కాకుండా, డిజిపీ,

సిబిఐ, ఏసిబి, టాడా.. అన్ని శాఖల నుంచీ ప్రతినిధులున్నారక్కడ. డిఫెన్స్ సెక్రెటరీ, కల్నల్ ఇస్మాయిల్ విమానంలోనే వచ్చాడు.

ఒక్క నిముషం కూడా వృధా చెయ్యకుండా, కల్నల్ ఇస్మాయిల్ తన పథకం వివరించాడు.

"మనం ఈ సోర్స్ ని ఎంతవరకూ నమ్మచ్చు?" సిబిఐ జాయింట్ డైరెక్టర్ సందేహం..

"పొద్దుటి నుంచీ నేను ఆ కళ్యాణ మంటపం దగ్గర కాపలా పెట్టాను. అంతా మామూలుగా ఉంది. ఒక కోటీశ్వరుని ఇంట్లో ఎలా ఉంటాయో అలాగే ఉన్నాయి ఏర్పాట్లు." డిజిపి అన్నాడు.

"ఇక్కడ ఇప్పుడు మనం కూర్చుని మాట్లాడుతూ ఉండడం ఎంత నిజమో.. నా సోర్స్ కూడా అంతే నిజం. నా దగ్గర ప్రెసిడెంషియల్ ఆర్డర్ ఉంది.. నా ఆదేశాలు అందరూ అమలు చెయ్యాలని." కల్నల్ మాటలకి నోరెత్తలేదు మరెవరూ. అంతలో అతని సెల్ మోగింది. మళ్ళీ యస్ ఓయస్ నుంచి.. నిశ్శబ్దంగా విని పెట్టేశాడు.

కల్నల్ ఇస్మాయిల్ పక్కన ఉన్న కెప్టెన్ ని పిలిచి, హోటల్ అడ్రస్ ఇచ్చి, పార్సిల్ తీసుకు రమ్మని చెప్పాడు.

"సైరన్స్ వేసుకుని వెళ్ళండి.. నో టైమ్.." కెప్టెన్ పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

"నా సోర్స్ కళ్యాణ మంటపం లోకి వెళ్ళడానికి మార్గం ఏర్పరచాడు. లేకపోతే ఎవ్వరు వెళ్లలేం.. అంత టైట్ సెక్యూరిటీ." కల్నల్ మాటలకి డిజిపి, అవునన్నట్లు తలూపాడు.

ఈ సారి డిజిపి గారి సెల్ మోగింది.

"ఓ.. వచ్చేశారా? అందర్నీ స్పెషల్ సెల్ లో ఉంచండి. టైట్ కాపలా.. చాలా కేర్ ఫుల్ గా ఉండాలి. వాళ్ళ దగ్గరున్నవన్నీ, పిస్టల్స్, సెల్ ఫోన్లు.. ఎలెక్ట్రానిక్ డివైజ్ లన్నీ తీసుకున్నారు కదా! ఏ ఒక్కటీ ఉండ కూడదు.. ఓ.. స్ట్రిప్ చేశారా.. వెరీ గుడ్.."

"మనకి వాళ్ళనుంచడానికి ఏ ఇబ్బందీ లేకుండా, ఆర్మీలో ఒక బేరక్ అంతా ఖాళీ చేయించమన్నాను. పవర్ ప్లాంట్ దగ్గర పట్టుకున్నవాళ్ళు, కోల్ వేగన్ల దగ్గర వాళ్ళు.. ఇంకా అన్ని పవర్ ప్లాంట్స్ దగ్గర పట్టుకున్నవాళ్ళు, చాలా మందే గెస్టులున్నారు. ఇవేళ కూడా.. వెల్ ఎక్విప్డ్ గా ఉండచ్చు వాళ్ళు.." డిజిపి మాటలకి కల్నల్ ఇస్మాయిల్ కొంచెం కూడా బెదరలేదు.

"నాకు నిన్న ఇన్ఫర్మేషన్ వచ్చినప్పట్నుంచీ ఆ పని మీదే ఉన్నాను. మనకి ఫోర్స్ కి కొదవలేదు. నాగపూర్ నుంచీ, సౌత్ నుంచీ బెటాలియన్లు వచ్చేశాయి. ఇంకా కొన్ని వస్తున్నాయి. అంతా తయారుగానే ఉన్నాం."

బస్ స్టాండ్ దగ్గర హోటల్ కి వెళ్ళిన కెప్టెన్ వచ్చేశాడు.

పార్శిల్ విప్పి శుభలేఖలు, ఐడి కార్డులు తీశాడు కల్నల్. అందులో, నిఖా రెండు గంటలకి, లంచ్ ఒంటిగంటకి అని ఉంది. టైమ్ చూసుకున్నాడు. పన్నెండయింది.

"క్విక్.. నేను బయలుదేరుతున్నాను. అంతా రెడీనే కదా?"

పక్క హాలు తలుపు తీస్తే, యాభై మంది మెరికల్లాంటి ఆర్మీ ఆఫీసర్లు, షేర్వాణీ పైజామాల్లో తయారుగా ఉండి సెల్యూట్ కొట్టారు.

"కార్లు?"

"ఇరవై ఐదు ఏసీ టొయాటో కార్లు రెడీ."

"కమాన్.. పదండి. క్విక్. డిజిపి గారూ, మీ ఫోర్స్ కళ్యాణ మండపం బైట పెట్టారు కదా? మండపం వెనుక ప్లే గ్రౌండ్ ఉంది.. అక్కడ వెహికిల్స్ రెడీగా ఉండాలి." అందరికీ త్వరత్వరగా ఆదేశాలిచ్చి, తను కూడా షేర్వాణీ పైజామా వేసుకుని కారెక్కాడు.

"అందరికీ కార్డ్స్ అందాయా? మరీ ఒకేసారి ఊరేగింపులా వెళ్ళకుండా.. కొద్ది నిముషాల తేడాలో వెళ్ళండి. అక్కడ ఏం చెప్పాలో

గుర్తుంది కదా?"

## 12

మౌళి మధ్యాన్నం భోజనం సి.ఇ గారింట్లోనే చేశాడు.

భారతి, రాజు సంగతి తెలిసిన వెంటనే శ్రీనివాస్ కి ఫోన్ చేసింది.

"తెలిసింది భారతీ.. గోపాల్ అక్కడే ఉన్నారు. వాళ్ళు కావలసినవి చూసుకుంటున్నారు. మీరు మీ ప్రోగ్రాం సంగతి చూసుకోండి. అది ఎట్లాగూ పిల్లలు, లేడీస్ కలిసి చేసేదే కదా!" శ్రీనివాస్ అప్పటికే ఆఫీసు పనుల్లో తల మునుకలుగా ఉన్నారు.

"నేను లంచ్ కి రావట్లేదు. ఇక్కడికే పంపు." ఫోన్ ఇంకా పూర్తిగా పెట్టలేదు..

"సార్! సివిల్ యస్. యి గారు వచ్చారు." అటెండర్ కుర్చీలు సరిచేశాడు.

"రండి.. కోల్ ప్లాంట్ ప్రాబ్లం తీరింది కదా! కాలనీలో స్ట్రీట్ లైట్ల సంగతి చూడాలండీ. యూత్ అంతా నడుం కట్టామంటున్నారు. మీరు కూడా వాళ్ళ మీటింగ్ కి వెళ్ళండి. డి.యి సుందర్ ని కూడా తీసుకెళ్తే, మనం చెయ్యగలిగిన హెల్ప్ మనం చేద్దాం. హెడ్ ఆఫీస్ తో మాట్లాడి, సివిల్ బడ్జెట్ కొంత ఎలాట్ చెయ్యమని అడుగుతాను.

"అందులోనే స్ట్రీట్ లైట్స్.."

"యస్. యస్.. అవి కూడా అడుగుడాం. మన బడ్జట్ మాత్రమే కాకుండా ఇంటికి కొంత కంట్రిబ్యూట్ చెయ్యాలని చెప్దాం. కనీసం సగం మంది ఇచ్చినా చాలానే అవుతుంది. నాలుగింటికి కమ్యూనిటీ హాలు దగ్గర మీటింగ్.."

"అది కాదు సార్.. ఇంత అర్జంట్ గా.." సివిల్ యస్.యి పని శ్రద్ధగానే చేస్తాడు కానీ చొరవ తక్కువ. అన్నీ నిదానంగా చేద్దామంటాడు.

"చూడండి యస్.యి గారూ! దేనికైనా ప్రారంభం అని ఉంటుంది కదా!ఇవేళ మొదలు పెడుతున్నాం. చూద్దాం ఏమవుతుందో." శ్రీనివాస్ ఫోన్ తీశాడు, హైద్రాబాద్ ఫోన్ చెయ్యడానికి. అక్కడ అకౌంట్స్ విభాగం వాళ్ళు సరే అంటే ఇక్కడి వాళ్ళు ఇస్తారు. మామూలుగా జరిగే పనులకి ఏ అడ్డంకీ ఉండదు. కొత్తవి కావాలంటే తప్పదు.

సి.యి గారు ఫోన్ లో మాట్లాడుతూ ఉండగానే యస్.యి. గోపాల్ తలుపు తీసుకుని వచ్చి కూర్చున్నాడి విష్ చేసి. అతనికి కూడా మీటింగ్ గురించి చెప్పారు సి.యి గారు.

భోజనాలయ్యాక మళ్ళీ కూర్చున్నారు మౌళి, ఉష.

"ఏం స్లైడ్స్ చూపించ దల్చుకున్నారో చెక్ చేసుకున్నారు కదూ! నేను మిమ్మల్ని పరిచయం చేస్తాను. చెన్నై ఐ.ఐ.టి కాంపస్ ఎలా ఉంటుందో.. అలాగే మనదీ చెయ్యాలి, అని చెప్పండి. అక్కడ కూడా స్టూడెంట్స్ ఎలా పాల్గొంటారో.. నీట్ నెస్, సివిక్ సెన్స్.." ఉష మాట్లాడుతుంటే పకపక నవ్వాడు మౌళి.

"ఐ.ఐ.టి అంటే అందరికీ భూతల స్వర్గం అనిపిస్తుంది. నిజమే.. అలాగే పరిచయం చెయ్యి. కొంత దాని ప్రభావం ఉండచ్చు. కానీ చెన్నై ఐఐటిలో రెసిడెంషియల్ కాలనీ అంత నీట్ గా ఉండదు. కాంపస్ లో కొంత భాగం ఫారెన్ యూనివర్సిటీల మోడల్ లో ఉంటుంది. కొంత మామూలే. యస్.. మనం బాగా ఉన్న భాగం చూపిద్దాం. గెస్ట్ హౌస్ దగ్గరా అక్కడా.. లాన్స్ అవీ బాగుంటాయి."

మొదట్లో బిత్తరపోయి చూసిన ఉష తేరుకుని తను కూడా నవ్వేసింది.

"అన్నింటి కంటే ముందు, 'రోడ్ మీద ఎవరూ చెత్త విసిరెయ్య కూడదు..' అనే కాన్సెప్ట్ బుర్రల్లోకి ఎక్కించాలి. మనం మన ఐడియాలు చెప్పి, తర్వాత వాళ్ల చేత మాట్లాడించాలి. అలా అయితే వాళ్ళు కూడా ముఖ్యమైన వాళ్ళే అనే భావం వస్తుంది."

"కరెక్ట్ ఉషా! మనం మూడున్నరకి హాల్ కి చేరుకుందాం. అక్కడ అరేంజ్ మెంట్స్ చూసుకుని వచ్చే వాళ్ళని.. ఎక్కడ ఎవర్ని కూర్చోపెట్టాలో.. అవన్నీ చూద్దాం. నేను రూం కి వెళ్ళి మూడింటికి వచ్చేస్తా." మౌళి ఆవలిస్తూ లేచాడు.

"అవునయ్యా.. ఒక గంట రెస్ట్ తీసుకో. రాత్రి నువ్వు కూడా చాలా సేపు మేల్కొని ఉన్నావు కదా!" భారత్ మాటలకి ఉష ఏంటన్నట్లు కళ్ళెగరేసింది.

"నాన్నగారి ప్లాంట్ లో ఏదో ప్రాబ్లం వచ్చింది. గోపాల్ అంకుల్ ఇక్కడే ఉన్నారు. రాత్రి మౌళి కూడా వచ్చాడు." టెర్రరిస్టుల సంగతి ఉషకి ఎందుకు చెప్పడం అన్నట్లు తేలిగ్గా అనేసింది భారతి.

వర్కర్స్ కాలనీలో ప్రొద్దుట్నుంచీ గుంపులు గుంపులుగా చేరారు. వీర్రాజు ఇంటి దగ్గర పెద్దలు యువకులు గుమి కూడారు. నర్సి కొంతసేపు తమ్ముళ్ళ దగ్గర బిక్కుబిక్కుమంటూ కూర్చుని, సి.ఇ గారింటికి చేరుకుంది. నాయనని చూడాలంటే దానికి భయమేసింది. కానీ తప్పదు కదా.. "అప్పటేల కొస్తాలే" అనుకుంటూ..

లక్ష్మమ్మ గోల పెడతానే ఉంది.

"ఆడు ఉండి మాత్తరం ఉద్ధరించిందేముంది? ఇదీ పిల్లలూ సగం రోజులు పస్తే కదా! అయినా మగడు మగడే.." లోపల కూర్చున్న ఆడవాళ్ళు అనుకుంటున్నారు.

ఎవరో పిల్లలకింత తినడానికి పెట్టారు.

"ఇంత టీ తాగవే.. శోషొస్తుంది.." బలవంతంగా లక్ష్మమ్మ చేత టీ తాగించి బన్ను తినిపించారు.

"అమ్మా! అయ్యని తీసుకొచ్చారు." పెద్ద పిల్లాడు పరుగెత్తుకొచ్చి చెప్పగానే మళ్ళీ మొదలెట్టింది. ఎక్కువ సేపు ఉంచకుండా తీసుకుపోయారు.

ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళి స్నానాలు చేసి నిత్య కృత్యంలో పడిపోయారు. లక్ష్మమ్మకీ, పిల్లలకీ పక్కింటి వాళ్ళు వాళ్ళకున్నదాంట్లోనే వండి తీసుకొచ్చారు. రాములు నేనున్నానంటూ ప్రతీ పనికీ ఆదుకున్నాడు.

సి.ఇ గారిచ్చిన పైసల్తో వెచ్చాలు కొని తెచ్చాడు. నర్సి వచ్చి తమ్ముళ్లకి స్నానాలు చేయించి, తల్లిని లేపింది. మూడు గంటకి అంతా సర్దు మణిగిపోయింది.

సన్నగా శోకం పెడుతున్న లక్ష్మమ్మ గొంతు తప్ప ఏమీ వినిపించడం లేదు. నారాయణ, సంతోష్ లతో సహా.. అందరూ పన్లకి వెళ్ళిపోయారు.

నారాయణ కొడుకు తిలక్ గవర్న్ మెంట్ కాలేజ్ లొ బి.ఏ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సి.ఇ గారమ్మాయి పొద్దున్న ఫోన్ చేసిన సంగతి అందరికీ చెప్పాడు.

వీర్రాజు వంటి తాగుబోతులు తప్ప చాలా మంది వర్కర్లు బాధ్యతగానే ఉంటారు. వాళ్ళ పిల్లలు స్కూళ్ళల్లో కాలేజీల్లో చదువుతున్నారు. నారాయణ కూతురు సరోజిని ఇంటర్ చదువుతోంది. నారాయణ పిల్లలిద్దరికీ దేశభక్తుల పేర్లు పెట్టుకున్నాడు.

"అన్నా! అమ్మాయిలు రావద్దా?" సరోజిని అన్నని అడిగింది.

"అందరూనే.. మీ ఫ్రెండ్స్ కి కూడా చెప్పు. అందరం నాలుగులోపల్నే కమ్యూనిటీ హాల్ల ఉండాలి. చాలా ఇంట్రెస్టింగ్ అని చెప్పారు అమ్మాయిగారు."

తిలక్, సరోజిని సైకిళ్ళ మీద తిరిగి కాలనీలో అందరు పిల్లలకీ చెప్పారు.

పిల్లలంతా వాళ్ళకున్న బట్టల్లోంచి మంచివి తీసి వేసుకున్నారు.

"ఇంత మటుకు సి.ఇ గారి పిల్లల్నెవర్నీ మనం చూడను కూడ లేదు. ఈ అమ్మాయి మీటింగే పెట్టింది.." ఏంటా అన్న కుతూహలం ఎవర్నీ నిలవ నియ్యట్లేదు.

❦❦❦

కానీ ఇంత ఉత్సాహం ఆఫీసర్ల కాలనీలో కనిపించలేదు.

"కొత్త సి.డి తెచ్చుకుని చూద్దామనుకున్నాం.. ఇదెక్కడి గోల!"

"మేం మాటనీకి టికెట్స్ కొనుక్కున్నాం.. వేస్టే.."

"వెళ్ళకపోతే బాగుండదు. సి.ఇ గారమ్మాయి కదా!"

సగం మంది తిట్టుకుంటూ తయారయ్యారు. సగం మంది మాత్రం ఉత్సాహంగానే ఉన్నారు.

"ఉష పిలిచిందంటే ఏదో బ్లాస్టే.. టి.వీ, మూవీస్.. బోరు కొట్టి చస్తున్నాం. కొత్త టైమ్ పాస్. గేమ్స్ అవీ కండక్ట్ చేస్తుందేమో.."

"లేదు.. డ్రామా వేయిస్తుందేమో.. తను మంచి యాక్టర్ కదా.."

ఎవరేమనుకుంటేనేం.. అందరూ కళకళ్ళాడుతూ తయారయిపోయారు.

ఇంత హడావుడికీ కారణమైన మౌళి మాత్రం గాఢంగా నిద్రపోతున్నాడు.

❦❦❦

బిరియానీ వాసనలు టాంక్ బండ్ వరకూ వస్తున్నాయి.

"ఎవరో మంత్రిగారమ్మాయి పెళ్ళై ఉంటుంది.." రోడ్డు మీద సెక్యూరిటీ అదీ చూసి అటుగా వెళ్తున్న ప్రజలు అనుకుంటున్నారు. అదంతా ప్రైవేట్ సెక్యూరిటీ అని తెలియదెవరికీ!

అసలు, నిజం పోలీస్ ఫోర్స్, ఆర్మీ.. ఏ మాత్రం హడావుడి లేకుండా నిశ్శబ్దంగా సర్దుకుంటున్నారు. వెనుక గేటు పెద్ద తాళం వేసి ఉంటుంది ఎప్పుడూ. గోడలు చాలా ఎత్తుగా ఉంటాయి. గేటు ఇరవై అడుగులు వెడల్పు, పది అడుగులు పొడవుతో, పైన ఈటెలతో ఉంటుంది. పోలీస్ కమీషనర్, హాలు యజమానికి ఫోన్ చేసి ఆ గేటు తాళాలు తీయించ మన్నారు.

"ఫంక్షన్ చేసుకుంటున్న వాళ్ళకి తెలియ నియ్యకండి. ఈ గేటు మూసి ఉంచుతామన్నారు కదా?"

"అవును సార్! అది ఎప్పుడూ తియ్యం. కార్లు రావడానికీ పోవడానికీ కూడా ఫ్రంట్ గేటే. వెనుక అంతా గలీజుగా ఉంటుంది." హాలు మానేజర్ చెప్పాడు. పోలీసోళ్ళతో జాగ్రత్తగా ఉండాలి కదా!

"మేం కూడా సేఠ్ గారి సెక్యూరిటీ కోసమే.. మళ్ళీ వాళ్ళకి తెలిస్తే ఖంగారు పడతారు. పెద్దపెద్ద వాళ్ళతో వ్యవహారం. కోట్ల విలువ

చేసే జూవలరీ.. మళ్ళీ మీకు ప్రాబ్లం రాకూడదనీ..”

“అలాగే సార్! ఎవరికీ తెలియకుండా గేటు తీయిస్తాను, పన్నెండున్నర లోగా..”

“గుడ్.” ఫోన్ పెట్టేసి డిజిపి గారి సెల్ కి చేశాడు కమీషనర్.

“సార్! వెనుక ఒక గేటుంది. హాలు మానేజర్ అది తీసి ఉంచుతానన్నాడు. మీరు మన ఫోర్స్ ని దాని ద్వారా పంపచ్చు. కానీ మరీ ఎక్కువమంది అయితే అనుమానం వస్తుంది.”

“వెరీ గుడ్. నాకు తెలుసు. ఎవరికీ అనుమానం రాకుండా మానేజ్ చేద్దాం.”

వెంటనే.. డిజిపి, వంద మంది గన్ మెన్ ని హాలు వెనుక గేటు లోంచి వెళ్ళి, చెట్ల చాటున, పొదల చాటున ఉండమన్నారు.

ఎవరైనా వచ్చి ఏదైనా అడుగుతే, వాళ్ళని పట్టి వాన్ లోకి ఎక్కించి, కాళ్ళూ, చేతులూ, నోరూ కట్టెయ్యడమే!

వెనుక గేట్లోంచి వంద మందీ వచ్చి అన్ని చోట్లా సర్దుకున్నారు. గేటు జారవేసి ఉంచారు. ఎవరైనా చూస్తే తలుపులు వేసినట్లే అనిపిస్తాయి.

పెళ్ళివారి ప్రైవేట్ సెక్యూరిటీ వాళ్ళందరూ ముందు గేటు దగ్గరా కళ్యాణ మండపం లోనూ ఉన్నారు. విచిత్రం ఏంటంటే.. వజ్రాల నగలు ధరించిన ఆడవాళ్ళ దగ్గర ఎవరూ లేరు. కాన్ఫరెన్స్ హాలు దగ్గరే ఎక్కువమంది గస్తీ తిరుగుతున్నారు.

వియ్యంకుళ్ళిద్దరూ, పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళి కూతురు తండ్రి, వచ్చిన వాళ్ళకి మర్యాదలు చేస్తున్నారు. భోజనాలు అవుతుండగా.. అప్పుడే ఢిల్లీ నుంచి వచ్చిన విమానంలో దిగిన అతిథులు రావడం మొదలు పెట్టారు. అందరికీ టొయోటా కార్లు పంపినట్లున్నారు.

మొదటగా వచ్చిన టొయోటాలోంచి దిగిన అతిథి అదే అన్నాడు సెక్యూరిటీతో.

“అరే.. లంచ్ షురూ అయి పోయిందా భాయ్! ఫ్లైట్ డిలే అయింది మన వాళ్ళంతా పీఛే వస్తున్నారు. సేఠ్ సాబ్ బిజీనా? ఫరవానై.. నిక్కా టైమ్కి వచ్చేశాం కదా!” సెక్యూరిటీ వాళ్ళు కార్డులు రెండూ సరిగ్గా ఉన్నాయా అని చూసి చెక్ చేసి మొహాల్లోకి చూసి వదిలేశారు, సలాం కొట్టి.

అందరూ ఒకలాగే ఉన్నారు... అదే ఆహార్యం.. పాన్, కళ్లకి సుర్మా, చిన్న గడ్డం, నెత్తి మీద టోపీ.

కల్నల్ ఇస్మాయిల్ బృందం (యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్) ఏ అడ్డూ లేకుండా లోపలికి వెళ్ళగలిగారు. అప్పుడే సేఠ్, వియ్యంకుడు భోజనానికి కూర్చున్నారు. గుండ్రని బల్లలు, చుట్టూ కుర్చీలు.. ఒక్కో బల్ల దగర పదిమంది కూర్చున్నారు. సేఠ్ బల్ల దగ్గరే, కుంభా, అతని అనుచరుడు ఉన్నారు. కుంభా కనిపించేట్లుగా ఇస్మాయిల్ ఒక బల్ల ఎంచుకుని కూర్చున్నాడు. మిగిలిన స్క్వాడ్ అంతా అన్ని బల్లల దగ్గరా సర్దుకున్నారు.

సేఠ్ జీ ఏదో జోక్ వేసినట్లున్నాడు. కుంభా పెద్దగా నవ్వుతూ తల వెనక్కి తిప్పి క్షణంలో సగం సేపు ఇస్మాయిల్ కేసి చూసి సేఠ్ జీ తొడమీద చిన్నగా తట్టాడు.

“ఆలీ సాబ్! బహుత్ హుషార్ హై..” సేఠ్ జీ కొంచెం బూందీ రైతా వడ్డించుకుంటూ అన్నాడు.

“ఆప్ కా బిజినెస్ కైసా హై ఆలీ సాబ్?” వియ్యంకుడు అడిగాడు.

“క్యాహై ఆప్ కా బిజినెస్?” ఎవరో అడిగారు నత్తిగా.

“జమీన్ కా కబ్జా..” ఫెళ్ళున నవ్వారు అందరూ.

హుషారుగా నవ్వుకుంటూ భోజనాలు కానిచ్చారు. కానీ అందరి కళ్ళూ తీక్షణంగా ఉన్నాయి. ఎవరికి వారే ఏదో చెప్పడానికి

తయారుగా ఉన్నారు.

అందరూ కడుపునిండా తిని, పాన్ లు నములుతూ అటూ ఇటూ తిరుగుతున్నారు. కల్నల్ బృందం ఒక్కొక్కరే హాలు దగ్గరికి చేరుకున్నారు. మళ్ళీ హాలు దగ్గర చెకింగ్. ఈ సారి ఎక్కడ్నుంచీ అని అడుగుతున్నారు. స్క్వాడ్ వాళ్ళంతా తాము పట్టుకున్న వాళ్ల పేర్లు అడ్రస్ లు చెప్పారు. ఒకసారి చెక్ చేసి, ఫొటోలనీ మొహాలనీ పరికించి చూసి లోపలికి పంపుతున్నారు. అయినా గుర్తింపు కార్డు మీది నంబర్ చాలు. అదే గుర్తు పెట్టుకోవాలి.

కుంభా భోజనాలయ్యాక, సేఠ్ జీ వెనుకే వెళ్ళాడు.

"సేఠ్ సాబ్! సెక్యూరిటీ పక్కా హైనా?" ఒంటరిగా దొరికిన సేఠ్ జీని అడిగాడు.

'బహుత్.. ఆజ్ మిషన్ భీ బహుత్ అచ్ఛా చల్తా. అన్ని ప్లేసెస్ లోనూ పక్కా అని సమాచారం వచ్చింది. తుమ్హారా లోగ్ ఆరానా?"

"వస్తూ ఉండాలి. కార్డ్స్ ఇచ్చి అంద జెయ్యమని చెప్పాను మన ప్లేస్ లో."

"ఏక్ మినట్. భాయ్ సాబ్! కైసా హై? ఆప్ కహాసే ఆయా?"

అటు పక్క నుంచి వెళ్తున్న కల్నల్ ఇస్మాయిల్ ఆగాడు.

"కర్ణాటకా బాబా!" తడుముకోకుండా స్వచ్ఛమైన ఉర్దూలో జవాబిచ్చాడు ఇస్మాయిల్. సంస్థలో అందరూ అతన్ని బాబా అంటారని తను భోజనం చేస్తున్న బల్ల దగ్గరున్న మహారాష్ట్ర బాచ్ మాటల్లో తెలిసింది.

"లేట్ గా వచ్చాం. ఫ్లైట్ డిలే. అందుకే మిమ్మల్ని కలిసే భాగ్యం కలుగలేదు."

ఆలోచనగా గడ్డం తడుముకున్నాడు బాబా. ఇతన్ని తను తీసుకోలేదే.. పెద్దవాడే. సుల్తాన్ సాబ్ తీసుకుని ఉంటాడు. ఉర్దూ కానీ, వ్యవహారం కానీ పాకిస్తానీ లానే ఉన్నాడు. తల పంకించి, "ఫిర్ మిలేంగే.." అని పక్కకి తిరిగాడు.

"నీకు తెలుసా అతను.. ఎక్కడా చూసినట్లు లేదు?" కుంభాని అడిగాడు సేఠ్ జీ.

"సుల్తాన్ సాబ్ దగ్గర చూసిన గుర్తు. ఎక్కువగా సౌత్ లో ఆప్రేట్ చేస్తుంటాడనుకుంటా." కుంభా అనేశాడు. ఇవేళ్తి తరువాత బ్రతికి ఉన్నా ఇంక ఈ బాబాని కలిసేది లేదు.

"అచ్ఛా.. మొత్తం కంట్రీ నుంచి అందరూ వచ్చారు కదూ! గుర్తు పట్ట లేకపోయా."

"బాబా! ఇంత పెద్ద హాలు.. కాంపౌండ్ వాల్ దగ్గర చుట్టూ చెట్లు. సెక్యూరిటీ గురించే నాకు ఫికర్ గా ఉంది. ఎక్కడా లీక్ లేదు కదా!"

సేఠ్ జీని పక్కకి తీసుకెళ్ళి అడిగాడు కుంభా.

సేఠ్ జీ గట్టిగా నవ్వి అన్నాడు..

"దేఖానా! ఇత్నా గన్ మన్ హై. ఎప్పుడూ అంత డేరింగ్ గా ఉంటావు. నువ్వేంటి ఇట్లా.. కుచ్ నయీ హోయేగా!"

"సుల్తాన్ సాబ్ కైసా హై?" అలా మాటల్లో పెట్టి, ఇస్మాయిల్ బృందం హాల్లోకి నిరాటంకంగా వెళ్ళాక, "అచ్ఛా బాబా! టైమ్ అవుతోంది. నేను భీ హాల్లోకి వెళ్తా." తన బ్రీఫ్ కేస్ చూపిస్తూ అన్నాడు కుంభా.

అందులో తన ప్లాన్ విశేషాలున్నాయని సూచిస్తూ.



కౌముది

" అంకుల్! డాడీ, మమ్మీలని చంపిన వాళ్ళని నేను గుర్తుపడ్తా. అక్కని కాల్చిన వాడిని నరుకుతా.." అమాయకంగా తన మొహంలోకి చూసి, వెక్కి వెక్కి ఏడ్చిన భాస్కర్ ఎంత పెద్దవాడయిపోయాడు..

కల్నల్ ఇస్మాయిల్ కి గతం గుర్తుకొచ్చి మనసంతా వికలమయిపోయింది.

అవును మరి.. ఇరవైఏళ్ళు. మొహం వెడల్పుగా అయి, చాతీ విశాలంగా.. మనిషి బలంగా, మిలమిల మెరిసే కళ్ళు, మొహానికి అతికినట్లున్న చిన్న ముక్కుని చూసి గుర్తు పట్టాడు. ఇన్ని సంవత్సరాలు, ఇష్టం లేని చోట, శత్రువుల మధ్య సన్నిహితంగా మెలగడం సామాన్యమైన విషయం కాదు.

ఎలాగయినా భాస్కర్ ని రక్షించాలి. దేశం గర్వించదగ్గ పౌరుడిగా అందరూ కాకపోయినా, కొద్ది మందయినా గుర్తించాలి. కానీ అది సాధ్యమా! రాక్షసుల్లా తిరుగుతున్న సెక్యూరిటీ వాళ్ళని చూసి అనుకున్నాడు ఇస్మాయిల్. హాల్లోకి వెళ్ళి తన నంబర్ వేసున్న కుర్చీలో కూర్చున్నాడు. తమ వాళ్ళంతా అప్పటికే కూర్చుని పరిసరాలు గమనిస్తున్నారు.. దేశం కోసం ప్రాణాల్ని తృణ ప్రాయంగా వదిలెయ్యగల ధీరులు.

మొత్తం ఇరవై మంది సెక్యూరిటీ వాళ్ళున్నారు లోపల. అది కాక లోపల కూర్చున్న వాళ్ళలో ముఖ్యమైన వాళ్ళ దగ్గర కూడా పిస్తోళ్ళున్నాయి. బరువుగా వేళ్ళాడుతున్న షేర్వాణీ జేబులే చెబుతున్నాయా సంగతి.

కళ్యాణ మంటపం బైట యాభైమంది తిరుగుతున్నారు. వాళ్ళందర్నీ బైట ఉన్న ఫోర్స్ చూసుకుంటే లోపలున్న వాళ్ళని తాము మానేజ్ చెయ్యచ్చు. ఒక వేళ వాళ్ళు కూడా లోపలికి వస్తే..

తల విదిలించాడు కల్నల్.. ఎందుకు అంత ఆలోచన.. ఎప్పటి అడుగుకి అప్పుడే..

అందరూ లేచి నిలుచున్నారు. సేఠ్ జీ, కుంభా, పెళ్ళికూతురి తండ్రి లోపలికి వచ్చారు.

మగ వాళ్ళందరూ కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్ళిపోయాక, జనానా భోజనాలకి కూర్చున్నారు. హాలు చుట్టూ పరదాలు కట్టేశారు. ఆడపిల్లలు డాన్స్ మొదలుపెట్టారు.

"హే.. జల్దీ.. ఖానా ముగించండి. ఖానా అయ్యాక ఇంటికి వెళ్ళి మళ్ళీ తయారయి, డిన్నర్ కి రావాలి. అబ్బాజాన్ చెప్పారు." పెళ్ళికూతురి తల్లి అందరినీ హడావుడి పెట్టింది.

అబ్బాజాన్ ఆర్డర్ అనగానే అందరు గప్ చుప్ గా వచ్చి కూర్చుని తినేశారు. సేఠ్ సాబ్ బంగ్లా జుబిలీ హిల్స్ లో ఉంది. నలభై గదులు పాలస్ అది. అక్కడున్న ఆడవాళ్లంతా ఆరామ్ తయారవచ్చు.

మగపెళ్ళివారి అతిథులు ఎవరూ ఆడవాళ్ళని తీసుకు రాలేదు. అమ్మీజాన్ కి అనుమానం వచ్చినా అడగడానికి ధైర్యం చాల్లేదు. పెళ్ళయి తీస్ సాల్ అవస్తున్నా ఇంకా హడలే అమ్మీజాన్ కి తన మరద్ ని చూస్తే. నలుగురు పిల్లలూ ముత్యాల్లా ఉంటారు. ఇప్పుడు జరుగుతున్నది పెద్దమ్మాయి పెళ్ళి. పెళ్ళికొడుకు ఖాన్దాన్ ని కూడా తీసుకెళ్ళమన్నారు. వాళ్ళు పదిమంది.

"మన బంగ్లా అంతా చూపించు సంబంధీ లోగోంకి."

"షాదీ అయ్యాక వెళ్తాం కదా!"

"జాదా బాత్ మత్ కరో. చెప్పింది చెయ్యి." ఒక్క కసురుకసిరే సరికి గుడ్లల్లో నీళ్ళు కుక్కుకుంటూ లోపలికెళ్ళి పోయింది.

అమాయకురాలు.. అమె కేం తెలుసు? తన మరద్ ఇన్నినాళ్ళూ అజ్ఞాత జీవితం గడిపాడని.. ఆ రాత్రితో ఆ సంసారం, పిల్లలూ అంతా వీధి పాలే, అదీ బ్రతికుంటే! ధగ ధగ మెరిసే వజ్రాభరణాలు, పడవల్లాంటి కార్లు, రాజ భవనాలు.. అన్నీ మాయం అయి పోతాయని అణు మాత్రం ఊహించలేదు.

ఖానా అవగానే, జనానా అంతా వరుసగా వచ్చి ఆగిన కార్లలో వెళ్ళిపోయారు పాటలు పాడుకుంటూ.

-----------------------------.

గస్తీ తిరుగుతున్న ఇద్దరు సెక్యూరిటీ వాళ్ళకి ఎందుకో అనుమానం వచ్చింది.

వెనుక గేటు ఏదోలాగుందే! అది బంద్ చేసి ఉంటుందన్నారు.. ఊగుతున్నట్లుంది. తాళం సరిగ్గా ఉందా! చెక్ చేస్తే పోలా.. లోపలున్న జీహాద్ వీరులందర్నీ తామే కద రక్షించాలి!

ఇద్దరూ వెనక్కి వెళ్ళారు.

"అవ్ భాయ్! ఖుల్లా హై. కోన్ హై యహా?" కోపంగా అరుస్తూ గేటు దగ్గరికి వెళ్ళారు.

నలుగురు పోలీసులు, ఇద్దరి మీద పడి నోరు నొక్కేసి, కాళ్ళూ చేతుల కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి వాన్ లో పడేశారు. వాళ్ళ బట్టలు తీసి ఇద్దరు వేసుకున్నారు. ఆ వాన్ నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. ఆ స్థానంలో ఇంకొక వాన్ వచ్చి నిలిచింది.

సెక్యూరిటీ వాళ్ళ యూని ఫామ్ వేసుకున్న ఇద్దరు ఆర్మీ వాళ్ళూ స్వేచ్ఛగా కళ్యాణమంటపం లాన్లలో తిరగడం మొదలెట్టారు. అక్కడి సెక్యూరిటీ అంతా వేర్వేరు చోట్ల నుంచి వచ్చిన వాళ్ళు. అందుకని కొత్తవాళ్ళనెవరూ గుర్తు పట్టలేదు. ఆవరణ అంతా చెట్లతో నిండి ఉండడం వల్ల పగలైనా వెలుతురు అంతగా లేదు.

"భాయ్! ఇథర్ ఆవ్." తమకు ఎదురు పడ్డ ఇద్దర్ని పక్కకి తీసుకెళ్ళారు.

"పీఛే.. జర జాదా గస్తీ కర్నా. మేం కూడా వెళ్ళి వచ్చాం. గేట్ వీక్ హై." చెవిలో చెప్తున్నట్లుగా చెప్పి ముందుకెళ్ళిపోయారు.

"బడే సాబ్ కి చెప్దామా?"

"క్యాకర్ నా? అందర్ హై."

"హాల్ మానేజర్ ఏడీ? ఇప్పటి వరకూ ఇక్కడే ఉండాలే.."

"కామ్ కి వెళ్ళినట్లున్నాడు.

"చలో! హమ్ దోనోం చలేంగే." ఇద్దరూ వెనక్కి వెళ్ళారు. వాళ్ళ పనీ అంతే అయింది. ఇంకొక వాన్ వచ్చి నిలిచింది. ఇద్దరు కొత్తవాళ్ళు వచ్చారు. అలా.. ఆవరణ అంతా ఆర్మీ వాళ్ళతో, పోలీసుల్తో నిండి పోయింది. సెక్యూరిటీవాళ్ళు యాభై మంది ఉంటే వీళ్లు నూటాభై మంది. ఫ్రంట్ లోనూ, కళ్యాణ మంటపం లోనూ సెక్యూరిటీ యూనిఫామ్ వాళ్ళు, మిగిలిన వాళ్ళు చెట్ల చాటున..

అప్పుడు మూడు గంటలయింది. హాల్లో ఢిల్లీ నుంచి వచ్చిన, పెళ్ళికొడుకు తండ్రి బాబా, స్లైడ్లు చూపించి వివరిస్తున్నాడు. అభావంగా మొహం పెట్టి కుంభా స్టేజ్ మీదనే కూర్చున్నాడు. ఇద్దరు నాయకుల తరువాత అతనే ప్రాముఖ్యమున్నవాడు.

భోజనాల దగ్గర బాబా తలమీద అతను కొట్టినప్పుడే తెలిసింది.. అతనే కల్నల్ ప్రభాకర్ ని చంపిన వాడని.

వేసి ఉన్న హాలు తలుపు టక్ టక్ శబ్దం అయింది. బాబా చెప్తున్నది ఆపేసి ప్రొజెక్టర్ స్విచ్ ఆర్పేశాడు.

"క్యా హువా? డిస్టర్బ్ మత్ కరో అని చెప్పాకదా!" తలుపు దగ్గర నిలుచున్న వాళ్లతో అన్నాడు క్రోధంగా.

ఓరగా తలుపు తీసి చూశారు. బైట సెక్యూరిటీ చీఫ్..

"జనానా చలే గయే సాబ్. కుఛ్ హోనా?"

"నయీ.. దిస్టర్బ్ మత్." దబ్బుమని తలుపేసేశాడు.

బయట అంతా ఆక్రమణ అయిపోయింది. అప్పటి వరకూ బాబా చూపిస్తున్న స్లైడ్స్ ని చూస్తూ, కుర్చీ పట్టుకుని కోపాన్ని నిగ్రహించుకుంటున్న కల్నల్ ఇస్మాయిల్ ఒక్క ఉదుట్న లేచాడు.. పిస్టల్ చేతిలో పట్టుకుని.

--------------------------.

13

రాజు కాళ్లూ చేతులూ కొంచెం కదిపాడు. పక్కనున్న నర్స్ డాక్టర్ని పిలవడానికి పరుగెత్తింది. డాక్టర్ వెంటనే వచ్చాడు. పల్స్ నార్మల్ కి వస్తోంది. శరీరం కూడా.. నీలం రంగు తగ్గుతునట్లుగా అనిపిస్తోంది. ఫరవాలేదు..

అప్పుడే భోజనాలు చేసి, గోపాల్, చక్రపాణి లోపలికి వస్తున్నారు.

"డాక్టర్!" గోపాలాచారి పిలుపు విని వెనక్కి తిరిగాడు డాక్టర్.

"ఎట్లా ఉంది?"

"ఫరవాలేదు. కానీ ఇంకా క్రిటికల్ అనే చెప్పచ్చు. కొంచెం హోప్ కనిపిస్తోంది."

"అతను బ్రతికి బైట పడితే ఫుడ్ పాయిజనింగ్ అని చెప్తారా?"

ఒక్కక్షణం ఆలోచించాడు డాక్టర్. ఆ హాస్పిటల్కి ఎడ్మినిస్ట్రేటివ్ ఇన్ ఛార్జ్ యస్.యి ఏడియమ్. సూయిసైడ్ అంటే పోలీసులూ గొడవా..

"చూద్దామండీ.. అదేం ప్రాబ్లం అనుకోను."

"థాంక్యు డాక్టర్. నాలుగింటికి అతని పేరెంట్స్ వస్తారు. అప్పుడు మీరు అవసరమైన డ్రగ్స్ ఇవ్వచ్చు." గోపాల్, చక్రపాణిని తీసుకుని బైటికి వెళ్ళాడు.

"ఏం చేద్దామంటావు? నాకు చాలా భయంగా ఉంది. ఏమైనా అయితే..ఇతను చేసిన ప్రచారంతో అమ్మాయి మీదికి వస్తుందేమో! పోలీస్ కేస్ అదీ.." చక్రపాణి విచారంగా అన్నాడు.

"అసలు అమ్మాయి పోలీస్ స్టేషన్ కి వెళ్ళి రిపోర్ట్ ఇవ్వవలసింది. ఇప్పుడితను ఇలా చెయ్యడంతో అందరూ అతని మెద జాలి చూపిస్తారు."

"నిజమే రా. అలా చెయ్యాలని ఆ సమయంలో తట్టదు కదా! ఏదో విధంగా బైటపడి మా దగ్గర కొచ్చేస్తే బ్రతికితే చాలనుకుంది."

"నా ఆఫీసుకెళ్దాం పద. యస్సై ని పిలిచి మాట్లాడుదాం. ఏమైనా సాయం చేస్తాడేమో!" గోపాల్ ఆఫీసుకెళ్ళారిద్దరూ.

తన కుర్చీలో కూర్చుని టైమ్ చూసుకున్నాడు గోపాలాచారి. రెండవుతోంది.

"నువ్విక్కడే కూర్చోరా. సి.యి గారికో మాట చెప్పొస్తాను."

గోపాల్ సి.యి గారి ఛాంబర్ లోకెళ్ళాడు. అప్పుడే సివిల్ ఇంజనీర్లకి యువత మీటింగ్ గురించి చెప్పి, గోపాల్ కి కూడా చెప్పాడు శ్రీనివాస్.

"నాక్కూడా ఈ ప్రాజక్ట్ బాగా నచ్చింది సార్. నిన్నటి గొడవలో రాజు అని.." రాజు సంగతి క్లుప్తంగా వివరించాడు గోపాల్.

"నిన్న పొద్దున్న అతని వ్యవహారం చూస్తే నాకు కొంచెం అనుమానం వేసింది. కానీ.. ఇప్పుడు ఆడపిల్లల్ని కూడా అంత నమ్మ లేకుండా ఉన్నాం కదా!"

"నిజమే. మీరు ఒకసారి ఆ అమ్మయిని చూస్తే అలా అనుకోరు. కళ్ళల్లో ఉన్నాయి ప్రాణాలు. ఒంటి నిండా అంగుళం ఖాళీ లేకుండా ఉన్నాయి దెబ్బలు. ఆఖరికి పిల్లల్ని కూడా వదల్లేదు."

"అయ్యో.. అలాగా! అయితే యస్.ఐ ఫ్రీగా ఉన్నాడేమో చూద్దాం. పోలీస్ స్టేషన్ కి ఫోన్ చెశాడు శ్రీనివాస్.

"హలో.. సి.ఐ గారా! గుడాఫ్టర్ నూన్ సార్. మీ ప్లాంట్ లో పట్టుకున్న టెర్రరిస్ట్ లు చాలా రికార్డున్న వాళ్ళు సార్. మేం పట్టిచ్చినందుకు, హెడాఫీసు వాళ్ళు చాలా మెచ్చుకున్నారు సార్." సంతోషంగా అన్నాడు యస్. ఐ.

"గుడ్.. ఇప్పుడు వేరే పని మీద ఫోన్ చేశాను. మీరు ఫ్రీగా ఉన్నారా.." జానకి గురించి వివరించాడు. "మీ స్టేషన్ కి వద్దామనుకుంటున్నాం నేనూ, యస్. యి ఏడియమ్ గారూ."

"మీరెందుకు సార్? అమ్మాయిని, వాళ్ళ ఫాదర్ ని పంపించండి.నేను చూసుకుంటాను." తను సాయం చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉన్నాడు యస్సై.

"థాంక్యూ. అరగంటలో అక్కడుంటారు."

"ఎందుకైనా మంచిది నేను కూడా వెళ్తాను. ఏమంటారు?" గోపాల్ లేచాడు.

"వెళ్ళి రండి. మీ ఫ్రెండ్ కి కాస్త ధైర్యం గా ఉంటుంది."

గోపాల్, చక్రపాణీ ఇంటికి వెళ్ళి జానకిని తీసుకుని, పోలీస్ స్టేషన్ కి వెళ్ళారు.

"మీరెందుకొచ్చారు సార్? నేను చూసుకునే వాణ్ణి కదా!" గోపాల్ ని చూసి అన్నాడు యస్.ఐ.

"మీకు అంతా వివరిద్దాము స్వయంగా అని వచ్చాను.." రాజు సూయిసైడ్ అటెంప్ట్ గురించి చెప్పాడు.

"అదా! మొన్న రిపోర్ట్ ఇచ్చినట్లు రాసేద్దాం. ఎలాగైనా ఒక కాపురం నిలబెట్టాలి మనం. అతను ఇంటి కొచ్చేశాక, ఏమైనా చేస్తే పోలీస్ ప్రొటెక్షన్ ఉందని చెప్పచ్చు." ఇంత సులభంగా తేలిపోతుందని అనుకోని చక్రపాణి, రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు.

"మీరు పెద్దవారు. ఊరుకోండి సార్!" యస్.ఐ జానకి చేతులు, కాళ్ళుమొహం ఫొటోలు తీశాడు. కొన్ని దెబ్బలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. మందులేం వెయ్యలేదు కదా!

కావలసిన సంతకాలు తీసుకుని ఫైల్ లోపల పెట్టాడు యస్.ఐ.

మళ్ళీ మళ్ళీ కృతజ్ఞతలు చెప్తూ పోలీస్ స్టేషన్ నుంచి బైటికి వచ్చి హాస్పిటల్ కి వెళ్ళారు. జానకి దెబ్బలకి మందులు, యాంటి టిటానస్ ఇంజక్షన్ ఇప్పించి నొప్పులు తగ్గడానికి మాత్రలు ఇచ్చారు.

"అంకుల్.." జానకి పిలుపు విని తన కేసి చూశాడు గోపాల్.

"ఒకసారి అతన్ని చూడచ్చా?" గోపాల్ కి మనసులో ఒక పొర కదిలి నట్లయింది. వివాహ బంధం ఎంత గొప్పది!

"తప్పకుండా నమ్మా. పద.." అందరూ రాజు బెడ్ దగ్గరికి వెళ్ళారు.

బైట వరండాలో ఎవరూ లేరు. ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళిపోయారు.

ఒంటరిగా నిస్సహాయంగా పడుక్కున్న రాజుని చూస్తే అందరికీ ఒక్క క్షణం జాలేసింది. అప్పుడే కళ్ళు తెరిచి జానకిని చూశాడు

రాజు. జానకిని చూడగానే అతని మొహం తేటగా అయింది. ఏదో మాట్లాడబోయి ఆయాసం వచ్చి ఆగిపోయాడు. చక్రపాణి వెళ్ళి గబగబా డాక్టర్ని పిలుచుకొచ్చాడు.

డాకర్ వచ్చి పల్స్ చూసి, ఇంజక్షన్ ఏదో ఇచ్చాడు.

“గుడ్.. ఇంక అవుటాఫ్ డేంజర్. మీరు చూసుకుంటారు కదా.” జానకిని చూసి అన్నాడు.

జానకి కళ్ళు విప్పార్చి చూసింది నిర్ఘాంతపోయి.

------------------------..

ఉలిక్కిపడి లేచాడు మౌళి. “అబ్బ.. ఎంత సేపు నిద్రపోయానో.” అనుకుంటూ.

బైట అంతా కోలాహలంగా ఉండడంతో వీధిలోకి వచ్చాడు. పిల్లలంతా గుంపులు గుంపులుగా, మాట్లాడుకుంటూ కమ్యూనిటీ హాలు కేసి వెళ్తున్నారు.

“అమ్మో.. ఆలిశ్యం అయిపోతోంది.. నేనే బద్ధకిస్తే ఎలా..” గబగబా లోపలికెళ్ళి చల్లని నీళ్ళతో మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని హాలు దగ్గరికి వెళ్ళిపోయాడు. ఉష అప్పటికే స్టేజ్ మీద ఏర్పాట్లు చూస్తోంది. కమ్యూనిటీ హాలు వాళ్ళే చాలా వరకూ చేసేశారు.

మౌళి తన లాప్ టాప్ కనెక్షన్స్ ఇచ్చి, స్క్రీన్ మీదికి వస్తోందా లేదా అని చూసుకున్నాడు. చూపించవలసిన వన్నీ క్రమంలో ఇంట్లోనే సర్దేసుకున్నారు తనూ, ఉషా. కర్టెన్ వేసేశారు, స్టేజ్ మీద.

నాలుగింటికి మీటింగంటే మూడింటి నుంచే అందరూ రావడంమొదలెట్టారు. వర్కర్స్ కాలనీ పిల్లలందర్నీ తిలక్ వెనుక వరుసల్లో కూర్చో పెడుతున్నాడు. ఇంజనీర్ల పిల్లలందరికీ మొదటి నాలుగు వరుసలూ వదిలేశారు.

“అంతా చెప్పక్కర్లేని క్రమశిక్షణ లాగుంది. ఖాళీ లేకపోతే వెళ్ళిపోయినా వెళ్ళిపోతారు వాళ్ళు.” మౌళి, ఉషతో అన్నాడు.

ఉష అవునన్నట్లుగా తలూపింది.

వర్కర్స్ కాలనీలోనే ఎక్కువమంది పిల్లలున్నారు. ఒక్కో కుటుంబానికి ముగ్గురు, నలుగురు. ఇంజనీర్ల కి ఇంటికిద్దరే. ఒక్కో ఇంట్లో ఒక్కొక్కళ్ళే కూడా. యస్.యి గార్ల పిల్లలందరూ పెద్ద ఉద్యోగాల్లో చదువుల్లో ఉన్నారు. ఒక్క ఉషే సీనియర్ ఇంజనీర్ల పిల్లల్లో చదువుతున్నది.

డాక్టర్ గారి అమ్మాయి, అబ్బాయి వచ్చేశారు. అమ్మాయి బి.యస్సీ ఫస్ట్ ఇయర్, అబ్బాయి ఇంటర్ ఫస్ట్ ఇయర్. లేడీ డాక్టర్ గారికి ఒక్కతే అమ్మాయి. ముందు రోజు రాత్రే ఊరికెళ్ళిందిట. రాలేదు.

అంతలో సరోజిని స్టేజ్ మీదికి వచ్చింది.

“అక్కా! మీ కోసం ఎవరో వచ్చారు.” ఉషని చూస్తూ అంది, కళ్ళతో నవ్వుతూ.

“నాకోసమా.. లోపలికి రమ్మను.”

“రాలేరక్కా. మీరే బైటికి రావాలి.” కొంటెగా అంది.

ఉషా, మౌళీ ఇద్దరూ హాలు బయటికి వచ్చి ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు. ఉష చటుక్కున మౌళి చెయ్యి పట్టుకుంది అసంకల్పితంగా. మౌళి తన చేతినీ ఉష చేతినీ మార్చి మార్చి చూశాడు.

“అబ్బా.. ఎంత వెచ్చగా ఉంది..” మౌళి చూడ్డం గమనించిన ఉష చెయ్యి తీసేసింది కాస్త సిగ్గుగా.

“ఏం చేద్దాం మౌళీ?”

“అదే అర్థం అవడం లేదు.”

కమ్యూనిటీహాలు ముందు లాన్ లో హైస్కూలు పిల్లలందరూ వచ్చి నిలబడ్డారు. గవర్న్ మెంట్ స్కూలు, కాన్వెంటు, విద్యానికేతన్.. అన్ని స్కూల్స్ నుంచీ.. ఎయిత్ క్లాస్ వరకూ.. మరీ చిన్నపిల్లలకి ఎవరు చెప్పలేదేమో.. వాళ్ళు రాలేదు.

రెండు వందలమంది పైగా అమ్మాయిలు, అబ్బాయిలు. ఒకచోట స్థిరంగా నిలబడ్డం కష్టమే వాళ్ళకి. కొందరు రెండుకాళ్ళు కదుపుతూ డాన్స్ చేస్తూ, కొందరు పిడికిలి బిగించి వదులుతూ, కొందరు లొడలొడ మాట్లాడుతూ.. రకరకాల విన్యాసాలు చేస్తున్నారు.

మూడు స్కూళ్ళ హెడ్, బాయిస్, గర్ల్స్ వచ్చి ఉష దగ్గర నిలుచున్నారు. స్కూల్ డిసిప్లిన్ పాటించాలి కదా!

"ఏంటక్కా! మమ్మల్ని పిలవలేదు. పార్టీ ఇస్తున్నావట కదా! ఇంకా ఏదో పిక్చర్ చూపిస్తున్నావట. ఓన్లీ కాలేజెస్ వాళ్ళకేనా? అన్యాయం అక్కా. అందుకే మేం వచ్చేశాం."

ఓహ్.. రిఫ్రెష్ మెంట్స్ తెమ్మంది కదా! హాల్లో తెర అదీ పెట్టడం చూసి ఎవరో ఊది ఉంటారు. టౌన్ షిప్ లో కట్టు అలా ఉంటుంది మరి.

ఆపద్బాంధవుడిలా గోపాల్ వచ్చాడు. వెనుకే యస్. యి రమేష్, డి.యి సుందర్.

"ఏంటమ్మా! ఏదో ప్రభంజనం లాగుంది." నవ్వుతూ అన్నాడు గోపాల్.

"అంకుల్! నేనేదో అనుకుంటే ఏదో అవుతోంది. ఏం చెయ్యాలి?" నిస్సహాయంగా అంది ఉష.

"ఈ పిల్లకాయలక్కూడా సెలవులేగా?"

"అవునంకుల్. మేం కాయలు గాదంకుల్." విద్యానికేతన్ అమ్మాయి కినుకగా అంది.

"మీరు పిడుగులమ్మా! అందరూ గొడవ చెయ్యకుండా కంట్రోల్ చెయ్యాలి మీరు. ఫోరో క్లాక్ కి మీటింగ్. అప్పటి వరకూ అల్లరి చెయ్యకుండా చూడండి. ఓకే!"

"ఓకే అంకుల్." హెడ్స్ అందరూ మార్చ్ చేసుకుంటూ వెళ్ళిపోయారు లాన్స్ లోకి.

"అంకుల్! హాల్లో వీళ్ళందరూ పట్టరు. ఎలాగ?" కీచు గొంతుతో అంది ఉష. మౌళి ఏం మాట్లాడలేదు. ఇట్లాంటిదెక్కడ ఊహించారు..

గోపాలాచారి, యస్.యి ఏడియమ్.. బాగా తల పండిన వ్యక్తి. ఇటువంటి అత్యవసర సమయాల్లో ఏం చెయ్యాలో తెలియకపోతే ఆ స్థానంలో ఎందుకుంటారు?

అంతలో భారతికూడా వచ్చింది. ఇక్కడి పరిస్థితి ఎవరో చెప్పినట్లున్నారు. వచ్చే ముందే రెండు వందల మందికి ఎక్స్ట్రాగా స్నాక్స్ కి ఆర్డర్ ఇచ్చి వచ్చింది.

ఆఫీసర్ల కాలనీల్లో పిల్లలు కూడా వచ్చేశారు. మొత్తం టౌన్ షిప్ అంతా హాలు దగ్గరున్నప్పుడు, వాళ్ళు డివిడిలు చూస్తుంటే ఎల్లాగ.. వాళ్ళ అమ్మలు తరిమేశారు. ఊరిలో లేని వాళ్ళు, పన్నెండేళ్ళలోపు పిల్లలు తప్పం అందరూ అక్కడే ఉన్నారు.

గోపాలాచారి చార్జ్ తీసుకున్నాడు.

స్క్రీన్ ని బయట పెట్టించారు. కమ్యూనిటీ హాలు దగ్గర ఆరు బయట కూడా స్టేజ్ ఉంది. అక్కడ కూడా ప్లగ్ లూ, మైక్ సెట్ పెట్టడానికి, తెరలూ.. అన్ని సదుపాయాలూ ఉన్నాయి. న్యూ ఇయర్ వేడుకలూ, ఆగస్ట్ పదిహేను.. కొన్ని ఫంక్షన్స్ అక్కడ జరుగుతాయి.

పిల్లలంతా లాన్ లో కూర్చున్నారు. లోపలున్న పెద్ద పిల్లల్ని బైటికి రమ్మని, కుర్చీలన్నీ వెనుక పక్క వేయించారు. కావాలంటే కుర్చీల్లో, లేదా కింద కూర్చోవచ్చు.

మౌళి గబగబా లోపలికి వెళ్ళి, తన లాప్ టాప్ తెచ్చి కనెక్షన్స్ ఇచ్చుకున్నాడు.

రాముడికి కిష్కింద వాసులు సహాయం చేసినట్లుగా, పిల్లలే లోపలివన్నీ బయటికి సర్దడంలో సాయ పడ్డారు. మంచినీళ్ళు నింపడం, గ్లాసులు సర్దడం.. పిల్లల్ని వర్సగా పొట్టీ పొడుగుల ప్రకారం కూర్చోపెట్టడం, అప్పుడే వచ్చిన కారప్పూస మిఠాయిలని ప్లేట్లలో సర్దడం.. అన్నీ సహజంగా చులాగ్గా జరిగిపోయాయి.

"అక్కా! మేం కూడా హెల్ప్ చేయద్దా!" కింద కూర్చున్న వాళ్ళు కూడా అడుగుతున్నారు.. డ్గంగ్ మని లేచి నిలుచునే వాళ్ళు కొందరయితే.. వాళ్ళని ఒక్కటిచ్చి కూర్చోపెట్టే వాళ్ళు కొందరు.

"ఇదేదో పబ్లిక్ మీటింగ్ లాగుంది. మనం చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. ముఖ్యంగా పిల్లల్లో కమిట్ మెంట్, ఇంట్రెస్ట్ క్రియేట్ చెయ్యాలి. ఎలాగో.." మౌళి గాభరాగా అంటుంటే..

"నేను మానేజ్ చేస్తాగా!" అభయం ఇచ్చింది ఉష.

------------------------

ఎంతో అందంగా ఠీవిగా కనిపించే కళ్యాణమంటపం.. కొద్ది క్షణాల్లో లోపల సెగలు కక్కబోతోంది. అందంగా కుండీలతో, పెయింటింగ్స్ తో అలంకరించిన కాన్ఫరెన్స్ హాల్లో..

కల్నల్ ఇస్మాయిల్ లేచాడు.. ఉగ్రనరసింహావతారంలా. పిస్తోలు చేతిలో పట్టుకుని తమ నాయకుడు లేవడం చూసిన, మిగిలిన స్క్వాడ్ వాళ్ళందరూ ఒక్క ఉదుట్న లేచారు. అందరి చేతుల్లో పిస్తోళ్ళు. వాళ్ళంతా స్లైడ్స్ చూస్తూ, లెక్చర్ వింటున్నా ధ్యాస అంతా కల్నల్ మీదే.. అతని కదలిక మీదే.

అప్పటి వరకూ బాబా చూపిస్తున్న స్లైడ్స్ లో ఏముంది? మారణ హోమం. పచ్చగా కళకళ్ళాడుతున్న పంటపొలాలూ.. వాటితో తమ నాయకులూ, అమాయకులైన ప్రజలూ.. అందర్నీ సర్వనాశనం చేసే పథకాలు. బిగపట్టుకుని ఆపుకుంటున్న అవేశం ఉప్పెనలా బైట పడింది.

హాలు లోపల ఏమి చెయ్యాలో రెండు, మూడు రకాల ప్లాన్స్ ముందే వేసి, ఇస్మాయిల్ అందర్నీ సిద్ధం చేశాడు. ఒక్కొక్క స్క్వాడ్ మెంబరూ యుద్ధాల్లో ఢక్కామొక్కీలు తిన్న వాళ్ళే. ముందుగా సెక్యూరిటీ వాళ్ళని కాల్చేశారు.

ఎక్కడి వాళ్ళక్కడ కుప్ప కూలిపోయారు. వాళ్ళు బైటినుంచి ఎవరైనా వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు కానీ.. లోపల.. ఊహించలేదు. ఆ అనూహ్యమే కల్నల్ బృందానికి అవకాశమయింది.

హాల్లో కూర్చున్న అతిథులలో చాలా మంది దగ్గర ఆయుధాలున్నాయి. అందరూ ఆరి తేరిన వాళ్ళే. మెరుపుల్లా తమ జేబుల్లోంచి తుపాకులు తీశారు. కానీ ఒక్క క్షణం వెనుక. అది చాలు..

అయినా.. కొంతమంది స్క్వాడ్ వీరుల మీద ఆ కాల్పుల ప్రభావం పడింది.. ఎంత జాగ్రత్తగా ఉన్నా. శత్రువులు సామాన్యులు కాదు కదా!

కుర్చీలు అడ్డు పెట్టుకుని, పాకుతూ.. కనిపించిన విద్రోహులందర్నీ కాల్చేశారు. ప్రాణాలు వదిలేస్తూ కూడా కనీసం ఒకర్నైనా చంపకుండా వదల్లేదు వీర జవాన్ లు. ఉగ్రవాదులైతే పకపకా నవ్వుతూ మరణించారు. పవిత్ర యుద్ధం కదా!

బాబా, అతని అనుచరుడూ తేరుకునే లోగా స్టేజ్ మీదికి గెంతాడు కల్నల్ ఇస్మాయిల్. ఈ క్షణం కోసమే అతను ఇన్ని సంవత్సరాలుగా ఎదురు చూసింది. ఆ వయసులో కూడా, నిత్యం వ్యాయామంతో కడ్డీలా అయిన శరీరం చులాగ్గా ఎగిరింది.

కుంభా బల్లకిందికి దూరి పిస్తోలు తీసి కాలుస్తున్నాడు. కానీ మెరుపువేగంతో దూసుకొస్తున్న ఇస్మాయిల్ నీ అతని అనుచరుల్నీ గురి

పెట్టలేకపోతున్నాడు.

ఇస్మాయిల్ కుడి చేతిలో పిస్తోలుని బాబా కణతకి ఆనించి పట్టుకుని, అతని ముఖ్య అనుచరుడ్ని, కుంభాని పిస్తోళ్ళని కింద పడేయమన్నాడు. కుంభా కింద పడేసి, చేతులు పైకెత్తి నిలుచున్నాడు.

అప్పుడు జరిగిందొక విచిత్రం..

"పవిత్ర యుద్ధంలొ వ్యక్తులకి ప్రాధాన్యత ఉండ కూడదు." అంటూ ముఖ్య అనుచరుడు, శేర్ జీ, బాబాని కాల్చేశాడు.

"ఇప్పుడు నేనే లీడర్ని" అని తన వాళ్ళందర్నీ హుషారు చేస్తూ కుర్చీలు అడ్డు పెట్టుకుని స్వైర విహారం చెయ్య సాగాడు. ఆ సమరంలో.. కుంభా బల్ల దగ్గర బోర్లా పడుక్కున్నాడు చలనం లేకుండా.

బాబా నిర్జీవ శరీరాన్ని అడ్డుగా డాలులా పెట్టుకుని ఇస్మాయిల్ విజృంభించాడు. అడ్డూ ఆపూ లేకుండా రెచ్చిపోతున్న వజ్రాల వ్యాపారి.. ప్రస్థుత నాయకుడు.. ముప్పై సంవత్సరాల నుండీ తనది కాని జీవితం గడుపుతున్న పవిత్ర యుద్ధ వీరుడు.. బల్ల కింద నుంచి కాల్పులు జరుపుతున్న సమయంలో.. బల్ల వెనుక బోర్లా పడుక్కున కుంభా చెయ్యి నెమ్మదిగా తన శేర్వాణీ జేబులోకి వెళ్ళింది. బాబా ఇచ్చిన పిస్తోలు తీసుకుని, కుంభా అతి నెమ్మదిగా.. పక్కకి తిరిగి ఇస్మాయిల్ ని కాల్చబోతున్న విద్రోహిని కణత మీద కాల్చేశాడు. నమ్మ శక్యం కాని చూపుతో కళ్ళు పెద్దవి చేసి చూసి.. అర్థం చేసుకున్నట్లుగా తలూపి పడిపోయాడు.. మూడో స్థానంలో ఉంటూ, ఎన్నో కార్య కలాపాలు నడిపి ఎంతమంది ప్రాణాలో తీసిన శేర్. తను బాబాకి చేసిందే, తన కింద వాడు తనకి చేశాడు.. న్యాయమే కద!

అదే సమయంలో నాయకుల్ని పోగొట్టుకున్న మిలిటెంట్ వీరులు ఏం చెయ్యాలో అర్థం కాక ఒక్క నిముషం ఆగగా.. తలుపులు తెరుచుకుని లోపలికి వచ్చిన పోలీసులు, ఒక్కొక్కళ్ళ దగ్గరా తుపాకులు తీసుకుని, బేడీలు వేసి, బైటికి పట్టుకు పోయి, వాన్లలోకి ఎక్కించేశారు.

ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. కల్నల్ ఇస్మాయిల్, భుజం పట్టుకుని స్టేజ్ మీద నిలబడి చూస్తున్నాడు. అంతా కలిపి పది నిముషాలు కూడా పట్టలేదు. యభై మంది పైగా ప్రాణాలు కోల్పోయినట్లు కనిపిస్తోంది. కొన ఊపిరితో కొంత మంది ఉండచ్చనుకున్నాడు ఇస్మాయిల్. అతని భుజంలోనుంచి గుండు దూసుకు పోయింది.. బల్ల కింది నుంచి సేర్ కాల్చినప్పుడు.

"అంకుల్!"

పిలుపు వినగానే ఒళ్ళు పులకరించింది ఇస్మాయిల్ కి.

"బేటా.. " కుంభా ఉరఫ్ భాస్కర్ ని గట్టిగా కౌగలించుకున్నాడు.. కళ్ళ లోనుంచి నీళ్ళు కారిపోతుండగా.

"అనుకున్నది సాధించావా భాస్కర్?" ఎన్ని ఏళ్ళ తరువాత ఈ పిలుపు విన్నాడు.. మధ్యలో జరిగిందంతా కల లాగా, తను పన్నెండేళ్ళ భాస్కర్ లాగా అనిపించింది కుంభాకి.

"అంతా మీ దయ అంకుల్.." భాస్కర్ బల్ల కింద కూర్చుండి పోయాడు.. ఉద్వేగంతో నోట మాట రాక.

"నీ పట్టుదల, పేషెన్స్ లకి మించిందే ముంది బేటా?"

"కల్నల్ సాబ్!" వెనుక నుంచి ఎవరిదో పిలుపు.

వెనక్కి తిరిగాడు ఇస్మాయిల్.

"ప్రెస్ వాళ్ళు వచ్చారు. ఏమయిందని అడుగుతున్నారు."

"ఐదు గంటలకి, డి.జి.పి ఆఫీస్ దగ్గర కాన్ఫరెన్స్ కి రమ్మని చెప్పండి." శల్యూట్ చేసి వెళ్ళిపోయాడు, వార్త తెచ్చిన మేజర్.

ఇంతలో అంబులెన్స్ ల గణగణలు వినిపించాయి.

"భాస్కర్! నేను ప్రైమ్ మినిస్టర్ తో, ప్రెసిడేంట్ తో చెప్పి ఉంచాను. ప్రస్తుతానికి నువ్వు కుంభాగా చని పోవాలి. లేకపోతే మిలిటెంట్లు నిన్ను వెంటాడుతారు."

"అర్ధమయింది అంకుల్. కల్నల్ ఇస్మాయిల్, ముగ్గురు లీడర్లనీ కాల్చేశారు. ఈ వార్త పేపర్లలో, ఛానెల్స్ లో కనిపించాలి.." భాస్కర్, బాబా శరీరం పక్కన కదలకుండా పడుకున్నాడు. అక్కడ ఇద్దరి రక్తం మడుగులా చేరింది అప్పటికే..

ఫొటో గ్రాఫర్ వచ్చాడు కామెరా తీసుకుని.

***

**"మీరున్నారు కదా** చూసుకోడానికి.." డాక్టర్ ఆ మాటలు అనిగానే జానకి తండ్రికేసి చూసింది.

"నువ్వేం ఉండక్కర్లేదమ్మా! కాసేపట్లో వాళ్ళ అమ్మ వస్తుంది. అంత వరకూ నర్స్ ని చూస్తుండమందాం." చక్రపాణి కూతురి చెయ్యి పట్టుకున్నాడు, నేనున్నానన్నట్లుగా.

"ఢాం.." ఏదో చప్పుడయింది. రాజు మంచం పక్కన. అతనుచెయ్యి కదిపినట్లున్నాడు. బల్ల మీదున్న కిడ్నీ ట్రే కింద పడిపోయింది.

చక్రపాణి, జానకి అటు చూశారు. రాజు దీనంగా చూస్తున్నాడు. వెళ్ళొద్దు అన్నట్లు తల అడ్డంగా తిప్పుతున్నాడు.అగ్నిసాక్షిగా తాళి కట్టినవాడు.. రక్షించి కాపాడవలసిన వాడు.. వాడే రోజూ కాటేస్తున్నా..

అలా నిస్సహాయ స్థితిలో వదిలి వెళ్ళడానికి జానకి ప్రాణం ఒప్పలేదు. తను వెళ్ళిపోతే మళ్ళీ మొదటికొస్తుందేమో! పోనీ వాళ్ళ అమ్మ వచ్చే వరకూ ఉంటే..

ఆ స్థితిలో మంచం మీద పడున్నవాడు లేచి కొట్టలేడు కదా!

"అత్తయ్య వచ్చే వరకూ నేనుంటాలే నాన్నా." రాజు కేసి చూస్తూ అంది.

రాజు కళ్ళు మూసుకున్నాడు.

"బాగా ఆలోచించు కున్నావామ్మా! మీ అత్తయ్య కూడా నిన్ను బ్లేమ్ చేస్తుందేమో.." గోపాలాచారి జాలిగా చూస్తూ అన్నాడు.

"నేను కూడా ఉంటాను. నువ్వు ఆఫీసుకెళ్ళరా.. ఏదో పనుందన్నావు కదా! ఒక సారి ఇంటికి ఫోన్ చేసి చెప్పు.. ఇకడున్నామని." వరండా లోంచి కుర్చీ తెచ్చుకుని కూర్చున్నాడు చక్రపాణి.

జానకి మంచం పక్కనున్న బెంచీ మీద కూర్చుంది గోడకానుకుని.

"కాసేపు పడుకోమ్మా. రెండు రోజుల్నుంచీ ప్రయాణాలు. అతను ఎలాగూ కొంచెం సేపటి వరకూ లేవడు." గోపాలాచారి ఇద్దరికీ జాగ్రత్తలు చెప్పి హాస్పిటల్ బైటికి వచ్చాడు.

సరిగ్గా అప్పుడే పిల్లలంతా కమ్యూనిటి హాలు వేపు నడుస్తుంటే, తను కూడ అటు నడిచాడు. "చాలా పెద్ద ప్రోగ్రామ్ లాగుందే.." అనుకుంటూ.

------------------------..

"టి.వీ పంపిచేశావామ్మా?" సంబరంగా అడిగాడు, అప్పుడే స్కూల్ నుంచి వచ్చిన అవినాశ్.

ముందు గది చక్కగా సర్ది ఉంది.అలివేలు ఫినాయిల్ బట్ట పెట్టి అప్పుడే తుడిచింది. కర్టెన్లు మార్చి, కుషన్ కవర్లు కొత్తవి వేసి మళ్ళీ సర్దింది సుగుణ.

"మా గదిలో పెట్టాను."

"ఓహ్.." నిరుత్సాహంగా అన్నాడు అవినాశ్. ఇంక గదిలోనే కూర్చుని చూస్తుందన్నమాట. ఏం లాభం..

"డాడీకి యాక్సిడెంట్ అయింది. కొన్నాళ్ళు రెస్ట్ తీసుకోవాలి. ఇంట్లోనే ఉంటారు. టైమ్ పాస్ అవాలి కదా! అందుకని మా రూంలో పెట్టాను." అటొక షూ, ఇటొక షూ.. సోఫా కిందికి స్కూల్ బాగ్ విసిరేసి పరుగెడుతున్న అఖిల్ ని పట్టుకుంది సుగుణ. అలివేలు వెనకాలే వచ్చి అన్నీ సర్దింది.

"ఏంటి మమ్మీ!డాడీకి యాక్సిడేంటా?" కళ్ళు పెద్దవి చేసి, భయం భయంగా అడుగుతున్న పిల్లల్ని పట్టుకుని దగ్గరికి లాక్కుంది.

"అవును. కులాసాగా ఉన్నారు. సాయంత్రం వస్తున్నారు. మీరు గుడ్ బాయిస్ లా ఉండాలి. డాడీని సతాయించ కూడదు."

"యస్ మమ్మీ.. ఉంటాం. యాక్సిడెంట్ ఎలా అయింది? కార్ టక్కరా?"

"లేదు నాన్నా.. తొడలోంచి తుపాకీ గుండు దూసుకెళ్ళింది."

"వాట్.. గన్ నా? డాడీ డిష్యుం డిష్యుం ఫైట్ చేశారా?" అఖిల్ చేత్తో యాక్షన్ చేస్తూ అన్నాడు.

అవినాశ్ మాత్రం బట్టలు విప్పుకుంటున్నవాడు ఆగిపోయి వింటున్నాడు. అంతా అర్థం అవుతుంది కదా! మొహంలో భయం.. కళ్ళనిండా నీళ్ళు..

సుగుణ నేల మీద ఇద్దరి మధ్యనా కూర్చుంది.

"డాడీ ఫైట్ చెయ్యలేదు. పోలీసులూ, బాడ్ గైస్ ఫైట్ చేసుకుంటుంటే అక్కడున్న డాడీకి తగిలింది."

ఇంక మొదలయ్యాయి.. అంతులేని ప్రశ్నలు. తనకు తెలిసున్నంత వరకూ, వాళ్లకి అర్థమ్యే రీతిలో వివరించింది.

"అయితే డాడీ హీరోనా? బాడ్ పీపుల్ ని పట్టుకోడానికి హెల్ప్ చేశారా?" అవినాశ్ ఆరాధనగా చూస్తూ అడిగాడు.

"అవును కన్నా! మనం డాడీ వచ్చేసరికి టిఫిన్ తినేసి, హోవర్క్ చేసేసుఉని రెడీగా ఉండాలి కదా!"

"ఓ యస్ మమ్మీ!" ఇద్దరూ బట్టలు మర్చుకుని తయారయి, వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయారు.

సుగుణ మరోసారి డ్రాయింగ్ రూమ్ సర్ది, అగరొత్తులు వెలిగించి, వంటింట్లోకి నడిచింది. ఏం కూరలు చెయ్యాలి? అలివేలు, ఉన్న కూరలన్నీ తరిగి పెట్టింది.

సూప్ పెడ్తే.. రాగానే వేడిగా తాగుతారు కదా! టొమాటోలు కుకర్ లో పెట్టి, రవికి ఇష్టమైన బెండకాయ వేపుడు, పాపు పులుసు, కొబ్బరి పచ్చడి చేద్దామని అన్నింటికీ సిద్ధం చేసుకో సాగింది.

"అమ్మా టీ పొయ్యరా?" అలివేలు. పాపం పొద్దుట్నుంచీ ఇల్లు సర్దడంతో ఒళ్ళు హూనమైపోయుంటుంది.

"పెడతానుండు. మధ్యాన్నం ఏమైనా తిన్నావా?"

"పొద్దున్నే మనింట్లో తిన్నా కదమ్మా! అంతే. ఇంటికి పోకుండా ఇక్కడ్నే ఉన్న కదా.."

అయ్యో మర్చిపోయా.. అనుకుంటూ, మధ్యాన్నం మిగిలిన సాంబారు అన్నం, పళ్ళెంలో పెట్టి టీకి నీళ్ళు పడేసింది గాస్ మీద.

"రోజూ ఏం చేస్తావే?"

"సాయంత్రం బాబులు తినగా మిగిలినవి తింటానమ్మా."

వాళ్ళు స్కూల్నుంచి వచ్చి ఏం తింటున్నారో.. మొత్తం ఇదే ఖాళీ చేస్తుందన్నమాట.. ఇకనుంచీ జాగ్రత్తగా చూసుకోవాలి. దీనిక్కూడా కడుపునిండా పెడ్తే.. సమస్యేముంది.. సుగుణ అప్పుడప్పుడే కళ్ళు తెరుచుకుంటున్న పాపాయిలాగ, తన ఇంటి పరిస్థితిని అవగాహన చేసుకుంటోంది.

---------------------..

"అమ్మా!" రవి బాధగా మూలిగాడు.

"సార్!" ఆంజనేయులు, భీమారావు ఒక్కసారిగా లేచారు. కునికి పాట్లు పడుతున్న సింగ్, చైతన్య, రహీమ్ కళ్ళు తెరచి చూశారు.

అప్పుడే ఒక గుంతలో పడి అంబులెన్స్ ఊగింది. మార్ఫిన్ మత్తులో కూడా రవికి నొప్పి తెలిసింది.

ఇంక అరవైమైళ్ళు ప్రయాణం చేస్తే టౌన్ షిప్ వచ్చేస్తుంది. పదకొండు గంటలకి పుందూరులో బయలు దేరారు. మధ్యలో భోజనానికి ఒక గంట ఆగి, టీ కూడా తాగి ప్రయాణం సాగిస్తున్నారు.

వాళ్ళతో వస్తున్న మేల్ నర్స్, రవి దగ్గరగా వచ్చి పల్స్ అవీ చూశాడు.

"సార్ బాగానే ఉన్నారు. కట్టు అదీ టైట్ గానే ఉంది. కుదుపుకు అదిరినట్లుంది. అంతే.." గ్లూకోజ్ డ్రిప్ ఒక సారి సరి చేసి, కూర్చున్నాడు.

అంబులెన్స్ డ్రైవర్ చాలా జాగ్రత్తగా పోనిస్తున్నాడు.

రవి సైగ చేసి ఆంజనేయుల్ని పిలిచాడు.

"అమ్మకి ఫోన్ చేశారా?"

"మీ అమ్మగారికి పొద్దున్నే చేశాం సార్! మనం వెళ్ళే సరికి వచ్చేసుంటారు."

రవికి కళ్ళల్లో నీళ్ళు కారిపోతున్నాయి.

ఒక్కరోజు కూడా అమ్మని దగ్గర ఉంచుకుని సుఖ పెట్టలేదు. వచ్చిన రెండు సార్లు, తనతో మాట్లాడే వాళ్ళు లేక,, సుగుణ పట్టించుకోకపోవడం చూళ్ళేక వెళ్ళి పోయింది. తను మాత్రం.. ఎప్పుడైనా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పాడా? తను పని చేస్తుంటే చూడ లేక, ఆవిడ చెయ్యలేక.. మనసు కష్టపెట్టుకుని వెళ్ళిపోయింది.

ఏమిటో! తనకి ఆవిడతో మాట్లాడ్డానికి సంగతులే ఉండేవి కాదు. చిన్నప్పుడు ఆవిడ దగ్గరే కుర్చుని గంటలు గంటలు గడిపే వాడు కదా! కానీ.. కష్టం వచ్చినప్పుడు అమ్మే గుర్తుకొస్తుంది. తనని చూసి ఆవిడ ఎంత బాధ పడుతుందో పాపం.

"సార్! ఊరుకోండి. బాధగా ఉందా? మళ్ళీ ఇంజక్షన్ ఇవ్వనా?"

"వద్దు. ఇంటికెళ్ళగానే అందరితో మాట్లాడాలి. ఇన్జక్షన్ ఇస్తే నిద్రే కదా!" దెబ్బ కంటే మనసు బాధ ఎక్కువగా ఉంది. దానికి మందు లేదు కదా! ఇప్పుడు తను బెడ్ రిడెన్ అయ్యాడు. ఇంట్లో పనులెల్లాగ.. ఏం చెయాలి? సన్నగ నొప్పి మొదలయింది.

అమ్మ ఉంటే అలివేలు చేతనైనా పని చేయిస్తుంది. సుగుణ కొంతయినా బాధ్యతగా ఉంటే.. ఎంత ప్రయత్నం చేశాడు తను! ఎక్కడుంది లోపం? తను కొంచెం అర్ధం చేసుకుని.. మాట్లాడి ఉంటే.. అలా నిర్లిప్తంగా వదిలెయ్యకుండా ఉంటే మారేదేమో! వద్దు.. ఈ ఆలోచనల్తో తల నొప్పి వస్తోంది. తల విదిలించాడు.

"సార్! ఏం కావాలి?"

వీళ్ళు ఎప్పుడూ తనకేసే చూస్తుంటారా..

"ఆ టెర్రరిస్టులందరూ ఏమయ్యారు? హోస్టేజెస్?"

రవి స్పృహ తప్పి పడిపోయాక పల్లేరులో ఏమయిందో అతనికి తెలియదు.

"పోలీసులు ఆర్మీ వాన్ లో అందరినీ హైద్రాబాద్ తీసుకుపోయారు సార్! మన దగ్గర జరిగిన ఈ అటాక్ చాలా పెద్ద కుట్రని

ఆపుతుందని అనుకుంటున్నారుట. మనం బయల్దేరే ముంది యస్. ఐ మాట్లాడారు. హైద్రాబాద్ నుంచి మెచ్చుకుంటూ కమీషనర్ స్వయంగా మాట్లాడారుట. ఆంజనేయులు వివరించాడు.

రవి నీరసంగా నవ్వాడు, బొటనవేలు పైకెత్తి చూపుతూ. తమ శ్రమ వృధా కాలేదు.

"రేక్స్ స్టాఫ్ కి ఏమీ కాలేదు. అంతా క్షేమంగా ఉన్నారు. ఈ పాటికి వాగన్లన్నీ మన ప్లాంట్ దగ్గరికి చేరుతూ ఉంటాయి. రేపట్నుంచీ అన్ని యూనిట్స్ నడపడానికి వీలవుతుందంటున్నారు."

"కానీ.. నేను.."

"మీరు హాయిగా రెస్ట్ తీసుకోండి సర్! మేం రోజూ వచ్చి కబుర్లు చెప్తుంటాం. ఎంత.. రెండు నెలలు. ఇట్టే గడిచిపోతాయి." భరోసా ఇచ్చేశాడు ఆంజనేయులు.

మిగిలిన వాళ్ళు కూడా రవి దగ్గరగా వచ్చారు.

"అవును సార్! మనది నాలుగైదు రోజులు పిక్నిక్ అనుకున్నామా! ఒక్క రోజులో అయిపోయింది. మిగిలిన రోజులన్నీ మీ ఇంట్లోనే." రహీమ్ మాటలకి అందరూ నవ్వారు.

రవి కూడా నవ్వబోయి, "అమ్మా" అన్నాడు బాధతో.

--------------------

లోపలికి వస్తున్న వాళ్ళని చూస్తూనే తడబడుతూ లేచి నిలుచుంది జానకి. చక్రపాణి అప్పుడే బయటి నుంచి వచ్చాడు టీ తాగి. జానకి కి కూడా ఒక కప్పు తెచ్చాడు. టీ తాగుతున్నదల్లా, కప్పు పక్కన పెట్టేసి నిలుచుంది.

రాజు తల్లిదండ్రులు, విమల, శేషగిరి బస్సు దిగి సరాసరి హాస్పిటల్ కే వచ్చేశారు.

"ఎలా ఉంది? ఏం జరిగింది?" రాజు మంచం పక్కకి వెళ్ళి, అతని చెయ్యి పట్టుకుని అడిగింది విమల.

"అన్నయ్యా! మీ రెప్పుడు వచ్చారు? అసలేం జరిగింది? డెంగీ జ్వరమా?" విమల ప్రశ్నలకి ఏం చెప్పాలో, ఎలా మాట్లాడాలో అర్ధం అవలేదు జానక్కి.

రాజు నిశ్చింతగా నిద్ర పోతున్నాడు. జానకి పక్కనే ఉంది కదా!

చక్రపాణికి ఆవేశం వచ్చేస్తోంది. ఏమీ తెలీనట్లు ఎలా అడుగుతోందో! కొడుకు సంగతి తనకి తెలీదా.. మళ్ళీ తమాయించుకున్నాడు. తను వాళ్ళకి సంగతి ఇదీ అని చెప్పలేదు కదా!

"సీరియస్ గా ఉంది." అని మాత్రమే చెప్పాడు.

"అదికాదన్నయ్యా!" ఏదో చెప్పబోయి, జానకి మొహం చూసి ఆగిపోయింది విమల. ఈ పిల్ల ఏమిటి ఇలా ఉంది? ఇంత ముచావంగా.. ఒంట్లో రక్తం లేనట్లు పాలిపోయి.. కళ్లల్లో ఉన్నాయి ప్రాణాలు. పిల్లలు వదిన ఇంట్లో ఉండి ఉంటారు.

ఏదో అనుమానం వచ్చింది విమలకి.. శేషగిరి కేసి చూసింది. అతను రాజునే పరికిస్తున్నాడు.

చక్రపాణి అన్నయ్య కోపంగా ఉన్నాడు. ఏదో జరిగింది. విమలకి గుండెలు దడదడలాడాయి. ఈ ప్రబుద్ధుడు ఏం చేశాడో! బుజ్జి పుట్టినప్పట్నుంచీ బానే ఉన్నారులే అనుకుంది. అదివరకు రెండు మూడు సార్లు వెళ్ళినప్పుడు జానకి మొత్తుకుంది పాపం. . వీడి అతికోపం, చేతివాటుతనం తట్టుకోలేకపోతున్నానని. "తగ్గుతుంది లేమ్మా.. ఓపిక పట్టు." అని చెప్పింది.

అయినా ఎప్పుడు వచ్చినా వీడుకూడా సెలవుపెట్టి ఇంట్లోనే వేళ్ళాడేవాడు. ఇంక కోడలూ, తనూ మనసారా మాట్లాడుకోడానికి

అవకాశం ఏదీ?

"విమలా! ఇంక మేం వెళ్తున్నాం. ఇవిగో ఇంటి తాళాలు. రాజు ఫ్రెండ్ ఇచ్చాడు. రాజుని మీరే చూసుకోండి. తర్వాత కలుద్దాం." చక్రపాణి లేచాడు వెళ్ళడానికి.

"అదేమిటి? మీరెక్కడికి వెళ్తున్నారు" మాకు తాళం ఇవ్వడమేమిటి? నాకేం అర్థం కావడం లేదన్నయ్యా!" విమల ఏడుపు గొంతుతో అంది.

"మేం మా స్నేహితుడి ఇంట్లో దిగాం. అతను ఇక్కడే పని చేస్తాడు. రాజు సూయిసైడ్ అటెంప్ట్ చేశాడు. జానకి మొన్న బయలుదేరి నాదగ్గరికి వచ్చేసింది. సంగతి కనుక్కుందామని జానకిని తీసుకునొచ్చాం. రాజుని రేపు డిస్చార్జ్ చేస్తారుట. రేపు మాట్లాడుకుందాం విషయాలు." చక్రపాణి, జానకి చెయ్యి పట్టుకున్నాడు.

"మామయ్యా! నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ జానకిని బాధపెట్టను." రాజు అన్నాడు. నీరసంగా, నూతిలోంచి వస్తున్నట్లుగా వచ్చింది గొంతు.

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు నువ్వు మామూలుగా అవు." జానకిని తీసుకుని వెళ్ళిపోయాడు చక్రపాణి.

రాజు చూస్తుండి పోయాడు కన్నీళ్ళు కారుతుండగా.

"ఇదేవిటండీ.. మనకేం తెలీదు. కొత్తచోటు. హాస్పిటల్లో పిల్లాడు.. ఎలా చూసుకుంటాం? ఇక్కడ్నుంచి ఇంటికి దారైనా తెలుసా మీకు? ఇలా వదిలేసి వెళ్ళిపోయారు. ఇదెక్కడి న్యాయం?" విమల మొత్తుకుంది.

"ఇదే న్యాయం అమ్మా! జానకిని అంత కష్టపెట్టాను నేను. తను లేకుండా నేను బ్రతకలేనమ్మా! నన్ను వదిలెయ్యద్దని చెప్పమ్మా! మీరు ఇంటికి వెళ్ళి స్నానం చేసి రండి. నన్ను నర్సు చూసుకుంటుంది. ఇంట్లో సరుకులున్నాయి. వంట చేసుకోండి. పనిమనిషి లేదు. మీరే చేసుకోవాలి.. చూసుకోవాలి." రాజు కళ్ళు మూసుకున్నాడు.

-----------------------------

సుగుణ వంటింట్లో, నాలుగు కళ్ళు ఆరు చేతుల్తో వంట చేస్తోంది. అలివేలు వెళ్ళిపోయింది.

కాలింగ్ బెల్ మోగింది. నాలుగయినట్లు గడియారం గంటలు కొట్టింది. అవినాశ్ తలుపు తియ్యచ్చు కదా! అబ్బే.. ఎవడిలోకం వాడిది. మళ్ళీ మోగింది బెల్లు.

ఆ పిట్టల గోల మరీ ఎక్కువగా ఉంది. బెల్ మార్చాలి. సుగుణ గబగబా వెళ్ళి తలుపు తీసింది. అనసూయ.. రవి తల్లి.

"రండి అత్తయ్యా! మీకు ఫోన్ చేశారా? నేనే చేద్దామనుకుంటున్నా.." అనసూయ చేతిలో సంచీ అందుకుని పిల్లల గదిలో పెట్టింది.

"ఇదంతా నిజమే!" అనసూయ ఆశ్చర్యంగా నిలబడి పోయింది. సుగుణ ఇంత ఆప్యాయంగా పలకరించ గలదా! ఒక్క మాట మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయేమో అన్నట్లు మొహం తిప్పుకునే సుగుణ.. ఎంత ప్రేమగా మాట్లాడినా లెక్క చేయనట్లుండే సుగుణ.. ఇలా మారిపోయిందా? నమ్మ శక్యంగా లేదు. ఈ మాత్రం ఉంటే.. ఉన్న ఒక్క కొడుక్కీ దూరంగా ఎందుకుంటుంది? తలుచుకున్నప్పుడల్లా గుండె పిండేస్తుందే!

"ఎలా ఉన్నాడమ్మా రవి? ఏమైనా ఫోన్ వచ్చిందా? నాకు పొద్దున్నెప్పుడో వాళ్ళ ఫ్రెండ్ చేశాడు. వెంటనే బస్సెక్కి వచ్చేశా."

"ఫరవాలేదత్తయ్యా. ఇంకాసేపట్లో వచ్చేస్తారు. ఒక గంట లోపే."

సుగుణ వంటింట్లోకి వెళ్ళింది. నయమే.. ఇంకో క్షణం ఉంటే బెండకాయ ముక్కలు మాడిపోయేవే. ముక్కలు కలిపి గ్లాసులో

మంచినీళ్ళు తీసుకెళ్ళిఇచ్చింది అత్తగారికి.

ఇంకా ఆశ్చర్య పోతూనే ఉంది అనసూయ. తేరుకుని మంచి నీళ్ళు తాగింది. బస్సులో దుమ్మంతా తల్లోనూ, మొహం లోనే ఉంది. వెంటనే స్నానం చేస్తే కానీ.. గదిలోకెళ్ళింది.

"నాన్నమ్మా!" అవినాశ్ పట్టేసుకున్నాడు. "ఇక్కడెందుకుండవు నాన్నమ్మా? ఎంచక్కా కథలు చెప్పచ్చు కదా!" కినుకగా అన్నాడు.

"ఇంక ఉంటాను నాన్నా! అఖీ.. అరే పడుక్కున్నాడా! అవేంట్రా ముళ్ళల్లా గుచ్చుకుంటూ.." బ్లాకులన్నీ తీసి సర్దింది.

బట్టలు తీసుకుని బాత్రూంలోకి వెళ్ళి స్నానం చేసి వచ్చింది.

"కాఫీ కలుపుకుని తాగుదాం. తల పగిలి పోతోంది. ముగ్గుటెండ మాడ్చేసింది." అనుకుంటూ వంటగది దగ్గరగా వెళ్ళింది.

గ్లాసులో కాఫీ తీసుకుని సుగుణ ఎదురొచ్చింది. నోట్లో మాట రాక చూస్తున్న అత్తగారికి కాఫీ ఇచ్చింది.

"రండి.. ఇలా కూర్చుందాం." ముందు గదిలోకి తీసుకెళ్ళింది.

కొడుకు పెళ్ళయిన ఇన్నేళ్ళకి.. తను ఎలాంటి కోడలు కావాలనుకుందో.. అచ్చం అటువంటి..

"ఎన్నాళ్ళుంటుందో ఇలా.. ఆమాట కొస్తే సుగుణకే తెలియదు తన స్వభావం ఏమిటో. టి.వి డ్రామాల్లోని పాత్రలతో లీనమై పోతుంటుంది. ఈ మంచి కోడలు పాత్ర ఏ డ్రామా లోనిదో!" అనుకుంటూ కాఫీ చప్పరించింది అనసూయ.

"కాఫీ చాలా బాగుందమ్మా.." మనస్పూర్తిగా అంది.

ముందు గది విశాలంగా కొత్తగా ఉంది.

"బాగా సర్దిందే.. భగవంతుడా ఈ బుద్ధి కలకాలం ఉండేట్లు చెయ్యి తండ్రీ." అనసూయకి చాలా ఆనందంగా ఉంది. టివీ మోత లేదు ముందు. ఇల్లు ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉంది. కళ్ళు మూసుకుని దైవ ధ్యానం చేసుకుంటే.. ఇటువంటి జీవితం ఇచ్చినందుకు కృతజ్ఞత చెప్పుకున్నట్లుగా ఉంటుంది.

అవినాశ్ రివ్వుమని వీధిలోకి వెళ్ళాడు. మళ్ళీ గదిలోకి వెళ్ళి ఏదో తీసుకుని వీధిలోకి పరుగెత్తాడు. ఏం చేస్తున్నాడో చూద్దామనే ఉంది. కానీ ఈమోకాళ్ళు.. కూర్చుండి పోయింది అలాగే.

ఇంతలో అఖిల్ లేచాడు. చాటంత మొహం చేసుకుని, "నాన్నమ్మా!" అంటూ ఒళ్ళో వచ్చి పడ్డాడు. కాళ్ళూ, చేతులూ తడుముతూ.. నిజంగానే వచ్చిందా అన్నట్లు దూరి కూర్చున్నాడు. అనసూయకి ఎంతో హాయిగా అని పించింది. ఇక్కడే ఉండిపోగలిగితే ఎంత బాగుంటుంది..

"గ్లాసిలా ఇవ్వండి అత్తయ్యా." సుగుణ గ్లాస్ తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

--------------------

14

చల్లని సాయంత్రం ఆహ్లాదంగా ఉంది. ఆరుబయట ఏర్పాటు చెయ్యడం మంచికే అనుకున్నాడు మౌళి. స్టేజ్ మీద ఒక పక్కగా బల్ల మీద లాప్ టాప్ పెట్టుకుని అనుకున్నట్లుగా అన్నీ వస్తున్నాయా లేదా అని చూసుకున్నాడు. నాలుగింటికి అనుకున్నది నాలుగున్నర అవుతోంది. ఫరవాలేదు.. అరగంట ఆలిశ్యమయితేనేం.. చల్లని గాలి అందరికీ సేద తీరుస్తోంది.

టౌన్ షిప్ లో ప్రతీ ఆదివారం ఆరు బయట సినిమా చూపిస్తారు. పెద్ద తెర ఉంటుంది. ఆ తెర మీదికే తను అనుకున్న స్లైడ్స్ వచ్చేలాగ చూసుకున్నాడు మౌళి. గోపాల్ అంకుల్ రావడం మంచిదే అయింది. పవర్ ఫుల్ మైక్రోఫోన్లు పెట్టించారు. స్టేజ్ మీది నుంచి ఒక సారి ఆడియన్స్ అందరినీ పరికించాడు.

అరవిరిసిన పువ్వుల్లా.. రంరంగుల గౌన్లు, డ్రస్ లు, మిడీలు వేసుకుని అమ్మాయిలు.. మౌళి చూడగానే రెండు చేతులూ పైకెత్తి ఊపారు. వాన వచ్చే ముందు ఆకాశంలో ఎగురుతున్న పక్షుల్లా ఉన్నారు.

అబ్బాయిలు కుర్తా పైజామాలు.. కుర్తాలు రంగురంగులవి, డిజైన్లు కుట్టినవి వేసుకుని, మౌళి చూసినప్పుడు ఎగిరి లేచి మళ్ళీ కూర్చున్నారు. గెంతులేస్తున్న లేడి పిల్లల్లా ఉన్నారు.

అందరూ ఏదో పెళ్ళికి తయారైనట్లు తయారయి వచ్చేశారు. మొదట్లో వేసిన భయం ఇప్పుడు లేదు ఉషకి, మౌళికీ కూడా. స్టేజ్ అనుభవం బాగా ఉంది. దానికి తోడు భాష మీద.. ఇంగ్లీషు, తెలుగు కూడా మంచి పట్టుంది.

గ్రౌండ్స్ వెనుక గోపాలాచారి, భారతి, సివిల్ యస్. యి రమేష్, డి.యి సుందర్ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. భారతి లేడీస్ క్లబ్ మీటింగ్ కి వచ్చిన వాళ్ళందర్నీ ఇటు రమ్మని చెప్పింది.

ఉష మైక్ దగ్గరికి వచ్చి నిలుచుని అందరినీ చూసింది. తరువాత ఎవరైనా పని చెయ్యనీ చెయ్యకపోనీ.. ముందుగా తన పిలుపు విని వచ్చిన చిన్నారులందరినీ.. మొహమంతా ఆనందం నింపుకుని చూసింది. అందరికీ చెయ్యూపింది.

"మీరంతా నా పిలుపు విని వచ్చినందుకు సంతోషం. మనం ప్రార్ధన అయ్యాక మొదలు పెడదాం. అందరూ కూర్చునే చెయ్యచ్చు. అనండి..

"ఓం..అసతోమా సద్గమయ

తమసోమా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతమ్గమయ. ఓం శాంతి శాంతి శాంతిః"

అందరూ ముక్త కంఠంతో చెప్పారు. స్కూల్లో రోజూ చేసేదే కదా.

"ఒక గంట సేపు నేను చెప్పదల్చుకున్నది చెప్తాను. తర్వాత ఎవరైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడచ్చు. ఆఖర్న అందరికీ స్నాక్స్, టీ ఇస్తారు." మృదు మధుర కంఠంతో ఉష చెప్తుంటే అందరూ ఏం చెప్తుందా అని చూస్తున్నారు.

స్క్రీన్ మీద ఒక దృశ్యం కనిపించింది. చక్కగా ట్రిమ్ చేసిన లాన్స్, రకరకాల ఆకారాల్లోకత్తిరించబడిన బుష్ లు, మధ్యలో పరుగులు పెడుతున్న కుందేళ్ళు.. చిన్న చిన్న కొలనులు.. అందులో తామరపువ్వులు.

"ఎలా ఉంది?"

"చాలా బావుందక్కా!"

"ఇప్పుడు చూడండి.." మౌళి స్లైడ్ మార్చాడు.

అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డి, ముళ్ళపొదలు, మురికి గుంటలు.

"చూశారు కదా! ఇది మన కాలనీ. ముందు చూసింది, కొంచెం శ్రద్ధ పెట్టి బాగు చేసుకున్న కాలనీ. మనం అందరం చదువుకుంటున్నాం కదా!"

"అవునక్కా!"

"ఎవరో వచ్చి ఏదో చెయ్యాలని అనుకోకుండా,మనమే మన కాలనీని అలా ఎందుకు చేసుకోకూడదు?" అలా ధారలా సాగిపోయింది ఉష గొంతు. ఇంక స్క్రీన్ మీద..

ఒక పక్క ఎగురుతున్న పాలిథీన్ కవర్లు.. ఇంకో పక్క అందమైన చెత్తబుట్టలో , శుభ్రం చేసి వేసిన్ కవర్లు.

ఒక దాంట్లో రోడ్డు మీద చెత్త పోస్తోందొక ఇల్లాలు.. ఇంట్లో చెత్త తుడిచి.. అందరు చప్పట్లు ఉష కామెంట్స్ వింటూ.

ఇంకొక దాంట్లో ఇంట్లో తుక్కు అంతా కవర్లో మూట కట్టి రోడ్డు చివర ఉన్న చెత్త కుండీలో వేస్తున్న పదేళ్ళ పిల్ల.

తళతళా అద్దంలా మెరిసిపోతున్న రోడ్డు మీద ఖరీదైన కారులోంచి కిటికీ తలుపు తీసి, బత్తాయి తుక్కులు వేస్తున్నాడొక పెద్దమనిషి. వెంటనే.. కారులో ఒక సంచీ పెట్టుకుని అందులో తుక్కులన్నీ పడేస్తున్న ఒక అబ్బాయి..

టౌన్ షిప్ లో ఉన్న మురుక్కాలవ ఎటువంటి అధ్వాన్నపు స్థితిలో ఉందో చూపించాడు మౌళి.

"ఎంత బాగా కట్టారు మన కాలనీ! ఎంత విశాలంగా ఉంటాయి రోడ్లు.. ఎన్ని చెట్లు.. అసలు ఆ డ్రైనేజ్ కాలువ ప్లాన్ చేసిన తీరు చూడండి.. ఎవరికీ అడ్డు రాకుండా.. మధ్యలో నడవడానికీ,, కార్లు వెళ్ళడానికీ, సైకిళ్ళకీ, రిక్షాలకీ స్కూటర్లకీ.. చిన్న చిన్న బ్రిడ్జీలు చూస్తున్నారు కదా!"

మౌళి జూమ్ చేసి అవన్నీ చూపించాడు. పొద్దున్న టిఫిన్ తిన్నాక అవన్నీ ఫొటోలు తీసి, కంప్యూటర్ లో భద్రపరచాడు.

"మనం మన కాలనీని ఇలా చేసుకుందామా?" ఉష ప్రశ్న వెయ్యగానే.. సింగపూర్ లోని వీధుల్ని చూపించాడు మౌళి.

"ఓ..ఓ.." ఒక నిముషం పాటు హర్షధ్వానాలు.

"ఇప్పుడు అందరికీ పది రోజులు సెలవలు కదా.. మొదలు పెడదామా?"

"యా.. య్యా.."

"మనం కాలనీని ఇంత శుభ్రంగా చేస్తే మన ముఖ్యమంత్రిగారు వచ్చి మెచ్చుకుంటారు. స్వచ్ఛ్ భారత్ ప్రోగ్రామ్ అని ప్రధాన మంత్రి గార్ కుడా వచ్చే అవకాశం ఉంది. అప్పుడు.. మనం ఒక పెద్ద స్టేడియమ్ కట్టించి ఇమ్మని అడగవచ్చు." ఉష ఉత్సాహంగా అంది.

"అందులో వన్ డే క్రికెట్ కి ప్లేయర్స్ వస్తారా? హైద్రాబాద్ లో లాగ.." ఒక కోణంగి అరిచాడు.

"తప్పకుండా.. మన కాలనీని చూసి రావలసిందే." తర్వాత ఉష ఎవర్నైనా మాట్లాడమంది.

తిలక్ వచ్చి మాట్లాడాడు.

"ఉషక్క ఐడియా చాలా బాగుంది. సెలవులన్నీ వేస్ట్ గా గడిపే బదులు ఇటువంటి ఉపయోగకరమైన పనులు చేస్తే ఎంతో బాగుంటుంది. అందరం కలిసి పనులు చేస్తుంటే స్నేహ బంధం కూడా గట్టి పడుతుంది..." పది నిముషాలు ఏక ధాటిగా మాట్లాడాడు.

ఇంజనీర్ల పిల్లల్లో ఉష క్లాస్ మేట్ వచ్చి మాట్లాడింది.. మంచి ఉద్దేశ్యమే.. కానీ ఆచరణలో ఎంత వరకూ సాధ్యం.. అంటూ.

అలా కొంత మంది ఉత్సాహంగా, కొంతమంది నీరు కారిపోతూ మాట్లాడుతుంటే ఆరు గంటలయింది. కమ్యూనిటీ హాలు దగ్గర, వీధుల్లోనూ దీపాలు వెలిగాయి. కానీ వెలుతురే లేదు. వెలుగంతా చెట్లమీదే.

గోపాల్ సివిల్ యస్.యి కేసి చూశాడు. రమేష్ తలూపాడు..

"రేపట్నుంచీ మొదలుపెడతాం. మనీ కూడా వచ్చేసింది."

---------------------------..

"అయితే మనం ఇప్పుడు ఏ విధంగా చెయ్యాలా, ఎక్కడ మొదలు పెట్టాలా అనేది ప్లాన్ చేసుకోవాలి. నేనొక ప్లాన్ వేశాను. మీ కందరికీ ఇష్టమైతే చేస్తాను." ఉష మాటలకి అందరూ అరిచారు.. ఏక కంఠంతో..

"చెప్పక్కా!"

అప్పుడు.. మళ్ళీ స్లైడ్స్ చూపిస్తూ మాట్లాడింది ఉష.

"మన టౌన్ షిప్ లో ఉన్న కాలనీలకి.. పనిచెయ్యడానికి ఇష్టపడి వచ్చే వాలంటీరులు ఎంత మందో చుసుకుని వాలంటీర్లని విభజిద్దాం. మొత్తం ఐదు కాలనీలు.. వందమంది వాలంటీర్లు ఉన్నారనుకుంటే ఇరవై మంది ఒక గ్రూపు. అందులో మళ్ళీ ఐదుగురు చొప్పున సబ్ గ్రూప్స్ ఉంటాయి. గ్రూప్ కి ఒక లీడరు, సబ్ గ్రూప్ కి అసిస్టెంట్ ఉంటారు.

ప్రతీ రోజూ రెండు గంటలు పని చేస్తే చాలు. రోడ్లు తుడవడం, కాలువలు బాగు చెయ్యడం మనం చెయ్యనక్కర్లేదు. వాటికి కాంట్రాక్ట్ వర్కర్స్ ని పెడ్తామన్నారు గోపాల్ అంకుల్, రమేష్ అంకుల్. మనం చెయ్యాల్సిందల్లా వాళ్ళ చేత పనులు చేయించడం.

రోడ్ల మీద ఎవరు తుక్కులు, చెత్త పొయ్యకుండా చూడ్డం. చెత్త బుట్టలు ప్రతీ వంద గజాలకీ పెట్టడం. తోట పని మనమే చేద్దాం. చెట్లు మన ఫ్రెండ్స్ కదా! చెట్లతో కబుర్లు చెప్తు పని చేశామంటే అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. చెట్లకి ప్రాణం ఉంటుంది కదా!"

"ఉంటుందక్కా.. మా టీచర్ గారు ప్రయోగం చేశారు. ." ఒకే సారి గవర్న్ మెంట్ స్కూలు పిల్లలు నలుగురు లేచి అరిచారు.

"గుడ్.. అందుకే మనం మాట్లాడుతూ ఉండాలి వాటితో. అవి స్పందిస్తాయని మన దేశం శాస్త్రజ్ఞుడే ఒకాయన చెప్పారు.. ఎవరో తెలుసా?"

"జగదీశ్ చంద్ర బోస్." కొంచెం పెద్ద పిల్లలు.. ముక్త కంఠంతో.

"వెరీ గుడ్. ఎవరైనా తుక్కు, చెత్త బుట్టల్లో, కుండీల్లో కాకుండా బైట వేస్తే వాళ్ళకి ఫైన్.. వాళ్ళు ఎవరైనా సరే. ఆ తరువాత.. మనం పాలిథీన్ కవర్లు వాడ్డం మానెయ్యాలి.." ఊష ఏమేం చెయ్యాలో వివరించింది. మధ్య మధ్యలో ప్రశ్నలడుగుతూ.. పిల్లల్ని హుషారు చేస్తూ.

ఒక పుస్తకం పెట్టి, ఎవరెవరు వాలంటీర్లు గా చేరుతున్నారో రాయమంది.

రెండు వందల మంది సంతకాలు పెట్టారు. ఉషకి చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. అందులో సగం మంది వచ్చినా చాలు.

"ఇప్పుడు అందరం టిఫిన్ తిందాం. అయాక, ఇందులో సంతకాలు పెట్టిన వాళ్ళందరం కమ్యూనిటీ హాల్లో కలుద్దాం. ఓ.కే. ఇప్పుడు వాలంటీర్లు, ఇంటర్ స్టూడెంట్స్ కలిసి, అందరికీ టిఫిన్ ప్లేట్లు మంచి నీళ్ళు అందించాలి."

ఆరుగంటలకి భారతి లేచి లేడీస్ క్లబ్ దగ్గరికి వెళ్ళింది. ఆవిడ వెనుకే అందరూ బయల్దేరారు. అక్కడ, భారతి, తాము చెయ్య వలసింది వివరించింది. ఒక డి .యి గారి భార్య కి అన్నగారు ఫారెస్ట్ ఆఫీసర్. ఆవిడ కావలసిన చెట్లన్నీ మర్నాటికే తెప్పించేస్తానంది. ఒకామె హార్టీ కల్చర్ ట్రైనింగ్ అయింది. ఆవిడ చెట్లు ఎక్కడ, ఏవి నాటాలో ప్లాన్ చేస్తానంది. మరునాడు సాయంత్రం మళ్ళీ కలుద్దామనుకున్నారు.

సి.యి గారి భార్య ఏదైనా చెప్తే కాదనే వాళ్ళు సాధారణంగా ఉండరు. ఆ క్రమశిక్షణ టౌన్ షిప్స్ లో ఉంటుంది.

లేడీస్ క్లబ్, కమ్యూనిటీ హాలు అన్నీ ఒక ఆవరణలోనే ఉంటాయి. ఆఫీసర్స్ క్లబ్ మాత్రం వేరే ఉంటుంది. అక్కడ, కార్డ్స్, అప్పుడప్పుడు డ్రింక్స్ కూడా ఉంటయి. అందుకే దూరంగా ఉంటుంది.

కమ్యూనిటీ హాల్లో హరుగుతున్న గొడవంతా వినిపిస్తోంది. గ్రూప్ లీడర్లని ఎన్ను కోవడం, ఏ గ్రూప్ ఎక్కడ పనిచెయ్యాలో వంటి చర్చలు.. మరి వాదోపవాదాలు ఉంటాయి కదా!

బెస్ట్ గ్రూప్ కి సి.యి గారు అవార్డ్ ఇస్తారుట. ఉష మొత్తం అందర్కీ లీడర్. మౌళి సలహాదారు. తిలక్, సరోజిని,అపర్ణ.. అలా గ్రూప్ లీడర్స్ అందరినీ విడగొట్టి... మరునాడు పొద్దున్న తొమ్మిదింటికి అక్కడే కలవాలని చెప్పి పంపించేసింది ఉష. అప్పుడు రాత్రి తొమ్మిదయింది.

జానకి ఇంట్లోకి వస్తూండగానే పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చేసి చుట్టేశారు. వాళ్ళను వదిలి ఎన్నో రోజులైపోయినట్లుంది జానకికి.

వరండాలో నే కూలబడిపోయింది.. అపురూపంగా దగ్గరికి తీసుకుని.

"అమ్మా! ఎక్కడికెళ్ళావూ.. మనింటికా?" చిట్టి అడిగింది.

"లేదమ్మా! హాస్పిటల్ కి వెళ్ళాను. నాన్నకి ఆయి అయింది."

"ఆయా! నాన్నకా! పోలీస్ అంకుల్ కి మనల్ని కొట్టినట్లు తెలిసిందా? కర్ర పట్టుకుని కొట్టారా?" రోజూ నాన్న ఆఫీస్ కి వెళ్ళాక పోలీస్ అంకుల్ కి చెప్తానంటుంది చిట్టి.

"లేదు లేదు.. జ్వరం వచ్చింది. నాన్నమ, తాతయ్య వచ్చారు. అందుకే నేను వచ్చేశా."

"నాన్నమ్మా! అయితే మనింటికెళ్ళిపోదామమ్మా. తాతయ్య నా కోసం ఏం తెచ్చారో!"

"రేపు వెళ్దాం చిట్టీ.. అల్లరి చెయ్యకుండా ఆడుకో వెళ్ళి." చక్రపాణి పిల్లలిద్దర్నీ తోట లోకి పంపి, జానకిని తీసుకుని లోపలికి వెళ్ళాడు.

"ఎలా ఉందండీ.. ఇంతసేపు చేశారేం?" సుభద్ర ఆదుర్దాగా అడిగింది.

అరుణ అందరికీ టీ తెచ్చి ఇచ్చింది. భోజనాల బల్ల దగ్గర చుట్టూ కూర్చుని, టీ తాగాక, జరిగింది చెప్పాడు చక్రపాణి.

"రేపు అందరూ కూర్చుని ఏం చెయ్యాలో ఆలోచించుకోవచ్చు. కాసేపు రెస్ట్ తీసుకోండన్నయ్యా!" అరుణ అంతా విని అంది.

"గోపాల్ ఇంకా రాలేదామ్మా?"

"రాలేదన్నయ్యా! కమ్యూనిటీ హాల్లో ఏదో మీటింగట. రాత్రి తొమ్మిది దాటేట్లుంది. మీరు కూడా వెళ్ళాలనుకుంటే వెళ్ళచ్చు."

"నేను కాసేపు పడుక్కుంటానమ్మా!" చక్రపాణి వెళ్తూనే మంచం మీద వాలిపోయాడు. అలసిన శరీరం మనసూ వెంటనే సుషుప్తి లోకి వెళ్ళిపోయాయి.

జానకీ, సుభద్రా వెళ్ళి అరుణకి వంటలో సాయం చెయ్యసాగారు. వద్దు వద్దంటున్నా వినకుండా.

అలివేలు పరుగెత్తుకుంటూ వచ్చింది. "అమ్మా! రవి సారు వచ్చేశారు. ఇప్పుడే అంబులెన్సు ఆరింటి ముందాగింది. నే ఎల్తానమ్మా.."

"సరే వెళ్ళొచ్చి ఎలా ఉన్నారో చెప్పు."

ఒక్క గెంతులో ఇంట్లోంచి బైటపడింది అలివేలు.

"ఏమయింది అరుణా! రవి ఎవరు?" సుభద్ర బియ్యంలో బెడ్డలు ఏరుతూ అడిగింది.

తనకి తెలిసినంత వరకు జరిగిందంతా చెప్పింది అరుణ.

"నిన్నంతా ఒకటే హడావుడి అనుకోండి. పొద్దున్నే ప్లాంట్ కివెళ్లగానే యాక్సిడెంట్. అది అంతా సర్ది, టీమ్ని వాగన్లు ఆగిపోయిన దగ్గరికి పంపాక.. రాత్రి అక్కడ్నుంచి ఎమర్జెన్సీ.. తెల్లవార్లూ నిద్ర లేదనుకోండి. ఈ ప్లాంట్స్ లో ఉద్యోగాలంతే.. ఏ క్షణాన ఏం జరుగుతుందో ఏమీ చెప్పలేం. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిందే. ఏదేమైనా, ఎటువంటి పరిస్థితి వచ్చినా ప్లాంట్ లోంచి కరెంట్ పంపాల్సిందే. ప్రతీ ఒక్కరూ తప్పుపట్టే వాళ్ళే."

"దానికి సాయం మా గోలొటి.. పొద్దున్నే లేపేశాం అన్నయ్యగారిని." సుభద్ర నొచ్చుకుంటూ అంది.

"అదేం ఫర్వాలేదండీ. అమ్మాయి జీవితం చక్కబడితే అంతే చాలు. ఈ శ్రమంతా మటు మాయం అయిపోతుంది."

అరుణ మాటలకి పేలవంగా నవ్వింది జానకి.

"ఏమీ కాదమ్మా జానకీ! అంతా సర్దుకుంటుంది. అసలు నువ్వు ఇదివరకే ఇక్కడికి వచ్చుంటే, ఈపాటికే అంతా సరి చేసే వారు. అప్పటికి మేము తెలీదనుకో.. తెలియక పోయినా కూడా సి.ఇగారి దగ్గరికి వెళ్ళుండాలిసింది."

'సరే..మాకే ఏమీ చెప్పలేదిన్నాళ్ళూ. ఏమాత్రం గ్రహించినా.. ముందే.." దగ్గుత్తికతో ఆగిపోయింది సుభద్ర.

"ఏదో అనుకుంటాం కానీ.. దేనికైనా సమయం రావాలి. ఏదీ.. మేం ఈ మధ్యనే కదా ఇక్కడికొచ్చాం." అరుణ కూర తరిగి లేచింది. సీతాలు మధ్యాన్నమే వెళ్ళిపోయింది.. ఇంటికి చుట్టాలొచ్చారంటూ.

చిట్టి పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అమ్మమ్మా! బుజ్జి కనిపించట్లేదే.." జానకి ఒక్క ఉదుట్న లేచింది.

"నువ్వేం చేస్తున్నావే.. చెల్లిని చూసుకోవద్దా!" వీధి వరండా లోకెళ్ళింది. గేటు ఓరగా తీసుంది. అలివేలు వేసినట్లు లేదు.

చెప్పులేసుకుని జానకి వీధిలోకి పరుగెత్తింది.

సుభద్ర గబగబా గదిలోకి వెళ్ళి చక్రపాణిని లేపింది. ఒక్క క్షణం చక్రపాణికి తాను ఎక్కడున్నాడో.. ఏం వింటున్నాడో అర్ధం కాలేదు.

"అరే! అంత చూసుకోకుండా ఏం చేస్తున్నారే?' గట్టిగా అరిచాడు. స్వతహాగా నెమ్మదస్తుడు అతను. గొంతుక పొడారిపోయినట్లయిపోయింది.

సుభద్ర మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది. గ్లాసు కిందికి దించకుండా గటగటా తాగి బైటికి పరుగెట్టాడు చక్రపాణి.

జీపునీ, డ్రైవర్ నీ పంపమని గోపాలాచారికి ఫోన్ చేసింది అరుణ.

'అక్కడే చుట్టు పక్కలే ఉంటుందిలే.. నే వస్తున్నా.." గోపాల్ బొంగురు గొంతుతో అన్నాడు. అప్పుడప్పుడే చీకటి పడుతోంది. మసక మసక దీపాల వెలుతురు. రెండేళ్ళ పిల్లని పట్టుకోవడం కష్టమే. రమేష్కీ, సుందర్కీ చెప్పి జీపు లో బయల్దేరాడు.

గోపాల్ మధ్యాన్నం కూడా విశ్రాంతి తీసుకోలేదు. తలంతా దిమ్ముగా ఉంది. ఉన్న సమస్యలు చాలనట్లు ఇదొకటి. జానకి హాస్పిటల్ లోనే ఉందా.. ఏమీ అడగలేదు. దార్లో అంతా చూసుకుంటూ ఇంటికెళ్ళాడు.

"ఎప్పట్నుంచీ కనిపించడం లేదు? ఆఖరుగా ఎవరు చూశారు?" వరుసగా ప్రశ్నలేశాడు. జానకి దగ్గర్నుంచి వెళ్ళినప్పటికీ, కనిపించకుండా పోయినప్పటికీ పదినిముషాలు కూడా గాప్ లేదు. తర్వాత అలివేలు వెళ్ళింది. అలివేలెక్కడికెళ్ళింది?

రవి ఇంటికెళ్ళిందని అరుణ చెప్పగానే, జీపెక్కి పోనియ్యమన్నాడు. అతనికి బుర్ర పనిచెయ్యడం మానేసింది.

"ఎక్కడికి సార్?"

"రవి డి.యి గారిల్లు తెలుసా?" డ్రయివర్ ని అడిగాడు.

"తెలుసు సార్.. ఇప్పుడే అంబులెన్స్ వెళ్ళిందటు."

అంబులెన్స్ ఆగగానే పరుగెత్తుకుంటూ వచ్చేశారు సుగుణ, అనసూయ, అవినాశ్, అఖిల్. తలుపు తియ్యగానే అందరూ గుమికూడారు.

"పక్కకి జరగండమ్మా." చైతన్య, రహీం అంబులెన్స్ లోంచి కిందికి దిగుతూ అన్నారు.

ఆంజనేయులు, భీమారావు వెనుక పక్క, ముందు చైతన్య, రహీం పట్టుకుని స్ట్రెచర్ దించారు. సింగ్ రవి బాగ్, మేల్ నర్స్ ఐ.వి సెట్ పట్టుకుని దిగారు.

"అమ్మా!" రవి కళ్ళు తెరిచి అనసూయని చూసి అన్నాడు. అనసూయ కళ్ళ నిండా నీళ్ళతో వెళ్ళి చెయ్యి పట్టుకుంది. అవినాశ్

దూరంగా నిల్చుని చూస్తున్నాడు.

అతి మెల్లగా రవికి నొప్పి కలుగకుండా తీసుకెళ్ళారు. తలుపు దగ్గరగా వెళ్తూనే రవి కళ్ళు ఆశ్చర్యంతో, ఆనందంతో పెద్దవయ్యాయి.

"రెండు పక్షులు, "వెల్కం హోం డాడీ" అని రాసున్న బోర్డ్ని ముక్కులతో చెరో పక్కనా పట్టుకుని ఉన్నట్లు డ్రాయింగ్ వేసిన పేపర్ అతికించి ఉంది తలుపు మీద. రెండు పక్షుల మీద, "అవినాశ్", "అఖిల్" అని పేర్లు రాసున్నాయి.

"స్కూల్ నుంచి వచ్చాక నువ్వు చేసిన పని ఇదా?" అనసూయ అడిగింది.

అవినాశ్ సిగ్గుగా నవ్వాడు.

తలుపు తీసి పట్టుకున్న సుగుణని చూసి నీరసంగా చెయ్యి పైకెత్తి ఊపాడు రవి. సుగుణ తల దించుకుంది. అతను వెళ్ళేటప్పుడు చెప్పినా తలుపు వరకూ కూడా వెళ్ళలేదనుకుంటూ..

స్ట్రెచర్ని తమ గదిలోకి తీసుకెళ్లమంది సుగుణ. తీరుగా సర్ది ఉన్న గదిని చూసి ఇది తమ ఇల్లేనా అనుకున్నాడు రవి.

మంచం మీద ఒక పక్క రవికి అనుకూలంగా సర్ది ఉంది. కాళ్ళ దగ్గర ఎత్తుగా దిళ్ళు, తల దగ్గర ఆనుకోవడానికి వీలుగా బాల్స్టర్.. నెమ్మదిగా రవిని మంచం మీదికి చేర్చారు. కాలు సర్దబోతుంటే, "అమ్మా" అని గట్టిగా మూలిగాడు. సుగుణ ఆదుర్దాగా దగ్గరికి వచ్చింది.

ఇంట్లోకి అడుగు పెట్టగానే విమలకి కళ్ళు తిరిగినంత పనయింది. ఎక్కడివక్కడ పడేసి ఉన్నాయి. సగం తోమిన అంట్ల గిన్నెలు వంటింట్లో అట్టలు కట్టి పోయాయి. ముందు గదిలో కుర్చీలన్నీ తల కిందులుగా పడేసున్నాయి. భోజనాలు చేసే వరండాలో నేతి గిన్నె గోడకి కొట్టుకుని గోడంతా నేతి మరకలు.. వరండాలో నూనె ఒలికి పోయి, కాలేస్తే జర్రున జారేట్లుంది. పిల్లల గదిలో, రాజు గదిలో చిందర వందరగా బట్టలు..

హడావుడిగా చేతికందిన బట్టలు సర్దుకున్నట్లుంది.. అలమార్లో బట్టలన్నీ కిందా మీదా పడున్నాయి.

వంటింట్లో సరుకులైతే ఉన్నాయి కానీ కూరలేం లేవు. ఫ్రిజ్ అంతా ఖాళీ. పాలున్నాయి కానీ మూడు రోజుల నాటివి, ఫ్రిజ్ లో కూడా వాసనొచ్చేసి, పచ్చగా అయిపోయాయి.

ఎక్కడ మొదలు పెట్టాలో ఎలా మొదలు పెట్టాలో అర్ధమవలేదు. శేషగిరి బజారు కెళ్ళి, కూరలు పాలు పట్టుకునొచ్చాడు.

కాఫీ తాగుతే కాస్తె బుర్ర పని చేస్తుందేమో! డికాక్షన్ వేసి, వంట చెయ్యాలి కనుక, రణరంగంలా ఉన్నవంటిల్లు సర్దడం మొదలు పెట్టింది విమల.

కాఫీ తాగి, శేషగిరి సాయం చేస్తుండగా వంట ముగించి, ఇల్లు ఒక మాదిరిగా సర్దే సరికి, నడుం పట్టేసింది. మోకాళ్ళు సలిపేస్తున్నాయి.

"అమ్మో! ఈ చాకిరీ నా వల్ల కాదు. పని మనిషి లేకుండా అంత పని చెయ్యాలంటే.. ఇంత అడ్డదిడ్డంగా ఎలా ఉంటారో మనుషులు.." కోడలి మీద పీకల్దాకా కోపం వచ్చింది విమలకి. కానీ, ఆలోచిస్తే.. ఆ అమ్మాయి తప్పు ఎంత వరకూ ఉంది.. జానకి మీద జాలేసింది.

అయితే వీడేం మారలేదన్నమాట.

వెర్రి కోపం.. కనిపించిన వన్నీ విసిరెయ్యడం.. చిన్నప్పట్నుంచీ అంతే! ఒక సారి వాడికంటే ముందు తను అన్నం తిందని ఎంత గొడవ చేశాడూ! "జ్వరం వచ్చి తగ్గింది రా.. నీరసంగా ఉందని తిన్నా" అని చెప్పినా విన లేదు. "తిన్నదంతా కక్కు." అని కూర్చున్నాడు.

ఇంట్లో ఉన్న వస్తువులన్నీ విసిరేశాడు. అప్పుడు శేషగిరి లేడు కనుక సరిపోయింది. ఉంటే ఎన్ని దెబ్బలు తినేవాడో! చివరికి నోట్లో వేళ్ళు పెట్టుకుని అంతా కక్కే వరకూ ఊరుకో లేదు. విమల ఆలోచిస్తుంటే ఒక్కొక్కటీ గుర్తుకు రాసాగాయి. పెళ్ళి చేస్తే మారతాడులే అనుకుంది. మళ్ళీ బయట అందరితో నిక్షేపంగా ఉండేవాడు. ఇంటి కొచ్చేసరికి దెయ్యం పట్టినట్లు చేసేవాడు.. తనని చూస్తే మరీ.

వీడినీ వీడి సంసారాన్నీ సరి చెయ్యడం ఎలా? పశ్చాత్తాప పడుతున్నట్లు కనిపిస్తాడు కానీ, ఎప్పుడు తిక్క తిరుగుతుందో చెప్పలేం. ఏం చెయ్యాలి.. తల పట్టుక్కూర్చుంది విమల.

శేషగిరి మొదట్నుంచీ ఏమీ పట్టించుకునే వాడు కాదు. రాజు తరువాత మళ్ళీ కానుపు రాకపోవడంతో తను పూర్తిగా వాడితోనే గడపడం అలవాటు చేసుకుంది. ఎప్పుడైనా సమయం చిక్కి, తామిద్దరూ సరదాగా ఉంటే రాజు సహించే వాడు కాదు. బల్ల మీద తల పెట్టి పడుక్కున్న విమలకి నుదురు మీద ఎత్తుగా తగిలింది. ఒకసారి రాజుగాడు, పాలు తాగి కప్పు విసిరేస్తే చిట్లిందక్కడ. కుట్లు వెయ్యాల్సి వచ్చింది. తలుచుకుంటుంటే ఆపుకోలేని దుఃఖం వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తుంటే శేషగిరి పక్కనే కూర్చుని ఓదార్చాడు.

"తగ్గి పోతుందిలే విమలా! ఊరుకో."

'అదికాదండీ నా బాధ.. వీడు చిన్నప్పట్నుంచీ ఇంతే.." రాజు సంగతులన్నీ ఒక్కొక్కటే చెప్పుకొచ్చింది. ఏదో చిన్నతనం అనుకున్నాడు, అప్పుడప్పుడు తిక్క పెడుతుంటే.. ఇంత తీవ్రమైన సమస్యా!

"ఇలా అని చెప్పలేదేం విమలా, డాక్టర్కి చూపించే వాళ్ళం కదా! నా దగ్గర అంత చేటు చెయ్యలేదే ఎప్పుడూ.."

"మీరునప్పుడు బుద్ధిమంతుడిలా మారి పోయేవాడు.. చాడీలు చెప్పి కొట్టించినట్లు అవుతుందేమో అని భయ పడ్డాను. డాక్టర్కి చూపిస్తే తగ్గుతుందా?" వెక్కుతూ అడిగింది.

"తప్పకుండా.. మంచి సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్దాం."

జీపు రవి ఇంటి ముందుకు రాగానే రివర్స్ చేస్తున్న అంబులెన్స్ కనిపించింది. వెనుకే బుజ్జి.. అయోమయంగా నడుస్తూ! ఒక్క క్షణం ఆగుతే వెనుక చక్రం దాని మీద నుంచి వెళ్ళి పోయేదే.

అదృష్టవశాత్తూ, అప్పుడే ఇంట్లోంచి బైటికొచ్చిన రహీం చూశాడు. ఒక్క గంతులో బుజ్జిని ఎత్తుకుని పక్కకి పడ్డాడు.

జీపు కీచుమంటూ ఆగింది, సడన్ బ్రేక్ వేస్తూ. అంబులెన్స్ డ్రైవర్, రహీం పడి పోవడం సైడ్ మిర్రర్ లోంచి చూసి ఆపి కిందికి దూకాడు.

"సార్! ఈ పాప కనిపించలేదు సార్.." ఏడుపుగొంతుతో అన్నాడు.

"ఇంత పెద్ద వెహికిల్ రివర్స్ చేస్తూ.. ఎవరైనా గైడ్ చెయ్యమనద్దయ్యా! చటుక్కున వెనక్కి వెళ్ళిపోవడమే.. ఏం నేర్చుకున్నారు మీరు.." గోపాలాచారి లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నాడు.

రహీం పక్కకి దొర్లి, పాపని ఎత్తుకుని లేచాడు. మోచెయ్యి, మోకాలు దోక్కు పోయింది. బొటన వేలు రాయికి తగిలి చిట్లింది. పడేదేదో అంబులెన్స్ దగ్గరే పడ్డాడు కనుక.. అందులో ఉన్న మేల్ నర్స్ డ్రెస్సింగ్ చేసి, ఫస్ట్ ఎయిడ్ కిట్ లోంచి, యాంటి టిటనస్ ఇంజక్షన్ ఇచ్చాడు.

పిచ్చిదానిలా వీధులు తిరుగుతున్న జానకి అక్కడి హడావుడి చూసి గబగబా వచ్చి బుజ్జిని ఎత్తుకుంది.

గోపాల్ తో మాట్లాడి అంబులెన్స్ తీసుకుని, డ్రైవర్, మేల్ నర్స్ వెళ్ళిపోయారు.

"తల్లీ!" జీపు దిగి చక్రపాణి పిలిచాడు.

"పాణీ! మీరు ఇంటికి వెళ్ళండి. నేను రవిని చూసి వచ్చేస్తాను. నడిచి వస్తాలే." గోపాల్ రవి ఇంటి కేసి తిరిగి అన్నాడు.

ఆంజనేయులూ వాళ్ళూ వెళ్ళాక తలుపు వెయ్యడానికి బైటికి వచ్చిన సుగుణ జరిగిందంతా చూసింది.

"మీరు కూడా లోపలికి రండి.. మంచి నీళ్ళు తాగి వెళ్దురుగాని." చక్రపాణిని, జానకిని లోపలికి పిలిచింది.

అందరూ లోపలికి వెళ్ళి, ముందు గదిలో కూర్చున్నారు. అవినాశ్ గ్లాసుల్లో నీళ్ళు తెచ్చి అందరికీ ఇచ్చాడు.

అఖిల్ వచ్చి బుజ్జిని పలుకరించి, వాడి బొమ్మలు తెచ్చి ఇచ్చాడు. ఇద్దరూ ఆడుకుంటుంటే జానకిని కూర్చోమని, గోపాల్ని లోపలికి తీసుకెళ్ళింది సుగుణ.

"సార్! మీరా.." రవి లేవబోయాడు.

"ఆగవయ్యా హీరో లేవకు.." అన్నాడు గోపాల్.

# 15

ఆ రాత్రి టౌన్ షిప్లో..

రకరకాల ఆలోచనలతో.. అందరూ ఒక నిశ్చయానికి వస్తూ గాఢంగా నిట్టూర్చి నిద్రకుపక్రమించారు.

మౌళి– నేనకున్నదంతా నిజంగా జరుగుతోందా? ఊహించిందానికంటే ఎక్కువ స్పీడ్ గా జరిగిపోతున్నాయి.. ఎంతో ప్లాన్డ్ గ కట్టిన ఈ టౌన్ షిప్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలను కోవడం.. అది వెంటనే రూపు దిద్దుకోవడం, నమ్మ శక్యంగా లేదు.

అన్నింటికంటే ముఖ్యం, ఉషతో సాంగత్యం. సాన్నిహిత్యం పెరగడం. పేరెంట్స్కి కూడా ఏ అభ్యంతరం ఉండదు.. ఇద్దరూ ఫ్రెండ్స్.. పైగా కులం కూడా ఒకటే. నిజంగానే నేను చాలా లక్కీ. ఎప్పుడో సమయం చూసుకుని, ఉషతో, అంకుల్ తో మాట్లాడెయ్యాలి.

ఉష– ఓహ్.. ఏంటో! ఆనందంతో నిద్రరావట్లేదు. ఏదో సోషల్ వర్క్ చెయ్యాలని ఎప్పట్నుంచో ఉందా.. అది మౌళి తోవ చూపిస్తే కానీ తెలియలేదు. ఏదయితేనేం.. థాంక్స్ టు మౌళి. అతను చూపించిన స్లైడ్స్ ఇంకా కళ్ళ ముందు తిరుగుతున్నాయి.

అవునూ.. ఈ పిల్లలుఇవేళ చూపించినంత ఉత్సాహం రోజూ చూపిస్తారా? పొద్దున్నే వెళ్ళి ప్లాన్స్ తయారు చేస్తుంటే.. ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుని వచ్చేస్తారు. ఇటువంటి కాలనీల్లో అదే అడ్వాంటేజ్.

అసలు ఈ మౌళి ఏంటో! మూణ్ణెళ్ళ ముచ్చటకి ఇంత శ్రద్ధ చూపిస్తున్నాడు. తనవీ, అతనివీ ఐడియాస్, వ్యూస్ చాలా వరకూ కామన్ గా ఉన్నాయి. తనంటే ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాడా? ఏమో.. వెయిట్ అండ్ సీ. ఇంక పడుక్కోవాలి బాబూ! తెల్లారి బోలెడు పనుంది.

సుధీర– రేపే ప్రయాణం. వేణు కూడా సాయంత్రానికి వచ్చేస్తాడు. అబ్బ.. ఎన్నో నెలలయినట్లుంది. బబ్లూ గాడిని మిస్ అయిపోతున్నాడు పాపం. అమ్మో.. ఎంత ప్రమాదం తప్పింది! తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుతుంది. మౌళికి ఏమిచ్చినా ఋణం తీరదు.

అన్నట్లు.. ఉషని, మౌళికి సజెస్ట్ చేస్తే! వెళ్ళే లోగా.. రేపే అత్తయ్యగారితో మాట్లాడాలి. ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్లాగుంటారు.. అచ్చం తమ లాగే.

భారతి– అబ్బ. ఏం వచ్చారు పిల్లలు.. ప్రవాహంలాగ. టౌన్ షిప్ వదిలేలోగా ఒక మంచి పని చెయ్యడానికి అంకురార్పణ జతిగింది,

మౌళి ధర్మమా అని. క్లబ్లో కూడా చాలా మంది పాజిటివ్ గానే ఉన్నారు. ఉష పెళ్ళి చేసేస్తే.. బాధ్యతలన్నీ ఒక కొలిక్కి వచ్చినట్లే.

శ్రీనివాస్– హమ్మయ్య.. ప్రస్థుతానికి ప్లాంట్ లో ప్రాబ్లమ్స్ అన్నీ సాల్వ్ అయినట్లే. అన్ని స్టేషన్లూ ఫుల్ కపాసిటీతో నడుస్తున్నాయి. ఇలాగే నడుస్తే తమ ప్లాంట్ కి అవార్డ్ రావడం ష్యూర్.

నిన్న మొన్నటి టెన్షన్స్ తలుచుకుంటే ఇప్పటికీ గాభరాగానే ఉంటుంది. అదృష్టం బాగుండి రవికేం గాలేదు. ఇంకెప్పుడూ తమ స్టాఫ్కి అటువంటి పనులు చెప్పకూడదు. వీఆజు భార్యకి ప్రయారిటీలో అపాయింట్ మెంట్ ఇచ్చెయ్యాలి. రాజుకి ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ తెప్పించాలి. అటువంటి వాళ్ళు ప్రొడక్షన్ లో ఉంటే డేంజర్.

గోపాల్ లేకపోతే ఈ రెండ్రోజులూ తను తట్టుకోలేకపోయేవాడే. అతన్ని చూస్తుంటే ఎవరో దగ్గరి వాళ్ళని చూసినట్లు అనిపిస్తుంది. పిల్లల ప్రాజక్ట్.. హాహా.. మంచి పనికి తన సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది.మౌళి బాగా కలిసి పోయాడు అందరితో. సివిల్ డి.ఇ తో రేపు మా...ట్లా..డా...లి.

గోపాలాచారి– అబ్బ.. రెండ్రోజులు ఎంత హెక్టిక్ అయిపోయిందో! రేపు చెయ్యాల్సిన పనులు.. హూ! ప్లాంట్ ప్రస్థుతానికి ఫరవాలే.. ఆ టెంపరరీ స్టాఫ్ని పర్మనెంట్ చెయ్యాలి.. దాని సంగతి ముందు ప్రయారిటీ. ఆర్డర్స్ ఎక్కడున్నాయో.. ఏ స్టేజ్ లో ఉన్నాయో..

పాపం పాణి! ఈ వయసులో పిల్లల బాధ్యత మళ్ళీ స్క్వేర్ వన్ కి వస్తే తట్టుకోవడం కష్టమే! రేపు ఆ రాజు పేరెంట్స్ తో మాట్లాడి తేల్చెయ్యాలి.

సాయంత్రం కమ్యూనిటీ హాలు దగ్గర.. పిల్లలకి వీలైనంత సపోర్ట్ ఇవ్వాలి. నిద్ర పట్టేసి ఒక ఆరుగంటలు.. అన్నీ మర్చిపోగలిగితే...

అరుణ– ఇవేళంతా ఇంట్లోనే సరిపోయింది. పాపం సుభద్ర! ఎంతో కలుపుగోలుగా ఉంది.జానకి జీవితం బాగు పడితే బాగుండును. పిల్లల్ని చూస్తుంటే జాలేస్తోంది. రేపైనా సి.ఇ గారి భార్యదగ్గరకెళ్ళాలి. ఏమనుకున్నారో ఏమిటో! రేప్పొద్దున్న టిఫిన్.. హ్హా..న్నిద్దర..

చక్రపాణి– ఎంత ధైర్యంగా ఉండాలనుకున్నా నిస్తేజం వచ్చేస్తోంది. ముత్యాల్లాంటి పిల్లలనుకుంటే ఎలా అయిపోయింది? రేపనేది పెద్ద ప్రశ్న అయిపోయింది. కళ్ళు మండి పోతున్నాయి. నిద్దరొస్తే బాగుండు.. రేపటికి కాస్త ఓపిక.. వస్తుంది.

సుభద్ర– అదృష్టవంతులు. అప్పుడే గుఱు పెట్టేస్తున్నారీయన. ఎన్ని సమస్యలున్నా నిద్ర పట్టదనే బాధ లేదు. తల్లికాపురం బాగు చెయ్యి భగవంతుడా! నీ కొండ కొస్తాము వెంకన్నా బాబూ.. నడిచి. అయ్యయ్యో! ఏదో అనేశానా.. మోకాళ్ళు సలిపేస్తున్నాయి. అయినా తప్పదు ఎక్కాల్సిందే..

జానకి– మనసు, మెదడు మొద్దు బారి పోయాయి. అస్సలేం జరుగుతోందీ? అమ్మో.. నా పిల్లలు. వాళ్ళని ఎక్కడికైనా దూరంగా తీసుకుపోయి.. కళ్ళు మూసుకుపోతున్నాయి.. డాక్టరిచ్చిన నిద్దర మాత్ర పని చేస్తున్నట్లుంది..హూ..

రాజు– ఇంక రాదనుకున్న జానకి వచ్చింది. అంతే చాలు. ఇంక ఏమైనా కోపం తెచ్చుకోను. అమ్మ చూసుకుంటుంది ఏం చెయ్యాలో! ఇంకా ఆయాసంగా ఉంది. చిట్టి, బుజ్జీ రానే లేదు. చూడగానే మంచం కింద దాక్కుంటారు. ముందా భయం పోగొట్టాలి. సిస్టర్.. సెడేటివ్ ఇవ్వవా..

విమల– రాజుకి నయమయ్యాక హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ అడగాలి. ఒంట్లో బాగోట్లేదంటే ఇవ్వరూ? జానకీ వాళ్ళ అమ్మా నాన్నలని వీళ్ళకి దగ్గరగా ఉండమని బతిమిలాడి, రాజు కి ట్రీట్మెంట్ ఇస్తే బాగు పడ్డా!

మధ్యాన్నం అంతా గతుకుల రోడ్డు మీద ఎఱ బస్సు ప్రయాణం.. ఒళ్ళంతా హూనం.. దానికి తోడు ఇంటి పని.. రేపు పని మనిషిని చూడాలి.. పాపం ఈయన కూడా అలసి పోయారు.. వచ్చే వయసా పోయే వయసా? నేనో కాల్పాల్ వేసుకుని, ఈయనకోటి ఇస్తే కానీ..

సుగుణ– రవిని చూస్తుంటే ఏడుపొస్తోంది.. ఇనాళ్ళూ అతని మీద వదిలేసి.. ఒక వేళ ఏమన్నా అయుంటే పిల్లలకీ నాకూ దిక్కెవ్వరూ? మార్ఫిన్ ఇంజక్షన్ ఇచ్చారేమో, పసిపిల్లాడిలా నిద్ర పోతున్నారు. ఛా.. ఎంత ఫూలిష్గా ఉన్నాను.. గట్టిగా లెంపలు వాయించుకుంటే కానీ బుద్ధి రాదు. అబ్బ.. పొద్దుట్నుంచీ ఎంత పని చేశానో.. నేనేనా? విచిత్రంగా ఎక్కడా నొప్పే లేదు.. అయినా చేసే వయసే కదా! ఎందుకో కూర్చున్న చోట్నించి లేవబుద్ధి వెయ్యలేదిన్నాళ్ళూ! ఈ బద్ధకం వదిలించు కోవాలి ముందు. బుజ్జి ముండ అవినాశ్ గాడు ఎంత చక్కగా పైంట్ వేశాడూ.. ఇంక వాళ్ళతోనే గడపాలి ఎప్పుడూ!

అత్తయ్య నడిగి రకరకాల వంటలు నేర్చుకోవాలి. మళ్ళీ సంగీతం మొదలెట్టాలి.. గుడ్ ఐడియా..

అనసూయ– అమ్మా! కనకదుర్గమ్మ తల్లీ! రవ్కి తొందరగా నయం అయ్యేట్లు చూడు తల్లీ. వాడు నడవగానే అందరం నీ కొండకొస్తాం. కోడలికి కాస్త మంచి బుద్ధి ఇచ్చావంటే ఇంకేం అడగను. అప్పుడు ఇక్కడే పిల్లల్ని కళ్ళ ముందు చూసుకుంటూ కాలం గడుపుతా.. అత్యాశ అనుకుంటున్నావా? నువ్వు తలుచుకుంటే చెయ్యలేందేముంది తల్లీ..

లక్ష్మమ్మ– పోయినాడు పోయాడు.. పెద్దయ్యగారు, “వీఱాజు పోయాడని బాధ పడకు లక్ష్మమ్మా! నీకు ఉద్యోగం వేయిస్తా” అన్నారు కదా.. పిల్లల్ని చూసుకుంటూ బతకాలి.. అయినా ఆడు ఉండి చేసిందేవుంది? తాగొచ్చి తన్నటవే కదా! ఇప్పుడవన్నా తప్పుతాయి. ఆడి మంచం మీద పండుకొని కళ్ళు మూస్తే.. రేపు చానా పనుంది..

🦋🦋🦋

**మూడు నెలల తరువాత..**

“లక్ష్మమ్మక్కా!” గట్టిగా పిలుస్తూ వచ్చాడు రాములు. వెనుకగా నారాయణ, సంతోష్.. చేతిలో ఏదో కాగితం పట్టుకుని.

ఎసట్లో బియ్యం పోస్తున్న లక్ష్మమ్మ తలెత్తి చూసింది.

“నీకు పర్మనెంట్ పోస్టింగ్ వచ్చిందక్కా! దీని మీద యేలిముద్రెయ్యి. సి.ఇ గారి యస్.ఇ గార్ల గదులు, వరండాలు ఊడవటం, నీళ్ళయ్యి పెట్టటం. స్వీపరు జాబు. నెలకి ఐదారు వేలొస్తాయి. క్వార్టర్ల కూడా ఉండచ్చంట.”

లక్ష్మమ్మ బియ్యం ఎసట్లో పోసేసి, చేతులు చీర కొంగుకి తుడిచేసి, వేలి ముద్ర వేసింది, నారాయణ ఇచ్చిన కాగితాల మీద.

“ఎట్టయిందిరా?” నమ్మలేనట్లు చూస్తూ అడిగింది.

“ఆ ఇంజనీరు సారుదే తప్పంటక్కా. అందుకే బావ తాగింది తక్కువనే అని డాక్టర్ బాబు సర్టిఫికేటు ఇచ్చింద్రు. దాని కోసమని నారాయణన్న సంతోషన్న తెగతిరిగింద్రనుకో.” రాములు అన్నాడు.

“ఆ దేముడు చల్లగా చూస్తాడు మిమ్మల్ని.” లక్ష్మమ్మ రెండు చేతులూ జోడించి అంది.

వీఱాజు లేడన్న బాధ తప్పించి ఆ కుటుంబానికి ఏ లోటు లేదు. నర్సి, తమ్ముళ్ళు స్కూల్లో చేరారు. ఆఖరి వాడిని రాములు భార్య చూస్తోంది నెలకి ఐదొందలు తీసుకుని.

🦋🦋🦋

రవి కాలు బాగయిపోయింది. కండరం ఏదో సాగిందిట. కొద్దిగా ఈడుస్తూ నడుస్తున్నాడు. జనరల్ షిఫ్ట్ లో వేశారు.

సాయంత్రం ఐదు పదికి ఇంటికొచ్చాడు రవి, ఆఫీసులో చేరిన మొదటి రోజు. వస్తూనే హాలులో దృశ్యం చూసి అలా సోఫాలో కూర్చుండి పోయాడు.

అఖిల్ చాప మీద కూర్చుని డామ్ కడుతున్నాడు, నాన్నమ్మ బత్తాయి తొనలు వలిచి నోట్లో పెడుతుంటే. అవినాశ్ బల్ల దగ్గర కూర్చుని హోమ్ వర్క్ చేస్తున్నాడు.. మధ్య లో టివి కేసి దొంగ చూపులు చూస్తూ.

"అత్తయ్యా! చూడండి.. మిస్ అవద్దు. ఎంత బాగా చేస్తున్నారో.." సుగుణ అంటుంటే.. అందరూ టివి పక్కకి తిరిగారు, 'బొమ్మరిల్లు' డివిడి నడుస్తోందక్కడ.

రవి తల పట్టుకుని కూర్చుండి పోయాడు.

"ఏమయింది రవీ! తలనొప్పా? కాఫీ తెస్తానుండండి." సుగుణ డివిడి పాజ్ లో పెట్టి లేచింది.

రాజుని హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ చేశారు. శేషగిరి కొన్న ఫ్లాట్లో, జానకీ పిల్లలతో చక్రపాణి, సుభద్ర వచ్చి ఉంటున్నారు. రాజుని సైకియాట్రిస్ట్కి చూపించి ట్రీట్మెంట్ ఇప్పిస్తున్నారు.

"మామయ్యా! మీరు అత్తయ్య ఇక్కడే ఉండి పోండి. పిల్లలకి బాగా అలవాటయిపోయారు. జానకికి కూడా ధైర్యంగా ఉంటుంది." క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ, తన కోపాన్ని ఆవేశాన్ని నియంత్రించుకుంటున్న రాజు ఒక రోజు అన్నాడు చక్రపాణితో.

జానకి సహాయం చేస్తూ ఒక పూట వంట చేస్తుంటే సుభద్రకి కూడా హాయిగా ఉంది.

రఘు రమ్మని పిలుస్తే కూడా రామని చెప్పేశారు. అంతగా పిల్లలు పెద్దవాళ్ళయి, ఇల్లు సరిపోదనుకుంటే, పక్కనే రెండు గదులు అద్దెకి తీసుకుని, జానకి దగ్గరే ఉంటామని చెప్పేశారు. రఘు కోపగించుకుని వెళ్ళిపోయాడు.

చైతన్య, ఆంజనేయులు, సింగ్, రహీమ్, భీమారావు, రవి మంచి ఫ్రెండ్స్ అయిపోయారు. ప్రతీ ఆదివారం రెండు గంటలేనా కలిసి గడుపుతున్నారు.. కబుర్లు చెప్పుకుంటూనో, సరదాగా పదిరూపాయల పూల్తో కార్డ్స్ ఆడుకుంటూనో. ప్రతీ రెండు నెలలకీ కుటుంబాలతో ఎక్కడికైనా పికినిక్ వెళ్దామని అనుకున్నారు. ఒక సారి డామ్ దగ్గరికి వెళ్ళొచ్చారు కూడా!

సాయంత్రం నాలుగయింది. చక్కగా తయారయి, కాకీ యూనిఫామ్ లాంటి బట్టలు వేసుకుని, చెరోకర్రా పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చారు, ఇద్దరు పన్నెండేళ్ళ అబ్బాయిలు.. ఆటో దిగి రోడ్ మీద అరటిపండు తొక్క వేస్తున్న ఒక లాల్చీ వాలా దగ్గరికి.

"అంకుల్! ఫైవ్ రుపీస్ ఫైన్." పుస్తకం తీసి రాస్తూ అడిగాడొక పిడుగు.

"ఎందుకురా?"

"మా ఊళ్ళో రోడ్ మీద తుక్కు వెయ్యడం క్రైమ్ అంకుల్."

"ఎవరు చెప్పింది? రోడ్డేమైనా మీ బాబుగాడి సొత్తా?" వీరావేశంతో అడిగాడు లాల్చీ.

"అవును. మా సొత్తే.. లేకపోతే మీ బాబుగారి సొత్తా? " తిలక్ జమాజెట్టీ ల్లాంటి పది మంది కుర్రాళ్లతో వచ్చి అన్నాడు, లాల్చీ వాలా మీది మీదికి వెళ్తూ.

"సరే.. సరే." అంటూ ఐదు రూపాయలు సమర్పించుకున్నాడు లాల్చీ. తెల్లని ఖద్దరు లాల్చీ వేసుకుంటే ఎదురే లేదనుకునే ఆ పెద్ద మనిషి.

"ఆంటీ.. ఆంటీ.." గాభరాగా అరిచింది పక్కింటి పదహారేళ్ళమ్మాయి, పట్టు పరికిణీ కట్టుకుని.

పాలిథీన్ బాగ్స్ పది మూట కట్టి, ఇంట్లో తుక్కుతో సహా వీధి కాలువలో పడెయ్యబోతున్న ఇల్లాలు ఆగి పోయింది.

"అందులో వేస్తే, మీరే దిగి తియ్యాలి. మర్చి పోయారా?"

"ఇవి వాడండి ఆంటీ! వంద ఫైవ్ రుపీసే." ఇంకొకమ్మాయి, న్యూస్ పేపర్లతో ఇంట్లో తయారు చేసిన సంచీ ఇచ్చింది.

టౌన్షిప్ లో పెద్దలంతా పిలలకి హడలి పోతున్నారు. ఎవరైనా పాంటు సవరించుకుంటూ గోడ దగ్గరికి వెళ్ళబోతుంటే వచ్చేస్తారు పది మంది అబ్బాయిలు చప్పట్లు కొట్టుకుంటూ..

"అంకుల్ ఇక్కడికి టూ హండ్రడ్ యార్డ్స్ లో యూరినల్స్ ఉన్నాయి. అవి వాడండి ప్లీజ్!"

పర్యావరణ పరిరక్షణ ప్రారంభం కాగానే ప్రతీ రెండు వీధులకీ పబ్లిక్ టాయిలెట్ ఒకటి కట్టించారు శ్రీనివాస్, కాంటింజెన్సీ ఫండ్ లోనుంచి.

"టాయిలెట్స్ లేకపోతే, రోడ్డు మీద గోడలు వాడకుండా ఆపలేము అంకుల్! నేచర్ కాల్ ఎమర్జెన్సీ కదా. ఇంకా శుభ్రం చెయ్యడానికి, నీళ్ళు సరిగ్గా పొయ్యమని చెప్పడానికి వర్కర్స్ని కూడా పెడదాము. ఇంటింటికీ వెళ్ళి వసూలు చేసి నిర్వహిద్దాము." మౌళి ముందుగా వాటి సంగతే చూశాడు. కాలనీలో అందరిళ్ళకీ తిరిగి డొనేషన్స్ వసూలు కూడా అతనే నిర్వహించాడు.

అనూహ్యమైన స్పందన వచ్చింది కాలనీ వాసుల దగ్గర్నుంచి. శుభ్రంగా ఉన్న పరిసరాలంటే ఎవరికిష్టం ఉండదు? కాకపోతే నయానా భయానా చెప్పి వప్పించాలి అంతే!

శ్రీనివాస్, గోపాలాచారి వీధి వరండాలో కూర్చుని, శుభలేఖల మీద అడ్రస్లు రాస్తున్నారు. ఇంటి లోపల భారతి, అరుణ పెళ్ళి వారికి పెట్టబోయే బట్టలన్నింటినీ సంచుల్లో పెట్టి, ఎవరికి ఏ ట్రైమ్లో పెట్టాలో రాసుకుంటూ సర్దుతున్నారు.

మౌళి, ఉష, వేణు, సుధీర అప్పుడే పెళ్ళికి కావలసిన బట్టలూ, సామాన్లూ తీసుకుని హైద్రాబాద్ నుంచి వచ్చారు. అందరూ వెనుక వరండాలో కూర్చుని కాఫీలు తాగుతున్నారు.

"అంకూల్.." బబ్లూ వచ్చి మౌళి జేబులోంచి కిట్కాట్ తీసుకున్నాడు జబర్దస్తీగా. మౌళి వాడిని ఒళ్ళో కూర్చో పెట్టుకున్నాడు.

"అయితే మీ ప్రేమ ఎప్పుడు ఎక్కడ పుట్టింది?" అడిగాడు వేణు కుతూహలంగా. అతను వాళ్ళని హైద్రాబాద్లో కలిశాడు, బెంగుళూర్నించి వచ్చి.

"రోడ్లు ఊడ్చేసి,, మొక్కలు పాతడానికి గోతులు తవ్వుతుంటే.." ఉష అంది, మౌళి తనకి ఎప్పుడు 'ఐ లౌ యు' చెప్పాడో గుర్తుకు తెచ్చుకుంటూ.

"వ్వాట్? ఇదెక్కడి వింత ప్రేమే" వేణు నవ్వాడు పకపకా.

అప్పుడు మౌళి తన ప్రాజక్ట్ అంతా వివరించాడు.

"మొదట నేను ప్రపోజ్ చేసినప్పుడు అస్సలు అనుకోలేదండీ. సి.ఇ గారు ఫామిలీ ఫుల్ సపోర్ట్ ఇవ్వబట్టి అంత సక్సెస్ఫుల్ అయింది. కాలనీలో ఎవరూ వెనుకంజ వెయ్యడానికి వీల్లేక పోయింది."

"అయితే నీ రెండు ప్రపోజల్స్ సక్సెస్ఫుల్లే కదా!" వేణు సరదాగా అన్నాడు.

మౌళి బుగ్గలు ఎఱబడుతుండగా చిరునవ్వు నవ్వాడు.

మౌళి, ఉషల పెళ్ళయిన మరునాడు, సత్యనారాయణ వ్రతం అయింది. అప్పుడే చీకటి పడుతోంది. ఆ రాత్రికే పెళ్ళివారు వెళ్ళిపోతున్నారు, రెండు బస్సుల్లో..

గేటు చప్పుడు విని తలెత్తి చూశాడు శ్రీనివాస్. పెళ్ళి ఇల్లు.. అలంకరించిన దీపాలు ఒక్క సారిగా వెలిగాయి, రంగు రంగుల కాంతులు వెదజల్లుతూ.

ఇద్దరు అపరిచిత వ్యక్తులు లోపలికి వస్తున్నారు. ఒకతను కాకీ యూనిఫామ్ లో ఉన్నాడు.. నలభై లోపుంటుంది వయసు. ఇంకొకతను యాభై పైన.. తెల్లని లాల్చీ, పైజామా వేసుకున్నాడు.

ఇద్దరూ నిటారుగా నడుస్తూ, మార్చ్ చేస్తున్నట్లు వస్తున్నారు.

శ్రీనివాస్ అప్రయత్నంగా లేచి నిలుచున్నాడు.

“సారీ సర్. మిమ్మల్ని ఇంటికి వచ్చి డిస్టర్బ్ చెయ్యాల్సి వచ్చింది. ఆఫీస్లో గోపాలాచారిగారు పర్మిషన్ ఇస్తే వచ్చాము. నేను ‘కల్నల్ ఇస్మాయిల్’. ఇతను ‘కె. భాస్కర్ రావ్’. మీ ప్లాంట్కి సెక్యూరిటీ చీఫ్గా అపాయింట్ అయ్యాడు. స్వయంగా గవర్నర్ అపాయింట్ చేశారు. నేను ఇప్పుడే వెళ్ళిపోవాలి.. అందుకే పరిచయం చేద్దామని తీసుకొచ్చాను.” వస్తూనే లాల్చీ అతను షేక్ హాండిచ్చి పరిచయాలు చేశాడు.

“అదేంటీ.. ముందుగా ఏ ఇన్ఫర్మేషన్ లేకుండా..”

“గవర్నర్ మీకు చెప్పమన్నారు, సెంట్రల్ ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల ప్రకారం, అత్యవసరంగా చెయ్యవలసి వచ్చిందని. మీకు లెటర్ కూడా ఇచ్చారు. మీ ప్లాంట్ని టార్గెట్ గా తీసుకుని టెర్రరిస్టులు చాలా పెద్ద విధ్వంసాన్ని ప్లాన్ చేశారుట. అందుకని మీకు స్పెషల్గా ట్రైన్ అయిన ఆఫీసర్ని ఇచ్చారు. భాస్కర్, అండర్ గ్రౌండ్ ఆపరేషన్స్ లో ఆరి తేరిన వారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ నుంచి వచ్చారు. పైగా తెలుగు వారు. మీ పవర్హౌస్ వాళ్ళు చాలా బాగా అలర్ట్ అయ్యారని హాపీగా ఫీల్ అయ్యారు. ప్రస్థుతం గెస్ట్ హౌస్ లో దిగాము. వీలవగానే క్వార్టర్స్ అదీ..”

“ఓ.కే కల్నల్ ఇస్మాయిల్. ప్రభుత్వ ఆదేశాలని ఫాలో అవడమే కదా మనం చెయ్యాలిసిన పని. కంగ్రాచ్యులేషన్స్ భాస్కర్.. మేజర్, కల్నల్..” సందేహంగా ఆగిపోయాడు శ్రీనివాస్.

“అబ్బే అదేం లేదు సార్! ప్రస్తుతానికి అతని ఐడెంటిటీ సీక్రెట్ గానే ఉంటుంది. అదే మీకు ఇచ్చిన లెటర్లో ఉంది. ఇక్కడ మీరే ఐడి ఇవ్వాలి. మిస్టర్ కట్టా భాస్కర్ రావు అతని పేరు.” కల్నల్ ఇస్మాయిల్, గవర్నర్ లెటర్ ఇచ్చి, తన ఐడి చూపించాడు.

“గ్లాడ్ మీటింగ్ యు మిస్టర్ భాస్కర్. వెల్కమ్ టు అవర్ పవర్ హౌస్.. లోపలికి రండి. మాట్లాడుకుందాం.”

అంతలో..

ఆకాశంలో ఒక్క సారిగా మెరుపులు. వెంటనే ఢాం అంటూ పెద్ద చప్పుడు స్విచ్ యార్డ్ నుంచి. మరో క్షణంలో మొత్తం అంతా చీకటి..

“వస్తూనే మీకు మంచి వెల్కమ్.. చూశారా మిస్టర్ భాస్కర్! ప్లాంట్కి వెళ్దాం వస్తారా? కల్నల్ ఇస్మాయిల్ మీరు..” శ్రీనివాస్ షూ రాక్ దగ్గరికి వెళ్తూ అడిగాడు.

“మీరు మీ పని అటెండ్ అవండి సి.ఇ గారూ! నాకు మరో గంటలో ట్రైన్.. టాక్సీ ఉంది బయల్దేరతాను. ఆల్ ద బెస్ట్ భాస్కర్! విల్ బి ఇన్ టచ్.” భాస్కర్ భుజం తట్టి వెనుతిరిగాడు కల్నల్ ఇస్మాయిల్.

ఎమర్జెన్సీ లైట్ వెలుగులో భారతి తెచ్చి ఇచ్చిన కాఫీ కప్ తీసుకున్నాడు భాస్కర్.

“కూర్చుని తాగండి. ఇక్కడ ఇదంతా మామూలే. మేఘం లేకుండా మెరుపులు వచ్చాయంటే టెన్షన్ తప్పదు భాస్కర్ గారూ! రాత్రంతా జాగారమే ప్లాంట్లో అందరూ!” భారతి మాటలకి నవ్వుతూ తలూపాడు శ్రీనివాస్.

“బయల్దేరదామా సర్!” భాస్కర్ కుర్చీలోంచి లేచి అటెన్షన్లో నిలబడ్డాడు.

## ఐపోయింది